

శ్రీ

చలం

అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ - 520 002

★ 'స్త్రీ' (వ్యాసాలు)
★ రచనా కాలం: 1925

పేజీలు : 142
ధర : రూ. 35/-

★ స్వీట్ హోమ్ పబ్లికేషన్స్ ద్వారా:
1వ ముద్రణ: 1979 జూన్
2వ ముద్రణ: 1982 మార్చి
3వ ముద్రణ: 1984 ఆగస్టు
4వ ముద్రణ: 1988 ఏప్రిల్
5వ ముద్రణ: 1991 అక్టోబర్
6వ ముద్రణ: 1993 సెప్టెంబర్
7వ ముద్రణ: 1995 జనవరి
8వ ముద్రణ: 1996 ఆగస్టు
9వ ముద్రణ: 1999 సెప్టెంబర్

★ అరుణా పబ్లిషింగ్ హౌస్ ద్వారా:
1వ ముద్రణ: 2003 మార్చి

★ ముఖచిత్రం : బాపూ

★ కంపోజింగ్ అండ్ పేజ్ మేకప్:
ఆర్.జె.గ్రాఫిక్స్, హైదరాబాద్
(ఫోన్: 55610373)

★ ముద్రణ:
శ్రీ అరుణోదయా ప్రింటింగ్ ప్రెస్
సీతారామపురం
విజయవాడ - 520 002.

★ ప్రతులకు:
అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2
(ఫోన్: 2431181)

సర్వహక్కులు:
సౌరిస్ ప్రమోద
'స్నేహ'
నేరెళ్ళవలస కాలనీ
భీమునిపట్నం - 531 163
విశాఖపట్నం జిల్లా

ఇందులో

★ అంకితం

★ ముందు మాటలు

1. మొదటి మాట
2. మళ్ళీ ఈ నాడు
3. మూడో మాట
4. చివరికీనాడు
5. ఇంకోసారి మళ్ళీ తప్పలేదు

పేజీ

1. మోహం 17
2. పతివ్రత 23
3. స్త్రీ నీతి 30
4. స్త్రీ సంపాదన 31
5. బడి చదువులు 38
6. స్త్రీ స్వేచ్ఛ 42
7. సంఘ నీతి 48
8. జెలసీ 53
9. వివాహ బంధం 54
10. మోనాగమీ 59
11. ప్రేమ 63
12. శృంగార జీవనం 64
13. మొండివాళ్ళు 72
14. సంఘమూ - స్త్రీ 78
15. బాధ్యతలు 83
16. నీతీ - వ్యక్తీ 85
17. కామోద్రేకం 86
18. దాంపత్య సుఖం 89
19. గర్భనివృత్తి మార్గాలు 105
20. సుఖ రోగాలు 110
21. చిన్నపిల్లలకి జ్ఞానం 118
22. గర్భం 120
23. గర్భస్రావం-బాగుపోగులు 123
24. యోగం 128
25. వంధ్యత్వం 130
26. విడాకులు 134
27. శృంగారం 137
28. ముగింపు 138

★

అంకితం

నాకు
ఒక్క నిమిషం విశ్రాంతి నివ్వక
మహా ప్రణయ మారుత వేగం మీదనో,
అగాధ వియోగ భారం కిందనో
చీల్చి, నలిపి,
ఊపిరాడనీక
నా జీవితాన్ని పాలించే
స్త్రీలోకానికి
నివేదితము!

మొదటి మాట

స్త్రీ కి కూడా శరీరం ఉంది; దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకి మెదడు ఉంది; దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకి హృదయం ఉంది; దానికి అనుభవం ఇవ్వాలి - అనే సంగతి గుర్తించని ఈ దేశానికి, నేను రాసే ఈ సంగతులు అర్థమవుతాయా? పాశ్చాత్య నాగరికత వ్యామోహంలో పడి, వొళ్ళు తెలీక, నోటికి వచ్చినట్టు కూసిన కూతలనుకుంటారని తెలుసు. కానీ, ఇట్లాంటి పుస్తకం నా చిన్నతనంలో దొరికితే, నా జీవితాన్ని ఇప్పటికన్న ఎన్నో రెట్లు పవిత్రవంతమూ, సార్థకమూ చేసుకోగలిగేవాణ్ణి. నా వంటి వారు ఈ నూతన యుగంలో ఉన్నారేమో!

★

మళ్ళీ ఈ నాడు

మొదటి ముద్రణ చివర "ఈ నాటికి ఈ మార్గం, ఈ పద్ధతులు నాకు మంచిపని తోస్తున్నాయి. తప్పు కావచ్చు" అని రాసి, కాలం గడిచినకొద్దీ నా అభిప్రాయాలు మార వొచ్చునని సూచించాను. నా ఉద్దేశాలూ, ఆచారాలూ మారితే చూసి సంతోషించాలని చాలామంది చాలా ఏళ్ళనుంచి కాచుకుని ఉన్నారు. నాలో ఇన్‌టరెస్టు వల్ల కాదు. నా పద్ధతుల్ని అనుసరించి చెడిపోతున్నారని (బాగుపడుతున్నారని) అనుకునే యువకుల్ని నిరుత్సాహపరచి, తమవంటి నిర్జీవపు తుక్కుకింద మురగపెట్టాలనే ఆశవల్ల. యువకులే భవిష్యత్తుకి ఆధారాలని కబుర్లేగాని, పెద్దవాళ్ళకి చిన్నవాళ్ళు తమకన్న బాగుపడతారంటే చాలా ఈర్ష్య. అందువల్లనే లోకానికి మహోపకారం చేసినవాళ్ళూ, జవసత్వాలు ఉన్నవాళ్ళూ అందరూ పెద్దవాళ్ళకి తిరగబడ్డవారే! తల్లిదండ్రుల మాట వినే కుర్రవాడికి గతులులేవు. గురువుల మాట వినేవాళ్ళకి అంతకన్నా!

ఆనాడు పెద్దవాళ్ళమీద తిరగబాటు చేసిన యువకులు పెద్దవారై, చిన్నవారికి నీతులు బోధించి, అధికారాలు చేసి, అణగతొక్కటం చూస్తున్నాను. తమకి చిన్నప్పుడే పెళ్ళిళ్ళు చేశారని తమ తల్లిదండ్రుల్ని తిడుతో తమ పిల్లలకి చిన్నప్పుడే బలవంతంగా పెళ్ళిళ్ళు చేసే తల్లి దండ్రుల్ని చూస్తున్నాను. నాతో చేరి నా కథలూ, అభిప్రాయాలూ మెచ్చుకుని తమ స్వంత స్వతంత్రం మీద చాలా అభిలాష చూపి, గంతులు వేసి, పెళ్ళిళ్ళు చేసుకునీ, ఉద్యోగాలు సంపాయించుకునీ, ఇళ్ళు కట్టుకునీ, చప్పుడు కాకుండా మాయమైన వాళ్ళని ఎరుగుదును. స్వతంత్ర దేవత కలకత్తా కాళీకన్నా భయంకరమైనది. నిరంతరమూ సుఖ నైవేద్యాన్నీ, అశ్రు అభిషేకాన్నీ కోరుతుంది. ఆమెని చివరిదాకా ఆరాధించగల జవసత్వాలున్న వాళ్ళు అరుదు. చాలామంది తమ ప్రత్యేక కష్టంలోంచి తప్పించుకునే స్వతంత్రాన్నే గాని, జీవితంలో ఆ దేవతని భరించలేరు.

మొదటి ముద్రణ చివర ఆ పై వాక్యం 2-12-30 న రాశాను. ఈనాడు 2-12-1940 న పదేళ్ళ అనుభవంతో "స్త్రీ"ని మళ్ళీ చదివి, నా అభిప్రాయాలు ఎక్కడ మార్చుకోవలసిన అవసరముందో చూశాను. ఈ పదిహేనేళ్ళలో ("స్త్రీ" రాసింది 1925 లో) చాలా దూరం ప్రయాణం చేశాను — (లోపల-బయట కాదు.) ఏళ్ళలో కాక, మనసుల్లో ఎదిగే వాళ్ళకి ఈ ఆయాస ప్రయాణాలు తప్పవు.

అప్పటికన్న ఇప్పుడు నా బాధ్యత హెచ్చింది. ఇల్లాంటి రోజు వొస్తుందేమోననే చాలా ఏళ్ళనుంచి నా భయం. ఎవరూ ఇష్టపడక, వెలివేసి, వొదిలివేసిననాడు స్వేచ్ఛాజీవిని. 'ఏమి రాస్తున్నాను, ఏమి చేస్తున్నాను' అనే సంకోచం ఉండదు.

ఆ కాలంలో నేను, నేను బతకటం ఇష్టంలేని ప్రజలమీద దండెత్తి "సెల్ఫ్ ఎసెర్ట్"

చేసుకోవడమే ప్రధానంగా ఉండేది. ప్రజలకి ఎంత కోపం తెప్పిస్తే నాకు అంత సంతోషం. నన్నెదిరించే వాళ్ళని అదరకొట్టడానికి ఎంత తీవ్రమైన మాటలూ శక్తిహీనంగా తోచేవి. అందువల్లనే ఆనాటి పుస్తకాల నిండా, అతిశయోక్తులూ, వన్‌సైడ్ స్టేట్‌మెంట్స్ (One-side Statements), ద్వేషంతో కూడిన తిట్లూ, అనవసర శృంగారమూ ఉండేవి. ఈనాడు ముఖాలతో, కంఠాలతో, ఉత్తరాలతో, మౌనంతో, నిశ్శబ్దంతో రాయటానికీ, అడగటానికీ వీలులేని పరిస్థితులలోంచి, ఆతృతగా నన్ను ప్రశ్నిస్తున్నవారున్నారనీ, నా మాటలు విలువగా గ్రహించే వారు వొస్తున్నారనీ తెలీగానే కాళ్ళకి బంధాలు పడ్డాయి. నిర్విచారపు స్వేచ్ఛాప్రయాణం ముగిసింది. అజాగ్రత్తగా ఏం రాసి, ఏం మాట్లాడి, ఏం రాయక, ఏం మాట్లాడక 'మిస్‌లీడ్' చేస్తానో అని భయం!

నేను గర్విష్టిననీ, మాట్లాడననీ, సిన్సియర్‌గా కంప్లెయింట్ చేసే వారికి చెపుతున్నాను (మాట్లాడడానికి ఇతరులు నా దగ్గరికి రాకుండా చెయ్యడానికి స్కాండల్స్ చెప్పే ప్రియ మిత్రులకి కాదు). ఎందుకు మాట్లాడనంటే నిజం మాట్లాడనేమోననే భయంవల్ల. (నా అబద్ధం నాకు హానిచేస్తే భయంలేదు. ఇతరులకి హాని చేస్తుందని భయం.) తమకి తామే యోచించుకునేట్టు వారిని నా మౌనంవల్లా, స్వల్ప భాషణవల్లా నేను చెయ్యగలిగితే వారికి ఎక్కువ ఉపయోగం ఉంటుందనే నమ్మకం చేత. ఇదే సరైన మార్గమని గట్టిగా చెప్పడానికి నాకు అధికారం లేదని గుర్తించడంవల్ల. ప్రజలమీదా, వారి స్వంత అభిప్రాయాలమీదా, వారి స్వేచ్ఛమీదా నాకు గౌరవం ఉండడంచేత. ప్రతి వారి మార్గమూ, సత్యమనే విశ్వాసం చేత. నా మార్గం కొంత కొంత సూచనలకేగాని, యావత్తూ నాకు గాక, ఇంకెవరికీ సరిగా సరిపోదు అని తెలీటంవల్ల. ప్రజలకి, మొత్తం మీద ఈ మార్గం మంచిదని రాయడమున్నూ, ప్రత్యేకం ఒకరితో 'ఇది నీకు మంచి'దని చెప్పడమున్నూ రెండూ వేరే సంగతులు. వొచ్చిన కర్మమేమిటంటే, నాకు సంఘంమీద కోపం, వ్యక్తులమీద ఇష్టం. సంఘం (నాతో కలుపుకొని) నా కన్నా, చాలామంది కన్నా బుద్ధిహీనమైనది. వ్యక్తులు నా కన్నా గొప్పవారూ లేరూ; నాకన్నా హీనులూ లేరూ.

"స్త్రీ" అంతా జాగ్రత్తగా చదివాను. అచ్చు పొరపాట్లు తప్ప మార్చవలసినమాట ఒకటీ కనబడలేదు — నీతిని బోధించే వారిని తిట్టడానికీ, స్త్రీ పురుష ఆకర్షణ ప్రభావాన్ని అద్వితీయంగా పొగడటానికీ, కొత్తమాటలూ గొప్పమాటలూ నేర్చుకోకపోతినే అనే చింతతప్ప.

మతాన్ని గురించీ, నీతిని గురించీ నా భావాలు విశాలం చేసుకున్నాను. కానీ మతమూ, నీతీ, వేదాంతమూ మాట్లాడే మనుషుల్ని ఏ మాత్రం నమ్మవద్దనీ, వాళ్ళ దగ్గర మతమూ, నీతీ ఏ మాత్రమూ లేవనీ హెచ్చరిస్తున్నాను. స్వేచ్ఛని కావాలనే మనుషుల్నీ, పుస్తకాల్నీ వొప్పుకోని వాళ్ళందరూ దుర్మార్గులు; బానిసలు; దొంగలు — సందేహ మేమాత్రమూ లేదు.

నా పుస్తకాలు (ముఖ్యం "స్త్రీ") చదివి చెడిపోయిన వారున్నారని చాలామంది ఉద్దేశ్యం లాగు కనబడుతోంది. చెడిపోవడమంటే ఏమిటి? అనే మాట అటుంచి, ఆ చెడిపోయిన వాళ్ళు వొక్కరూ నా కంట పడలేదు. ప్రస్తుతం ఏ మోహమూ, ఆకర్షణా లేకుండా అలవాటు

ప్రకారం నిష్కామ కర్మచేసే ఈ సంసారులకన్నా చెడిపోవడమనేది ఎట్లా సంభవమో ఎంత యోచించినా మనసుకి అందటంలేదు. ప్రత్యేకించి ఈ పుణ్యలోకంలో నా వొక్కడిదే పాపిష్టి మనసు కావచ్చు.. అట్లా నా పుస్తకాలు చదివి చెడిపోయే వాళ్ళే ఉంటే వాళ్ళు ఎంత బాగుపడ్డారో!

ప్రపంచమంతా ఇట్లా తమ కళ్ళముందు ఇదివరకు మారదని అనుకున్న దానికన్న చాలా ఎక్కువగా మారిపోతోవుంటే, దేశాలకి దేశాలు కొట్టుకుపోతోవుంటే, ఇంకా పసుపు పారాణాల కోసం, అంటు తప్పాలమీది మెతుకుల కోసం, సిగ్గు బిడియాల కోసం గింజుకులాడే ముసలి అత్తల్నీ, శీల, అశ్లీలాల కోసం తెలుగు కథకుల్నీ, బడి టీచర్లనీ, పత్రికా విమర్శకుల్నీ చూసి నవ్వొస్తుంది! దిగులేస్తుంది.

పత్రిక కొనే ప్రతి మనిషీ వీరనుకొనే అవినీతి కథల కోసమే కొంటున్నాడు. తెలుగు వాళ్ళల్లో చదువు వొచ్చిన వాళ్ళంతా అవినీతి వంతులుగానే ఉన్నారు. ఈ విమర్శకులు మాత్రం ఆ కథల్నే ఆరుసార్లు చదివి, అవినీతి కథలని పత్రికలలో రాయడం ఇంకా మాన లేదు. ఏం చేస్తాం? ఈ మ్యూజియం వస్తువులు పదేళ్ళలో మరీ అపురూపమైపోతాయి. చూసి నవ్వేందుకు ఎవరూ ఉండరేమో అనే దిగులుతో, ఇంకా పదేళ్ళపాటు మా ఆహ్లాదం కోసం బతకమని దీవిద్దాము.

"సెక్సు" అంటే జీవితపు సూత్రం. పిల్లల దగ్గర్నించి ముసలి వాళ్ళయిందాకా, అందర్నీ, వాళ్ళకి తెలిసినా తెలియకపోయినా ప్రోత్సహించి పాలిస్తోంది. తమలో ఆ ప్రోద్బలంలేదనీ, అక్కర్లేదనీ, ఎంత వంచన చేసుకునీ లాభంలేదు. జీవితంలేదు. 'మేము బతకటమేలేదు, బతుకు ముఖ్యం గాదు' అనుకుంటే ఎంత లాభమో "సెక్సు" ప్రోద్బలం లేదనుకుంటే అంతే అర్థం. ఈ ఆకర్షణ ఉందని నిష్కపటంగా అంగీకరించి, దానినించి సౌఖ్యాన్ని సాధించినవాళ్ళు ధన్యులు. అంత ఉన్నతమైన సాధన, అపూర్వానందం, ఇంక ఏమీలేదు. దొంగ నీతులకీ, కీర్తులకీపోయి అత్మవంచకులైనంత మాత్రాన ఆ శక్తి ఒదిలేదిగాదు. నిర్భాగ్యుల్నీ, నిస్సారుల్నీ, నిరర్థకుల్నీ చేసి మరీ ఒదులుతుంది.

బెజవాడ, 2-12-40 వెంకట చలం

మూడోమాట

స్త్రీ పురుషానుభవం అమూల్యమని శృంగారపు విలువల్లో నమ్మి, తమ జీవితాన్నేగాక తక్కిన తమ సంబంధమైన జీవితాల్ని సుఖప్రదం చెయ్యాలనే దీక్షవున్న వారికోసమే రాశాను, "స్త్రీ". ఈ నా స్వేచ్ఛాబోధని అర్థం చేసుకోని, తప్పు అర్థం చేసుకునే ప్రజలకి వివాహబంధం చాల అవసరం. సంఘ నియమాల్నీ, నీతి నిబంధనల్నీ చాటుగా, స్వార్థంగా, గిల్టీగా, అపాలజెటిక్ (apologetic)గా కాక, సంఘం మీది అభిమానం వల్ల, మనసుమీది ప్రేమవల్ల ఎదిరించగల ధీరులు అవసరం. నా రాతలలో సంఘంమీద ద్వేషమంతా, సంఘంచూపే అజ్ఞానంలో, క్రౌర్యంలో నలిగే మనుషులమీద ప్రేమ.

ఈ ఫిల్ములలో, కథలలో, యువకుల వీరాలాపాల్లోవినబడే "వెధవ సంఘం, సంఘం మనబోటివాళ్ళకి లెక్కా? సంఘం మూర్ఖం" అనే మాటలు అర్థంలేనివే కావు, దుర్మార్గమైన మాటలు. ఆ సంఘం దయలేనిది, ఆధారం లేనిది, ఒక్క నిమిషం నిలువలేని మనుషులే ఈ మాటలనేది.

అమలులో ఉన్న కట్టుబాట్లకి ఎదురు తిరగగల అవసరమూ, సామర్థ్యమూ ఉన్న మనుషులు ఏ కాలంలోనైనా కొద్దిమంది ఉంటారు. తన తిరుగుబాటువల్ల తనకిగాని, ఇతరులకిగాని మేలు జరగాలంటే తను కోరే స్వేచ్ఛని అందరికీ అంగీకరించాలి. తన స్వంతవారిమీద తన అధికారాన్ని వదులుకోవాలి. తన తిరగబాటువల్ల వచ్చే కష్టాల్ని గర్వంతో ఎదుర్కోవాలి.

ఈ ప్రచారంవల్ల ప్రతి హృదయంలోనూ, కొద్దో గొప్పో మార్పు కలిగి తీరుతుందనీ; కొత్తకోణం నించి చూడడం తెలుసుకుంటారనీ; మౌనంవల్లా, మూర్ఖంవల్లా అజ్ఞానంవల్లా తాము ఇతరులకు, అసహాయులకు, బలహీనులకు చేసే అన్యాయం వ్యక్తమౌతుందనీ ఆశ. క్రమంగా ప్రజ కొత్త కాంతికి కళ్ళు తెరవగలదని విశ్వాసం.

నాగరికత హెచ్చినకొద్దీ, పనులూ, ధ్యాసలూ, ఆశలూ ఎక్కువైన కొద్దీ, మనుషుల్ని మనుషులుగా గుర్తించుకోవడం తగ్గిపోతోంది. "ఇది నా స్త్రీ" అనే భావం పోయి, పక్కలో సుఖాన్నిచ్చే శరీరంగాకూడా దృష్టి పోయి, ఉత్త వొస్తువ, ఒక ఐడియా, ఇంకే దిక్కూలేని ఒక జీవం అయిపోతోంది స్త్రీ. స్త్రీకి పురుషుడూ అంతే. తనకి తిండినీ, నగలనూ, మర్యాదనూ ఇచ్చే ఒక సాధనం—అంతే.

స్త్రీగా భార్యకి పురుషుడూ, పురుషుడుగా భర్తకి స్త్రీ, ఏమీ ఇవ్వలేక పోతున్నారు. ఒకరి శరీరం మీదనైనా రెండోవారికి ధ్యాసేపోయింది. ఉత్తసిగ్గూ అసహ్యం ఆ విధంగా తలుచుకుంటే! ముఖ్యంగా విద్యా, మతమూ తెచ్చిపెట్టాయి ఇట్టాంటి దౌర్భాగ్యస్థితిని. సౌఖ్యమివ్వడానికి ధనమూ, ఆస్తి ముఖ్యమనుకున్నంత కాలమూ ఇంక ఏ విలువకీ స్థలముండదు మనుషుల మనసుల్లో. తనను సృష్టించిన మన్నుతోటీ, తన కళ్ళు తెరిచిన కాంతితోటీ సంబంధానికి క్రమంగా దూరమౌతున్నాడు మానవుడు. ధనంలేనివాడు ఎందుకూ కొరగాని వాడూ, సుఖమనుభవించేవాడు పాపాత్ముడూ ఔతున్నాడు ప్రజల దృష్టిలో.

ఏ కొత్త పద్ధతులు, ముఖ్యం సంసార విషయమై, మాటాడినా సరే పెద్దలు "లోకం ఎల్లా సాగుతుంది" అంటారు. "ఎవరూ పిల్లల్ని కనకపోతే లోకమెట్లానండీ?" అంటారు. ఆ ప్రశ్నకింక సమాధానం లేనట్టూ, ఆ లోక సంగ్రహభారం తమ భుజాలమీద మోస్తున్నట్టూ, "ఏం లోకంలో మనుషులు లేకపోతేనేం?" అంటే ఆ జవాబుని ఒక లెక్కలోకి తీసుకోకుండా తుడిచెయ్యడానికి ఏ మాత్రమూ సంకోచించరు. ఎట్లాగో వచ్చాము ఇక్కడికి. రాకుండా ఉండలేకపోయినాము. కనక ఎట్లా సుఖపడాలో యోచిద్దాము. సుఖపడలేమా, ముందువాళ్ళకన్నా బాధలు లేకుండా వాళ్ళని ఆపు చేద్దాము. "పుడితే ఈ సమస్యలుగాని, పుట్టకుండానేవుంటే?" అంటున్నాము, జన్మనిచ్చే శక్తిని అధీనంలోకి తెచ్చుకొని.

"ఎవరూ బీదతనంలో బాధపడకుండా చేస్తాను" అని సోషలిస్టు అంటే, "సుఖపడ టానికి వొచ్చామా ప్రపంచంలోకి!" అంటాడు ఇంకోడు మతం కిందికి మారుతో.

Men would rather die than think అంటాడు బెట్రండ్ రస్సెల్. లోకం, సంసారం, అస్తి, ఈ నీతిపద్ధతీ ఇవన్నీ శాశ్వతమైన విషయాల్లాగు చూస్తారు — ప్రస్తుతం అమలులో ఉన్న విషయాల మల్లేకాకుండా. ఇంత రాస్తున్నానేగాని కమ్యూనిజంవంటి గొప్ప మార్పు వచ్చి వరదమల్లే ఈ చెత్తనంతా ఊడ్చేసిందాకా ఈ మనుషులు ఎట్లానూ కదలరు. ఎన్ని ఇట్లాంటి వ్యాసాలు వ్రాసినా, ఏ యుద్ధాలో, ఉద్యమాలో, కమ్యూనిజాలో కదిలించ వలసిందే గడ్డకట్టిన ఈ సంఘాల్ని. ఇట్లాంటి రాతలన్నీ అట్లాంటి గొప్ప మార్పులు రావడానికి సోపానాలు. కమ్యూనిజం వచ్చి ఈ గృహాలనే గూళ్ళని విధ్వంసం చేసి, ఈ ఊరగాయల గూళ్ళనీ, దేవుడి గదుల్నీ, వంటిళ్ళనీ కూలతోసి, 'కామన్ మెసెస్'నీ, పిల్లలకి గొప్ప ఆట మందిరాల్నీ, విద్యాలయాల్నీ, స్థాపించిందాకా ఒకళ్ళకొకళ్ళు పెనవేసుకుని ఒకరి రక్తాన్ని ఒకరు తాగుతో బతికే ఈ భార్యా భర్తా, పిల్లా, అత్తా ముత్తవ్వా, వితంతువా ఒకన్నొకరు హింసించుకోవడం మాన్తారా? తెల్లారిలేస్తే పప్పు, పిడకలు, మళ్ళు, చీదరలు, అలుకులు. అధికారాలు మూలుగులు, మురుకులు — ఇవన్నీ వదిలి సూర్యోదయాన్ని చూసి నవ్వే మనోవ్యవధి, సంతోషం, ఉత్సాహం— ఎప్పుడు కలుగుతుంది మానవులకి!

ఈ దరిద్రపు చచ్చుబతుకుల్లో, ఒక సంసారంలో, ఒకరిమీద ఒకరు అధికారాలు చలా యించుకుంటో, ఊరికే ఇతరులది ఎట్లాగో తమదిగా ఇంట్లో పడేసుకుంటో, దాన్ని ఒక్కొ క్కరే మళ్ళీ దాచుకుంటో, ఏడుస్తో తిట్టుకుంటో బతకడంలో ఉండే బాధ, నీచత్వం, ఇంకా దూరంగానన్నారాలేదు మనుషుల మనసుకి.

బెజవాడ, 27-7-45. వెంకట చలం

చివరికీనాడు

"People would rather die - than not think.

- Chalam.

"మిమ్మల్ని చూడగా, చివరికి త్వరలో ఈశ్వరుడిలో కూడా నమ్మేట్టున్నారు" అన్నారు ఓ మిత్రులు, కొత్తగా నేనీ ఊరు వచ్చిన రోజుల్లో నన్ను కలుసుకోవాలని చాలా దూరం నుంచి నన్ను వెతుక్కుంటో వచ్చి.

ఈశ్వరుడు ఉన్నట్టు రూడిగా తెలిస్తే నమ్మనా? అంతవరకు ఈశ్వరుడు లేనట్టూ రూడి లేదు మరి! ఉంటే నమ్మడానికి నాకేం అభ్యంతరం? నా కళ్ళ ఎదట సత్యమని నిలచిం దాన్ని, ఎంత నష్టానికోర్చి అయినా సరే, నమ్మి అచరించటమే నా నిశ్చయం! అ సత్యమనేది

రూపాలు మారుతోవుంటే, ఇదివరకు నమ్మినదానికి విరుద్ధమనిపించేది, ఈనాడు సత్యమని తెలిస్తే, దాన్ని నమ్మడానికేం అభ్యంతరం లేదు. అందువల్లనే ఈ పుస్తకంలోనూ, తక్కిన చోట్లా ఎప్పుడూ రాస్తున్నాను: ఏనాటికేది సత్యమని తోస్తే అది నమ్మడానికి ఎదురు చూస్తోండాలని, ఆ విధమైన 'ఓ పెన్ మైండెడ్‌నెస్' ఉండాలని.

చిత్రం, నా కథలకన్న, తక్కిన అన్ని పుస్తకాలకన్న ఈ పుస్తకం ఎక్కువ అమ్ముడు పోయింది. ఇరవై ఏళ్ళ పైగా కొంటూనే ఉన్నారు! ఈ పుస్తకం చదివి నాకు వొచ్చే ఉత్తరాలు ఈ నాటికీ ఆగిపోలేదు. ఇంత సీరియస్‌గానూ, విరుద్ధంగానూ, రాసిన పుస్తకాన్ని ఇంత ఆప్యాయంగా ప్రజలు చదివి నాకు ఉత్తరాలు రాస్తున్నారంటే, తెలుగు ప్రజల మేధాశక్తి మీద, జ్ఞానతృష్ణ మీద ఎంతో గౌరవం కలగవొచ్చు. కాని నాకు ఒచ్చే ఉత్తరాలలో మూడు వంతులు గర్భస్రావానికి మందో మార్గమో చూపమని, డైరెక్టుగానో, ఇన్‌డైరెక్టుగానో, నర్మ గర్భంగానో నన్ను అడిగేవి.

ఈనాడు మళ్ళీ ఓ ముందుమాట రాయాల్సి వొచ్చింది. ఇది నేనురాసే చివరి మాటేమో! ఇంక నేను రాయనేమో, నన్ను రాయనీయరేమో! నేను రాయకపోతే మునిగిపోయిందేమీ లేదు. ఈనాడు, చివరిసారి నేనేం నమ్ముతున్నానో, నే నెరగని మిత్రులెవరన్నా ఉంటే వారికి అచ్చుద్వారా వినిపిద్దామని— ఒకరున్నా సరే — లేరా, పోనీండి. నాకు నేను రాసుకుంటున్నాను. నా దృక్పథం మారినప్పుడు ఎట్లా మారిందో ఈ పుస్తకంలో రాయడం నా ధర్మం.

శిక్షణ ఆదర్శం — అది అవసరం కాకపోవడం. అట్లానే ప్రభుత్వపు ఆదర్శం, జైళ్ళూ, కోర్టులూ అవసరం కాకపోవడం, వైద్యపు ఆదర్శం మందు అవసరం కాకపోవడం. స్త్రీ తాను కోల్పోయిన గౌరవ స్థానాన్ని తిరిగి పొందేందుకు ముఖ్య సాధనం తిరుగుబాటు, "తిరగబడి, నలిగి, తన జీవితం అర్పిస్తేనేగాని, పోయిన తన ఆత్మని తిరిగి తాను పొంద లేదు" అని రాశాను.

తిరగబాటు ఆదర్శం తిరగబాటు అవసరం లేకపోవడం. టాగూరు అన్నట్టు తుఫాను ఆదర్శం శాంతి. ఈనాడు నేను సంపాదించుకున్న కొత్త జ్ఞానంతో (అజ్ఞానం అనండి, ఇబ్బంది లేదు. మనం జ్ఞానమనుకునే దాని కన్న అజ్ఞానం ఎక్కువ జ్ఞానం) నవీన యువతీ యువకుల ఆశయాల్నీ, వాళ్ళ జీవిత పద్ధతుల్నీ చూస్తున్నకొద్దీ, తిరగబాట్ల ఫలితాన్ని గమనించిన కొద్దీ, నేనీ నాడు తెలుసుకున్న దేమిటంటే, తిరగబాటు పర్యవసానం ఇంకో తిరగబాటు అవసరం కావడమేనని.

ఓసారి ఓ అమ్మాయి వచ్చింది మా దగ్గిరికి. ఇంట్లో తనని కష్టపెడుతున్నారనీ, స్వతంత్ర మార్గం చూపమనీ అడిగింది. ఆమెని వెతుక్కుంటో తండ్రి వచ్చాడు. తండ్రీ కూతురూ ముఖాముఖీగా మాట్లాడుకున్నారు. రాజీ షరతులేమిటంటే—

'కుంకంబొట్టు బదులు చాదుబొట్టు పెట్టుకోనివ్వాలనీ, పాత కడియాల బదులు పాంజేపులు చేయించాలనీ!'

ఆమె బానిసత్వమంతా ఈ రెంటికీ స్వేచ్ఛ లేకపోవడమే. పెద్ద స్వాతంత్ర్య యుద్ధాలలో కూడా ప్రత్యేక వ్యక్తుల ఆశయాలిట్లానే ఉంటాయి.

ప్రత్యేకమైన హక్కుల కోసం తిరుగుబాటు చెయ్యడం వల్ల హక్కులు రావొచ్చును కాని, ఆ హక్కులు పొందడంవల్ల సౌఖ్యంరాదు. అధికారంవల్ల కలుగుతోన్న ఇరుకులోంచి ఆత్మవికాసం కోసం, అభివృద్ధి కోసం తిరగబాటు చెయ్యడం వొక్కటే హర్షణీయం. అప్పుడు స్వతంత్రత కోసం తను చేసే త్యాగాలు కూడా పుష్పాలుగా మారతాయి.

తనకి రావలసిన హక్కులకన్న, తను నెరవేర్చవలసిన బాధ్యతలపైన దృష్టి నిలపాలి స్త్రీ. బైటఉన్న పరిస్థితులకన్న, తనచుట్టూ ఉన్న వాతావరణంనించి కన్న, స్వతంత్రమూ శాంతీ, హృదయం లోపల పలికి వచ్చినప్పుడే స్థిరంగా నిలుస్తాయి! అత్త అధికారంనుంచీ, భర్త అధీనంనించీ తప్పించుకుంటున్న నవీన స్త్రీ, షోకులకీ, సంఘగౌరవానికీ, ఫాషిన్స్‌కీ, బానిస ఔతోంది. ఒక పురుషుడి నీడ కింద నుంచుని (ఆ పురుషుడికి బానిస అయితేనేం గాక) లోకాన్ని ధిక్కరించగలిగే ఇల్లాలు, ఈనాడు సంఘ గౌరవం పేర, విద్య పేర, ఉద్యోగం పేర, ఫాషన్ పేర, వెయ్యిమందికి దాస్యం చేస్తోంది. నవీన స్త్రీకి—తన చుట్టూ స్త్రీ లందరూ అత్తలైనారు!

"తెల్లారిలేస్తే పిడకలు, మళ్ళు, అధికారాలు, అలుకులు. ఇవన్నీ వొదిలి, సూర్యోదయాన్ని చూసి నవ్వే మనోవ్యవధి, సంతోషం, ఉత్సాహం — ఎప్పుడు కలుగుతుంది మానవులకి!" అని అడిగాను విస్ట్‌ఫుల్ (Wistful)గా.

తిరగబాటు వల్ల పిడకల్నీ, అధికారాన్నీ తప్పించుకోవచ్చు. అట్లా తప్పించుకున్నవారు ఆ స్వతంత్రాన్ని ఇతరుల స్వతంత్రానికి అడ్డుపడి అధికారాన్ని చలాయించడానికో, లేక తమ దేహాన్ని లేటెస్ట్ ఫాషిన్ ప్రకారం అలంకరించుకోవడానికేగాని, సూర్యోదయాన్ని చూసి హర్షించడానికి వినియోగించడంలేదు. ఇదివరకు అరుగుమీద కూచుని కూరలూ, పచ్చళ్ళూ, మాట్లాడే ఇల్లాళ్ళు ఈనాడు లేటెస్ట్ సినిమా స్కాండల్స్ (Latest Cinema Scandals) చర్చించడానికీ, తమ మిత్రుల శీలాన్ని పరీక్షించడానికీ సంభాషిస్తున్నారు.

సూర్యోదయాన్ని చూసి ఆనందించడం నేర్చుకోలేదు గాని పిల్లలనించీ, పువ్వులనించీ, ఆవుల్నించీ, అతిథుల్నించీ, ముద్దులనించీ, ఇతరుల ఆకలి తీర్చడం నించీ వొచ్చే శాంతినీ, ఉత్సాహాన్నీ పోగొట్టుకున్నారు.

జీవితం అనే 'ఫినామినన్' దేనికీ సంబంధం లేని ఉత్త 'యాక్సిడెంట్' అనే దృష్టి ఎక్కువ కావడంచేత, జీవితం అర్థవిహీనమై, ఇంత అసంతుష్టిని పుట్టిస్తోంది. ఈనాడు ఎవరైనాసరే, మనిషిలో ఈపై మనస్సు కాక, దాని వెనక అపారమైన జ్ఞానం మరుగుపడి ఉందని వొప్పుకోని వారు లేరు. సత్యాన్వేషణ అంటే చివరి అర్థం తన లోపలి ఈ సత్యాన్ని అన్వేషించడమన్న మాట. కొద్దో గొప్పో ఆ విధమైన దృష్టివొస్తే తప్ప ఏ సమస్యా తీరదు.

ఈ స్త్రీ పురుష సంబంధం ఎంత ముఖ్యమైనా ప్రపంచంలో ఉన్న అనేక సంబంధాలలో సమస్యలలో ఇది వొకటి. ఏ ఒక్క సమస్య పూర్తిగా తీరినా తక్కినవన్నీ తీరినట్టే. ఎందుకంటే సమస్య అనేది బైటగాక, మనిషి మనసులో ఉందిగనక. ఇట్లా అనడంవల్ల నేనీ పుస్తకంలో

రాసిన ఏ ఒక్కమాటా మార్చవలసిన పనిలేదు. అవన్నీ స్త్రీ నేర్చుకోవలసిన విషయాలే. కానీ ఆ స్వేచ్ఛాయత్నంలో అసలు సంస్కారం ఎక్కడ జరగాలో అది మరచిపోకూడదు. నేను రాసిన పుస్తకంలో తమకి ఉపయోగపడే వాక్యాలనే సంపూర్ణ సత్యమని ఏరుకునే పొరబాటు చెయ్యకూడదు.

ఈ ప్రపంచ మహావృక్షంలో మనిషి ఒక ఆకు. ఆకు తాను విడికాదనీ, తన జీవనం, తన అందం, ఎండలో ఆడే సంతోషం, అన్నిటికీ మూలం చెట్టు వేరులోంచి వొచ్చి తనని నింపే జీవన రసమనీ తెలుసుకున్న కొద్దీ, ఆ ఆకుకి వర్చస్సు, పుష్టి, సంతుష్టి. తనకీ — సృష్టిలో ప్రతి దానికీ, జంతువుకీ, చెట్టుకీ, సూర్యోదయానికీ బైట కనపడే సంబంధం కాక అసలు వీటన్నిటీ ఉత్పత్తిలో ఉండే సంబంధాన్ని తెలుసుకున్న కొద్దీ జీవితానికి అర్థమూ, అందమూ, సార్థకతా వ్యక్తమౌతాయి. ఈ పైపొరలోంచి, స్వార్థమైన సంబంధాలలోంచి మనసు తప్పుకుని, లోతైన బాంధవ్యానికి దగ్గిరైనకొద్దీ, అందరిమధ్యా అన్నిటిమధ్యా సమానంగా ఏకం చేస్తో విజృంబించే ఈ సృష్టిలీలని తెలుసుకున్న కొద్దీ కళ్ళు కొత్తకాంతికీ, సామరస్యాలకీ తెరుచుకుంటాయి.

పైపైన చూసినకొద్దీ సృష్టిలో ప్రతిదానికీ ఒక దానినుంచి ఇంకో దానికి భిన్నత్వం ఎక్కువగా కనపడుతుంది. లోతుగా చూడగలిగిన కొద్దీ భిన్నం చెయ్యడానికి వీలులేని ఏకత్వం తోస్తుంది. ఆ ఏకత్వమే ఈశ్వరుడు. ఆ సత్యానికి దగ్గిరైన కొద్దీ, భర్త ఆజ్ఞాపించడమూ ఉండదు, స్త్రీ ధిక్కరించడమూ ఉండదు.

అరుణాచలం, 20-9-52

చలం

ఇంకోసారి మళ్ళీ తప్పలేదు

పూర్వం చాలా ఏళ్ళు ఈ పుస్తకాన్ని అచ్చువేసే ధైర్యం ఎవరికీ లేకపోయింది. అచ్చయినాక చదవనీలేదు — అధికారమున్నవారు. తమకి లోబడినవారి ప్రతిష్టనీ, నీతినీ కూడా ఆయుధాలుగా ఉపయోగించారు. ఆ తరంవారు నామరూపాలు లేకుండా అణగారి పోయినారు. దేశ స్వాతంత్ర్యంతోబాటు అనేక సంస్కారాలు జరిగాయి. తత్ఫలితంగా స్త్రీల చేతుల్లోకి అధికారాలు కూడా దిగాయి. ఈనాడు కాగితాలపైన ఉన్న సంస్కారాలూ, విద్యాధి కులమనుకునే స్త్రీలు చెలాయిస్తున్న స్వతంత్రాలూ చూస్తే ఈ పుస్తకం 'ఓల్డు ఫాషిన్డ్'గా కనపడుతుంది. ఈ పుస్తకంలో వాంఛించిన స్వేచ్ఛకి చాలా బాధ్యతలూ, నియమాలూ ఉన్నాయి. ఏ బాధ్యతలూ, నియమాలూ లేని స్వతంత్రాన్ని దోచుకుంటోంది పురోగ మించిన స్త్రీ.

ఇంటిదగ్గర స్వేచ్ఛలేని డాక్టరుగారు ఒకరు అన్నారు, పూర్వం — "స్త్రీకి మనదేశంలో స్వేచ్ఛ లేదంటారా?"

"మనదేశంలో అనలేదు నేను. ఏ దేశంలోనూ లేదన్నాను."

"కాని చూడండి, అసలు ఇంటిదగ్గర ఆమెదే అధికారం."

"అవును, మీ ఇంటిలో అంతే. ఇంటిదగ్గిరేం, బైటకూడా మీ మీద ఆమెదే అధికారం, ఆమెకి బైట మీరు అందినంతవరకు."

"అంతేకాదు. స్వతంత్రం రాగానే, వెంటనే స్త్రీకి ఓటుని దేశం ఇచ్చింది!"

"ఓటు ఉండడం స్వేచ్ఛా చిహ్నం. కాని ఆ ఓటుని ఇష్ట ప్రకారం ఉపయోగించే స్వతంత్రం ఉందా స్త్రీకి? పురుషుడికి ఉందా? మీకు ఉందా?"

ప్రస్తుతం దేశంలో ప్రభుత్వపు కాయితాలలో స్త్రీకి సంపూర్ణ స్వతంత్రం ఉంది. అంతవరకే.

కోర్టుకెక్కటానికి ప్రతి మనిషికీ స్వతంత్రం ఉంది. కానీ బీద వాడికి డబ్బులేదు. నిష్పక్షపాతంగా తీర్పు చెప్పే స్వతంత్రం న్యాయాధి కారికి త్వరగా పోతోంది.

ఆస్తినంతా లాగేస్తో, ఆస్తి హక్కుని స్త్రీకి ఇచ్చి ఏం లాభం?

బతుకే బానిసత్వం చేసి, భర్తనించి స్వేచ్ఛనిచ్చి ఏం లాభం?

ఒక భర్తనించి పారిపోయి, పదిమంది విటులచేత తన్నులు తినేస్త్రీకి ఏం స్వాతంత్ర్యం?

స్వేచ్ఛ రెండు విధాలు — లోపలిదీ, బైటదీ.

లోపలి స్వేచ్ఛ ఉన్నవాడికి బైట స్వేచ్ఛతో పనిలేదు. అతనికి అంతా స్వేచ్ఛే. బైట స్వేచ్ఛ కావాలంటే ముఖ్యమైన అవసరాల్లో ఒకటి డబ్బు. లోపల స్వేచ్ఛ లేకుండా, తన అశలతో, చీకట్లతో, కోర్కెలతో గొలుసులు కట్టుకున్న మనిషిని బైట స్వతంత్రం ఇంకా బానిసని చేస్తుంది. అట్లాగే ఈనాటి స్త్రీ. పూర్వకాలపు స్త్రీ ఎంత ఇరుకైనా ఓ నీతికీ, తనను కున్న ధర్మానికీ, భర్తా, బంధువులూ, సంఘం — వీటికి బానిస. ఈనాటి స్త్రీ తనకి తానే బానిస. అంటే ప్రతిదానికీ బానిసే. ఆమెకి వొచ్చిన స్వతంత్రం మళ్ళా తన కాపరంనించే. ఆ గుంటలోంచి లేచి "నేను" అనే అహంకారాన్ని పెంచుకుని, ఆ ఇండివిడ్యువాలిటీ నిలబెట్టుకునేందుకు, అవినీతికీ, సక్సెస్‌కీ డబ్బుకీ, అధికారాలకీ, అన్నిటికన్న — 'ఫాషన్, మర్యాద' అనే రూపాల— సంఘానికి భరించలేని బానిస అయింది.

ఈ నూతన పరిస్థితుల్ని గమనించి వాటి అధారంగా బాగుపడదామని బైటుదేరిన స్త్రీలలో కొంచెంమంది రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా ఉన్నతస్థానాల్ని అలంకరించారు. ఇంకా కొంతమంది రేడియో, సినీమా, యుద్ధభూములలో తెగబడి, ఆ సమరంలో చాలా అవస్తలూ, నష్టాలూపడి, ఆత్మలూ, దేహాలూ అమ్ముకుని, ఏ అదృష్టంవల్లనో, ఆ శిఖరాలకి చేరుకున్నారు. కానీ బైలుదేరిన వెయ్యిమందిలో ఓ పదిమందికన్నా కృతార్థులు కాలేదు. తక్కిన వారికి అప్పుడే అనుమానం కలుగుతోంది — ఈ స్వేచ్ఛ 'వర్తవైల' ఏనా అని.

వంద ఏళ్ళ కిందట బ్రిటీషు ప్రభుత్వం ఉద్యోగాలకి తలుపు తెరిచి నప్పుడు, పురుషుల జీవిత పరిస్థితులలో కలిగిన మార్పు ఈనాడు స్త్రీలలో జరుగుతోంది. సంసార రక్షణ వాదిలి బైటికి పోగలిగిన పరిస్థితులూ, సామర్థ్యాలూ ఇంకా కలగని స్త్రీలు తమ గూళ్ళలోంచి తొంగి చూస్తున్నారు, ఎప్పుడు ఎగిరిపోదామా అని. తమని బంధించిన గొలుసులు తుప్పుపట్టి ఊడిపోతున్నాయని గ్రహించారు.

స్వేచ్ఛతో వచ్చిన బాధ్యతలూ సమస్యలూ జీవితాల్ని పిండి చేస్తున్నాయి. ఎక్కడా శాంతీ సుఖం లేకుండా ఉన్నాయి. 'పబ్లిక్‌లైఫ్' పురుషుడి స్వభావానికి సహజం. జయం రానీ రాకపోనీ. అతనికి అంతకన్న గతిలేదు. కాని స్త్రీ స్వభావానికి విరుద్ధం. పురుషుడి అధికారం నించి తప్పించుకుని, పదవులకీ, డబ్బుకీ బానిస అయింది స్త్రీ. ఎంత ఇరుకైనా ఆ పెళ్ళే నయమేమో అనే అలోచన వస్తోంది. కానీ పెళ్ళికి వీరు వాంచించే భర్త దొరకడు. ఏదో వో భర్తతో తృప్తిపడలేరు. భర్తని భార్యా, భార్యని భర్తా, తమ సాంఘిక ఆశలకి ఉపయోగించు కుంటున్నారు. కాని అప్పుడే కొందరు పురుషులు కూడా స్త్రీపైన తమకి పూర్వకాలపు అధికారాలు లేందే, పెళ్ళి అట్టే ఆకర్షణీయం కాదనుకుంటున్నారు.

అదీగాక పెళ్ళి అనే కట్టుబాటూ, పిల్లలనే బాధ్యతా లేకుండానే, కాపరానికి స్త్రీలు దొరుకుతుండడంవల్ల, పురుషుడికి పెళ్ళి అవసరమూ కనపట్టంలేదు. ఆ విధంగా ఇంకా స్త్రీ మార్కెట్‌లో చవకగానే ఉండిపోయింది.

'ఫాషన్ అండ్ గుడ్‌నేమ్' రెండే పాలిస్తున్నాయి సంఘాన్ని. నీతి అనేది ఏ కోశానా 'ఇన్‌ఫ్లూయన్స్' చెయ్యటంలేదు. ఏదో ఓలాగు ఓ పురుషుణ్ణి పెళ్ళి అంటో చేసుకుని, ప్రతిష్ట అనే అయుధంతో అతన్ని పరిపాలనలో ఉంచుకుంటోంది స్త్రీ.

పూర్వం స్త్రీ పురుషుల్ని ఒక వివాహబంధంలో ఉంచిన ధర్మాలూ, ఆదర్శాలూ, అవస రాలూ, ఆకర్షణలూ, అనేక కారణాలవల్ల ఈ కాలంలో లేకుండా పోయినాయి. ఇప్పుడు పెళ్ళి ఒక "కెరీర్."

"ఏం చేస్తాం. ఏదో ఓ ఉద్యోగం చెయ్యాలి. ఓ ఉద్యోగమే దొరకాలిగాని" అని పురు షుడు అనుకున్నట్టే. స్త్రీ కూడా —

"ఏం చేస్తాం. పెళ్ళి చేసుకోవటమే బావుంటుంది, ఓ పురుషుడు దొరకాలి గాని" అంటోంది.

వివాహానికి ఉండే పాత ధర్మాలు పోయినాయి. కొత్త ధర్మాలు రాలేదు.

ఉత్త స్వేచ్ఛవల్ల ఏమి ప్రయోజనం! ఆ స్వేచ్ఛవల్ల సుఖమూ శాంతీ, ఆత్మవైశాల్యమూ కలగంది?

ఈ కొత్త స్వతంత్రం ఎంత భారమైనా పురుషుడి అధికారానికి లొంగివుండే పాతరకపు సంసారంలోకి స్త్రీ తిరిగి వెళ్ళడమనేది ఉత్త మాట. పెళ్ళి జేసుకోడాలే తక్కువౌతాయి.

ఇంక తలెత్తకుండా భర్తే దైవమని అతనికి వంట చేస్తో, తనని చూడకపోతే ఏడుస్తో, ఓ మూల వంటింట్లో స్త్రీ పడివుండే పరిస్థితులు మ్యూజియంలో తప్ప కనబడవు. పెళ్ళి అంటే, అది సహకార సంస్థ అవుతుంది. పురుషుడు తనని ఇష్టం వొచ్చినట్టు పిల్లలు కనేదానిగా చూడటానికి స్త్రీ ఇంక వొప్పుకోదు. రాజకీయ స్వతంత్రంతో ఇంత మార్పు స్త్రీ జీవితంలో జరగబోతోంది, ఇంకా కలగలేదుగాని.

ఈ మార్పువల్ల స్త్రీ పురుషులకి సుఖం కలుగుతుందా, ఎక్కువ అశాంతి కలుగుతుందా అనేది, సర్వసాధారణంగా సంఘంలో ధర్మమూ నీతీ పరిపాలిస్తాయా, లేక ధనమూ దొంగ మర్యాదలే చలాయిస్తాయా అనే దానిపైన అధారపడి ఉంటుంది.

"స్త్రీని బైటికి రానిస్తామా?"

"స్వతంత్రాన్నిచ్చినా హిందూ స్త్రీ సీతా, దమయంతుల పంథాని అనుగమిస్తుంది."

ఇట్లాంటి అరుపులు తక్కువైపోయినాయి. ఈనాడు, స్త్రీలని చూసి అ మాటాలనడానికే సిగ్గుపడుతున్నారు.

సావిత్రీ, చంద్రమతీ, అనసూయావాళ్ళూ బహిరంగసభల వేదికలనించి పతితలై ఎక్కడా ఆశ్రయం లేక, ఇంక గతిలేక ఎంత అసహ్యంగా ఉన్నా, ఆలిండియా రేడియో వనితా విహారాల ప్రోగ్రాములోకి పోయినారు.

కనక ఇకముందు కాపరాలు పేరుకిమాత్రం ఏర్పడి, లోపల ఏ విషయమూ అనేది లేకుండా, లోకంలో రొష్టు పడకుండా, ఓ కప్పుకింద అప్పుడప్పుడు దంపతులు నిద్రపోయే స్థలాలకింద ఉండవొచ్చు. ఇప్పుడే చూస్తున్నాం, నలుగురిలో—

"My darling wife (మై డార్లింగ్ వైఫ్)"

"My reverend husband (మై రెవరెండ్ హజ్బెండ్)"

— అని పిలుచుకుంటో, ఇంట్లో తిట్టుకునే నాగరికపు జంటల్ని కాక, ఈశ్వరుడే ఈ దేశాన్నీ లోకాన్నీ ఆశీర్వదిస్తే, హృదయాలు ఐక్యం కావడంవల్ల, ఎవరూ ఏ హక్కుల్నీ, ఏ అధికారాన్నీ కోరనవసరం లేని, స్వార్థరహితమైన స్నేహమే ముఖ్యమై ప్రేమాలయాలుగా తయారు కావొచ్చు సంసారాలు.

అసలు ముందు స్త్రీ తనకి స్వతంత్రం కావాలనడం పారతంత్ర్యపు బాధలు పడలేదు గనక. గతిలేక దాంటోంచి తప్పించుకోవాలని పెనుగు లాడుతుంది. ఆ కాస్త పెనుగులాటకే పురుషుడు భయపడి హార్న్(horn) బిగించాడు. తత్ఫలితంగా, అసలు బంధనాన్ని తెగ తెంచుకుని బైటపడుతోంది. కాని పాపం స్వతంత్రదేవత ఆమెని సుఖంగా తన బానినని చేసుకుంది. గతిలేక యుద్ధంలోకి దిగిందే కానీ, ఆమెకీ స్వేచ్ఛ ఏమీ స్వభావికం కాదు. తన భారాన్నీ బాధ్యతల్నీ తీసుకుని దయగాచూసే పురుషుడికి, తనని అర్పించుకోవడానికి ఎప్పుడూ ఆమె స్వభావం సుముఖమే.

అన్ని దిక్కులా, అన్ని వ్యవహారాల్లోనూ, ఏ నీతినీ పాటించక, సంసారాలలో మాత్రం ధర్మం రాజ్యం చెయ్యాలని ఆశించడం అవివేకం. పురుషుడు తన లోక వ్యవహారాలలో ఎప్పుడు ఏ ధర్మాన్ని వదిలాడో, అప్పుడే తన సంసారం ఎడలా ధర్మాన్ని వొదిలాడు. ఒదిలి భార్య మాత్రం స్త్రీ ధర్మాన్ని పరిపాలించాలని ఆశించాడు. సాగలేదు. స్త్రీ ఎదురు తిరిగింది. భార్యాభర్తలు త్వరత్వరగా వారి ధర్మాల్ని మరుస్తో, తమ పిల్లల్ని మాత్రం ధర్మం తప్పితే శిక్షించేవారు. కాని అదృష్టవశాత్తూ పెద్దలు వారి ధర్మాలేవో పూర్తిగా మరచిపోయినారు. కాని పిల్లలకి కూడా ఎట్లాగైనా ధనం సంపాయించే మార్గమే ధర్మమార్గమని ఆదర్శంగా చూపుతున్నారు.

'వ్యక్తి ధర్మం', 'సంఘధర్మం' పోయి, 'ప్రభుత్వ ధర్మం' ఒక్కటే మిగిలిపోయింది. వ్యక్తులకీ, సంఘాలకీ తాము స్వయంగా ఆలోచించుకుని నిర్ణయించుకునే శక్తి పోయింది. మతం పట్ల అనుకున్నవన్నీ ఎగిరిపోయినాయి. చిన్నపిల్లల పెళ్ళిళ్ళు వీల్లేదని ప్రభుత్వ మంటే, నరకానికి పోతామనే భయాలు అడ్డు రాలేదు. మనువూ, వేదాలూ నోరుమూసు కున్నారు. ఆడపిల్లలకి కూడా ఆస్తి పంచడం న్యాయమని ప్రభుత్వం చెప్పాల్సి వచ్చింది. ఇదివరకు మూర్ఖమో, చాదస్తమో, ఒక నీతికీ, ధర్మానికీ, మతానికీ, పట్టువుండేది. ఈనాడు తమకి ఏ ఆచారాలూ నీతులూ ఉండాలో చెప్పమనీ, న్యాయచట్టాలు చెయ్యమనీ ప్రభు త్వాన్ని అడుగుతున్నారు — తమ బతుకుల్ని నడపవలసిన నీతి సూత్రాల్ని మరిచి. అందుకే బతుకింత నిస్సారమయింది. ఇదివరకు భర్తని వదిలి స్త్రీ ఇంకొక పురుషుడితో వుంటే దాన్ని వ్యభిచారమన్నారు. ఈనాడు ప్రభుత్వం కోర్టు ద్వారా ఇంకొకసారి పెళ్ళి చేసుకోవచ్చునన గానే, ఆ స్త్రీ పతివ్రత అయిపోయింది. డబ్బూ, పేరూ సంపాయించిన స్త్రీలు వారి సంసార జీవితం ఎట్లావున్నా సంఘంలో యోగ్యులైనారు. పురుషుడు ఎందరు స్త్రీలని పెళ్ళి చేసుకోవాలో, అతని ధర్మం ప్రభుత్వం చెపుతోంది. ప్రస్తుతం రాజకీయాలూ, ధనం తప్ప ఇంకేం మిగలలేదు, మానవుడి ప్రయత్నానికీ ఘనతకీ.

నీతీ, ధర్మమూ, ఆచారమూ కూడా "నేషనలైజ్" అయిపోయినాయి.

మీరు చూస్తోవుండగా, ప్రభుత్వం మీ కులాన్ని కలిపేసింది. 'అస్పృశ్యులకి' సలా ములు చేయించింది. మీ ఆడపిల్లల పెళ్ళివయసు నిర్ణయించింది. స్త్రీలకి ఆస్తి హక్కుల్నీ, ఉద్యోగాల్నీ ఇచ్చింది. భర్తలనించి పూర్తి స్వాతంత్ర్యాన్నిచ్చింది. ఎవరూ కుయ్యిమనలేదు. నన్ను బహిష్కరించిన మీరు, ప్రభుత్వాన్ని బహిష్కరిస్తే మిమ్మల్ని చూసి ఎంత గర్వపడుదును!

ఎంత వెన్నెముక లేకుండా పోయింది మీ ధర్మం!

అరుణాచలం, 31-12-52.

చలం

మోహం

శరీర సంపర్కం కోసం స్త్రీ పురుషులకి ఒకరిమీద ఒకరికి ఉండే వాంఛ కామం. కామం సహజం! ఈ వాంఛ లేనివారు అరుదు. ఆకలి వలెనే కామం తీర్చుకోడానికి కూడా ప్రతివారికీ అవసరం, హక్కూ ఉన్నాయి. కానీ స్పష్టంగా కనబడుతున్న ఈ విషయాన్ని సంఘ నిబంధనలు కొన్ని విషయాల్లో ఒప్పుకోవు. ఉదాహరణ: వితంతువులు. వారికి కామం ఉంటుందనే మరిచిపోయారు. ఇట్లా కొందరు స్త్రీలని నిర్భంధ బ్రహ్మచారిణులుగా ఉంచడంవల్ల అక్కర కొచ్చే స్త్రీలు దేశంలో తక్కువై ఒక స్త్రీ వల్లనే అనేక మంది పురుషులు కామం తీర్చుకోవలసిన అవసరం కలుగుతోంది. వేశ్యావృత్తి అవసరానికి ఇదొక ముఖ్యకారణం. కొంతమంది స్త్రీలు తామనుభవించగలిగిన దానికన్నా ఎక్కువ సౌఖ్యాన్ని బాధతో వోర్చుకోవలసిన గతీ, కొందరు స్త్రీలు ఆ సౌఖ్యంలో నూరో వంతు దక్కక కృశించవలసిన గతీ కలుగుతోంది.

కామాన్ని కట్టుకోమనడం అన్యాయమే, క్రూరమే. కాని కామాన్ని తీర్చుకోటానికి హక్కు ఉంది కదా అని తమ కామంతో ఇతర్లని బాధపెట్టటానికి ఎవరికీ అధికారం లేదు — భార్యనైనా సరే.

పెళ్ళి ఉద్దేశ్యాలలో కామమొక ముఖ్యమైన విషయం అని పైకి చెప్పకోటం బూతు. ఏదో గృహస్థధర్మానికీ, యజ్ఞయాగాదిక్రతువులకూ పరలోక గతుల కోసమే నిష్కామంగా కొడుకుల్ని కనేందుకేగాని, శరీర వాంఛ తీర్చుకోటానికని పైకన కూడదు. "ఇంకా పెద్ద మనిషి కాలేదు — ఎన్నాళ్ళాగను? పోనీ కాకపోయినా నిషేకం చెయ్య"మని బెదిరించవచ్చు. రాత్రిం బవళ్ళు గదుల్లో కుళ్ళుతో మంచాలమీద పడి పొర్లవచ్చు — పైకి మాత్రం వివాహం సంస్కారమనీ, కామేచ్ఛ ఉండకూడదనీ అంటే చాలు. పెళ్ళికొడుకుని వెతికేటప్పుడు ఇతను ఆరోగ్యవంతుడా బలవంతుడా పిల్లని సంతుష్టి పరచగలడా అనే ప్రశ్న లెవరైనా ఆలోచిస్తున్నారా? కామం సంగతి ఎత్తుతారా? చివరకి అతడు పుంసకుడవునో కాదో కనుక్కుంటున్నారా? డబ్బుచూసి పెళ్ళిళ్ళు చేసేవాళ్ళు కూతుర్లని వేశ్యలు చేస్తున్నారు! అంతే.

పశువులకన్న అధికంగా తక్కిన విషయాల్లో రుచులూ,నాజూకూ, శుచీ నేర్చుకున్నట్టే, ఈ విషయంలో మనుషులు మోహాన్ని నేర్చుకున్నారు. ఆ సమయానికి కనపడ్డ స్త్రీతో కామవాంఛ తీర్చుకుని, అప్పటితో ఆమెని వదలి, మళ్ళీ వాంఛ కలిగినప్పుడు ఇంకో స్త్రీని వెతికి అనుభవించడంలో తృప్తిపడడు. స్త్రీకూడా అట్లానే. అంతకన్న శాశ్వత సంబంధమూ, ఉన్నత బంధమూ కావాలనే ఈ మోహపు ఆదర్శం వల్లనే ఈ జెలసీ, తగాదాలూ కలుగుతున్నాయి. ప్రత్యేకించి ఒకానొక స్త్రీనిగానీ, స్త్రీలనిగానీ వారే కావాలని పురుషుడు

కోరడమూ; పురుషుణ్ణిగానీ, పురుషుల్ని గానీ వారే కావాలని స్త్రీ కోరడమూ, కామం తీర్చుకోవడంతో తృప్తిపడక వారిని ఎప్పుడూ తమతోటే ఉంచుకుని తమవారిగా చేసుకోవాలను కోవడమూ — ఇదీ మోహం.

మోహం కలగడానికి కారణం కనుక్కోవడం కష్టం. మోహించే వారికే తెలియాలి ఆ కారణాలు. చాలాసార్లు వాళ్ళకీ తెలీవు. ఆ వ్యక్తి ఊహల్నీ, సంస్కారాన్నీ, అభిరుచులనీ బట్టి మారుతూ ఉంటాయి. "ఎందుకు మోహించావు? ఆ వ్యక్తిలో నీకేం కనబడ్డది? మోహించడం తప్పు" అనడం అర్థవిహీనం, వెర్రి. అట్లా అడగడానికిగానీ, ఆ మోహాన్ని ఆటంకపరచడానికి గానీ ఎవరికీ అధికారం లేదు.దాన్ని అణచుకోడం, అణచుకోలేకపోవడం మాత్రమే వారి శక్తిలో ఉంది. అసలు మోహమంటే ఎన్నడూ తెలీని, తెలుసుకోలేని పశుప్రాయులున్నారు. వారిబాషలో కామమే మోహం.

మోహం వల్లనే పెళ్ళి ఏర్పడ్డది. కామానికి పెళ్ళి అవసరంలేదుకాని ఇప్పటి పరిస్థితుల ప్రకారం పెళ్ళే మోహానికి ఆధారమయింది. స్వేచ్ఛగావరించనిచోట మోహం ఉండడంగానీ, కలగడం గానీ అసంభవం. ఈ వివాహంలో బంధనాలు మోహానికి చోటులేకుండా చేస్తున్నాయి.

పెళ్ళి విషయమై సంఘం విధించిన నిబంధనల్ని చూడండి.

1. కులంలోనే గోత్రం కూడా పరీక్షచేసి పెళ్ళి చేసుకోవాలి.

   హృదయ బంధనానికి కులం గోత్రం ఉన్నాయా? మోహానికి ఇవి ఆటంకాలా?

2. మోహమూ, చివరకి కామమూ అంటే తెలియకముందే పెళ్ళి చెయ్యడం.

   పెళ్ళి అయిన తరవాత మోహం కలుగుతుందనడం హాస్యాస్పదం, మోహమంటే అర్థంకాని మూర్ఖం.

ప్రస్తుతం సాధారణంగా పురుషులు పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యాలు వేరు:

(అ) కామం తీర్చుకునేందుకు.

(ఆ) ఒంటరితనం పోవడానికి.

(ఇ) జబ్బులో వృద్ధాప్యంలో సేవ చెయ్యడానికి ఒకరుండాలని.

(ఈ) వంటా చాకిరీ చేయడం కోసం.

(ఉ) ఉన్న సంతానం పోషణ కోసం.

(ఊ) ముందు సంతానం కోసం.

స్త్రీలకి పెళ్ళి ఎందుకంటే:

(అ) అల్లరి చెయ్యకుండా ఆజ్ఞాను బద్ధులయ్యేందుకు.

(ఆ) కూడూ గుడ్డా ఇచ్చేవాడుండడానికి.

(ఇ) అన్నిటికీ ముఖ్యం ఏదో ఆచారమనీ, అందరూ చేస్తున్నారనీ, చేయకపోతే విడ్డూరంగా ఉంటుందనీ.

ఈ కారణాల్లో మోహం ప్రసక్తేలేదు. మొదట్లో కామంవల్లా, తరవాత కొన్ని సంవత్సరాలు కలిసి ఉండడంవల్లా — భార్యా భర్తా ఒకరి కొకరు అలవాటు కావడంవల్లా ఒకర్నొకరు వదల్లేరు. చాలామంది అదే మోహమనీ, ప్రేమనీ భ్రమపడతారు. పెళ్ళి అయిన తరవాత కలిగే మోహమిదే. ఇలాంటి "మోహం" చాలా కాలం వాడుకున్న కుర్చీలమీదా, గేదెలమీదా కూడా కలుగుతుంది. ఈ 'అలవాటు కావడం' ఎవరితో పెళ్ళిచేస్తే వారితో అవుతుంది.

మోహం అట్లాకాదు, ప్రత్యేకించి

వొకరు కావాలని కోరుతుంది.

3. పెద్దలు, వారు ఏరి తెచ్చి కట్టడం. పెళ్ళికొడుకు స్వభావమూ, మోహ ధర్మమూ — అతని తండ్రికెలా తెలుస్తుంది?
4. మోహం పోయిన తరవాత కూడా ఇద్దర్నీ పెళ్ళివల్ల అతికించి ఉంచడం.
5. ఒకరికంటే ఎక్కువమంది మీద ఏక కాలమందే పురుషుడికి గాని, ముఖ్యంగా స్త్రీకి మోహం కలగవచ్చు ననీ, ఆమె పెళ్ళి చేసుకున్న వారిమీద గాక ఇతరులమీద కూడా ఆమెకి కారణం తెలీకుండానే మోహం కలగ వచ్చనీ అర్థం చేసుకోలేకపోవడం.

ఎవరి హృదయాన్ని వాళ్ళు పరీక్ష చేసు కుంటే ఏకకాలమందే చాలా మందిమీద మోహం ఉండడమూ, ఆ మోహం ఎక్కువ తక్కువ ఉండడమూ అసహజం కాదని తెలుస్తుంది. పూర్వం రాజులు ఎంత మందినో మోహిస్తూ పెళ్ళిచేసుకునే వాళ్ళు కదా? ఇప్పుడు మహమ్మదీయులు చేసు కోవడం లేదూ?

స్త్రీ హృదయమూ అట్లాంటిదే. ద్రౌపతికి అయిదుగురిమీద మోహం కలిగిందని అందరూ విశ్వసించడంలేదా? భార్య పోయిన ఆర్నెల్లలో కొత్త భార్యమీద, అంతకుముందే సాని మీదా మోహం కల్గగా లేనిది భార్య ఉండగా ఇతరులమీదా, భార్యమీదా కూడా మోహం ఉండకూడదా? అదీగాక ఒక సుగుణంవల్ల ఒకరిమీదా, ఇంకొంచం సుగుణం ఉండటంవల్ల ఇంకొ కరిమీదా, అట్లా అంతం లేకుండా మోహం ప్రేరేపణ కావచ్చునని లోకానుభవంవైపు కళ్ళు మూసుకోనివారి కందరికీ తెలుస్తుంది.

ఇట్లాంటి నిబంధనవల్ల మోహపు స్వేచ్ఛని తెగగొట్టి, కామాన్నే ప్రధానంగా చేసి, మనుషుల్ని పశుత్వానికి లాగు తున్నారు. స్వేచ్ఛకి చోటియ్యక, మోహం ఉద్భవించటానికే వీలులేకుండా చెయ్యడం వల్ల, ఈ నిర్బంధించబడిన దంపతులకి కామంతప్ప ఇంకేమీ మిగలదు. చాతకాదు.

అదీగాక మోహం వల్ల చాలా ఉత్కృష్ట మైన లాభాలు ఉన్నాయి.

మోహించిన వారిని సంతోషపెట్టడా నికీ, వారి ప్రేమకి తాము అర్హులు కావ డానికీ, స్త్రీ పురుషులు అభివృద్ధి పొంది సుగుణవంతులై, రెండోవారు తమని మోహించేటట్టు చేసుకోడానికి ప్రయత్ని స్తారు. స్త్రీ పురుషులు ధైర్యవంతులూ, సాహసవంతులూ, ఉదారులూ అవుతారు. రెండోవారి మోహం ఎక్కడ పోతుందో అనే భయంచేత అనేక చెడు అలవాట్లనించీ, దుష్కార్యాలనించీ, ప్రలోభాలనించీ తప్పు కుని బాగుపడతారు — ఇంకొకరు తమను మోహిస్తున్నారనీ, తమ కార్యాలు తమకేగాక ఇంకొకరికి కూడా చెందుతాయనే భావమే వారి హృదయాల్లో అమూల్యానందాన్నిచ్చి, అసాధ్యాలైన మహత్కార్యాలకి వారిని పురి కొల్పుతుంది. ఇటువంటి ప్రోత్సాహాన్ని ఈ దేశస్తు లెరగరు. తాము ఎంత నిర్జీవంగా ఉన్నా, 'రెండోవారికి పెనిమిటిగానో, భార్య గానో ఉండడం తప్పకపోదు కదా!' అనే నిర్లక్ష్యంలో ఎట్లా ఉన్నవారు అట్లానే ఉంటారు. అభివృద్ధికి ప్రయత్నించక. ఒకరి హృదయాన్ని ఇంకొకరు తమదాన్ని చేసుకో వాలనే ప్రయత్నంవల్ల కలిగే ఆనందం, లోకంలో ఇంక దేనివల్లారాదు. అటువంటి ఆనందాన్ని పొందినవారు దేవత్వాన్ని అనుభ

ించినవారు. మృగాలవలే కామంపల్ల పొందే సౌఖ్యం ఒక లెక్కలోది కాదు. ఇప్పుడు సాధారణంగా పెళ్ళి సమయంలో భార్య హృదయం మోహించడానికి తగిన వయసులోనే ఉండదు. ఎదిగిన పిల్లలకి గోషాగనక పెళ్ళి ముందు భర్తనెరుగరు. రెండోవారికి తానే కావాలనీ, తను తప్ప ఇంకెవరూ అక్కర్లేదనీ తెలీడంవల్లనే నిజమైన ఆనందం కలుగుతుంది. దీన్ని ఈ ప్రజ ఎరుగనే ఎరుగదు. తమ భార్యా భర్తలనించి ఇట్లాంటి అనుభవం లేనందువల్ల ఇతర స్త్రీ పురుష హృదయాల్ని ఆకర్షించి ఇట్లాంటి అమూల్యమైన ఆనందాన్ని పొందాలని చూస్తారు.

6. జంతువులు కూడా సంతానం కోసం ఆరోగ్యమూ, బలమూగల జంతువుల్నే ఏరుకుంటాయి. ఆరోగ్యం లేనివాటిని ఇతర జంతువులు కోరకపోవడంవల్ల అవి సంతానం కనకుండానే నశిస్తాయి. ఈ పద్ధతి వల్ల సృష్టి తన ప్రాణుల్ని ఆరోగ్యవంతంగా ఉంచుతుంది. మనుష్యులకి ఈ స్వేచ్ఛ లేదు. అనారోగ్యవంతుడైన భర్తనించి తప్పించుకునే స్వేచ్ఛ భార్యకి లేదు. మోహంతో, స్వేచ్ఛతో, ఒకరినొకరు కోరి, వలుసుకున్నప్పుడే మంచి సంతానం కలుగుతుంది.

కనక మోహమే ఆధారంగా వివాహమేర్పడాలి. మోహం లేక పోయినా వివాహం విచ్ఛేదమైనట్టే భావించుకోవాలి. తనకి మోహం పోయిందా భర్త భర్తకాదు. భార్య భార్యకాదు. వారితో సంబంధం ఇతర మనిషితో చేసినట్టే. తనకి ఎవరిమీద మోహం కలుగుతుందో వారిని తనకి భర్తగా స్త్రీ నిర్ణయించుకునే నీతికి సంఘం అభివృద్ధి పొందాలి.

కానీ ఎవరి సహాయమూ లక్ష్యపెట్టక, వారంతట వారు ఏరుకుని పెళ్ళిళ్ళు చేసుకునే స్వేచ్ఛ యువకులకీ, యువతులకీ, ఇస్తే సరైన వారిని ఏరుకుంటారా అని సందేహం చాలా మందికి. కనక పెద్దవారి అనుభవమూ, జ్ఞానమూ నిర్ణయించాలంటారు.

ఈ పెద్దవారికి తెలుసునా సరైన వారెవరో! సరైన వారంటే పెద్ద వారికి సరైన వారా? పెళ్ళిచేసుకునేవారికి సరైనవారా?

ఎంత వయస్సువొస్తే కలుగుతుంది ఆ సరైనవారిని ఏరేజ్ఞానం? సరే అంతవరకూ వివాహం ఆపి ఉంచరాదూ?

కులం, రూపం, ధనం, విద్య ఇవి ముఖ్యమైనప్పటికీ వీటిని మించిన కారణాలున్నాయి మోహానికి. పెళ్ళికి మోహమే ప్రధానం కనక మోహించుకునేవారికి తప్ప అవి ఇతరులకు తెలీవు.

ఈ పసివారు రూపాన్నీ, ధనాన్నీ చూస్తారని, అసలు కావలసింది వంశమూ, గుణమూ అంటారు. ఈ పెద్దలేమాత్రం వంశాన్నీ, గుణాన్నీ చూస్తున్నారు? ఆ వధూవరుల గుణాలు తెలీడానికేమాత్రం వీళ్ళున్నాయి వీరికి? కట్నాలూ నగలూ తెలుస్తున్నాయి గాని! అయినా గుణమో రూపమో, ఏది ప్రధానమో పెళ్ళిచేసుకొనేవారు నిర్ణయించాలి. వీరెవరు నిర్ణయించడానికి?

బాలికలకి బాగా లోకజ్ఞానం ఇస్తే వారికెల్లాంటివారు తగిన భర్తలో, ఉత్తమ పురుషులెవరో తెలుసుకునే శక్తి కలుగుతుంది. ఇప్పుడీ చిన్న పిల్లలకి కూడా ఈ పెద్దవారి కంటె ఎక్కువ తెలివే ఉంది, వధూవరుల్ని వెతుక్కోవటంలో.

తప్పుగా ఏరుకున్నా తమ పొరపాటుకి

తామనుభవిస్తారు. ఈ పెద్దవారి పారపాట్లకి వీళ్ళెందు కనుభవించాలి?

సంపూర్ణమైన ఉద్దేశ్యంతో, జ్ఞానంతో ఏరుకున్నా మనసు మారిపోవచ్చు. మోహం పోవచ్చును అంటారు. అది నిజమే. కాని అసలు మోహం లేకుండా పెళ్ళి చేసుకోవడంకన్న నయం. ఆ సంబంధం చాలా కాలం నిలుస్తుంది. నిలవనప్పుడు విడిపోతారు.

ఇప్పుడు జరిగే వివాహాల ప్రకారం గర్భాదానం నాటికి భార్యకీ భర్తకీ మైత్రి ఉండదు. ఒకరి నొకరు ఆశించరు, మోహించరు, ప్రేమించరు, పరస్పరం ఎరుగనే ఎరుగరు. కొన్ని జాతుల్లో ఒకరి నొకరు ముందు చూసే ఉండరు. ఎవరు ఆ రాత్రి గదిలోకి వస్తే వారే భర్త, వారే భార్య. అట్లా కొత్త వాళ్ళిద్దర్నీ గదిలో పశువుల్లా బంధించడానికి పవిత్రమైన వివాహమని పేరు. రజస్వల కాని పిల్లని, ఆసంగతేమిటో తెలియని పిల్లని, బోనులో మేకపిల్ల కోసం తిరిగే పులివంటి భర్తకివొప్పచెపుతారు. వాడు తన రోగాలు ఈమె వొంట్లో ప్రవేశపెట్టి ఆమెని తాకడానికీ, చూడడానికీ అసహ్యం కలిగేట్టుగా చెయ్యవచ్చు. వీటికి ఏమీ రోత పడకుండా వప్పుకునే పశు ప్రాయురాలూ, అనాధా, పిరికిదీ, వీళ్ళూ పతివ్రతలు. స్వర్గమంతా వీరిదే. ఇష్టపడందే ఒక మృగాన్ని ఇంకో దానితో కలపలేరు. ఒక రాత్రి కాకుండా జన్మమంతా కట్టేస్తారు, మనుషుల పిల్లల్ని పెద్దవాళ్ళెరిగిన పురుషుల దగ్గిర.

వివాహాన్ని గురించి మూడు అభిప్రాయాలు వున్నాయి.

1. ఈశ్వర నిర్మితమనీ,
2. సంఘ నిర్మితమనీ,
3. వ్యక్తి నిర్మితమనీ.

ఈశ్వర నిర్మితం:

దీని ప్రకారం ఈశ్వరుడే ఇట్లా భార్యా భర్తా ఉండాలనీ, ఒకరి నొకరు మాత్రమే ప్రేమించుకోవాలనీ, ఎవరిని కూచోపెట్టి మంత్రాలు చదివితే వారే భార్యా, భర్తా అవుతారనీ, వారింక విడిపోకూడదనీ. ఆ ఈశ్వరుడే పురుషుడు మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకోవచ్చుననీ, స్త్రీ చేసుకో గూడదనీ ఇల్లాంటి అన్యాయాలుకూడా శాసించాడు. కాని ఆయన కనపడడు కనక, అడగడానికీ, ధిక్కరించడానికీ వీలులేదు.

ఇట్లా అనుకునే వాళ్ళతో వాదించి లాభంలేదు. ఆ ఈశ్వరుడు ఎప్పుడు ఎవరికి చెప్పాడో, చెప్పినట్లు వీళ్ళకిగానీ, చూపరికి గాని ఎట్లా తెలుసో చెప్పరు. కనక మాట్లాడకుండా వాళ్ళని లెక్కలోకి తీసుకురాకుండా తుడిచివెయ్యటమే మంచి మార్గం. వాదించి లాభంలేదు.

సంఘ నిర్మితం:

సంఘ పారిశుధ్యం కోసం సంక్షేమం కోసం ఈ వివాహ నిబంధనలు ఏర్పడ్డాయనీ, వ్యక్తి మనసూ, మోహమూ ఎట్లా వున్నా సంఘం కోసం త్యాగం చెయ్యవలసిందేనని అంటారు. వ్యక్తి స్వాతంత్ర్యంవల్ల సంఘమే ధ్వంసమైతే యోచించవలసిన విషయమే. ఈ నియమాలు మొదట ఆయా పరిస్థితులను బట్టి ఆ కాలాను గుణ్యంగా సంఘ క్షేమం కోసమే ఉద్భవించి వుంటాయి. కానీ ప్రతిదినమూ మారిపోతున్న సంఘాన్ని పాలించేందుకు బూజు పట్టి పుచ్చి రాలిపోతున్న ఈ పాత విషయాలనే ఆధారం చేసుకొంటే దొంగతనమూ,

కపటమూ తప్ప ఏమీ మిగలదు. సంఘం పేరుపెట్టి తమకు ప్రతికూలంగావున్న ప్రతి సంస్కారానికీ, అడ్డుపడడానికి మాత్రం పనికి వస్తుంది ఈ వాదన. వ్యక్తుల్ని బలి తీసుకుంటున్న ఈ సంఘం ఎంత పవిత్రంగా ఎంత వృద్ధితో శోభిల్లుతుందో కళ్ళుంటే కనబడుతోనే ఉంది.

వ్యక్తి నిర్మితం:

అనగా మోహం వల్ల వివాహం పాలింపబడాలనీ, ఇంకొకరికి అన్యాయంగా హాని కలగనంతకాలం ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ఆచరించవొచ్చనీ.

కానీ వ్యక్తికి అనుభవం తక్కువ అనీ, అందువల్ల పెద్దవారూ అనుభవస్తులూ ఏర్పరచిన ఈ నియమాలను ఆచరించడం వల్ల ధర్మసుఖ మార్గాలలో ప్రవర్తిస్తారనీ అంటారు. కానీ శాస్త్రాలకీ, ముసలివాళ్ళకీ లోబడి, ఏ అధికారాన్నీ ప్రశ్నించక కాలం గడిపిన మనిషి ఎప్పుడు తాను తన స్వంత అనుభవాన్ని నేర్చుకుంటాడు? ఆ శాస్త్రాలు చెప్పేవన్నీ నిజమనీ అర్థయుతములనీ ఎట్లా రూఢి? ప్రతిదినం ప్రతివారూ శాస్త్ర విరుద్ధంగా ప్రవర్తించడమూ, వాటిని లక్ష్య పెట్టక పోవడమూ జరుగుతూనే ఉంది. అట్లా అతిక్రమించకపోతే — ఆ దేశంగానీ, వ్యక్తిగానీ నాశనమే. మనుష్యులకు వాళ్ళు చెప్పే సూత్రాలకంటే బుద్ధి ఎక్కువే ఉంది. కానీ ఏ పనన్నా చెయ్యడానికి ధైర్యం చాలనప్పుడు శాస్త్రాలు నిషేధిస్తున్నాయని దొంగ మాటలు చెప్పి సమర్థించుకుంటారు. పెద్దవారిమీద నేరం తొయ్యాలని బుద్ధిపుట్టినప్పుడే, చప్పున పెద్దవారిమీద భక్తికూడా ఉద్భవిస్తుంది.

ప్రస్తుతం ఆడవాళ్ళ స్వభావానికీ, మొగవాళ్ళ స్వభావానికీ స్పష్టమైన భేదాలు కొన్ని కనపడతాయి. ఈ బేదం వాళ్ళ జీవితాల పద్ధతిలో కూడ భేదాన్ని కల్పిస్తోంది.

పురుషుడికి మోహం స్త్రీ రూపంమీద ఎక్కువ ఆధారపడుతుంది. గుణం, వంశం అనేవి ఉత్త పెళ్ళిళ్ళకీ, కాపరాల స్థిరత్వాలకీ పనికి రావచ్చు నేమోగాని, మోహానికి అవి రూపం అంత ప్రాముఖ్యంకాదు. అది కాకుండా స్త్రీ శరీరంలోని కొన్ని భాగాలు మాత్రమే అతన్ని ముఖ్యంగా ఆకర్షిస్తాయి.

స్త్రీ మోహించేటప్పుడు, భాగాలు గాక పురుషుణ్ణి అంతా రూపం, గుణం, స్వభావమూ కలిపి మోహిస్తుంది. ఆమె మోహా తుతరత చాలాకాలం నిలుస్తుంది. పురుషుడివలె నిముషాలమీద తేలిపోకుండా! ఆమె మోహోద్రేకం ఒక పనిమీద గాని, ఒక అవయవంమీద గాని, ఒక పరిస్థితిమీద గాని, పూర్తిగా ఆధారపడదు. ఆమె శరీరం అంతా కోర్కె ప్రతి అంగుళమూ ఉద్రేకిస్తుంది. ఆమె సంపూర్ణంగా వశ్యురా లౌతుంది తన భావోద్రేకాలకి. అందువల్లనే ఆమె తల్లిగా గొప్పది. ఇతరుల భావాలనీ, మనోవృత్తులనీ, సూటిగా సరిగా అప్రయత్నంగా తెలుసుకుంటుంది. వ్యవహారాలలో ఎట్లా వర్తించాలో చాలా సులభంగా సరిగా తెలుసుకో గలుగుతుంది. పురుషుడి యత్నాలకి అతని రీజన్ సహాయమూ చేస్తుంది, అడ్డువస్తుంది. ఏ యోచనా లేకుండా సరైన మార్గన్ని తెలుసుకుంటుంది స్త్రీ. కానీ యోచనచేసి తెలుసుకోవలసిన ప్రవర్తనలో, ప్రయత్నించి కనిపెట్టవలసిన విషయాలలో ఆమె భావోద్రేకం ఆమెకి అడ్డు. ఆమె మనసు "రీజనింగ్"లో కొరత పడుతుంది.

పతివ్రత

స్త్రీ పురుషుల్ని స్వేచ్ఛగా వొదిలి వరించుకోనియ్యడానికి సంఘానికి పెద్ద అభ్యంతరమూ, భయమూ ఉంది— వాళ్ళకి స్నేహం ఎక్కువై పెళ్ళికాకముందే శరీర సంబంధం కూడా కలగవచ్చని. తప్పకుండా కలిగితీరుతుందని దృఢమైన నమ్మకం. వారి పిల్లల పాతివ్రత్యంలోనూ, మనో బలంలోనూ అంత విశ్వాసముంది.

దీన్నే 'పురుషుడు స్త్రీని చెరచడ' మంటారు. స్త్రీ పురుషులు ఇద్దరూ వొకటే పనిచేస్తే చెడిపోయే వారొకరూ, చెరపే వారొకరూ అనే భేదం అర్థహీనమయింది. సంఘం ప్రకారం పురుషుడు ఏంచేసినా చెడిపోని పదార్థం. పరపురుషుడి వేలుపడితే చాలు స్త్రీ కుళ్ళిపోతుంది. స్త్రీకి నోరు లేకపోబట్టే కథ, అన్యాయమైన ఈ భేద భావం ఇంకా ఈనాటికి కూడా అమలులో ఉంది! ఆమెకి గర్భం వస్తుందనే భేదం సృష్టిభేదం కాని నీతి భేదం కాదు.

ఇప్పుడున్నస్థితిలో స్త్రీ పురుషుడి వలలో అక్రమంగా వెంటనే పడిపోతుందన్నమాట నిజం. కాని స్త్రీకి స్వేచ్ఛనిచ్చి లోకంలో పురుషుడివలె తిరగనిస్తే తన స్వేచ్ఛనీ, గౌరవాన్నీ నిలుపుకోడం నేర్చుకుని తన మానం తనే కాపాడుకొనగల శక్తీ, తెలివీ సంపాదించుకుంటుంది. ఇప్పటివలె పురుషుడినించి పారిపోవడమూ, చాతగాక చిక్కడమూ, అవసరముండదు. స్త్రీని ఇళ్ళల్లో దాస్తే పురుషుడు ఆమెకి వింత. ఒకరినొకరు చూడగానే వారికిప్పుడు కలిగే అస్వభావికమైన కామోద్రేకం తగ్గుతుంది. బాలికకి సరైన విద్యనీ, అనుభవాన్నీ, లోక జ్ఞానాన్నీ, నీతినీ, మోహసంబంధమైన విద్యనీ ఇచ్చినట్లయితే, ఇప్పటి వెర్రిబాలి కలవలె తనకి కనపడ్డ పురుషుడల్లా దేవుడనీ, అతడు చెప్పినవన్నీ నిజమేననీ నమ్మి లోబడదు. చిన్నప్పటినించి బాలురలో పురుషులలో కలిసి మెలిసి తిరిగిన బాలిక పురుషుల స్వభావం తెలుసుకుంటుంది. అధముడైన పురుషుణ్ణి దేవుడని మూర్ఖంగా ప్రేమించదు. అతన్ని భర్తగాగానీ, ప్రియుడుగా గానీ అంగీకరించదు. ఒకవేళ ఈ కొత్త స్వేచ్ఛవల్ల కొందరు చెడిపోయినా ఇప్పుడు రహస్యంగా చెడిపోయే వాళ్ళకంటే ఎక్కువ ఉండరు.

ఎక్కడ చెడిపోతుందోనని ఇళ్ళల్లో, బడుల్లో తాళాలు వేస్తే స్త్రీకి లోకజ్ఞానం ఉండదు. విద్యరాదు. అల్పబుద్ధి కలిగి వుంటుంది. దేహబలం, బుద్ధిబలం, నీతి బలం ఉండవు. అట్లా జీవచ్ఛవాలై ఉండటం కంటే జ్ఞానమూ, బలమూ సంపాయించుకునే ప్రయత్నంలో చెడిపోవడమే నయం. ఎవరో పూర్వం పుస్తకాల్లో రాసేసిన నీతులూ, భర్త నిర్దేశించిన ఆజ్ఞలూ తప్ప స్త్రీలు ఏ నీతినిగానీ, అవినీతినిగానీ ఎరుగుదురా? మోహాన్నెరుగని చిన్నపిల్లల్ని కట్టుకుని, వారిని జ్ఞానంనించీ, అవినీతినించీ, కాంతినించీ, పురుషులనించీ, దాచుకుని దుర్నీతికి కూడా పనికిరాని కళేబరాలతో కాపరం చెయ్యడం ఉత్తమమో — అనుభవమూ, తెలివీ, లావణ్యమూ, చాకచక్యమూ, తనమీద గాఢానురాగమూ కలిగి ఉన్న స్త్రీతో (ఆమె పదిసార్లు చెడిపోయినదై తేనేం) కాపరం ఉత్తమమో పురుషులు

నిర్ణయించుకోవచ్చు.

పురుషుడు స్త్రీని "చెరుపుతాడనే" ఈ అనుమానంవల్ల దగ్గిర బంధువులకి తప్ప ఇతర స్త్రీ పురుషులకి స్నేహం వీలులేదు. పడకగదిలో తప్ప ఇతర సంబంధం భార్యా భర్తలకైనా వొప్పుకోరు. మొగవాళ్ళు స్త్రీకి సహజశత్రువైనారు. దీనివల్ల ఇద్దరి స్వభావాలకీ కూడా అమితమైన నష్టం కలుగుతోంది.

పవిత్రత — స్త్రీకి భూషణమే. అది అత్యవసరం. తుచ్ఛమైన కోర్కెలకి లోబడకుండా ఇంద్రియ జయాన్ని పొందడం ఆమె మనోబలాన్ని అభివృద్ధిచేసి, ఆమె స్వభావానికి మెరుగునూ ఔన్నత్యాన్నీ ఇస్తుంది. తన మృదుత్వాన్నీ, మనోలావణ్యాన్నీ, అమూల్యమైన నిర్మలత్వాన్నీ ఎవడికిపడితే వాడికి విచక్షణ లేకుండా, అనర్హుడైన వాడికి, తాత్కాలికంగా, వాడిముందు పారెయ్యడం, ఒక నిముషపుకామం కోసం వృధా చెయ్యడం మూర్ఖమైన పని. కానీ ఆ కార్యంలో పాపమూ అసహ్యమూ వ్యక్తి హృదయస్తములని తెలుసుకోవాలి. నిర్మలత్వమంటే ఎటువంటిదో, దాన్ని కాపాడుకోడ మెట్లానో స్త్రీ తనకి తానే నిర్ణయించుకోవాలి. అటువంటి సర్వోన్నతమైన తన పవిత్రతనీ, మృధుమధురమైన తన శరీరాన్నీ, యోగ్యతనీ, గూఢత్వాన్నీ, అర్హుడు కాని భర్త కైనాసరే ఇవ్వని ధైర్యాన్నీ, అభిమానాన్నీ అభ్యసించడం స్త్రీ విధి. కాని స్త్రీ హృదయంలో ఈ అభిప్రాయాలు పాదుకొనందే, ఆమె ఇంకా జడప్రాయురాలుగా ఉండే సమయంలోనే, ఈ నిబంధనలని బైటనించి సంఘం బలవంతంగా విధించడం పరిపాటు. అందులో సంఘం అభిప్రాయాలుపోనీ సరిగా ఉన్నాయా? సంఘం ఆదేశం ప్రకారం రోగాలతో పుచ్చిన భర్తకి తనమీద మోహమేమాత్రము లేకపోయినా సరే, అతన్ని నిర్మలమైన దేహాభిమానమూ ఆత్మాభిమానమూ కలిగి ఎదిరించిన స్త్రీకి గతులు లేవు. పవిత్రతా మహాదర్శాన్ని ప్రజల కళ్ళముందు ప్రతిష్టించి పురికొల్పవలసిందేగాని, అక్రమంగా, అన్యాయంగా, మూర్ఖంగా, తన చిత్తంవొచ్చినట్టు శాసించడం వల్ల ఏమీ లాభం కలగదు. ఆ ఆదర్శం పడిపోతుంది. అంతే.

పెళ్ళి అయింతర్వాత సంఘం స్త్రీ మీద విధిస్తున్న నిబంధన పాతివ్రత్యం. పాతివ్రత్యానికి మొదటి ధర్మం పతిని దైవంగా తలుచుకోడం. భర్త ఎటువంటివాడైనా, పర పురుషుడు కలలోకి రాకూడదు. భర్తకుష్ఠురోగీ, నీచుడూ, నరహంతకుడూ అయితే మరీ మంచిది, పాతివ్రత్యం మరీ బాగా కనపడుతుంది. మానసికశాస్త్రం తెలీక, లోకజ్ఞానం తెలుసుకో నిష్టపడని శుద్ధ మూర్ఖుల అభిప్రాయం అది. మన కెవరిమీద ఇష్టమో వాళ్ళని రాజూ, దేవుడూ అనుకోగలంగాని, యెవ్వరో యేరి బలవంతంగా మీద పడవేసిన వారిని, యెంత ప్రయత్నిస్తే మాత్రం వారిమీద మోహంవస్తుందా! అది స్వభావికమా? మోహం వచ్చిందనుకుంటే అది అబద్ధం, మోసం, మాయ. ఇద్దరూ కలిసి వుండడంవల్ల కొన్నాళ్ళకి కలిగే అలవాటునీ, మామూలు సంబంధాన్నీ చూసి మోహమని భ్రమిస్తున్నారు. మనం చూసే స్త్రీలందరూ భర్తల్ని దేవుళ్ళుగా చూస్తున్నట్లుగానే కనబడుతున్నారా? పెళ్ళి మంత్రాలు ప్రేమని కల్పిస్తాయా? ఎంత ప్రయత్నించీ ఇష్టంలేని కూరని మింగలేమే! కళ్ళారా నీచుణ్ణి చూస్తో,

దేవుడనుకుంటో యావజ్జీవమూ యెట్లా భరించడం? చంటిపిల్లని ఈవిధంగా మోస పుచ్చలేమే, దేశంలో ఎదిగిన స్త్రీలని మోస పుచ్చగలమా! ఈ తన్నే దేవుళ్ళనీ, తాగే దేవుళ్ళనీ రోగాల దేవుళ్ళనీ ఎంతకాలం భరించగలం?

పాతివ్రత్యానికి ఉండే రెండో సుగుణం పతి ఆజ్ఞని పాటించడం. ఈ వంక పెట్టుకుని పురాణ పతివ్రతలు చేసిన ఘోర కృత్యాలు, అసహ్యపు పనులూ అనంతం. పెనిమిటి ఆజ్ఞల'ని అబద్ధాలాడేవాళ్ళూ, సంసారాలు పాడుచేసుకునేవాళ్ళూ, పిల్లల్ని యేడిపించుకు తినేవాళ్ళూ, అందరూ ఉన్నారు. ఆ కార్యం మంచిదా, కాదా అనే విచారణ లేదు. ఇతరులకి అన్యాయంగా హాని చేస్తున్నామే — అనే యోచనేలేదు. తమ స్వభావాలన్నీ నీచపరచుకుంటున్నామే —అనే దిగులే లేదు. దేనికైనా సిద్ధమే. ఇప్పటికీ భార్యలకి అదే ఆదర్శం. భార్యకి వేరే మెదడూ, అభిప్రాయాలూ, నీతులూ, అంతరాత్మలేవు. పతి ఆజ్ఞే సమస్తమూ. చివరికి పురాణ స్త్రీలు కూడా పూర్తిగా యీ ఆజ్ఞల్ని పాటించక పోయినారు. ఉత్త "మిషన్లు" తప్ప ఈ పతి ఆజ్ఞల్ని గొడ్లు కూడా పాటించలేవు. ఇప్పుడు పతి ఆజ్ఞల్ని పాటించడంలేదు సరికదా, తాము చేసే పనులకి పతి ఆజ్ఞ అనే వంకమాత్రం సులభంగా దొరుకుతుంది.

ఇంక దీనికి సంబంధించిన మూడో సుగుణం త్యాగం. స్త్రీ జీవితానికి అర్థమే, అవధే, ఆదర్శమే త్యాగం. త్యాగం చెయ్యని స్త్రీ పాలియ్యని గొడ్డు. భర్తకోసం, పిల్లల కోసం, సంసారంకోసం, బంధువులకోసం, శత్రువుల కోసం, లోకంకోసం, పరలోకం కోసం, మాట్లాడితే ముందు త్యాగం. ఎన్ని "యిన్టరెస్ట్సూ", ఆదర్శాలూ అభిరుచులు వున్నా ఏమీ తలపెట్టక త్యాగం. భర్త తాగుబోతైతే అభిమానత్యాగం. కోపిష్టి ఐతే శరీరత్యాగం. దుర్నీతుపరుడైతే నీతిత్యాగం. స్త్రీకి అందరి యెడలా తాను జరుపుకోవలసిన విధులు ఉన్నాయి. తన యెడల తాను జరుపుకోవలసిన విధులు మాత్రం లేవు.

త్యాగం చెయ్యడానికి ముందు త్యాగం చెయ్యడానికి యేమన్నావుండాలి. పురాణ స్త్రీల దగ్గిర రెండే ఉన్నాయి శరీరం, మానం. భర్తకి అవసరమైనప్పుడల్లా ఈ రెండూ సిద్ధంగా ఉంచుతారు — కష్టపెట్టడానికీ, దానమిచ్చుకోడానికీ, అమ్ముకోడానికీ, చంపుకోడానికీ. ప్రస్తుత స్త్రీలకి నగలూ, భూములూ ఉంటాయి. ఇష్టముంటే ఇవి త్యాగం. అంతేకాని తెలివీ, అభిమానమూ, రోషమూ, ధైర్యమూ, సాహసమూ లేవు. అవి ఇవ్వలేరు. ఎవరికన్నా ఒకరు త్యాగం చేస్తే త్యాగం పొందినవారు బాగుపడాలి. కానీ ఈ పురాణ స్త్రీల భర్తల్లో ఒక్కరూ వాళ్ళ త్యాగం వల్ల బాగుపడ్డవాళ్ళు లేరు. ఒక్కరికీ భార్యల యెడ కృతజ్ఞత లేదు. గౌరవంలేదు. ఆ త్యాగంవల్ల భర్తలూ, పిల్లలూ, ప్రజలూ అందరూ చెడ్డారు. ఇప్పటికీ ఇంకా ఆ ఆదర్శాలే పట్టుకుని మనుషులు చెడబోతున్నారు. ఈ భార్యలిచ్చే వస్తువులకి భర్త మనసులోనూ, లోకం మనసులోనూ విలువ తక్కువ కనక ఎవరూ బాగుపడరు. ఏదో గొప్ప అవసరం కలిగినప్పుడు సకృతుగా ప్రేమతో అనందంతో చేసే త్యాగం ఆనందకరమూ ఆరోగ్యవంతమూ కాని, విధిగా స్త్రీ భర్తకి త్యాగంచేసి తీరాలన్నప్పుడు ఆ భర్తకి కృతజ్ఞత వుంటుందా? కాని ఇంకా

నీచపరచి లోకువ చేస్తారు. వీరు చేసే త్యాగాలు గొప్పవీ, పరులకి జరిగే ఉపకారం అతి స్వల్పమూ.

ఈ మహాత్యాగాల్ని చూస్తే భర్తకి చాలా భయం. అతను కృతజ్ఞతా ప్రేమా చూపి, ఈ త్యాగాన్ని స్వీకరించి లోబడ్డాడా, పతివ్రతా భార్య తన జీవితాన్నంతా ప్రతి నిమిషం త్యాగాల కింద మార్చి భర్తని అల్లుకుంటుంది. 'స్నేహితులు, బిడ్డలు, సౌఖ్యాలు, ధర్మం నీ కోసం త్యాగం చేస్తున్నానని' చెప్పి భర్త కంఠం చుట్టూ ఈ త్యాగాలన్నిటి భారంతోటీ వేళ్ళాడుతుంది. భర్తకు సర్వమూ తానే అయి ఊపిరాడనీయదు. అందుకనే అతడు ప్రేమ చూపకుండా, భార్యనించి తప్పించుకోవాలని చూస్తాడు. అట్లా తప్పించుకోలేకపోతే, ఇంక అన్నీ పోయి త్యాగాలు చేసి నిర్జీవమైన భార్య పీనుగకొగిలిలో శాంతీ, ఊపిరీ యేమీలేక ఉక్కిరిబిక్కిరై చచ్చిపోడూ? ధైర్యమూ, ఉత్సాహమూ పోయి, దేశానికీ, సంఘానికీ ఉపయోగపడక స్నేహితులకి అందక పాడైపోతున్నాడు. పురాణ వనితలు కూడా మాట్లాడడం మంచి నీతులే మాట్లాడతారు. కానీ, అవన్నీ చిలకపలుకుల్లాగా నేర్చుకున్న పురుషనీతులే. వీళ్ళ నీతి ఉపన్యాసాలు వినేవాడేగాని, ఒక భర్తా వీళ్ళు చెప్పినమాట వినడు. వినకపోతే భార్యలకి కోపంలేదు. కోపం చూపిందా పాతివ్రత్యానికి లోటే.

నాలుగో సుగుణం — సేవ. భర్తకీ, భర్తతో సంబంధమున్న వారందరికీ, అత్తా, మామ, బావా, అందరూ, తిని కొవ్వి పని లేకదొల్లుతూ ఉండనీ, ఈ భార్య సేవ! నౌకర్లున్నా భార్య సేవ?— ఆమె హృదయం ప్రేమతో నిండిపోయి ఆ భర్తాదులకి పనులుచేసే అదృష్టమే గొప్పవరంగా చూసుకుంటుంది. అట్లాంటప్పుడు ఇంక బానిసత్వమేమిటంటారు? అంత ప్రేమేవుంటే ఉపచారం చెయ్యమని బోధించడమెందుకు? అది విధి అనడమెందుకు? పోనీ ప్రేమించే ఆ భర్త చెయ్యడేం సేవ? చెయ్యమని అతనికి బోధించరేం? అట్లాంటి ప్రేమవుంటే సేవచెయ్యమని బోధించడమెందుకు? అక్కర్లేదుకదా!

భార్య తన దేహం భర్తకి ఒప్పచెప్పటం ఈ సేవలో జమే. తనకి ఇష్టమున్నా, లేకపోయినా, జబ్బులో, రోతలో భర్తకి దేహం ఒప్ప చెప్పాలి. దైవమని కళ్ళు మూసుకోవాలి. అసహ్యమని, బాధ అని, భయమని స్త్రీ మొరపెడుతోంటే మీదపడేది దైవమా? దెయ్యమా? అతని శరీరానికి సంబంధించినదంతా ఆమెకి పవిత్రం. అతని ఎంగిలి ఆమెకి పరమాన్నం. ఆ భర్త మందించిన ఎద్దుకన్న, మేకపోతుకన్న నీచంగా తన ఇష్టం వచ్చినట్లు, దిక్కుమాలిన, దిక్కులేని భార్యని, తనకి బలం, శక్తి వున్నంతవరకు బాధించవచ్చు. తన ఆరోగ్యమంతా, బలమంతా నాశనమయిందాకా, రోతపుట్టి భార్య కళ్ళు తిరిగిందాకా ఆమెని ఉపయోగించుకోవచ్చు. కక్కుర్తిపడవొచ్చు. స్త్రీ భరించలేక తిరగబడిందా సిగ్గులేదీ శిఖండికి అని ఆమె మొహం చూడరు — సత్పురుషులూ, పెద్ద ముత్తయిదులూ. ఇష్టం వచ్చినట్లు చేసుకోడానికి ఒక నిర్భాగ్యపు పిల్ల తన చేతికి దొరికింది కదా అని, ఆమె దేహం, యవ్వనం తనదే కదానని, రాత్రులనక, పగలనక తన యిష్టం వొచ్చినట్లు ఆమె లావణ్యాన్నీ, మెరుగునీ, తేజస్సునీ, రూపాన్నీ ధ్వంసం చేస్తాడు.

అయినా శరీరం యిస్తే చాలదు. స్త్రీ తన మనస్సునీ, హృదయాన్నీ యివ్వాలి పురుషుడికి. భర్త ఆలోచనలే ఆమెకీ ఉండాలి. భర్త ఆజ్ఞలే నీతి, దైవం ఆజ్ఞలు కావు. అన్ని నీతుల్నీ భర్త భగ్నం చెయ్య మన్నా చెయ్యడమే ధర్మం భార్యకి. తండ్రి దగ్గర వుంటే తండ్రి ఊహలు, భర్త దగ్గిర ఉంటే భర్తవి! తాను స్వతంత్రంగా జ్ఞానాన్ని సంపాదించే హక్కు స్త్రీకిలేదు. భర్త బంధువుల్ని ఆమె పొగడాలి. అతని శత్రువుల్ని ద్వేషించాలి. ఆమె ప్రేమించే ఆమె తల్లి దండ్రులు అతనికి విరోధులైతే ఆమెకీ విరోధులే. అతని కిష్టమైన రంగులూ, పనులూ, పచ్చళ్ళూ, నీతులూ ఈమెకి యిష్టమే కావాలి. అతనెట్టా గుడ్డ కట్టుకోమంటే ఆమె అట్లానే కట్టుకోవాలి.

పూర్వం పురుషుడికి, పొట్టిచేతుల రెవికా, కొప్పూ, అందెలూ, రాగిడీ ఇష్టమైతే స్త్రీ ఆ వేషమే వేసింది. ఇంగ్లీషు విద్య నేర్చిన పురుషుడికి జాకెట్టూ, నాగరం గాజులూ, చిన్నబొట్టూ, కొంచెం సంగీతం, ఇంగ్లీషు ముక్కలూ, ఇష్టమైతే ఆ స్వరూపమే దాల్చింది — ఆడపిల్ల. జంపర్లూ, పక్క పాపిడీ, మొహంమీదా చెవులమీదా జుట్టూ, లోలకులూ, బోడి ముక్కులూ ఇష్టమైతే ఆ విధంగానే తయారయింది. బోగంవాళ్ళు చేస్తున్నపనీ ఇదేగా! ఏమిటి భేదం? తన చిన్నభార్య ఇంట్లో అడుగు పెట్టిన నిమిషాన్నించి మొదలు పెడతాడు భర్త, ఆమె మనసుని స్వాధీనపరుచుకునే కార్యం. ఆమె ఇష్టాన్ని తాను నిర్ణయిస్తాడు. ఆమె ఊహలకి తను అధికారమిస్తాడు. ఆమె అభిరుచులకి తను రంగులేస్తాడు. ఈమె ఏ పుస్తకాలు చదవాలో అసలు చదవాలో లేదో, ఆమె ఎవరితో మాట్లాడాలో అసలు మాట్లాడాలో లేదో, ఎట్లా కూచోవాలో, ఎన్ని గంటలకి లేవాలో, పడుకోవాలో అజ్ఞాపిస్తాడు. ఆమె కిదివరకేవున్న పాత అభిప్రాయాలలో తనకి నచ్చనివి ఉంటే వాటిని వెక్కిరించి, ఏడిపించి వదిలిస్తాడు. అంతమేరా కత్తిరిస్తాడు. తను చెప్పే కొత్త అభిప్రాయాల్ని వెంటనే నమ్మి అనుసరించక పోయిందంటే తొలిచి అతికిస్తాడు. చివరికి అతని మాటేపలికే చిలకగా, గ్రామఫోను ప్లేటుగా మారుతుంది. చీర కొనేటప్పుడు కూడా 'ఆ రంగు అతని కిష్టమేనా,' పచ్చడి చేసేప్పుడు 'ఆ రుచి అతనికి సయిస్తుందా', ఈ 'కొత్త ఊహ అతనికి నచ్చుతుందా' అని ఆలోచిస్తుంది. చిన్న భార్య పూర్వపు సహజమైన ఉత్సాహం, ఆనందం, కొత్త విషయాల మీద అభిరుచీ, తనంతట తను నిర్ణయించుకునే శక్తీ, స్వతంత్రాభిప్రాయాలు కలిగివుండే తెలివీ — అన్నీ నశించి, మెదడూ ప్రాణమూలేని ప్రతిమగా, తోడు నీడగా మారుతుంది. హత్య చేసేవాడు శరీరాన్ని చంపుతాడు. ఈ భర్త ఆత్మ నాశనం చేస్తాడు. ఇట్లా తొలుచుకునే ఘోరహత్యని పెళ్ళీ, ప్రేమా, ఐక్యమూ, ఆత్మోన్నతీ, పాతివ్రత్యమూ మొదలైన పవిత్రమైన పేర్లతో పిలుస్తారు. అవును మరి, రెండు ఆత్మలూ ఒకటి కాక యింకేం చేస్తాయి? ఒక ఆత్మ రెండో దాంట్లో ఇష్టంలేని భాగాన్ని కోసేసి లోపల లోపల గుల్లచేసి తినేస్తో వుంటే! — పిల్లీ ఎలకా ఒకటి కావటంలా?

భార్యకి స్వతంత్రపుటాలోచనలుంటే, స్వతంత్రంగా పనులు చేస్తుంది. అది భర్తకి ఇబ్బంది. పోట్లాటలు వస్తాయి. కనక తన శాంతం కోసం పురుషుడు భార్యని ఈ

విధంగా చంపి ఆమె యాతనా శరీరంతో, కావరం చేస్తున్నాడు. తెలివిగా ఆరోగ్యంగా బలంగా సంతోషంగా వున్న పిల్లకి మత్తు మందెక్కించి బలవంతపరచి నోరుకట్టి సన్నగా శస్త్రం జేసి అనేక వికార రూపాలతో అతికించి విషపదార్థాలు రక్తంలో తయారు చేసుకోడం — నిజంగా జరిగేపని. ఆ వికృత రూపాలనే పతివ్రతలని ప్రపంచం వ్యవహరిస్తుంది. తిరగపడ్డ వారిని కులటలంటుంది. ఇట్లా భార్య దహనం కానిచ్చేందుకు భర్త చాలా సాధనాల్ని ప్రయోగిస్తాడు. దయ, లాలన, ప్రేమ, కామం, కోపం, దౌర్జన్యం, భయం, దెబ్బలు, తరిమి వెయ్యడం.... సంఘానికీ, అతనికీ జడిసి వీటిలో దేనికో ఒక దానికి పిల్ల లొంగుతుంది.

ప్రపంచంలో తిరిగి వ్యవహారం చేసి, ప్రజలలో కలిసి మొగవాడు జ్ఞానమూ అనుభవమూ సంపాయిస్తాడు బాగుపడతాడు, పాడవుతాడు. కాని ఆడది యిల్లు కదలక పోవడంచేత ఆ భర్త ద్వారా తప్ప లోకజ్ఞానం ఆమెకి రాదు. భర్తే ఆమె స్నేహితులూ, పుస్తకాలూ, తల్లిదండ్రులూ, పంచేంద్రియాలూ, మెదడూ, ఆత్మ, లోకం, జ్ఞానం, సర్వేశ్వరుడూ అన్నీ అతనే. ఆ భర్త తెలివి తక్కువవాడైతే ఈమే అవుతుంది. అతను దుర్మార్గుడైతే, ఈమే అవుతుంది. ఇంతగా భార్య తన శరీరాన్ని, మనసునీ ఈ విధంగా రూపుమాపుకోవడంవల్ల వొచ్చే లాభ మేమిటి? తన మొస్తరు స్వరూపాన్నే తన నిర్జీవమైన నీడనే తన భార్యగా తయారు చేసుకుని, ఆమె మీద రోతపడి అసహ్యమైన నీడనే తన భార్యగా తయారుచేసుకుని, ఆమె మీద రోతపడి అసహ్యమైన తన ఫోటోగ్రాపుని మరచిపోవడానికి భర్త ఇంకెవరితోనన్నా స్నేహం మొదలు పెడతాడు. ఆ స్త్రీ యెంతయేడ్చి ఏం లాభం?

భర్తలు తమ మనసులని స్వాధీన పరచుకుని చంపడం సహించలేక తమ దేహాన్ని అట్లా వశపరచుకోవడం భరించలేక కొందరు పెళ్ళికూతుళ్ళు ఇంట్లోంచి పారిపోతారు. కానీ చివరికి సకల కష్టాలూపడి, తల్లిదండ్రులు కూడా తరిమేస్తే దిక్కులేక మళ్ళీ ఆ భర్త పాదాలమీద పడి అతనేం చేసినా ఒప్పుకుంటామని ముందుకంటే నీచ స్థితిలో పడతారు. తిరిగి భర్త దగ్గిరికి రాకుండా ఉంటే సంఘం వెలేసి దూరంగా తరుముతుంది.

తెలివిగా భర్తల దగ్గిర నమ్మకంగా ఉండే స్త్రీలు కూడా ఈ విధంగా భర్తలు తమ శరీరాల్నీ, మనసుల్నీ బాధపెడుతోంటే సహించలేరు. భర్తల్ని వొదిలి కష్టపడనూ లేరు. కనక భర్తకి లొంగినట్టే ఉండి అతను చూసినప్పుడల్లా ఏం తెలీనట్టు అమాయకంగా, మూర్ఖంగా కనపడి, అతని వీపు వెనక మాత్రం వారి మనోవ్యాపారానికి వ్యాయామం కలిగేట్టు అనేక వ్యవహారాలు పెట్టుకుంటారు. బదుళ్ళివ్వడం, అమ్మడం, తాకట్టూ, నగలు చేయించడం, రహస్యంగా ప్రేమ సంబంధాలు పెట్టుకోడం చేస్తారు. తమ భర్తలవల్ల తృప్తిపొందేవాళ్ళు కూడా, తమ అసహజ మనోశక్తుల్ని ప్రయోగంలో ఉంచడానికి మాత్రమే, రహస్యకామ వ్యాపారాలలో చిక్కుకుంటారు. భర్తలు మాత్రం, తమ భార్యలకంటే, నమ్మకస్తులూ, నిర్మలాత్ములూ లేరనీ, వారిని అట్లా చెయ్యడం తమ ప్రజ్ఞే అని కులుకుతో బడాయిలు కొట్టుకుంటో తిరుగుతారు.

స్వకీయ స్వాతంత్ర్యానికి మానసికమైన, అంతరంగికమైన, ఏ ఆటంకమున్నా దాన్ని తొలగించడం ప్రతి వ్యక్తికీ ముఖ్యమైన విధి — స్త్రీకి కూడా, భర్త అయినాసరే ఆ ఆటంకం తొలగించుకోవటం చాతకాకపోతే స్త్రీ అట్లా బతికి ఉండడంకంటె చావడం నయం. ఈశ్వరుడయినా సరే పాపం చెయ్యకుండా ఎవ్వరికీ ఆటంకం రాకూడదు. పాపపుణ్యాల నిర్ణయశక్తి వ్యక్తిదే అయిఉండాలి. కానీ ప్రతి స్త్రీకీ, ఒక పురుషుడు, ఆమె దుర్నీతికి లోబడకుండా, పొరపాటు చెయ్యకుండా చూసే అధికారిగా ఉన్నాడు. సంఘం పేరుపెట్టి ఆమె నిర్మలత్వాన్ని తన స్వంత ఉపయోగార్థం ఊరగాయవలె దాచి పెట్టుకుంటున్నాడు. ఇంత వరకు లోకం ఇంత నీచమైన ఘోరమైన నిరంకుశాధికారాన్ని ఎరగదు.

భార్యాభర్తా ఒకటి కావాలనే వాంఛ సహజమైన ఆదర్శమే. ఎవరి దగ్గిర నించి శరీరంలోగాని, మనసులోగాని రహస్యమనేది లేదో, ఎవరి శరీరమంతా తనకి ప్రేమదాయకమో, సుందరమో, నాదీ నీదీ అనే భేదం ఎవరితో ఉండదో, తన మనోభావాలు ఏమి చెప్పినా వారికి అర్థమై తీరతాయనే రూఢి ఎవరి విషయమై ఉంటుందో, సుఖ దుఃఖాలు ఎవరికి ఒకరివి రెండోవారివిగా ఉంటాయో — అటువంటివారు ఇంకొకరు ఉండాలని ప్రతి స్త్రీకీ పురుషుడికీ ఉంటుంది. కానీ ఈ ఏకత్వం పున్నతంగా పరిణామం పొందిన మనుషులకే గాని సాధ్యం కాదు. ఈ ఆదర్శాన్ని అనుసరించబోయే ఈ గోతిలో పడింది సంఘం. ఇటువంటి ఐక్యం కోసం ఇద్దరి స్వభావాలూ, ఆదర్శాలూ, ఆలోచనలూ, అభిప్రాయాలూ ఒకటి కానక్కర్లేదు. ఒకరివి ఒకరికి, ఒకరి స్వభావం ఒకరికి, అర్థమైతే చాలు. అర్థం చేసుకునేశక్తీ, ఉదారమూ ఉండాలి. ఇద్దరూ పూర్ణమైన స్వతంత్రం, అభివృద్ధీ, వ్యక్తిత్వం పొందితేగానీ ఇట్లాంటి పున్నతమైన సంబంధం వీలుకాదు. లోకజ్ఞానమే లేక, దాసి అయి పడివుండే వంట భార్యకి ఏమర్థమౌతాయి పురుషుడి ఉన్నతాదర్శాలు? స్త్రీ యొక్క చిన్న చిన్న ఊహలతో, అబద్ధాలతో పురుషుడు ఎట్లా సానుభూతిని చూపగలడు? "జెలసీ"తో, పాతివ్రత్యంతో, అధికారంతో, స్వార్థంతో పుచ్చిన పురుషుడికి స్త్రీ స్వాతంత్ర్యమూ, ఉదారమూ, నిర్మలత్వమూ అర్థం చేసుకునే శక్తి యెట్లా వస్తుంది? ఆ ఉన్నతమైన సంబంధం చాతగాక స్త్రీ స్వేచ్ఛని సహించలేక, స్త్రీ ఆత్మని నాశనంచేసి కాళ్ళు తెగకొట్టి పంజరంలో బంధించి స్త్రీ తన దగ్గర్నించి లేచిపోలేదనీ, ఇతర పురుషులతో (తనకి తెలిసేట్టు) సంబంధం పెట్టుకోలేదనీ సంతోషించి, తనకి ఎదురు మాటాడనీక, ఆడదానికి ధైర్యంలేదని ఆనందించి, ఆమె తనలో ఐక్యమయిందని కులుకుతాడు పురుషుడు. ఐక్యం కావడమంటే, వీళ్ళ అర్థమేమిటి? తను కోరినప్పుడల్లా శరీరం ఇవ్వడమూ, తను చెప్పినదానికి వ్యతిరేకం చెప్పకపోవడమూ — ఇంతేకదా?

స్త్రీ పురుషులు నిజమైన స్నేహితులూ, దంపతులూ కావాలంటే ఇద్దరికీ సంపూర్ణమైన స్వేచ్ఛ ఉండాలి. ప్రేమబంధమే కాని అధికార బంధం ఉండకూడదు. పాపమూ, ద్వేషమూ, జెలసీ, అవినీతీ వ్యభిచారం దుఃఖమూ.... ఈ అగ్నిలోంచి నడిచి, తపిస్తేనే కాని ఆ వ్యక్తి స్వాతంత్ర్యం కలగదు. సాధారణులకు ఆ స్వర్గతుల్యమైన ఆనందం, ఆ ఉన్నత స్నేహం అర్థంకాదు.

స్త్రీ నీతి

లోకంలోకల్లా హిందూ స్త్రీ పాతివ్రత్యం కలదనీ, పవిత్రవంతురాలనీ, దివ్యచారిత్ర అనీ, దేశాభిమానుల దృఢాభిప్రాయం. స్త్రీ సంస్కరణ విషయమై ఏ ప్రస్తావన వచ్చినా, తమకి ఏమీ తెలీని పాశ్చాత్య స్త్రీలతో పోల్చుకుని తమ స్త్రీలు చాలా బావున్నారని సంతుష్టి కనపరిచి, ఇంక ఏ మార్పూ కూడ దని బిగ్గరగా అరుస్తారు. పాశ్చాత్య స్త్రీలని గురించి వీరి అభిప్రాయమేమిటంటే—

1. వారు సాధారణంగా నీతి విహీనులనీ,

2. వారి దుర్నీతి వారికి వుండే స్వేచ్ఛ వల్లనే కలిగిందనీ.

ఆ సంగతులెల్లా ఉన్నా ఈ దేశపు స్త్రీలస్థితి చూసుకుందాం ముందు.

1. జరిగే వ్యభిచారాలలో ముప్పాతికవంతు బైటికి రావు. ఆమెకి నష్టం గనక. స్త్రీ ముందుగా జాగ్రత్త పడుతుంది. దగ్గిర వాళ్ళకి తెలిసినా సంసారం పాడవుతుందని దయతలిచి ఊరుకుంటారు. భర్తలు కూడా చాలామంది ప్రతిష్టకోసం దాస్తారు. అయినప్పటికీ సాధారణంగా అపవాదులు ప్రతి ఇంటికీ సంబంధించి ఉండడం సామాన్యమే.

2. అనేకమంది స్త్రీలకి పురుషులమీద మోహం కలుగుతుంది. అందులో ముఖ్యంగా ఆత్మా, రొమాన్సూ, అందం, తెలివీ గల స్త్రీకి. అది నీతా, అవినీతా అని విచారించడం లేదిక్కడ. సహజమనీ, సృష్టిలో జరిగేపని అనీ నిరూపిస్తున్నాము. అంతే. కళ్ళూ, హృదయమూ ఉంటే ఇంకో పురుషుడిలో అందమూ, ఔదార్యమూ కనపడకుండా ఉంటాయా? అతనితో శరీర సంబంధం కలగాలని కోరిక లేకపోయినా, ఇతర సంబంధం, వాచా స్నేహం సంఘం ఒప్పుకోదు కనక, ఏ సంబంధమైనా వ్యభిచారం కింద కట్టేస్తుంది గనక, స్త్రీ బుద్ధి ఆ విధంగానే పనిచేస్తుంది. దీనికి సంఘపు అనుమానాలే కారణం. కానీ సామాన్యంగా స్త్రీలకి ఆ మనసు తీర్చుకోడానికి వీలుండదు. కొంతమందికి ధైర్యం చాలదు కనక ఊరుకుంటారు.

3. అదీగాక రెండేళ్ళలో చాలామంది స్త్రీలదేహం పాడైపోతుంది. ఈ నవనాగరికపు కోమలత్వంచేత — ఒక కాన్పుతో, భర్త సహజ ఉద్రేకంతో — వంగి సన్నగిల్లి అసహ్యంగా తయారవుతుంది. ఆరోగ్యమూ బలమూ నశిస్తాయి. ఇతర పురుషులు తనని చూసి (కామంలేని ఆలోచనలతో) సంతోషిస్తారనే ఆశ లేకపోవడంవల్ల, రోజూ కనబడే బంధువులు తప్ప ఇంకెవరూ తనని చూసేవాళ్ళు లేకపోవడం వల్ల, మంచి వస్త్రాలు ధరించడం, ఆకర్షణా, శుభ్రమూ మానేసి అసహ్యంగా కనపడుతుంది స్త్రీ. కనక, తనని కోరే పురుషుడు లేక విధిలేక పతివ్రతలై ఉంటారు చాలా మంది, మనసులో అనేక కోర్కెలు కలిగి ఉండి కూడా.

నీ ఈ దేశాభిమానులు చెప్పేట్టు ఈ దేశమంతా పతివ్రతలతో నిండివుందికదా, వాళ్ళకి స్వేచ్ఛనిస్తే సంఘం పాడవుతుందనీ,

నీతి చెడిపోతుందనీ గోల పెడతారెందుకు? పతివ్రతలేగా? మొగాళ్ళతో స్వేచ్ఛగా మాట్లాడితేనేం? వంటరిగా ఇష్టం వచ్చిన చోట్లకి వెడితేనేం? ఈ మహాబంధనాలు ఉన్నంత సేపే, వెనకాల భర్త భయంవల్ల పతివ్రతలే గాని స్వేచ్ఛ వచ్చిందా ఒక్కరూ పతివ్రతగా ఉండరనే వీరి నిశ్చితాభిప్రాయం. తామూ, తమ భార్యలూ, పుత్రికలూ తప్ప తక్కిన సంఘమంతా దుర్భలులనిన్నీ, తాము ఔదార్యంతో సంక్షేమం కోసం నిలుపుతున్న ఈ నీతిచట్టాలు పోయినాయా అందరూ కులట లవుతారనిన్నీ, వీరి ఘన నిర్మల హృదయాలు నమ్ముతున్నాయి. ఈశ్వరుడి తరవాత ఈ ప్రపంచానికి ప్రస్తుతం వీరే ఈశ్వరావతారాలు.

వ్యభిచారం చెయ్యడానికిగానీ, మానడానికిగానీ స్వేచ్ఛ ఉన్నప్పుడు పతివ్రతలో, దుర్మార్గులో కావడానికి వీలుందిగాని అసలు దుర్మార్గం చెయ్యడానికి స్వేచ్ఛ లేనప్పుడు పతివ్రతలేమిటి? లోకంలో డబ్బు లేకపోతే యెవరూ దొంగలుకాదు. గదుల్లో దాస్తే అందరూ పతివ్రతలే. జైలులో దొంగతనాలు జరుగుతాయా? అక్కడ ఉన్న వాళ్ళు అందరూ ఋషులే. నీతిగా గానీ అవినీతిగా గానీ ప్రవర్తించడానికి స్వతంత్రం ఉన్నప్పుడే అభివృద్ధి వుంటుంది. మాట్లాడ్డానికి స్వేచ్ఛా, శక్తీ ఉన్నవాడే నిజమో అబద్ధమో చెప్పగలరు. అట్లా తన స్వేచ్ఛని ఉపయోగించేవాడే ఈనాడు అబద్ధాలు చెప్పినా ఒకనాడైనా నిజం చెప్పడం నేర్చుకుంటాడు. బలవంతంగా పురుషుడు స్త్రీని దాచి పెడితే కట్టుదిట్టాలతో భద్రపరుచుకుంటే ఆమె అభివృద్ధి చెందేదెట్లా? ఆమెకి నీతి సమస్య లేవీ? నీతిలో పడదామా, అవినీతిలో పడదామా అనే ఆలోచన ఏదీ? కనక అభివృద్ధి ఉండనే ఉండదు. మొదట ఎట్లా పుట్టిందో, చచ్చేంతవరకూ, అంతే. చాలా మంది పురుషులతో స్నేహం కలిగి, తన భర్తతో తప్ప ఇతరులతో (భర్తమీద ప్రేమవల్ల) ఏ సంబంధానికీ ఒప్పుకోకపోయినప్పుడే నిజమైన పాతివ్రత్యం. దుర్నీతికి స్వేచ్ఛ ఉన్నప్పుడే ముందు రాబోయే నీతికి సోపానమవుతుంది. ఈ కట్టువెయ్యబడ్డ బలవంతపు పతివ్రతా బొమ్మలకంటే రోజుకో పురుషుణ్ణి స్వేచ్ఛగా వరించే అధమురాలనుకునే వేశ్య నీతి నందుకోవడానికి సమీపంగా వుంది.

స్త్రీ సంపాదన

స్త్రీని మనుషుల్లో కాక, చివరికి జంతువుల్లో కాక, వస్తువుల్లో జమకట్టింది సంఘం. అద్దాలకీ, బట్టలకీ, కొత్తవాటికి ఖరీదెక్కువా, పాతవాటికి తక్కువా అయినట్టే వితంతువు లకీ వ్యభిచారిణులకీ ఖరీదు తక్కువ. కన్య కలకి హెచ్చు. జంతువులకీ మనుషులకీ పాతపడిన వాటికీ పాతవాటికీ ఖరీదెక్కువ, కొత్తవాటికి తక్కువ. బండిలాగే యెద్దూ, పనికి చెయ్యి తిరిగిన మనిషికి వలెనే. ఈ జంతువుల తాహతు కూడా లేదు స్త్రీకి. అందువల్లనే వస్తువులాగ పురుషుడి ఆస్తి అయింది.

తనంతట తను తనకోసమే జీవించే అధికారం స్త్రీకి లేదు. మగవాడు అనేక పనులు చెయ్యడానికి, అనేక ఆదర్శాల కోసం, జీవించే ఆనందం కోసం, బతుకు

తాడు. స్త్రీ అట్లాకాదు. పురుషుడికి ఉప యోగపడక పోయిందా స్త్రీ బతికీ ఒకటే, చచ్చీ ఒకటే. పాలివ్వని ఆవూ, కాయలు కాయని మొక్కా వీటి బతుకు వృధా అను కున్నట్టే కామానికీ, వంటకీ, పిల్లలకీ ఉప యోగించకపోతే స్త్రీ ఎందుకు బతుకు తుందా అని అందరికీ సందేహం.

పురుషులకి ప్రత్యేకించి ఒక్కొక్కరికీ వేరువేరు ఆదర్శాలూ, జీవితోద్దేశాలూ ఉన్నాయి. స్త్రీలందరికీ కలిసి ఒకటే. గుర్రా లకి సవారీ. కుక్కలకి ఇల్లు కాయడంలాగు, పుట్టినప్పణ్ణించి ఆడపిల్లకి పెళ్ళి ఆదర్శం. అందరు ఆడపిల్లలకీ అంతే. పెళ్ళీ, పిల్లలూ, చాకిరీ. ఆడపిల్ల తనకి పెళ్ళి అక్కర్లేదన కూడదు. పురుషుడి మీద ఎన్నడూ మోహం కలగనేరని స్త్రీలు, తమ స్వభావానికి తగిన పురుషుడు కనపడక నిరాశచెందిన స్త్రీలు, పురుషుడికింద లొంగి పడివుండడం ఇష్టం లేక పెళ్ళి మానుకున్న స్త్రీలు, తమ ఆద ర్శానికి తగినంత ఔన్నత్యం గల పురుషుడు దొరక్క పెళ్ళి చేసుకోని స్త్రీలు, ఏదో ఆద ర్శాలూ, పనులూ, అభిరుచులూ ఉండి భర్తకీ, పిల్లలకీ ఇవ్వడానికి వ్యవధిలేక పెళ్ళి మరిచిపోయిన స్త్రీలు ఉంటారని సంఘం కలలోనన్నా ఆలోచించదు. కుక్కకి యజ మానుడు ఎంత అవసరమో, ఆడపిల్లకి మొగుడు అంత అవసరం. కానీ ప్రతి స్త్రీకి ఇట్లా ఏదో ఒక భర్తని ఎల్లాంటివాణ్ణో ఒకణ్ణి దానంచేసి తీరే సంఘం, భర్త లేకపోతే ఒప్పు కోని సంఘం, ఆ భర్త పోతే మళ్ళీ దానం చెయ్యదేమీ? స్త్రీకి భర్తవుండటమే అంత అవసరమైతే ఎప్పుడూ ఉండనక్కర్లేదూ? భర్త వద్దని ఏడుస్తున్న చిన్నపిల్లలకి బల వంతంగా కట్టపెడుతుంది. భర్త కావాలని గోలపెడుతున్న వితంతువులకి నిరాకరి స్తుంది సంఘం. ఏం తెలివి?

స్త్రీ బలం భర్తకి పనులు చేయడానికీ, ఆమె అందం అతని కళ్ళకీ, ఆమె సౌజన్యం అతనికి నమ్మకంగా ఉండడానికీ, ఆమె చదువు "కుమారీ" శతకం అప్పచెప్పడానికీ, చాకలి పద్దులు వెయ్యడానికీ, ఆమె సంగీతం అతని చెవులకీ! ఆడపిల్ల గట్టిగా గంతులు వెయ్యకూడదు. అరవకూడదు. ఆడకూడదు. పడక వెయ్యకుండా మూలు గుతోనన్నా వంట చెయ్యగల సామర్థ్యం, పడకగదిలో పనికొచ్చే ఆరోగ్యం ఉంటే చాలు. పెళ్ళిలో నాలుగుపాటలు పాడే సంగీతం, వంట విషయమై భర్త మాట్లాడే ఒకటిన్నర మాటలూ అర్థం చేసుకునే తెలివీ ఉంటే చాలు. అంతకంటే బలమూ, తెలివీ వుంటే ఉపద్రవం.

స్త్రీకి ఎన్ని ఆదర్శాలూ, అభిరుచులూ, నేర్పూఉన్నా స్త్రీ అయినంత మాత్రంచేత ఆమెకి వంటింట్లోనూ, పడకటింటిలోనే పని. తక్కిన లోకంతో ఆమెకి సంబంధం లేదు. స్త్రీలకి మనో వ్యత్యాసాలున్నాయనే మరిచి పోయినారు — రాయికీ రాయికీ, కాకికీ కాకికీ వ్యత్యాసం లేనట్టు. పురుషుడికి వున్నట్టే, అనేక అభిరుచులతో, ఆవేశంతో, అభినివేశాలతో కూడిన మెదడు ఆమెకి ఉందని వప్పుకోరు. శాస్త్ర పరీక్షలో యెంతో ఆసక్తిగల స్త్రీ, సంగీతంలో పరవశత్వాన్ని పొందించగల స్త్రీ, కవీశ్వరురాలు కాగల స్త్రీ, అందరూ, ఈ గొప్పశక్తుల్ని అణగతొక్కుకుని, మరిచిపోయి, భర్త కామానికి దాసీలూ, ఆఖ రికి వంట మనుషులూ, పిల్లలదాదులూ కావలసిందే. వారి కష్టాలు చెప్పుకున్నా అర్థం చేసుకోగలిగిన వారన్నా లేక, గొప్ప ఆద

ర్శాలూ, అభిరుచులూ ఉన్న ఉదార హృదయులైన ఎందరో స్త్రీలు యెంతో బాధ పడుతూ ఉండాలి! దేశ నాయకుడో, శాస్త్ర పండితుడో కావలసిన పురుషుణ్ణి చెప్పులు కుట్టే పనిలోపెడితే దేశానికెంత నష్టం! అతని కెంత బాధగా వుంటుంది! స్త్రీ కట్లా కాదూ? ఎందరు నర్తకుల్ని, చిత్రకారుల్ని, కవులని, శిల్పుల్ని, యంత్రకారుల్ని, స్త్రీలలో తర తరమూ దేశం పోగొట్టుకుంటోందో! రాజ్య మేలగల స్త్రీలు కూడా అంట్లే తోము తున్నారు.

మృగంవలె, స్త్రీ, తినడం, కనడం స్థితి లోనే ఉంది. అంతకన్న అభివృద్ధి చెంద లేదు, ఎన్ని శతాబ్దాలు గడిచినా! పురుషుడి ఉపయోగార్థం స్త్రీ ఆత్మలూ, ఆదర్శాలూ నశింపచేశారు.

న్యాయంగా చూస్తే పురుషుడైనా, స్త్రీ ఐనా, భార్య అయినా, భర్త అయినా, బుద్ధి కుశలతా, మనోవికాసమూ తక్కువైనవారు శరీర సంబంధమైన పనులు చెయ్యాలి — ఇంటిపనులూ మొదలైనవి. లోకంలో అంతేగా? తెలివి స్వల్పంగా వున్నవాళ్ళు జవాన్లూ, కూలివాళ్ళూ అవుతారు. బుద్ధి కుశలతగలవాళ్ళు కవులూ, జడ్జీలూ, అధికార్లూ అవుతారు. అట్లానే భర్తయినా సరే తెలివి తక్కువవాడైతే వంటా, చాకిరీ అతను చెయ్యాలి. స్త్రీ ఉన్నత కార్యాలు చెయ్యాలి. ప్రస్తుత స్థితి భార్య ఇంట్లోపనీ భర్త బయట పనీ— లోకంలో పనులు జరగడానికి కార్య విభాగంగా అమలులోనికి వచ్చిందని సంఘాభిమానులు సరిపుచ్చుకుంటారు. కాని ఇది వొట్టి దురభిప్రాయం.

కులం కార్యవిభాగమే. కులాలలో సమత్వమూ, సమాన గౌరవమూ ఉన్న న్నాళ్ళూ నిలిచాయి కులాలు. కార్యవిభాగంలో భేదంగానీ, గౌరవంలో భేదంగానీ రాగానే వేరుపురుగు పుట్టిందన్నమాటే. మూఢత్వమూ, అజ్ఞానమూ తగ్గగానే, 'తక్కువజాతి' వాళ్ళనేవాళ్ళు మోసం తెలుసుకుని తిరగబడుతున్నారు. స్త్రీ కూడా అంతే. ఆమె బుద్ధికుశలతని పరీక్షించకుండా స్త్రీ అయినంతమాత్రం చేత, ఆమె భాగానికెప్పుడూ నీచకార్యాలే ఇస్తే అది సరైన కార్యవిభాగమెట్లా అవుతుంది? ఆమె చేసే వంటా, సేవా నీచం కావనీ, ఇంటి పనులవల్ల ఆమె రాణిలాగ గౌరవం పొందుతోందనీ దేశభిమానులూ, మతాభిమానులూ పెద్ద పెద్ద ఉపన్యాసాలిస్తారు. కానీ ఉపన్యాసమై ఇంటికి పోగానే, కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళు సిద్ధంగాలేకపోతే "ఏమే వొళ్ళు కొవ్విందా? నీళ్ళు పెట్టక ఏం చేస్తున్నావు? ఈసారి సిద్ధంగా ఉండకపోనీ, నీ పని చెపుతా"నంటాడు.

"నువ్వు సరిగా డబ్బు సంపాదించటంలేదు. బజారు సామానులు వేళకు తీసుకురాలేదు, వీపు చీలుస్తాను వెధవా!" అని స్త్రీ అంటే గౌరవిస్తారా? పోనీ ఆ కార్యాలలో నీచమే తమకి లేకపోతే పురుషుడు చెయ్యరాదూ వాటిని? "ఆఁ నేను వంట చేస్తావా?" అంటాడు అయ్యగారు. పనిలేక ఇంట్లో సోమరిగా కూచునే పనికిమాలినవాడు కూడా, ఊళ్ళో జీతానికి వంటచేసే వాడు కూడా, భార్యకి వండిపెట్టడు. ఆమె ఎంత తెలివైనదైనా సరే! శాస్త్రాల్లో భర్తకి భార్య సేవ చెయ్యాలని వుంది. భార్యకి సేవ చెయ్యమని వుందా! దయగా కుక్కల్నీ, ఆవుల్నీ చూసినట్టు చూడమని ఉంది. పాలంమీద వచ్చే డబ్బుతినే ఈ సోమరి

మొగవాళ్ళందరూ ఏమిటి లోకంలో చేస్తున్న పని? భార్యకి వంటచేసి పెట్టరాదూ? ఇళ్ళూ డవలేరూ? పైగా ఒక్క భర్తకేగాక, తత్సం బంధమైన సోమరిపోతులందరికీ సేవ చెయ్యాలి స్త్రీ. వంట విషయమై నియో గింపబడిన, జీతం భత్యంలేని ఒక 'స్త్రీ బానిస' సంఘంలో తేరగా పడివుండడం వల్ల, ఈ పురుషుడికి రుచులెక్కువైనాయి. నాలుగు గంటలు పదార్థాలు తయారు చేయవలసినంత నాజూకు బలిసింది భోజనపు రుచులలో, వంటమనిషిని పెట్టు కోలేనంతటి బీదవాడికి కూడా, దేవుడేర్ప రచిన వంటమనిషి తయారుగా ఉందిగా! ఏం, హోటల్లో భోజనం చెయ్యలేడూ? "అమ్మా! పెళ్ళాము ఉండగా హోటల్లో భోజనంచేసే ఖర్మమేం నాకు?" అంటాడు. భార్య చచ్చిపోతే 'వండిపెట్టే దిక్కన్నా లేదం' టాడు. భార్యల ఉపయోగం స్పష్టంగా తెలుస్తోనే వుంది. వీళ్ళే పెద్దబల్లలమీద ఎక్కి "భార్యా, గౌరవం, సహధర్మచారిణి" అని ఉపన్యాసాలిచ్చేది.

"సరే. స్త్రీకి యేదోపని నిర్ణయించా ముగా, అది చెయ్యకూడదూ?" అంటారు. ఇంత విశాల ప్రపంచంలో గూళ్ళవలె ఇళ్ళుకట్టి వాటిల్లో స్త్రీలని పెట్టి, జైలులోవలె కొన్ని పనులు చెప్పి, కర్రపుచ్చుకొని చేయిం చడానికి ఎవడిచ్చాడా అధికారం? ఇన్ని పనులతో, కళలతో, ఉత్సాహాలతో కూడు కున్న దేశంలో స్త్రీ తనంతట తాను నిర్ణ యించుకోకూడదూ తనకు తగిన పనిని?

స్త్రీ తన ఆత్మగౌరవంకోసం, తన ఆత్మానుభవంకోసం, తన జీవితానికి అర్థం ఉండడంకోసం, తన అభిరుచికి తగినట్టు పాటుపడాలని ఎవరన్నా అంటే "పిల్లల్ని కనాలి, వాళ్ళ జాగ్రత్త తీసుకోవాలి కనక ఆమె ఇంటిలో పడివుండా"లంటారు.

ఆరోగ్యం గల స్త్రీ, బిడ్డని కనకముందు ఇంట్లో ఉండనే అక్కర్లేదు. కన్న తరవాత మూడు నెలలు శిశువుకోసం ఇంటిదగ్గర ఉంటే ఉండవచ్చు. తరవాత శిశువు దగ్గర పగలంతా విడవకుండా ఉండవలసిన అవ సరముండదు. ఆ నెలలకు ఆమె అధికార్లో, ప్రభుత్వము వారో ఆమె మామూలు జీతం ఇస్తోవుంటారు. ఇప్పుడు కూలినాలి చేసు కునే తల్లులందరూ, పసిపిల్లలున్నందువల్ల పనులు మానుకుని ఇళ్ళలో కూచుంటు న్నారా? వాళ్ళ శిశువుని కూడా పనిచేసే చోటికి వెంట తీసుకువెళ్ళవచ్చును. ఆ చోట పనిచేసే స్త్రీలందరూ తమ పిల్లలకోసం ఒక దాయిని పెట్టుకుని తాము వేళకు వెళ్ళి, పాలిచ్చి చూసుకుంటో ఉండవచ్చు. లేపోతే, నేతనెయ్యడమో, కుట్టో, ఇంట్లోనే చేసుకుని స్వతంత్ర ఉపాధి కలిగి ఉండవచ్చు. చాలా మంది స్త్రీలు వితంతువులూ, పిల్లలు లేని వాళ్ళూ, ఎదిగిన పిల్లలున్న వాళ్ళూ అయి ఉంటారు. వీళ్ళందరూ పనిచెయ్య కూడదూ? పశువుల్లో , పక్షుల్లో పిల్లల్ని కనడంవల్ల ఆడవాటికి ఆహారం సంపా దించుకోడానికి ఆటంకం కలుగుతోందా? లోకంతోపాటు సృష్టికార్యం నెరవేరుస్తున్నం దుకు స్త్రీకి ఇంత కష్టమెందుకు?

స్త్రీ ఈ ప్రకారం, ఏ పురుషుడి రుచి కోసమో రోజూ ఆరుగంటలు పొయ్యిదగ్గర పడివుండడమూ, ఆ ఒక్కడి శరీరం, నాలు కల సౌఖ్యానికి అతను చేసుకోగలిగిన పను లన్నీ తను చేసి పెట్టడమూ, చాలా వ్యర్థంగా జీవించడమన్నమాట. పోనీ ఈ తల్లులు తాము తక్కిన పనులన్నీ మానుకుని పిల్లల్ని

యెట్లా పోషించాలో శాస్త్రంద్వారా చదివి నేర్చుకుని తర్ఫీదు పొంది ఉత్తమ సంతానాన్ని కలగజేసి, దేశానికి నూతన ప్రజల్ని అధికుల్ని ఉదారుల్ని ప్రసాదిస్తే అర్థముంది. ప్రస్తుతం ఈ తల్లుల దగ్గిర పెరిగే పిల్లలకన్న రోడ్డుమీద పారేసిన వాళ్ళెక్కువ మంది బతుకుతారు. వీళ్ళ దగ్గర శిక్షణ పొందిన పిల్లలకంటే అనాథ శరణాలయంలో మంచి బుద్ధులు నేర్చుకుంటారు. ఎందుకు వీళ్ళు పనులు మానుకుని జన్మంతా సోమరిగా ఇళ్ళదగ్గర పడివుండడం? పిల్లల్ని పెంచడం? ఈ తల్లుల చేతుల్లో ఉండడం కన్న ఆ పిల్లల్ని చెరచడం ఇంకోటి లేదు. మాతృప్రేమతో ఇంకా మృగాలుగా ఉన్నస్థితిలోనే ఉన్నారు ఈ స్త్రీలు. అనేక విషమ సమస్యలతో, దుష్కర సంబంధాలతో కూడిన ఈ నూతన ప్రపంచంలోకి తగిన వాణ్ణిగా తయారు చెయ్యాలంటే, శిశువుని యెంతో జాగ్రత్తగా తెలివిగా పెంచాలి. కళల జ్ఞానమూ, అభినవ శాస్త్ర విద్యా ఔదార్యమూ, క్షమా అన్నీ కలగాలి తల్లికి. తల్లికి వుండే ప్రేమ — శాస్త్ర జ్ఞానములేని తల్లి గుడ్డిప్రేమ, బిడ్డలకి విషతుల్యం. కనక ఈ తల్లుల నుంచి శిశువుల్ని యెంత త్వరగా తప్పిస్తే అంత శ్రేయస్కరం. స్త్రీ విద్యావంతురాలైనప్పటికీ, ప్రతి స్త్రీ పిల్లల్ని పెంచడానికి గల స్వభావాన్ని కలిగివుండదు. తన ఒక పిల్లనీ, ఇద్దరు పిల్లల్నీ పెంచడానికి శిశు శిక్షణా శాస్త్రము ప్రతి తల్లీ నేర్చుకునే ఉండనక్కరలేదు. చాలా మంది చంటిపిల్లల్ని చేర్చి, పెంచగలిగే దాదుల్ని నాలుగైదేళ్ళు 'ట్రైయిన్' చేస్తే అందరు పిల్లల్ని "నర్సరీ" పాఠశాలలో వాళ్ళు పెంచుతారు. ఇంట్లో పనితొందరలో చీదరించుకుని, ఈ పిల్లల సహజమైన అల్లరిని భరించలేక కొట్టి, తిట్టి, బాధపెట్టే తల్లులకంటే అక్కడే పిల్లలు సంతోషంగా, ఆరోగ్యంగా వుంటారు. తల్లు లింటికి వచ్చి తీరుబడిగా ఉన్నప్పుడు పిల్లల్ని తెచ్చుకోవచ్చును.

అదీగాక తల్లులవల్ల కుటుంబాలలో వచ్చే దుర్గుణాలూ, అందరు పిల్లలతో పెరగడంవల్ల వచ్చే సద్గుణాలూ పిల్లలకి ఎక్కువగా ఉన్నాయి.

ఇంతా స్త్రీ పురుషుడికి చాకిరీచేస్తే ఫలితమేమిటి? ఆమెకి పురుషుడేమిస్తాడు? తిండీ, బట్టా — తెలివిగలదైతే నగలూ, తన ఇష్టం వచ్చినప్పుడు ఉచితంగా తన్నులో, ముద్దులో ఇస్తాడు. స్త్రీ జీతంలేని సంఘ బానిస. ఆవుకి ఏం జీతమిస్తాడు? చావకుండా, గడ్డి పారేస్తారు. పాడిదైతే దాణా! పొడవకుండా, తన్నకుండా దూడల్ని కంటో ఉంటే మెడకి వెండి గంటలు. పురుషుడిచ్చే కూటికీబట్టకీ బదులు స్త్రీ అతనికి తన శరీరాన్నీ, మనసునీ, మానాన్నీ, అర్పిస్తోంది. ఒకసారి ఆ మహారాజు తనదాన్ని చేసుకున్నాడా, ఇంక శాశ్వతంగా అతనిదై పోతుంది. అతను తరిమేసినా ఇంకోరు ఆమెని స్వీకరించరు. ఆమెకి శాశ్వతంగా బతికే అధికారం లేదు. సంఘమంతా కాకుల్లాగా పొడుస్తారు. ఇంకా సమస్తం తనకి అర్పించుకున్న తరవాత, ఆయనకి ఏ స్వల్పాని కన్నా ఆగ్రహం వచ్చిందా, స్త్రీని పొమ్మంటాడు. ఇల్లూ, వాకిలీ, బట్టలూ అన్నీ ఆయనవే. వెళ్ళిపోయే స్త్రీకి తనదనే వస్తువుండదు. ఒక దమ్మిడి, ఒక పూటకి తిండి సంపాయించుకునే శక్తి లేదు. ఈ నాగరిక స్త్రీలంత అనాథలు ప్రపంచంలో ఏ జీవరాసుల్లోనూ లేరు. ఆ తెరవెనక భర్తపేరు

అర్థం వేసుకుని కులుకుతుంది తనే అధికురాలనని. పొమ్మన్నదాకా, అతనికి సమస్త నీచత్వమూ చేస్తుంది. తొమ్మిది నెలలూ మోసి తను కన్న పిల్లలు తన వాళ్ళుకారు — ఈ బానిసకి. గేదె కన్న దూడలు యజమానుడివి కావటంలా! అంతే ఈ గొడ్డుగతి కూడా! బిడ్డల్ని కని ప్రేమించుకునే తన హక్కుని అమ్ముకుంది పురుషుడికి స్త్రీ — తన పొట్టకోసం! స్త్రీకి పిల్లలు కావలసివస్తే, స్వతంత్రంగా కనే శక్తిలేదు. ఏ పురుషుడికో అతికి, అతని మీద వేళ్ళాడి, అతనికి జన్మ బానిసైతేగాని, తల్లి అయ్యే గౌరవాన్ని సంఘం నిరాకరిస్తోంది. సృష్టి తోడ్పడింది.

స్త్రీకి సంఘంలో ప్రత్యేక స్థానంలేదు. భర్తవల్ల ఆమె స్థానం నిర్ణయించబడుతుంది. పాకీ ఆమెని రాజు పెళ్ళిచేసుకుంటే రాణీ అవుతుంది. కూలివాడు రాజు కూతుర్ని పెళ్ళి చేసుకుంటే ఆమె కూలి మనిషి అవుతుంది. స్త్రీ తన జీవనంకోసం, రక్షణకోసం, సుఖంకోసం సంఘంలో మర్యాదకోసం భర్తమీద ఆధారపడవలసిన సంగతి ఆమెకీ, అందరికీ తెలుస్తోనే ఉంది. భర్త కరుణమీద ఆమె జీవనం ఆధారపడి ఉండడంవల్ల, ఆమె తనలో ఉన్న ఉన్నత స్వభావాన్నీ, శక్తుల్నీ, అభిరుచుల్నీ, వృద్ధి చేసుకోవడమూ వినియోగించడమూ మానేసింది. అవసరమేదీ? ఏం లాభం? ఏన్ని నేర్చుకున్నా ఒకటేగా పని! కనక తనకి సకల సౌఖ్యాలూ ఇచ్చి, స్వశక్తినించి, శ్రమనించి, సమస్యనించి, కాపాడగల భర్తని సంపాయించడానికి ప్రయత్నిస్తుంది. ఆమె చిన్నదైతే, ఆమె తల్లిదండ్రులు ప్రయత్నిస్తారు. అట్లాంటి గుణాల్నే చిన్నప్పటినించీ వృద్ధి చేస్తారు. స్త్రీ తన కండరాల్నీ, శరీరారోగ్యాన్నీ, స్వేచ్ఛనీ, ఆలోచనల్నీ, ఆత్మవికాసాన్నీ, కళాభిమానాన్నీ వృద్ధిచేసే ప్రయత్నం మానేసింది. అందమైన, మృదువైన, ఆరోగ్యకరమైన శరీరమూ, మోహమూ, సిగ్గూ, వెకిలితనమూ, తన ఊహల్నీ, తెలివినీ అణుచుకోవడమూ, దొంగ వేషాలూ, దొంగ మాటలూ పైకి కనబరచడమూ, ఏడుపూ, ప్రణయ కోపమూ, గోమూ నేర్చుకుంది. ఇవన్నీ బోగం టక్కులు. విటుడి మోహం తగ్గకుండా బోగందియెట్లా తన చాతుర్యం చేత, మోహచర్యలచేత అతన్ని లాలించి మరిగిస్తో ఉంటుందో, భార్యకూడా తన విధేయతచేత, వంట రుచులచేత పిల్లలకి తాను అవసరం కావటంచేత, ఆ పని మాటలే మాట్లాడడంవల్ల పురుషుణ్ణి కట్టేసుకుంటుంది. వేశ్య జీవనానికి పురుషుడెంత అవసరమో, భార్య జీవనానికి అంతకన్నా అధిక అవసరము. వేశ్యకి ఒక పురుషుడు కాకపోతే ఇంకోడూ. ఈ భార్యకింక దిక్కు లేరు. కనక వేశ్యకన్నా నీచంగా ఆ ఒక్క పురుషుణ్ణీ పట్టుకుని వేళ్ళాడుతుంది.

సమస్త జీవరాసులూ తమ జీవనం తామే సంపాదించుకుంటూ వుండగా లోకం లోకల్లా వొక్క స్త్రీ మాత్రం తన జీవనంకోసం ఇంత నీచంగా పురుషుడి కాళ్ళు పట్టుకోవడమో, ఎముకలు కొరుక్కుతినడమో చేస్తోంది. ఇంత నీచజీవి లోకంలో లేదు. ఈ పతివ్రతలందరూ భర్తల రెక్కల కష్టం మీద ఆధారపడి నెత్తురు పీల్చుకునే నల్లులూ, జెలగలూ. ఈ బానిసత్వంచేత, ఈ ఆధారపడడంచేత భర్తకి భార్యమీద ప్రేమా, గౌరవమూ చచ్చిపోయినాయి. తనమీద ప్రతి దమ్మిడీకీ ఆధారపడే నీచురాలి మీద పూజ్యభావమేమిటి? నిర్భయంగా, స్వేచ్ఛగా

సమస్తశక్తులతోటీ, ప్రకాశిస్తో తిరిగే స్త్రీ దిక్కు లేని కుక్కై, అతని తన్నే కాలిని నాకావలసిన అధమస్థితికి వచ్చింది. తిండికీ, బట్టకీ, మానం అమ్ముకుంటుంది.

ఆర్థికంగా వేశ్య ఈ భార్యకంటే నయం. తక్కిన వ్యాపారాల వలెనే వేశ్య తన దేహంతో, అందంతో వ్యాపారం చేస్తుంది. తమ ఆత్మల్నీ, నీతినీ, అమ్ముకునే న్యాయవాదులకన్నా, అన్యాయమూ మోసమూ జంకు లేకుండాచేసే వర్తకులకంటే, అధమమయిందా దేహం మాత్రమే అమ్ముకునే వేశ్య? ఈ పురుషులు ఇట్లా ఆత్మలూ ధర్మమూ అమ్ముకుని సంపాయించే సొమ్ము మీద ఆధారపడే ఈ పనిలేని జీతంలేని పతివ్రతల కంటే అధమమయిందా? ఎందరు పతివ్రతలు కనుక్కుంటున్నారు, తమ భర్తలు ఏవిధంగా ఆర్జిస్తున్నారని! ఎట్లా ఆర్జిస్తేనేం నగలకీ, చీరెలకీ తీసుకొస్తేచాలు! ఖైదులో పడకుండా ఉంటేచాలు! నీతి, అవినీతి అంటే ఏమిటో తెలుసునా, ఈ పతివ్రతలకి, భర్తపెట్టే నిరంకుశాజ్ఞలు తప్ప? నీచంగా ఎవరిమీదా ఆధారపడదు వేశ్య. ఆమె న్యాయంగా, స్వేచ్ఛగా సౌఖ్యమిస్తుంది, డబ్బు తీసుకుంటుంది. ఈ పతివ్రతా శిరోమణులకి లోకంలో ఒక్క దమ్మిడీలేదు — తాము సంపాయించుకుంది, తమదనుకోగలిగింది! తన దేహం ఇవ్వడానికీ, మానడానికీ, తనకి ఇష్టమైనవాడికి ఇవ్వడానికీ, మానడానికీ వేశ్యకి స్వతంత్రం ఉంది. భార్యకి భర్తని నిరాకరించడానికి స్వేచ్ఛలేదు. పైగా వేశ్యని నీచంగా చూస్తుంది పతివ్రత! వేశ్య ఎవరికో ఒకరికోసం తయారవుతుంది. భార్య రాత్రీ పగలూ కూడా ఒక్కడికోసమే తయారవుతుంది. అంతే భేదం. ఆ ఒక్క రాత్రికీ సంతోషించి వేశ్యకి డబ్బూ, నగలూ ఇస్తారు. పగటికీ, రాత్రికీ, చాకిరీకీ కలిపి తిండీ, బట్టా ఇస్తారు భార్యకి. వేశ్య దేహం మాత్రం అమ్ముకుంటుంది. భార్య దేహం, మనసూ, చాకిరీ, అభిమానం, నీతీ, ఆత్మా, అన్నీ అమ్ముకుంటుంది.

ఆజన్మాంతము, ఒక్కసారిగానే జీవితమమ్ముకున్న భార్య ఏమని వెక్కిరిస్తుంది వేశ్యని? తిట్లూ, తన్నులూ, ఉమ్ములూ పడుతుంది, భర్త నుంచి భార్య. భార్యనన్నట్టు వేశ్యని అంట్లుతోమమంటే తంతుంది. వేశ్య వృత్తిలో వలెనే, ఈ భర్తలకి కావలసింది భార్యల దేహమే కాని హృదయం కాదు. భార్య తానింకొకణ్ణి ప్రేమిస్తున్నానంటే వెళ్ళనిస్తారా? ఆ దేహాన్ని మాత్రం తమ గదుల్లో ఇంకెవరికీ ఇవ్వకుండా ఊరేసివుంచితే చాలు, హృదయ మెవరిదైతేనేం? ఇది వేశ్యతత్వంకాక ఇంకేమిటి? ప్రేమలేకుండా వేశ్య శరీర మిచ్చుకుంటుందనేకదా నీతి వేత్తల అభ్యంతరం? ఈ భార్యలు తాము ప్రేమించే పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారా? విటులు వేశ్య మొహంచూచి అన్నా వస్తారు. ఈ భర్తలు అదీ లేదే! తరవాత మాత్రం భార్యలు అలవాటు అవుతారు. బలవంతంగా ముడేసిం తరువాత ఇంక ప్రేమ యేమిటీ?

పెళ్ళి కూతుళ్ళ సంగతి ఆలోచించండి. పురుషులు బోగం ఆమెకి డబ్బిచ్చి ఇంటి చుట్టూ తిరుగుతారు. ఆమె కడగంటి చూపు మహాప్రసాద మనుకుంటారు. ఈ పెళ్ళి కూతుళ్ళు భోగం వాళ్ళలో వెయ్యోవంతు విలువచెయ్యరు. ఈ పెళ్ళికూతుళ్ళకోసం ముసలితొక్కులు తప్ప డబ్బిచ్చే వాళ్ళు లేనే

లేరు సరికదా, పైగా బతిమాలుకొని, వేలు వేలు రూపాయలిచ్చి సైకిళ్ళూ, పాలాలూ, బహుమానాలూ ఇచ్చి, తిట్లుతిని, కాళ్ళు పట్టుకొని తీసుకొస్తేగాని, ఈ అమ్మలతో జీవితానికెవడూ వప్పుకోడు. భోగంవాళ్ళ కాళ్ళమీదపడి, వాళ్ళ ఇంట్లోనే మహాభాగ్య మని పడివుండే చిన్నవాణ్ణి బలవంతంగా లాక్కొచ్చి, 'కట్నమిస్తా'మని స్నానమన్నా చేయించకుండా, మందన్నా ఇప్పించ కుండా, తమ పతివ్రతా పుత్రికలకు కట్టి పెట్టడం మనం చూడ్డంలేదూ?

పైగా ఈ పుత్రికల సంసారానికి పునాది ఐన వేశ్యల్ని దుర్మార్గులని దూరాన తరుము తారు. ఆ వేశ్య లేకపోతే, మర్యాదగా ఇంట్లో కులుకుతో పతివ్రతై కూర్చోగలదా ఈ అమ్మ! ఈ అపకారానికై కసితీరా వేశ్య ఈ పతివ్రతల భర్తల్నీ, నగల్నీ, భూముల్నీ, అనా రోగ్యాన్నీ దిగమింగి, పతివ్రతల సంతతిని బికారుల్నీ, కురూపుల్నీ చేస్తోంది. పతివ్రత, వేశ్య మొహం చూడదు. కానీ భర్తద్వారా నోరు మూసుకుని ఆమె రోగాల్ని ప్రవేశ పెట్టుకుని తన ముద్దు పిల్ల లకిస్తుంది.

బడి చదువులు

ప్రస్తుతం బళ్ళల్లో, కాలేజీలలో పెద్ద చదువులు చదువుకునే స్త్రీలు ఉత్త దౌర్భా గ్యులు. స్త్రీత్వం వాళ్ళలో చాలా వికృత రూపాన్ని పొందుతోంది.

ఈ చదువుతో వొంట్లో రసాలన్నీ ఎండి స్త్రీ కరుకుబారి మొగాళ్ళందరికీ తనని మాన భంగం చెయ్యాలని ఉన్నట్టూనూ, తాను జాగ్రత్తగా ఆ భాగాలు భద్రం చేసుకుంటు న్నట్టూనూ చీరె చెరుగులు చుట్టచుట్టి, తల వంచి చేతులు ముడుచుకుని వంగి జాగ్ర త్తగా జారిపోకుండా పట్టుకుని పోతోవుంటే "ఎవరికన్నా పురుషుడినించి అపాయం వుందిగాని మిమ్మల్ని కోరే పురుషుడు ఉన్నాడనే భ్రాంతి మీకు చాలా అనవసరం" అని చెప్పాలనిపిస్తుంది.

చివరికి పెళ్ళయి చూసుకుంటే, ఇన్నాళ్ళూ చూసుకోకుండా దాచుకున్నవి ఒక్కటీ కనపడవు.

ప్రస్తుతపు పెద్ద చదువులు, స్త్రీలలో ఈ తప్పుడు భావాల్ని రేపుతున్నాయి.

1. తమకి స్వేచ్ఛ ఉండాలనీ, తాము చాలా గొప్పవాళ్ళమనీ, పురుషుడికి లొంగ కూడదనీ, తాము అతనికి ఏమీ ఇవ్వనక్కర్లేదనీ, అంతా పురుషుడి దగ్గిర్నించే లాగా లనీ, భర్త తనని పోషించాలి, కాపాడాలి, బాధ్యత తీసుకోవాలి, తాను మాత్రం ఎదురు అతనికి ఇష్టం వచ్చింది ఇస్తుంది. పురుషుడికి తాను లొంగకూడదంటే అర్థం, అతని ఇష్టానికి తానేమాత్రమూ adjust కాకూడదు అని. అతను తన మాట వినాలి గాని తాను అతనిమాట వినవలసిన అవ సరం ఏమీలేదు అని.

2. ఏదో పుస్తకాలలో చదివే ఆదర్శ ప్రేమని భర్త తమకివ్వాలి. ధీరులూ, యోధులూ, దేవతలూ తమకి భర్తలుగా రావాలి.

3. శరీర సంబంధం నీచం. పురుషులు, పశువులు. అర్థంగాని గొప్ప మాటలూ, ఆద

ర్శాలూ, ఉద్యోగాలూ, మర్యాదలూ, షోకుగా సంఘ, దేశ సేవలూ (ఏ బాధా ఇబ్బందీ, అమర్యాదా లేనంతవరకే) డబ్బూ, గొప్పా — ఇదే జీవితపు విలువలు వాళ్ళకి. మనసుతో, ఆత్మలతో బతకాలి వాళ్ళు. శరీరాలు చాలా నీచం.

ఈ చదువుకున్న స్త్రీలకి ఒకదానికి ఒకటి పొందికలేని 'కాంప్లెక్సెస్' (complexes).

1. దేహం అందం అంటే ఏమీ లక్ష్యం లేనట్టు మాట్లాడతారు. సవరాలూ, స్నోలూ, అద్దాలూ ఎన్నైనా చాలవు.

2. మొగాళ్ళని ఒకటే ఆకర్షించాలని ప్రయత్నిస్తారు. కాని వాళ్ళకి ఏ చోటునీ ఇవ్వరు.

3. పెళ్ళి కావాలంటారు. కాని పెళ్ళికీ, సంసారానికీ, ఏ యోగ్యతనీ సంపాయించే ప్రయత్నమూ చెయ్యరు.

ఈ అభిప్రాయాలన్నీ కూడా దాంపత్య సుఖానికి పరమ శత్రువులు. ప్రస్తుతం కాలేజీలలో చదువుకున్న యువకులూ, ముఖ్యంగా యువతులూ ప్రేమకే కాదు, మోహానికీ, సంసారానికీ అనర్హులు.

ప్రస్తుత స్త్రీలు ఎక్కువ చదువులు చదవడమూ, ఉద్యోగాలు చెయ్యడమూ, ఏదో పురుషులు చేస్తున్నారనీ, కాంపిటీషన్ వల్లనూ, ఫాల్స్ వాల్యూస్ (false values) వల్లనూ, పురుషులేదో సుఖపడి, బావుకుపోతున్నారనే ఈర్ష్యవల్లనూ, ఇంకేం చెయ్యడం తోచకా, ఇతరుల కళ్ళల్లో గొప్ప కావడానికీ, అంతేగాని నిజమైన ఇష్టంవల్ల గాదు. కాలం గడిచిన కొద్దీ, పురుషుడికి బుద్ధి హెచ్చిన కొద్దీ ఈ చదువుకున్న స్త్రీని ఎవడూ పెళ్ళి చేసుకోడు. లంచమిచ్చినా దూరాన్నించి కూడా తాకడు. పెళ్ళి లేకుండా నిలవలేరు ఈ వనితలు సంస్కారం కావాలి స్త్రీకి — చదువు కాదు. ఈ చదువు ఉద్యోగాన్ని ఇచ్చి తద్వారా స్వేచ్ఛనిస్తోంది స్త్రీకి. అదొక్కటే స్త్రీకి సుగుణం. సులభంగా ఒక సంపాదననీ, బలాన్నీ ఇస్తోంది.

కానీ ఇన్ని త్యాగాలు స్త్రీనించి తీసుకుని ఆమెని స్త్రీనిగా, మనిషిగా రూపుమాపే చదువుద్వారా కాక ఇంకో విధాన ఆమె ఆర్జించుకునే పద్ధతిని చూసుకోవాలి. వేశ్యా వృత్తి నయం ఇంతకన్న.

ఇట్లా స్త్రీలని ఉద్యోగాలకీ, కాలేజీలకి తరుముతున్నది పురుషులు. వాళ్ళకి ఇంట్లో ఏ గౌరవమూ, శాంతీ సుఖమూ లేకుండా చేసి వాళ్ళ జీవితాల్ని ఇరుకూ, చీకటీ, నీచమూ చేయడంవల్ల ఇంక గతిలేక ఊపిరాడక బైటపడి కాలేజీలని శరణు చొస్తున్నారు. కాని ప్రస్తుతం ఈ బళ్ళల్లో కాలేజీలలో నేర్చుకొనే చదువులు స్త్రీ స్వభావాన్నీ మనసునీ చాలా వంకర్లు తిప్పి వదులుతున్నాయి. మొగవాళ్ళకన్న చాలా ఘోరమైన వికృతాల్ని కలిగిస్తోంది స్త్రీలలో చదువు. స్త్రీల సంపాదనలోనూ అంతే. పురుషుడు, చదువూ, ఉద్యోగం చాలా సహజంగా తీసుకుంటున్నాడు. తనకి నైజం కాని దాన్ని ఈ పురుషుడి మూలాన చెయ్యవలసివచ్చింది అనే దిగులూ, కోపం, రోషం, సబ్ కాన్షియస్‌గా స్త్రీ స్వభావాన్ని చాలా 'బిట్టర్'గా చేస్తున్నాయి.

"Women have shaken off sex slavery only to enter into the far more oppressive bondage of wage earning, says Sellhein.

"What use is if women do enjoy

conceivable freedom nowadays....of what use to women is every external equality with men?.... They are no longer free from their natural vocation of wife and mother, whether they will or not, they simply must enter the rank of wage earners.

భర్త బానిసత్వంనించి తప్పించుకోడానికి ఒక్కటే సాధనం స్త్రీకి. ఆర్థిక స్వాతంత్ర్యం. దీనికి ఆర్జన ముఖ్యం. ఆస్తి గల స్త్రీలు చాలా కొద్ది మంది. కొత్త చట్టాలు అమలులోనికి వచ్చి, స్త్రీకి కూడా తండ్రి నించి ఆస్తి వచ్చినా అప్పుడూ కొద్దిమందే ఉంటారు ఆస్తిగల స్త్రీలు. అంటే ఏదో పని చెయ్యాలి.

ప్రస్తుతం సంపాయించుకునే పురుషులకైనా వాళ్ళు చేసే పనిలో ఇష్టం చాలా తక్కువ. ఆ పని ఇచ్చే డబ్బు, ఘనత, అధికారం తప్పితే పనినించి తప్పించుకోవాలనే వుంటుంది ప్రతివారికీ. కొంతపని ఇష్టమే కాని, పని, ఇష్టమైన దానికన్న ఎక్కువగా చెయ్యవలసి వస్తోంది.

లోకంలో ఈ బైట పనులకి స్వభావంతోనే పురుషుడికన్న కూడా స్త్రీకి తక్కువ ఇష్టం. తక్కువ తృప్తి. సంసారం పనిలో కొంత సుఖం, అర్థం, మనసుకి తృప్తి. తనవాళ్ళతో సంబంధం — తన పిల్లలకి చేస్తున్నాననే యోచన — మొత్తానికి సారం వుంది. కాని బైట పనులు వుత్తచెత్త. బోలు బాదంకాయలు — ఆ కీర్తీ, ఘనతా, ఇంక గతిలేక పొట్టకూటికోసం తంటాలుపడడం తప్పితే ఇంకేమీలేదు స్త్రీకి. కళా స్వభావం గలవాళ్ళూ, మేధావంతులూ, స్పెషల్లీ గిఫ్టెడ్ వి మెన్ వీళ్ళు తప్పితే తక్కిన స్త్రీలకి ఉద్యోగాలు ఏమీ సంతోషాన్నియ్యవు.

ఈ గోలంతా పురుషుడికి స్త్రీ చౌకగా కావడంవల్ల! ఆమె సేవా, మాతృత్వమూ విలువ పోగొట్టుకోవడంవల్ల వచ్చిన అనర్థం. తానూ ఒకమినిషినేనని సమర్థించుకోడానికి స్త్రీ చేస్తున్న అసహాయయత్నం ఈ తిరుగుబాటు.

స్త్రీ, ఇంటికీ, భర్తకీ, పిల్లలకీ చేస్తున్న పనులు — వంటా, తుడవడాలూ మొదలైనవి పురుషుల్లో చాలా తక్కువస్థితిలో వాళ్ళు చేసేపనులు. స్త్రీ ధనవంతుడి భార్య అయి ఇంటి పరిపాలన చేసుకున్నా అంతే. కనక స్త్రీ తాహతూ, ఆర్థిక స్థితీ చాలా నీచమై పోయినాయి. హౌస్ — కీపింగ్ (House keeping), పిల్లల్ని పెంచడం పురుషుడి కళ్ళలోనూ, స్త్రీ కళ్ళలోనూ చాలా తక్కువ రకం పని అయిపోయింది. కళ్ళు తెరుస్తున్న నూతన స్త్రీ నీచత్వాన్ని గుర్తించి తిరగబడుతోంది. అదీకాక ఆర్థిక పరిస్థితులవల్ల ఇంటి మొనాటనీ (Monotony) కష్టాలూ, పనీ, పిల్లలూ అతి భారమైనాయి స్త్రీకి. ముఖ్యంగా పెద్ద పట్టణాల్లో ఇల్లు చిరాకుగా ఉంటే దులి పేసుకుని పురుషుడు సినిమాకి పోతాడు, తాగుతాడు. ఈ విధమైన ఎస్కేప్ (escape), తప్పించుకోవడం స్త్రీకి సాధ్యం కావడంలేదు. అందువల్ల మరీ ఘోరం జీవితం ఆమెకి. కనక తిరిగి స్త్రీ గృహాన్ని అలంకరించాలంటే

1. ఆమె చేసే సేవకి సంఘంలో గౌరవం కావాలి —

2. ఆమె ఆర్థిక పరిస్థితి భర్త అనుగ్రహంమీద ఆధారపడకూడదు.

3. స్త్రీ తాను సంపాదన చేసుకుంటో

ఉంటే, ఆ ఉద్యోగం ఆమె గృహిణీత్వానికి అటంకం కాకుండా ఉండేట్టు 'స్టేట్' (state) ఏర్పాటు చేయాలి.

4. ఆమె శీలం అర్పించుకుంటేనే గాని ఉద్యోగం నిలవని పరిస్థితులు ఉండకూడదు.

పెళ్ళి ఇష్టమున్న స్త్రీ, ఆర్థిక పరిస్థితివల్ల పెళ్ళిచేసుకోడానికి వెనుతీసే పరిస్థితీ, అవసరమైనప్పుడు సంపాయించుకునే శక్తీ ఉండాలి స్త్రీకి. కానీ ప్రపంచంలో తెగబడి సంపాయించుకోవలసిన అవసరం కలగకూడదు ఆమెకి. కానీ కొంతకాలం సంసారానికి అలవాటుపడ్డ స్త్రీకి సంపాయించుకునే అలవాటు పోవచ్చు. పిల్లలు అభ్యంతరం కావచ్చు.

పిల్లలకోసం, ఇంటికోసం పనిచెయ్యని స్త్రీని పోషించేందుకు భర్త సంపాయిస్తున్నా, అతని దయమీద ఆధారపడకూడదు ఆమె తన బతుకు కోసం. అతని జీవితంలో కొంత భాగానికి ఆమెకి అధికారం ఉండాలి.

పెళ్ళి ఇష్టమున్న స్త్రీ ఆర్థిక పరిస్థితివల్లా, బానిసత్వపు భయంవల్లా పెళ్ళి చేసుకోడానికి వెనుతీసే పరిస్థితి పట్టకూడదు.

భార్య కావడం, ఒక ఉద్యోగం కింద ప్రభుత్వం పరిగణించాలి. 'కమ్యూనిజం ప్రణాళిక'లో, ఏదో ఒక పద్ధతిమీద, ఇల్లాంటి ఏర్పాట్లు ఉన్నాయి. ప్రతి పెళ్ళయిన స్త్రీకీ, పెళ్ళయినగానీ, కాకగానీ, పిల్లల్నికనే స్త్రీలకి ఎలవెన్సులు వుండాలి. పెళ్ళయిన పురుషుడికీ, పిల్లలున్న పురుషులకీ ఉద్యోగాలలో ఎక్కువ జీతాలియ్యడమూ; ఆ జీతాలలో కొద్దిగా పురుషుడికిచ్చి తక్కినదంతా భార్యకి ఇవ్వడమూ; వర్తకులూ, ప్లీడర్లూ, మొదలైన వారిచేత చాలా భాగం భార్యలకి ఇప్పించడమూ ఉండాలి. పిల్లల్ని కనడానికీ, పెంచడానికీ, గృహాన్ని నిలబెట్టడానికీ, గొప్ప గౌరవమూ, సౌకర్యాలూ కలగజేస్తేనేగాని, ఇప్పుడు వున్న హీన పరిస్థితులతో స్త్రీలు ఎక్కువకాలం బానిసత్వంలో బతకడానికి ఒప్పుకోరు.

క్రమంగా స్త్రీలు ఈ ఇళ్ళలోంచి తప్పించుకున్న కొద్దీ వాళ్ళకీ, పురుషులకీ, పిల్లలకీ సుఖం క్షీణిస్తుంది. ఎంతకీ పురుషుడు ఈనాటి తన సంసారం సరిగాఉంటే చాలునని, చాలా సంకుచితదృష్టితో స్త్రీకి సంసారం దుర్భరం చేస్తున్నాడు.

ఈ సమస్యలన్నిటికీ కమ్యూనిజం గొప్ప జవాబు. మనుషులకి ఈ లోకంలో మిగిలిన ఒక గొప్ప దూరపు కల అది.

కానీ, లోకంలోకి వెళ్ళి, సంపాదన బాధ్యతనంతా వహించి తనని సురక్షితంగా కుటుంబంలో సుఖపెడతాననీ, పురుషుడంటే స్త్రీకి ఏ సూత్రమూ అభ్యంతరం వుండదు, ఏ కొద్దిమందికో తప్ప. పైగా సంతోషిస్తుంది. కాని కుటుంబంలో స్త్రీని వుంచినా, ఆమె మీద పురుషుడు తన అధికారాన్ని చలాయించినా, సంపాదన లేని తనాన్ని పురస్కరించుకుని లోకువ చేసినా, స్త్రీ కుటుంబంలో పడివుండేకాలం దాటిపోయింది. ఆమె అసలు స్వభావం కొంతవరకూ, ఇన్ని యుగాల అలవాటు కొంతవరకూ; పిల్లల్ని కనడమనే సృష్టి పద్ధతీ, ఆమెని ఎంతవరకూ సంసారం వేపే లాగుతాయి. కాని సంసారం సుఖప్రదమూ, గౌరవ ప్రదమూ కానన్నాళ్ళు దానినించి విడుదలపొందే పద్ధతుల్ని ప్రయత్నిస్తూనే ఉంటుంది. ఆ ప్రయత్నంలో ఆమె చీలికలై పోయినా సరే.

స్త్రీ స్వేచ్ఛ

తను చెప్పే ఈ పతివ్రతా లక్షణాలని నమ్మి, స్త్రీ లోబడేందుకు సంఘం రెండు ఉపాయాలని కనిపెట్టింది.

1. మగవాడు బలవంతుడనీ, మేధావంతుడనీ, ధైర్యస్తుడనీ, స్త్రీ అబల అనీ, బుద్ధిహీనురాలనీ, చపలచిత్త అనీ, నీచాత్మురాలనీ, కనక ఎప్పుడూ పురుషుడి అజ్ఞకి బద్ధురాలై వుండాలని, పురుషుడు తను నమ్మి స్త్రీ నమ్మేటట్లు బోధించాడు. స్త్రీ శరీరం కోమలం, హృదయం మార్దవం, ఆమె ఎందుకూ పనికిరానిది. అదీగాక సృష్టిలోనే ఆమెకి కాన్పులూ పిల్లలూ మొదలైన ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆమె అశుచి. ఈశ్వరుడే అట్లాచేసి ఆమెని సరిగా ఉంచడానికి పురుషుణ్ణి నియోగించాడు. ఆమె పురుషుణ్ణి పాపానికీ, నరకానికీ ఈడ్చే రాక్షసి. ఉన్నతాలైన అతని కార్యాలన్నిటినీ పాడుచేసి కూలదోసే మహాకాళి. తమ తల్లుల్ని గురించి ఇంత పవిత్రమైన అభిప్రాయాలున్నాయి — మాతృపూజకి ప్రసిద్ధి కెక్కిన ఈ దేశంలో! బైటకి వెళ్ళి పనులు చేసుకునే శక్తీ జ్ఞానమూ ధైర్యమూ ఆమెకి లేవు కనక మొగాడు పనులన్నీ చేసిపెడతాడు. అన్నీ తప్పుటాలోచనలు చేస్తుంది గనక మొగాడు ఆమె కోసం కూడా, ఆమె క్షేమం కోసం ఆలోచనలు చేసి పెడతాడు. వ్యవహారాలు నడుపుతాడు. పుస్తకాలు రాస్తాడు. యంత్రాలు చేస్తాడు. ఆమె నీతి వక్రము. ఎప్పుడూ, పాపకార్యాలకే లాగుతో వుంటుంది ఆమె స్వభావం. అందుకని ఆమెని దుర్నీతి నించీ, నీతి నించీ కూడా రక్షిస్తాడు పురుషుడు.

కనక లోకంలోకల్లా నీచమైన పనులు ఆమెకి ప్రసాదించారు — వండడం; పెంట లెత్తడం; అంట్లు తోమడం; మొగుడి పశు కామం తీర్చడానికి ఎప్పుడూ సిద్ధంగా వుండే సాధనంగా ఉండడం; అతనికి కోపమూ, విసుగూహొస్తే తిట్లూ, దెబ్బలూ నోరెత్తకుండా తినడానికి వీలయే బండగా ఉండడం. ఆమె సౌందర్యం, ఆరోగ్యం, ప్రాణం నశించి నాసరే పిల్లల్ని కనే యంత్రంగా ఉండడం, ఇవి ఆమె పనులు. ఈ ఉపయోగం ప్రకారం, స్త్రీ అంత నీచురాలూ, కష్టజీవీ ఇంక లోకంలో లేదు.

2. ఈ బోధన ప్రకారం స్త్రీ అంత అప్సరస, ఈశ్వరాంశ సంభూత, జగన్మాత, పవిత్ర, నిర్మల, సుశీల, శాంత, ఎక్కడా లేదు. కవులు ఆమె ఆకారాన్ని స్తుతిస్తారు. అవిమేషులై ఆనందిస్తారు. ఆమె జుట్టు మొదలు కాలిగోరువరకూ ఆమెకు వస్త్రం లేదనుకుని సమస్త అవయవాలూ వర్ణిస్తారు. ఆమె కళ్ళు చూడడానికీ, పాట్ట జీర్ణం చేసుకోడానికీ, చేతులు పనిచేయడానికీ, నోరు మాట్లాడడానికీకాదు, పురుషుడు కావలించు కోడానికీ, మోహించడానికీ. ఆ అందానికి తోడు మంచి బట్టలు కట్టుకుని, పువ్వులు పెట్టుకుని. గంధం రాసుకుని, పురుషుడికోసం బొమ్మలాగు యెదురు చూస్తో ఉండాలి. అందుకోసం నాజుకుగా, సొగసుగా బతకాలి.

అన్నిటికన్నా స్త్రీని తల్లిగా పొగుడుతారు. జగన్మాత — అవతార పురుషుల్ని

యోధుల్ని, రాజుల్ని కనేతల్లి. వంటచేసి — అంట్లుతోమే చపల చిత్తురాలు, మాత కాగానే వాదిలేసే మాత, వంటమనిషీ హోదా గల జగన్మాత, యోధుల్ని కన్న బానిస, పురుషుణ్ణి చెరిపే కుతంత్రశాలి — ఈ పవిత్రమైన మాత. చంటిపిల్లలకి బాగా తెలుసు, అంత అధికారమూ తండ్రిదేననీ, తల్లి ఒక లెక్కలోది కాదనీ, ఇంట్లోకల్లా అధమురాలనీ, ఎప్పుడో స్పష్టమౌతుంది. తండ్రితో కలిసి తల్లిని నీచంగా చూడడం చిన్నప్పుడే నేర్చుకుంటారు. మొగవాడవడం చేత తను తల్లి కన్నా అధికుణ్ణని ఆరేళ్ళ కుర్రవాడు కూడా ప్రవర్తిస్తాడు. ఇంటికంతా దాసి కావడం చేత, దానికి అధికార్లనించి వచ్చే తిట్లూ, దెబ్బలూ, పూజ్యురాలైన ఈ గొప్ప తల్లికి తప్పవు. ఎవరిదగ్గర్నించి ప్రేమా, భక్తీ రావాలని ఆమె హృదయం తల్లడిల్లుతో వుంటుందో ఆ పిల్లల దగ్గిర్నించి కూడా! పెద్ద వాళ్ళయిన తర్వాత కొంతమంది ఆమె అసహాయత్వాన్ని అర్థం చేసుకుని ఆ నీచత్వానికి ఆమె నొక్కతే బాధ్యతకలది కాదని నిగ్రహించుకుని ఆమె మూర్ఖత్వాన్ని మరచిపోయి తమకి ఆమెవల్ల కలిగిన హానిని క్షమించుకుంటారు.

ఒకరికి సేవ చెయ్యడానికిగానీ, మానడానికిగానీ స్వతంత్రమున్నప్పుడే సేవ ప్రేమ రూపాన్ని పొందుతుంది. ఇష్టం లేకపోతే నౌకరు తనపని మానుకోవచ్చు. ఆ స్వతంత్రం కూడా లేని బానిసత్వం ఈతల్లి స్థితి. తమకి చాకిరీ చెయ్యకపోతే ఈ తల్లికి వేరే గతిలేదనీ, సంపాయించుకునే శక్తి లేదనీ, పిల్లలకి కూడా తెలుసు. ఇంక గౌరవమూ, భక్తీ కృతజ్ఞతా యెట్లా ఉంటాయి?

బిడ్డ పుట్టడంలో కూడా తల్లికి స్వేచ్ఛ లేదు. బిడ్డపుట్టింది. సృష్టిలోనే ఆమె స్తనంలో పాలూ, హృదయంలో ప్రేమా ఏర్పడ్డాయి. తెలివి తక్కువగా పాలిచ్చి పిల్లలకి జబ్బులుతెస్తుంది. ఆ ప్రేమని ఉపయోగించే శాస్త్రజ్ఞానంలేక పిల్లల 'కారెక్టర్' పాడు చేస్తుంది. కొడుకు పెద్దవాడై అతనికి ఆమె ప్రేమ అవసరంలేనప్పుడు కూడా అతన్ని ప్రేమిస్తో తనకి ప్రేమ చూపమని గోల పెడుతుంది. అతను ఎదుగుతో ప్రపంచంలో సంగతులన్నీ నేర్చుకుంటో, బాధపడుతో, లేస్తో వున్నప్పుడు తను కూడా యెట్లానన్నా అతనికి సహాయం, బలం ఇచ్చి ఓదార్చి తోడ్పడాలని తల్లి హృదయమెంతో తల్లడిల్లుతుంది. కానీ ఆ ప్రపంచం సంగతి, ఆ ప్రపంచజ్ఞానం సంగతి ఆమెకేం తెలుసు? ఎట్లా గడపదాటుతుంది? దాటితే ఒక్క నిమిషం నిలవగలదా? తల్లి ఒళ్ళో పెరిగిన చిన్నకూన లోకమంతా చుట్టివచ్చి, ఆదుర్దాతో తనని ప్రశ్నలడిగి, తనకి పిచ్చి సలహాలు చెప్పి ఇంకా తనమీద అధికారమున్నట్టు ప్రవర్తించే తల్లిని చూసి "అదంతా నీకెందుకమ్మా! నీకేం తెలుసు!" అంటే ఎంత హృదయ వేదన ఇచ్చే సిట్యుయేషన్ అది! ఈ తల్లిప్రేమ అడ్డుగా వుంటే బరువుగా తోచి ఆ ప్రేమని తోసేసుకు తిరుగుతాడు కొడుకు. తల్లి హృదయం గాయమవుతుంది.

తల్లిప్రేమ కొంచెం ఎదిగిన పిల్లవాడికి కూడా నిష్ఫలం. ఇంకా తండ్రి జ్ఞానం ఉపకరిస్తుంది అతనికి. అనవసరమైన తన ప్రేమని ఉపసంహరించుకునే జ్ఞానమూ, శక్తీ, ప్రపంచ జ్ఞానమూ — శిక్షణలేని ఈ తల్లికి ఉండవు. కనక ఇంకా ప్రేమతో సలహాలూ ఆజ్ఞలూ పెడుతోనే ఉంటుంది.

ఈ తల్లి వెర్రి ఆలోచనల ప్రకారం నడుచుకున్నాడా, ఒక్క నిమిషం నిలవగలడా కుర్రవాడు?

ఈ రెండు అభిప్రాయాలనీ ఉపయోగించి స్త్రీని ఈ స్థితిలోనే ఉంచాలని పురుషుడి ఉద్దేశ్యం. ఆమెకి స్వతంత్రం ఉండడం అతనికి ఏమీ రుచించదు! స్త్రీకి ఇప్పటికన్న ఎక్కువ స్వతంత్ర ముండాలని ఎవరన్నా అంటే, దేశాభిమానులు రెండు సమాధానాలు చెపుతారు.

1. నిజంగా ఇంట్లో అధికారమంతా స్త్రీదేననీ, అక్కడ పురుషుడి ఆటలు సాగవనీ అంటారు. కానీ స్త్రీకి ఇంట్లో అధికారం ఇచ్చింది పురుషుడేనా? ఏ నిమిషాన్నన్నా ఆ అధికారం లాక్కోగలడు. తన ఇష్టం వచ్చిన మార్పు చెయ్యగలడు. డబ్బు సంచి పురుషుడి చేతిలో ఉంది. అయినా, ఇంట్లోనే ఆమె అధికారాన్ని బంధించాలనడానికి పురుషుడెవరు? అసలు ఇంట్లో అధికారం, బయటి అధికారం సంగతి కాదు కావాలనేది. స్త్రీకి కావలసింది తనమీద, తన జీవితంమీద, తన శరీరంమీద, మనసు మీద, హృదయంమీద సంపూర్ణాధికారం.

2. స్త్రీకి స్వేచ్ఛ అంటే మంచి చెయ్యడానికే గాని, తన ఇష్టం వచ్చినట్టు పాడుపని చెయ్యడానికి కాదంటారు. పురుషుడు స్వేచ్ఛని దురుపయోగపరచకుండా ఎవరు చూస్తున్నారు? అంతరాత్మ, సంఘం, శాస్త్రాలూ. స్త్రీ నీతిని పాలించేది ఇవన్నీ కాదు, పురుషుడు! పురుషుడు ఆజ్ఞాపిస్తే ఈ నీతి చట్టాన్ని స్త్రీ అతిక్రమించవలసిందే. ఈ పురుషుణ్ణి సంఘం శిక్షిస్తుంది. స్త్రీనికూడా సంఘం శిక్షిస్తుంది. పై పెచ్చు ముందుగా భర్త శిక్షిస్తాడు. స్త్రీని శిక్షించడానికి అతనికి మాత్రం ఎక్కువ ఏం తెలుసు? స్వేచ్ఛ అంటే పురుషుడికి ఒకటి తెలుసా ఏమిటి, స్త్రీని ఆజ్ఞ పెట్టేందుకు?

పురుషుడు బలం కలవాడు కావడం చేతనూ, సంఘం పురుషుడిపట్ల పక్షపాతం చూపడం వల్లనూ, స్త్రీ పురుషుణ్ణి అడ్డుపెట్టలేదు. పురుషుడు తన ఇష్టంవచ్చిన ఆజ్ఞలు పెట్టి స్త్రీని నిర్భంధించగలుగుతున్నాడు. ఆమె పాతివ్రత్యం, ఆమె దేహం తనది, తన హక్కు, తన స్వంతమనే అభిప్రాయంతో అతను చేసిన పనులు చూడండి.

1. అతను చచ్చిపోగానే, తన స్త్రీ ఇతరులకి మిగలకుండా కాల్చబడాలనే చట్టాన్ని అమలులో పెట్టాడు.

2. ఒకవేళ బతికివున్నా, ఆమెని ఎవరూ వాంఛించకుండా ఆమె వికార రూపాన్ని పొందేటట్టు శాసించాడు.

3. ఒకవేళ ఎవరన్నా వాంచించినా మళ్ళీ పెళ్ళి నిషేధించాడు.

4. ఆమె వేలన్నా కనబడకుండా ఘోషాలో పెట్టాడు. ఆమెకి లోకజ్ఞానం, గాలి, ఆకాశం, వెలుతురు దేవుడిచ్చినవి, తను అడ్డుపెట్టాడు. ఆమె హృదయం పోయినా, శరీరం తనదైతే చాలు. శరీరం కుళ్ళినా, క్షయరోగంతో చచ్చినా ఇంకోడు చూడకుండా ఉంటే చాలు.

ఒక్క పురుషుడేకాదు స్త్రీకూడా పురుషుణ్ణి తను స్వంతంగా తన సొమ్ముగా పురుషులంత జెలసీతోనూ చూసుకుంటుంది. కానీ ఆమెకు లోబడి ఆమె సొమ్మై పురుషుడు పడివుండడు మరి. పురుషుణ్ణి ఎట్లానన్నా తనవాణ్ణి, స్వంతం చేసుకోడానికి స్త్రీ అసలు ముందు ఈ వివాహ బంధానికి ఒప్పుకుంది. ఆమెకి పురుషుడి దగ్గరనుంచి

వదిలించుకుని స్వేచ్ఛ కావాలని ఏ మాత్రమూలేదు. ఈ లోకంలో తను సంపాదించుకుని, బాధ్యతలు నెత్తిన పడేసుకుని బతకటం ఎంత కష్టం! చవకగా ఒక పెళ్ళి తనని కాపాడి, తిండిపెట్టి, బాధ్యతలన్నీ భరించే భర్త ఉండగా తనెందుకు శ్రమ పడటం? ఒంటిగా బతికే శక్తి స్త్రీకి నశించింది. తన స్వేచ్ఛని తలుచుకుని భయపడే హీనస్థితికి తెచ్చి ఇప్పుడు ఆమెకి పురుషుడి మీద ఆధారపడటం ఇష్టమని అంటారు.

స్త్రీకి తన స్వేచ్ఛనే భయంకరంగా చేసిన పురుషుడు, ఆమెకి స్వేచ్ఛని తిరిగి నేర్పాలి. ఆ స్త్రీ కోసమేకాదు, తన కోసమూనూ. స్వేచ్ఛనెరిగి, అనుభవించి తనని ప్రేమించే జీవకళలు కల స్త్రీ ఎక్కడా బంధనంలో చిక్కుకుని అణగారి ప్రాణాలు పోయిన ఈ పీనుగలెక్కడా! అందుకే పురుషులకి భార్యలకంటే వేశ్యలు ఇష్టమయేది. స్వేచ్ఛ అనగానే నీతిని వొదిలేసి స్త్రీలు వారి ఇష్టం వచ్చినట్టు తిరుగుతారని పురుషుడి భయం. తిరిగితే మాత్రం తన కేంపని? తనెవరు అడ్డుపెట్టడానికి? కాని స్త్రీ అట్లా తిరగదు. ఇప్పటివలె 'స్త్రీ ఎక్కడ స్వేచ్ఛగా కనబడుతుందా పట్టుకుందామా' అని పురుషుడు చూడడు. స్వేచ్ఛగా తిరిగే స్త్రీని చూస్తే పురుషుడికి ఇష్టమే కాని ఆమె ఇతరుల భార్య కావాలి. తనకి చిక్కాలి. తన భార్య ఇంట్లోనే ఉండాలి, భద్రంగా.

భార్యకి స్వేచ్ఛనిస్తే ఇతర పురుషులతో సంబంధం పెట్టుకుంటుందనీ, వాళ్ళకి పిల్లల్ని కంటుందనీ, భర్త భయం. అట్లా ఇతరులతో సంబంధం పెట్టుకుంటే —

1. భర్త భరించటం మంచిది.
2. భరించలేకపోతే వదిలెయ్యవచ్చు.

కానీ — ఇట్లా బలవంతంగా బంధించడం అక్రమం, నిరర్థకం.

ఉత్తమజాతి స్త్రీకి స్వేచ్ఛనిస్తే, నీచజాతి పురుషుడికి సంతానం కని వర్ణ సంకరం చేసి, హెరిడిటీ (Heredity) పాడు చేస్తుందంటారు. ఈ ప్రకారంచూస్తే ఆ ఉత్తమ జాతి పురుషుల చేతనే సమస్త స్త్రీలకీ, ముఖ్యంగా పిల్లల్ని కనిపిస్తే చాలా బావుంటుందికదా? ఉత్తమజాతి వాడైనా, భర్త నీచుడైతే, ఉత్తమ సంతానం కోసం స్త్రీ ఇంకోణ్ణి ఏరుకోవచ్చునా?

సృష్టి దృష్టిలో వివాహ పవిత్రత సంతానంమీద ఆధారపడి ఉంది. ఏ సంబంధం ఉత్తమ సంతానానికి కారణమౌతుందో అదే నీతి. సంఘం అభిప్రాయంలో కూడా సంతానం వివాహానికి ఒక ముఖ్యమైన ఉద్దేశ్యమే. తాము కామేచ్ఛకు అతీతులమనీ, స్త్రీతో సంబంధం, విధిలేక సంతానం కోసం కలుగజేసుకుంటున్నామనీ, పెద్దమాటలతో వెర్రివాళ్ళని మోసపుచ్చ చూసే పురుష శ్రేష్ఠులు ముఖ్యంగా సంతానమే వివాహానికి ఉద్దేశ్యమంటారు. కాని ఈ రుషిపుంగవులకి గానీ, సంఘానికిగానీ, పిల్లల్ని కనడమే ప్రధానం గాని, ఎటువంటి పిల్లల్ని కంటున్నారు? ఎంత మందిని? వాళ్ళని ఎట్లా పెంచుతున్నారు? ఈ పిల్లలు ఎటువంటివారిగా తయారవుతున్నారు? వారి స్థితిని అభివృద్ధి చెయ్యడ మెలాగు? అనే సమస్య లక్ష్యంలేదు. ఆ పిల్లలు పెళ్ళి అయిన వాళ్ళకి పుట్టారా లేదా? అనేది ఒకటేవాళ్ళ దిగులు. రోగిష్టి, పిచ్చిదీ, దుర్మార్గురాలూ, కుష్ఠురోగీ — ఇట్లాంటివాళ్ళు వారిని పోలిన పిల్లల్ని కన్నా సంఘంలో మర్యాదే. అదంతా కర్మకింద,

ప్రారబ్ధంకింద వస్తుంది.

ఇంతకీ ఈ పవిత్రమైన వివాహంవల్ల, ప్రేమలో మునిగితేలే కుటుంబాలవల్ల, పుట్టిన సంతానం ఇంత గొప్పదిగా, ఇంత దృఢంగా, తెలివిగా, ధైర్యంగా, నీతిగా ఉందేమి? ఈ బానిసలకన్నా బలవంతుల్నీ ఆరోగ్యవంతుల్నీ, తెలివి గలవారినీ, ధైర్య వంతుల్నీ సృజించకపోతే ఈ ధర్మమూ, నీతీ, వివాహబంధమూ ఉండి ఏం లాభం, దిన దినమూ ఇట్లా ప్రజ అణగారి పోతోవుంటే?

వ్యభిచారమనేది సంఘ నిబంధనల వల్లే గాని లేకపోతే ఆ మాట లేదని తెలుసు కున్నాము. సంఘం కొన్ని పద్ధతుల్ని నియమించేదీ, వాటికి తిరగబడితే ఖండించేదీ అన్యాయం. పోనీ 'వ్యభిచారం' ఇప్పటి అర్థంలో తీసుకున్నా అదికూడా స్వేచ్ఛవల్ల తగ్గుతుంది. ముప్పాతిక వ్యభిచారం ఈ అసహజమైన నిర్బంధాలవల్ల అసహజంగా కలుగుతోంది.

సంఘం, అధికారాన్నీ, నీతి చట్టాన్నీ అట్టావుంచి ఒక మనిషి 'వ్యభిచారం ఎందుకు చెయ్యకూడదు?' అని తనను తాను ప్రశ్నించుకుంటే — "నేను ఒకర్ని మనసారా ప్రేమిస్తాను గనక, ఇంక నా మనసులో ఇంకోరికి స్థలమే లేదు గనక" అని ప్రత్యుత్తరం రావాలి. స్వేచ్ఛవల్ల అట్లాంటి అభిప్రాయాలున్న దంపతులు కాగలుగుతారు. అదిగాక పూర్వంనించి వస్తున్న "ఇన్‌స్టింక్సు" కొంచెం "ఛేన్‌జ్" (మార్పు) కోసం ఇతరులు కావాలనిపిస్తే వారిని పొందటంలో తప్పు ఉండకూడదు.

స్వేచ్ఛవల్ల వ్యభిచారం ఎక్కువవుతుం దని భయం. కాని ఇంకా స్వేచ్ఛ ఉన్నప్పుడే వ్యభిచారం తగ్గుతుంది. ఏ వస్తువునన్నా దాస్తే, అది పనికిరాకపోయిందైనాసరే, లోకం కావాలంటుంది. గోషాబళ్ళల్లో ముస లమ్మల్ని కూచోబెట్టినా అందరూ తొంగి చూస్తారు. స్త్రీలు బైటకి రాని దేశాల్లో పర స్త్రీని చూడగానే కామం పుడుతుంది. పొద్దస్త మానం స్త్రీలతో కలిసి పనిచేసే వాళ్ళకీ, ఎప్పుడూ స్త్రీలతో భుజాలు రాసుకునే పశ్చిమ దేశస్తులకీ, ఈ దేశస్తుల ప్రకారం ప్రతీ చూపుకీ కామం పుట్టుకొస్తే వాళ్ళకి బత కడం కష్టమైపోదూ? మనం, ఈ నిబంధన లని వుంచినన్నాళ్ళే — ఈ దుర్మార్గమూ, కుళ్ళుకోర్కెలూ. అదీగాక స్త్రీ తన దుస్తుల వల్లా, జుట్టువల్లా, తన భేదాన్ని విపరీతంగా కనబడేటట్టు చేస్తోంది.

స్త్రీ నిజ స్వాతంత్ర్యానికి ఒకటేమార్గం. ఈ పెద్ద కబుర్లూ, ఉపన్యాసాలూ, సంఘ సంస్కారాలూ ఏమీ సహాయం చెయ్యవు. ఈ పురుషులు చూపే దొంగ సహాయంతో స్త్రీకెన్నటికీ వాస్తవమైన స్వాతంత్ర్యం కలగ బోదు. అంత అధికారమూ (ముఖ్యం రూపా యల సంచి) తనచేతుల్లో ఉంచుకుని స్త్రీ కన్నీళ్ళు తుడవడానికీ, బాధించే తన అంత రాత్మని సంతుష్టి పరుచుకోడానికే ఈ మాయ మార్పుల్ని కల్పించి ఇంకా బానిస లని తయారుచేస్తారు. సహాయం చెయ్య తలచినా స్త్రీకి సహాయం చెయ్యలేడు పురుషుడు — ఆమె ఆత్మలోంచి స్వాతం త్ర్యాభిలాష రానిది. అతను స్త్రీ యెడల తాను వహించిన ఈ బాధ్యతలన్నిటినీ వదు లుకుని ఆమెని స్వేచ్ఛగా వదలడమొక్కటే అతను చేయగల సహాయం. ఆమె శరీరా రోగ్యానికై అతను రాసిపెట్టిన నిరర్థక డ్రిల్లునూ, ఆమె తెలివి అభివృద్ధి చేసేం దుకు తను ఏర్పరచిన శుష్క విద్యావిధా

నాన్నీ, ఆమె ప్రవర్తనకోసం తను కనిపెట్టిన కుళ్ళుమోతు నీతి చట్టాల్నీ, ఆమె ఆత్మ కోసం తను ప్రత్యేకంగా ఉద్దేశించిన పూజా పురస్కారాల్నీ, ఉపసంహరించుకుని — ఆమె ఏమైనాసరే తనదేదీ బాధ్యత కాదని వదిలేస్తేచాలు! పదివేల నమస్కారాలు. ఆమె తనమీద ఆధారపడచూసినప్పుడు క్రూరంగా నిరాకరించి, ఆమె స్వంతంగా తనబాధ్యత తానే వహించేటట్టు చెయ్యాలి! పురుష సహాయం పోయినప్పుడు, స్త్రీ తన తెలివినీ, బలాన్నీ ఉపయోగించి శక్తిమంతురాలవుతుంది. పురుషులీ సహాయం చెయ్యరు. ఎప్పుడన్నా అధికారవంతులు తమంతట తాము అధికారాన్ని వదులుకోడమెరుగుదుమా? ఆ అధికారాన్ని భరింప తలుచుకోనివారు తిరగబడి అధికారాన్ని కూలతొయ్యాలి. పురుషుడి ఈ దురాగత నిరంకుశత్వాన్ని కూలదొయ్యడానికి ఒకటే సాధనం — ఆర్థిక స్వాతంత్ర్యం. తను ప్రతి దినమూ నాల్గణాలు సంపాయించుకునే స్త్రీ, దేహమమ్ముకునే వేశ్య — సమస్తాభరణాలతో బనారసు చీరెలతో, కులుకుతూ ధర్మ భర్త పక్కన పదిమంది బిడ్డలతో, గుర్రపు బండిలోపోయే పుణ్యస్త్రీ కన్న పవిత్రురాలూ, స్వతంత్రురాలూ.

స్త్రీ కొరకు కాక, తన కొరకే పురుషుడు స్త్రీకి స్వాతంత్ర్య మివ్వాలి. ఈ స్త్రీని బానిసత్వంలో ఉంచినందుకై ఈ నిరంకుశ ప్రభువు అనేక పశుగుణాల్ని నేర్చుకున్నాడు. స్త్రీ స్వతంత్రురాలైతే అవి అన్నీ నశించి ఉత్తమ పురుషుడౌతాడు. స్త్రీని బానిసగా ఉంచేందుకై ఈయన ఈమెకి నేర్పిన పిచ్చి భయమూ, నీచత్వమూ, అల్పత్వమూ, సేవకత్వమూ అన్నీ తాను పిల్లలకినేర్పి, పురుషుల్ని కూడా తనతోపాటు అధమస్థితిలోకి లాగి కసి తీర్చుకుంటుంది. స్త్రీ ఆర్థిక స్వతంత్రురాలై, ధైర్యశాలీ, అనుభవశాలీ, ధీరురాలూ కాగానే, ఆమె సంతతి కూడా అట్లానే మారుతుంది.

ఈ ఆర్థిక స్వాతంత్ర్యము అవసరమని గుర్తించేందుకు, దాని అర్హత పొందేందుకు, దాన్ని నిలుపుకునేందుకు విద్యే మూలము. ఈ విద్యే స్త్రీనిమార్చి స్వాతంత్ర్యాన్ని పొందేటట్టు చేస్తుందని పురుషుడికీ తెలుసు. కనకనే పురుషుడి విద్య స్త్రీకి పనికిరాదనీ, ఆమెకి నేర్పే విద్యాప్రణాళిక ఆమెని పిల్లల్ని పెంచడానికీ, వంటకీ, పాతివ్రత్యానికీ తయారుచేసేదిగా ఉండాలనీ; పురుషాధిక్యతా, స్త్రీ నైచ్యతా బోధించే పాత పురాణాలూ, నీతిశతకాలూ, స్త్రీకి ముఖ్యమనీ అరుస్తో ఉంటాడు పురుషుడు. స్త్రీ దీనికి లోబడకూడదు. పురుషుడి వలెనే తానూ సమానంగా నూతన శాస్త్రజ్ఞానాన్నీ, ఈ నవయుగ సాంప్రదాయాల్నీ గ్రహించాలి.

అన్నిటికన్నా విద్యకన్నా ముఖ్యం — స్త్రీ స్వతంత్ర ఆర్జన. మనుషుల్నిగానీ, దేశాల్నీ గానీ అణగదొక్కాలంటే, ఆర్థిక అసహాయత్వం ముఖ్యసూత్రం. అందుచేతనే స్త్రీ ముఖ్యంగా బానిస అయింది — తాను సంపాదించుకునే శక్తిలేక! తన పొట్ట పోషించుకోడానికి తగిన పనీ, విద్యా స్త్రీ సంపాయించిందో ఈ పురుష ప్రభుత్వం నేలకూలిందన్నమాటే! విద్య అయినా స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇయ్యకపోతే వృథా.

స్త్రీని బానిసచేసేది— రెండోది, లోకభయం. తిరగబడ్డ స్త్రీని గౌరవించరు. పైగా హింసిస్తారు. అందరికీ చులకనౌతుంది. కనక వేల వేలు స్త్రీలు తిరగబడితేనేగానీ ఈ సంఘం కళ్ళు తెరిచి స్వతంత్ర అయిన స్త్రీని గౌరవించడం నేర్చుకోదు.

సంఘ నీతి

కామ సంబంధంగా మనుష్యులు మూడు రకాలు.

1. మోహమంటే ఎరగనివారు.

2. మోహం కలిగి దానిని జయించ లేక పెనుగులాడేవారు.

3. మోహాన్ని జయించేవారు.

సంఘం కళ్ళకి మొదటి రకం వారు ఉత్తములు. వారికి ఉన్నదల్లా కామం. ఆ నిమిషానికి పెళ్ళామంటో ఒకత్తె ఉంటే చాలు. ఏ స్త్రీ అయినా సరే, స్త్రీ అయితే చాలు. కనక భార్య ఉంటే ఇతర స్త్రీల జోలికిపోరు. సంఘానికి వీళ్ళనిచూస్తే చాలా ఇష్టం — బడిపంతులికి అల్లరి చెయ్యలేని బడిపిల్లల్ని చూస్తే ఇష్టమైనట్టు. వీళ్ళకి అందమూ, చాతుర్యమూ తెలుసుకునే సంస్కారమూ, జ్ఞానమూ లేవు. ఇతరులు ఎందుకు దుర్నీతిగా ప్రవర్తిస్తారో వీరికి అర్థం కాదు. తాము దుర్నీతిలో పడతామని భయంలేదు. అందువల్ల నీతులు బోధించడంలోనూ, ఇతరుల ప్రవర్తనలో నలుసు లేరడంలోనూ వీరు గట్టివారు. వీరి కల్లాంటి అపాయం రాదుగా! వీరినే సంఘం మంచి వాళ్ళనీ, నీతి వర్తనులనీ, మార్గదర్శకులనీ అనేది.

మూడో రకంవారికి అన్ని రసాలూ, ఉద్రేకాలూ ఉండి కూడా వారు వాటిని జయించి, ఆ శక్తినంతా లోకోపకారాలైన విషయాలలో ప్రవేశపెడతారు. శాస్త్రం, మతం, కళ మొదలైన వాటిల్లో చాలామంది స్త్రీనీ, స్త్రీ వాంఛనీ మరిచిపోతారు. వీరికే అత్యధికమైన కామశక్తి ఉంటుంది. ఆ శక్తిని లోబరుచుకుని తమ ఇష్టం వచ్చినట్లు తిప్పగలరు. కనకనే మహాత్ములవుతారు. వీరిని అర్థం చేసుకునే శక్తి లోకానికిలేదు. వీరిలో తనకి ఇష్టం కలిగేట్టు ప్రవర్తించేవారిని లోకం వెర్రిపూజలు చేస్తుంది. వ్యతిరిక్తంగా మాట్లాడేవారిని — ఆ మాట్లాడేది లోకాన్నత్యానికీ క్షేమానికీ అయినా సరే — బాధిస్తుంది. కొందరిని ముందు పూజించి తరవాత శిలువ వేస్తుంది. కొందరిని బాధించిన తరవాత హారతెత్తుతుంది. వారు మరణించిన కొన్నేళ్ళకి వారందరినీ అవతార పురుషులని గౌరవిస్తుంది.

వీరిలో కొందరు తమ అద్భుత కామ శక్తిని లోబరుచుకుని కూడా, లేక కొంత వరకే లోబరుచుకుని, స్త్రీ పరంగానే ఉపయోగిస్తారు. వారు తన సుందర ఉన్నత కళాశక్తిచేతా, తాము మోహించిన స్త్రీని రసికత్వం చేతా, ప్రేమ మాధుర్యం చేతా దేవత్వాని కెత్తెయ్యగలరు. ఆ స్త్రీకి తమ కళలోగాని, కవిత్వంలోగాని శాశ్వత కీర్తిని లోకంలో కలిగేట్టు చేస్తారు. కొందరు లెక్కలేని స్త్రీలని, రాజాధిరాజులని లెక్కజేయని శ్రేష్టులైన పతివ్రతలని కూడా ఆకర్షించి వాళ్ళని సంపూర్ణంగా రంజింపచేసి దక్షిణ నాయకులవుతారు.

ఇంక రెండోరకంవారు మిగిలారు. వీళ్ళలో చాలామంది దొంగలు. — నిజమైన వారి వాంఛల్నీ, ఊహల్నీ, కార్యాల్నీ దాచిపెట్టి ఒకటోరకం మూడోరకం మనుషుల్లాగ

కనబడాలని చూస్తారు. వీళ్ళు చెడ్డవనుకొని దాచే వీరి కార్యాలు చాలా సహజమైన ఉత్పత్తికలవని వీళ్ళకి తెలీదు. లోకం విధించే నీతి చట్టాల ప్రకారం పోల్చిచూసుకుని, తమ జీవితాలు అసహ్యాలనీ దాచవలసినవనీ అనుకుంటారు. అసహ్యాలను కోకపోయినా లోకానికి బహిరంగపరచడం ఇష్టంలేదు. తమ ఉద్దేశ్యమే సరైనదనీ, తమ కార్యాలు దాచుకోవలసినవి కావనీ నమ్మినా, బహిరంగపరిచే ధైర్యం లేదు. లోకానికి యెదురు నిలవగల బలంలేదు. నీతిమంతులవలే కనబడే ఉద్దేశ్యంతో దుర్నీతి కూడదని ఉపన్యాసాలిస్తారు. దుర్నీతిలోపడి తెలివి తక్కువగా బైటపడ్డ ఇతరులను క్షమించరు. కరుణని అణచుకుంటారు వారిపట్ల. ఎవర్నన్నా క్షమిస్తారుగాని, బహిరంగంగా చేసేవారినీ, తప్పుకాదనే వారినీ, 'దుర్నీతిపరులు చాలామంది ఉన్నారనీ, పైకి నీతిమంతులవలె కనబడేవారు దుర్నీతిపరులే' అనేవారినీ, సంఘ దురాచారాల్ని బైటపెట్టేవారినీ, తెగించి మోసానికీ, అబద్ధానికీ, తిరగబడేవారినీ వీరు మనస్ఫూర్తిగా ద్వేషిస్తారు. తమ సంఘానికి నమ్మకద్రోహం చేసినవారని వాళ్ళని చెండాడుతారు.

సహజాలైన స్వభావాలను దాచుకునేందుకు వాటిని వీళ్ళు వంకరతిప్పి మురగబెట్టి కల్మషాలుచేసి, కోతిపుండు బ్రహ్మరాక్షసి చేసుకుంటారు. వీళ్ళలో అనేక రకాలు, అనేక వాంఛలు, అనేక దొంగతనాలు. వీళ్ళలో కొందరికి; ఒక స్త్రీకి ఎక్కువ పురుషులు కావాలి. ఒక పురుషుడికి ఎక్కువ స్త్రీలు కావాలి. ఇంటివద్ద రంభవంటి భార్య ఉండగా చూడటానికి రోతగా ఉండే బోగందాని ఇంటివద్ద కావిలి. లోకపూజితుడైన భర్త గడప దాటగానే వంటవాడితో స్నేహం. పురుషుల్ని కోరే పురుషులు, స్త్రీలని కోరే స్త్రీలు. వీరికి అందం, రుచులూ, ఆదర్శాలూ, అనుభవాలూ, అనంతం. రౌడీలూ, కవులూ, అందరూ ఈ జాతివారే. చెల్లెళ్ళనీ, మరదళ్ళనీ, సవతితల్లుల్నీ, మామల్నీ, తండ్రుల్నీ కోరేవారందరూ దీంట్లోవాళ్ళే. తెలివిగలిగి ఈ కార్యాలన్నీ రహస్యంగా జరుపుకుని పైకి నీతులు గట్టిగా బోధించేవారు మంచివారనిపించుకుని బాగుపడతారు. తెలివి తక్కువగా బైటపడి అల్లరిపెడేవాళ్ళు దుర్మార్గులనిపించుకుని చెడిపోతారు. దాచుకుని మంచివారుగా ప్రవర్తించేవారే ఈ తెలివి తక్కువగా బైటపడ్డవాళ్ళనే ముందు బహిష్కరించి దెబ్బతిన్న కాకిని పొడిచి చంపే కాకుల్లాగు అరిచి, బాధపెట్టేది.

వీళ్ళందరికీ ప్రతిష్టాన మహాదేవతా, వీరు రోజూ తప్పకుండా పూజ నైవేద్యాలూ చెల్లించే మహాశక్తి; ప్రతిష్ట మర్యాద. వీర సౌఖ్యం. ఇతరులు వీరిని గొప్పగా తలచడం. ఇతరుల మొహాలు చూసి వాటివల్ల వీరి జీవనాన్ని దిద్దుకుంటూ ఉంటారు. వీరి నీతీ, వీరి పుణ్యమూ, వీరి అంతరాత్మా, అంతా ప్రతిష్ట. ఆ ప్రతిష్టకోసం సకల బాధలూ పడతారు. అతి ఘోరపాపాలు చేస్తారు. మహాక్రూరంగా రాక్షసులవలె ప్రవర్తిస్తారు. ఎంతెంత అన్యాయాలన్నా చేస్తారు. ఇతరులు తమని గురించి చెడ్డగా తలచకుండా ఉండడానికీ, తమ కార్యాలు లోకంనించి దాచడానికీ, మంచికార్యాల

చేతనైనా సరే లోకానికి కష్టం కలగచెయ్య కుండా ఉండడానికీ, వీరిలో తెలివి గల వారు తమ పిరికితనమూ, అబద్ధమూ కప్పిపుచ్చడానికీ, కొత్త ప్రిన్సిపల్సు, కొత్త ఆదర్శాలూ మాట్లాడతారు. కొత్త మార్పు రాగానే "సంఘం, సంఘం, నీతి, నీతి"అని అరుస్తారు. "లోక క్షేమం చూడాలి. ఇతరులకి బాధ కలిగించకూడ"దని ఉపన్యాసాలిచ్చి తమ పిరికితనాన్ని కప్పుకుంటారు. తమని తామే మోసపుచ్చుకోడంలో అగ్రగణ్యులు.

అల్లరి చెయ్యడానికి జీవంలేని మొదటి రకపు బుద్ధిమంతులకంటే వీరు చాల ఉత్తములు. గోలలన్నీ వీళ్ళ మూలానే కనక, వీళ్ళల్లో వీళ్ళకే ప్రతివారికీ తక్కినవారిని చూస్తే చాలా కోపం. తను ఏదో కొంచెం తప్పు దోవలోపడ్డా, 'ఈ తక్కిన వాళ్ళందరికీ ఇదేం రోగం? ఈ అవినీతి? అని ప్రతివారికీ కోపం. అసలు సంఘమే, ప్రతిష్టానదేవతే వీళ్ళని ఇట్లా దొంగలూ, పిరికివాళ్ళూ చేసేది. నిర్మలమైన సృష్టి కోర్కెని, తన నీతి చట్టాలతో అడ్డగించి, వాటిని మీరినవాళ్ళని దండించి చివరికి అపవిత్రం చేస్తుంది. తన ఉన్నతాదర్శాలని స్త్రీల నెత్తిమీద పెట్టి వాటిని వాళ్ళు అనుసరించలేకపోతే ఖండించే దొంగల్ని చేసి, చివరకి దాచి, దొంగలైన వాళ్ళకి గౌరవమూ, బహిరంగ పరుచుకున్న వాళ్ళకి వెలీ ప్రసాదిస్తోంది సంఘం.

యావజ్జీవం ఒకేభార్య, ఒకే భర్త అనేది ఆదర్శం పెళ్ళికి. కాని అది ఆదర్శం కదా అని ఆదర్శానికి తగిన సంస్కారంలేని వ్యక్తులతో కూడిన ప్రజా మొత్తంమీద విధిస్తే ఏం లాభం? పెళ్ళికానీ కాకపోనీ 'ఒక స్త్రీకి ఒక పురుషుడు, ఒక పురుషుడికి ఒక స్త్రీ' అనే ఆదర్శం చాలా ఉన్నతమయినది. మనుష్యులు పరిణామం చెంది, చిత్త సంస్కారం పొంది, ఆత్మోన్నత్యాన్ని పొంది, లోకమంతా ధర్మరాజ్యంగా ఏర్పడితేనే గాని అట్లాంటిది సాధ్యమౌతుందా? ఇప్పుడూ ఉంది ఆదర్శం — విధిలేక కుళ్ళుతో పడివుండే సంసారాలలో. అట్లాకాదు. స్వేచ్ఛగా మనస్ఫూర్తిగా ఇంకా మనసులోనన్నా వేరే కాంక్ష లేకుండా, వుండవలసిన అవసరం లేనంత ఆనందమూ, తృప్తే తమ సంసారంవల్ల పొందుతో, అన్ని అభినివేశాలూ, రసాలూ, భావాలూ, కళలూ, రెండోవారివల్ల సఫలం కావడం, కావించుకోవడం, కాకపోయినా అర్థం జేసుకుని ప్రేమించడం — అదీ ఆదర్శం. అట్లా సంపూర్ణమైన తృప్తిలేనిదే స్త్రీ పురుషులు కలిసివుండడం వ్యభిచారం కాదూ? వెయ్యి మంత్రాలతో ఆశీర్వాదాలతో పెళ్ళి అయినాసరే, అట్లాంటి సంతుష్టి ఈ నిర్బంధ వివాహాలవల్ల కలుగుతోందా? కలుగుతుందా? కలగడానికి ఇది మార్గమా?

ఈ మనుషుల్లో ఒక్క కామమే ప్రధాన గుణమైతే సంఘం తన ఏర్పాట్లని సులభంగా చేసుకోవచ్చు. కాని ఒకరి విషయం ఇంకోరు అర్థం చేసుకోలేని "ఇన్డివిడ్యువల్" (individual) విషయాలు చాలా ఉన్నాయి మనుష్య హృదయాల్లో.

1. అందం.
2. గుణం.
3. మృదుత్వం, శీలం, తెలివి, మాధుర్యం మొదలైన లక్షణాలు.

4. వివిధ క్రీడలు.
5. రసికత్వం.
6. మానసిక సానుభూతి.
7. అర్థంకాని ఆత్మాకర్షణ.

మొదలైనవెన్నో ఉన్నాయి. అనేక జన్మలనించి తెచ్చుకుంటున్నారా ఈ సంబంధం అని ఆశ్చర్యం కలిగేటంత బలమైన పరస్పరాన్వేషణం చూపే వ్యక్తులున్నారు. ఇటువంటివి ఏన్నో భావాలు మనుష్య నిర్మిత సంసారాల్ని నిలవనీక లోపల లోపల, అలలవలె రేపుతున్నాయి. ఇప్పుడే ఏ పురాతన కాలంలోనో రాసేసిన నీతులు ఈ నూతన యుగపు నూతన వ్యక్తుల్ని సంతృప్తి పరచగలవా?

స్త్రీ పురుషులు మార్పుకోరతారు. ఈ విషయంలో కూడా ఎంత మంచి వస్తువైనా మొహమ్మొత్తి తాత్కాలికంగా మార్పు అవసరమౌతుంది. కొందరు పురుషులకి ఒక స్త్రీ ఎక్కువ. కొంతమందికి అనేకులుకావాలి. పదిమందినీ ఏలగలవాడు అంతమందినీ ఎందుకు వివాహమాడకూడదు? అట్లాగే పదిమంది భర్తలు కావలసిన స్త్రీలుంటారు. వాళ్ళెందుకు పదిమందిని పెళ్ళి చేసుకోగూడదు? ఆ స్త్రీ రసికురాలూ, ఉన్నతురాలూ ఐతే, పది మంది పురుషులూ ఒప్పుకుంటారు ఆమెకి భర్తలుగా ఉండడానికి. ఎందుకూ పనికిరాని వెకిలి భార్యని తన కోసమే దాచుకోటంకంటే గొప్ప హృదయం గల స్త్రీని పదిమందితో పంచుకోడమే ఉత్తమంగా తలుచుకునే పురుషులుండరా? స్త్రీ గర్భవతి కావడంచేత పురుషుడికి చాలాకాలం దూరంగా ఉంటుంది. అప్పుడు పురుషులకి వేరే భార్యలుంటేనేమి? స్త్రీకి కామోద్రేకం కలిగిన నిమిషాన ఆమెని ఒక పురుషుడు సంతృప్తిపరచలేకపోవచ్చు. కామవాంఛ తీర్చుకోడం ధర్మమైనప్పుడు ఒక భర్తతో తీరకపోతే నలుగురి నెందు కంగీకరించ కూడదు! అందరు స్త్రీలకీ సమానమైన కామవాంఛ లేదని అందరికీ తెలుసు. ఆ వాంఛ గాఢత్వాన్నిబట్టి, దాన్ని తీర్చగల భర్తనో, భర్తలనో ప్రసాదించవద్దా సంఘం?

"ఈ తుచ్ఛవాంఛల్ని ఎంత అణుచుకుంటే అంత మంచిది, పైగా వాటిని తృప్తిపరుచుకోడానికి ఏర్పాట్లు కూడానా?" అంటారు.

కానీ ఆ కోర్కెల్ని తీర్చుకుంటున్నారా, అణుచుకుంటున్నారా? అణుచుకోడం ఆదర్శమా? ఆదర్శమైతే అందరూ సన్యాసులౌతారా? తీర్చుకోకుండా ఉండలేరు. భోజనం చెయ్యకుండా ఉంటారా? అట్లాంటప్పుడు శుభ్రంగా, నిర్మలంగా, తృప్తిగా తీర్చుకోడం పాపమా?

సహజమైన ఇట్లాంటి కోర్కెల్ని తీర్చుకోవాలంటే సంఘ భయం ఏడిపిస్తుంది ప్రజల్ని. "మార్టీర్సు" (martyrs) కావలసివొస్తుంది. వ్యక్తులు, ఆ ధైర్యం లేనివాళ్ళు, దొంగతనంగా సంతృప్తిపడి, అధములై పోతారు. సంఘమే అర్థహీనమై ఈ ఆజ్ఞల్ని తోసేస్తే, అన్యాయంగా సంఘం పెట్టే ఈ అభ్యంతరాలూ, వెలీ, న్యూనతా లేకపోతే ఒక భర్తతో, ఈ పతివ్రతలెంత గౌరవంగా (పైకి) సుఖంగా కాపరం చేస్తున్నారో తక్కిన వారూ అట్లానే పదిమంది భర్తలతోనూ అంత గౌరవంగా నీతిగా బతకగలిగేవారు కదా?

అట్లా చపలత్వానికీ, ఇంద్రియ

లోలత్వానికీ పాలుపడక, ఇంద్రియ నిగ్రహం కలగడానికి ఇట్లాంటి సంఘ నియమాలుండాలంటారు. అట్లా ఉన్నాయా? పశువులవలె కామం చూపే వారినీ, వేశ్యాలంపటుల్నీ అడ్డుపెట్టిందా సంఘం? తృప్తిపడని ఈ కోర్కెలు గల వ్యక్తులందరూ ఈ ఆజ్ఞాబద్ధులై ఊరుకుంటున్నారా? ఇంద్రియాల్ని వశపరచుకుంటున్నారా? వశపరచుకునే పురుషుల్ని వొద్దనటంలేదు. స్త్రీ తన కామం సంపూర్ణంగా తీరేట్టుగా ఇంకా తన ఆరోగ్యానికి హాని కలిగేటట్టుగా, తన భర్తతో కాపరం చేస్తూ ఉంటే సంఘం అడ్డుపెడుతుందా? కామమూ, ఇంద్రియ లోలత్వమూ, అప్పుడు పతివ్రతా లక్షణాలు. వితంతువుకు కామమున్నదని మరిచిపోలేక పోయినా, అనాకారి భర్తగల స్త్రీ ఒక్కసారి పాపం రూప వంతుడి కాశపడినా సంఘం కస్సుమంటుంది. ఒకడిచేత తృప్తిపడ్డం ఒప్పుకున్న సంఘం నలుగురిచేత ఎందుకు ఒప్పు కోదు? పోనీ సంవత్సరమంతా బ్రహ్మచర్యం చేస్తాను. ఒక్కరాత్రి నలుగురిని ప్రసాదించమంటే ఒప్పుకుంటారా? ప్రతియేటా, కవల పిల్లల్ని కనే ఈ పతివ్రతలకంటే, ఇంద్రియ నిగ్రహం కలదేగా ఆ స్త్రీ! భార్యాభర్తలు ఎన్నిసార్లు ఎంత నీచంగా భోగించినా అంతా పుణ్యకార్యమే! పెళ్ళి కానప్పుడే ఇబ్బంది.

సంఘం ఎంత ఇనప కాలికింద వ్యక్తుల్ని నలపాలని చూసినా లొంగుతారా? వీళ్ళ వాంఛలు అనాదివి. సృష్టి మూల సూత్రాలు. సంఘం లేకుండా సృష్టి సాగుతుంది కాని, ఈ వాంఛలు లేకుండా సాగుతుందా? సంఘం వితంతువుని కురూపిని చేస్తే సృష్టి విధానం ఆమె వెంట్రుకల్ని పెంచుతోనే ఉంటుంది. కళ్ళకీ, చెంపలకీ, మెరుగు పెడుతూనే ఉంటుంది. ప్రతినెలా పురుషాలింగనానికి తయారుచేస్తోనే ఉంటుంది. సంఘం చేతి ఆయుధం ప్రతిష్ఠ. సృష్టి చేతి ఆయుధం వాంఛ. ఈ రెంటికీ మధ్య పడి జీవితాలు తునాతునకలై పోతున్నాయి.

పురుషులు బలవంతులై సంఘనీతికి కట్టుబడకపోవడంవల్ల, వేశ్యాసంఘాన్ని కని పెట్టారు. భార్యపోతే, భార్యని వాళ్ళకి ప్రసాదించారు. అట్లాంటి వాంఛలే తనకూ న్యాయమేనంటే, స్త్రీ నోరు నొక్కారు. కాని అక్కడ ఆగారా, పురుషులు? డబ్బుతోకొనే మోహం వాళ్ళకి తృప్తినియ్యక తామే స్వయంగా హృదయాన్ని ఆకర్షించాలనే ఆశతో, కుల స్త్రీ వెంబడి తిరుగుతున్నారు. సాహసం, రహస్యం, ఇతరుల ఆస్తిని దోచుకోడం ఉంటేనేగాని కొందరికి మోహం రుచించదు. మితిమీరిపోయినారు మనుషులు. తన పురాతన చట్టాలను ఈ నూతన ఉద్రేకాలకి తృప్తిగా మార్చే ధైర్యమూ, శక్తీ సంఘానికి లేవు. ఏం చేస్తుంది? కళ్ళు మూసుకుంది. పెళ్ళి అనే తెరని కప్పేసింది. ఇదివరకు పలచగా ఉన్నదాన్ని మందంచేసి ఏమీ కనబడకుండా చెయ్యడానికి ప్రయత్నం చేసింది. పెళ్ళయిన తరవాత ఏం చేసినాసరే, అట్టే గోలపెట్టడం మానేసింది. సంఘం పెట్టే పవిత్ర మంత్రం పెళ్ళి. ఆ రక్షరేకు కట్టిందా ఇంక మైలలేదు. పెళ్ళి అయిన స్త్రీ బిడ్డని కంటే, ఎవరి బిడ్డ అని సంఘం ఆట్టే యోచించదు. భర్త వ్యర్థుడని లోకానికంతా తెలిసినాసరే. సంఘం ముద్ర ఉందిగా? పెళ్ళికాకపోతే, నిర్మలంగా ఉన్నా తప్పే, ముఖ్యంగా స్త్రీకి.

జెలసీ

మోహం మనుషుల స్వాధీనంలో లేదనీ, 'మోహించ'మని గానీ 'మోహించకు' అనిగానీ అనడం హాస్యాస్పదమనీ, శరీరాన్ని ఇంట్లో కట్టినా మనసు ఆగదనీ తెలీక పోవడం చేతనే మనుషులకు "జెలసీ" ఉంటుంది. ఇది దంపతులు ఒకరు రెండో వారి ఆస్తి అనే భావంవల్ల కలిగిన అవస్థ. తనని రెండోవారు ప్రేమించడం మాని నందుకు బాధా, విచారమూ సహజమే. స్త్రీ ఇంకెవరినీ మోహించకుండా తనని మోహించడం మానినా సహిస్తాడు. కానీ ఇంకొకరిని మోహించగానే అతనిమీద "జెలసీ" వస్తుంది. తనని మోహిస్తో ఇంకొకరిమీద కొంచెంగా మోహం చూపినా ఈ "జెలసీ" తప్పదు. అప్పుడు బాధ ఇంకా ఎక్కువ. ఆమె మోహించిందా, ఇతని మోహమంతా ద్వేషంగా మారుతుంది. ఆమె కష్టాలు పడ్డకొద్దీ ఇతనికి సంతోషం. ఇది పశుత్వం. మొగ కుక్కలు ఆడకుక్కలకోసం పోట్లాడిన తత్వం ఇంకా మనుషుల్లో నివసిస్తోంది. దీని వల్లనే తగాదాలూ, కొట్టుకోడాలూ, నరుక్కోడాలూ జరుగుతో ఉంటాయి. స్త్రీ స్వేచ్ఛకి, ముఖ్యమైన ఆటంకం ఇదే.

ప్రస్తుతం "జెలసీ" నించి తప్పించుకోగల మనుషులు చాలా తక్కువమంది. 'జెలసీ' లేనప్పుడు మోహం లేదన్నమాటే. "జెలసీ" ఉంటుంది, బాధ తప్పదు. కానీ ఈ జెలసీతోటి మాత్రం రెండోవారి మోహానికి ఆటంకాలు కల్పించడంకానీ, హానీ చెయ్యడంగానీ నీచమైనపని. "జెలసీ" అనేక భావాలనించి కలగవొచ్చును. ఇవి:

1. తన స్త్రీని తాను ఎంతో విలువగా చూసుకుంటో, ఇతరుల స్పర్శవల్ల అపవిత్రమవుతుందనేది ఈన్తటిక్ అభిప్రాయం. ఇది తప్పు అభిప్రాయమే, కాని కొంచెం ఉన్నతం.

2. స్త్రీ తన ఆస్తి. ఇతరులు దాన్ని తాకకూడదు.

3. తనకి ఆమె ఇవ్వగల మోహం తగ్గుతుంది.

అది న్యాయమే. కాని కొందరు సమానమైన మోహంతో ఇద్దరినీ, ఎక్కువ మందినీ మోహించగలరు మరి! ఇటువంటి భావం పురుషుల్లోనే కాదు! స్త్రీలు కూడా పురుషుల్ని తమ స్వంతమనుకుని వారితరులని తాకినప్పుడు, జెలసీతో బాధపడతారు. కానీ ఆ బాధ వాళ్ళ హృదయాల్ని తినేసి అక్కడే ఆగుతుంది. వారికి పురుషులమీద అధికారం లేకపోవడం వల్లా, వేరు గతి లేకపోవడం వల్లా నిస్సహాయులై లోపలే అణుచుకుని ఊరుకుంటారు. చేతనైనంత వరకు చూపుతారు.

స్త్రీ పురుష సంబంధం ఉన్నతమై, మోహం నిర్మలమూ, అధికమూనై ప్రేమగా మారితేగాని ఈ జెలసీపోదు. స్నేహితుడు ఇంకోడితో స్నేహంచేస్తే బాధపడతామా? పడ్డప్పుడు బుద్ధిహీనత అనుకోడూ? మోహంపోయిన తరువాత ఈ శరీరం దాచి పెట్టుకుని ఏం లాభం? "నన్నే మోహించు అనడమంత హాస్యాస్పదం లేదు" — అనే భావమే రాలేదు ప్రజలలోకి. "జెలసీ" నీచమని తెలీదు ఇంకా.

వివాహ బంధం

కొపురం మొదట్లో భార్యాభర్తలకి ఒకరిమీద ఒకరికి చాలా ఇష్టం ఉంటుంది, మోహంలేని వారికి కూడా. అది యవ్వనపు కామం. ఆ కాలంలో ఎటువంటి స్త్రీ పురుషులూ రెండోవారికి దేవతలవలె కనపడతారు. ఆ కొత్తనే, ఆ కామోద్రేకాన్నే మోహమనీ, విపరీతమైన ప్రేమ అనీ భ్రమపడతారు. ఎన్నటికీ పొదనుకునే ఆ ఆకర్షణ సాధారణంగా ఒక సంవత్సరంలో చల్లబడుతుంది. ఇట్లా చిత్త సంస్కారమూ, ఆత్మాభివృద్ధీ, మనో ఔన్నత్యమూ లేని సాధారణ దంపతులు పగలూ, రాత్రీ ఒకరినొకరు చూసుకుంటో ఉంటే మరీ త్వరగా నశిస్తుంది ఆ ఆకర్షణ. వివాహం రాక్షసమైన నిర్భంధమని వెంటనే అర్థమౌతుంది, హృదయమున్న వాళ్ళకి. రొమాన్సూ, సౌందర్య పిపాసా, సంస్కారమూ లేని ప్రజలు, పిల్లల్ని కనడమూ మంచి కూరలు తినడమూ కన్న ఎక్కువ ఆనందం స్త్రీనించి వస్తుందని తెలీని మానవులు, ఆ సంసారంలో ఏ అసంతుష్టినీ ఎరక్క స్థిరపడతారు. కానీ తక్కినవారికి వెంటనే అర్థమౌతుంది — పూర్వం తానను భవించినది తాత్కాలిక కామమని. జీవితంలో ఒకరినొకరు వదలమనీ, అన్ని జన్మాలలోనూ వారిద్దరే భార్యాభర్తలు కావాలనీ, చేసుకున్న వాగ్దానాలు తలుచుకుంటే ఇప్పుడు నవ్వూ, సిగ్గూ కలుగుతాయి.

రాత్రులు మాత్రమే గదుల్లో అలంకరించుకుని కనబడ్డంవల్లనే మొదట్లో ఒక సంవత్సరమన్నా నిలుస్తుంది ఆ భ్రమ. మనుషులుండే ఈ ప్రస్తుత స్థితిలో ఈ మోహం లేకుండా కట్టేసే ఈ వివాహాలు అమలులో ఉన్నంతకాలం, ఇట్లా ఆకర్షణ కొద్దికాలంలో నశించడం చాలా సహజం. కాని కొంతమందికి, ఆ స్త్రీలలో అధికాకర్షణ ఉండడం మొదలైన కారణాలవల్ల ఈ మోహం చాలాకాలం నిలవవచ్చు. కానీ అది సకృతు. మొదటనే ఆకర్షణ లేక, యవ్వన కామం తప్ప ఇంకేమీ సంబంధంలేని వారికంటే, ఇతర విషయాల్లో కలిసి ఏరికోరి చేసుకున్న వివాహాలు ఎక్కువకాలం ఆనందదాయకాలుగా ఉంటాయి. అట్లా రాత్రులు మాత్రం చూసుకోక, పశ్చిమ దేశస్తులవలె రాత్రింబవళ్ళు భార్యాభర్తలు కలిసి తిరుగుతో ఉంటే, మూడు రోజుల్లో ఒకర్ని చూస్తే ఒకరికి అసహ్యం పుడుతుంది ఈ దేశంవారికి. కానీ మోహంతో కోరి పెళ్ళిచేసుకున్న దాంపత్యానికి కూడా కొన్ని కారణాల వల్ల విఘాతం రావచ్చు. సాధారణంగా వస్తుంది.

1. పెళ్ళి అయిన తరవాత ఒకరి సంగతి ఒకరికి తెలిసి అదివరకున్న మాయ ఆకర్షణ పోవచ్చు.

2. ఏ రూపాన్నో, గుణాన్నో మోహిస్తే అది పోగానే మోహంపోవచ్చు.

3. మనుష్య స్వభావంతో, వయస్సుతో మోహం కూడా మారవచ్చు. ఇద్దరిలో ఒకరు అభివృద్ధి చెందితే వారి అభిప్రాయాలు మారి ఆకర్షణ తగ్గవచ్చు.

4. తాము వివాహం ఆడిన వాళ్ళకంటె తాము ఎక్కువగా మోహించదగిన వారిని కలుసుకుంటే వెనకటి మోహం మాయం కావచ్చు.

5. భార్య భర్తమీద ఆర్థికంగా ఆధారపడటం, భర్త ఆమెమీద నిరంకుశాధికారం చెయ్యడం, ఒక ముఖ్యమైన కారణం.

6. ఇద్దరూ కలిసి ఉండి పాతపడడం, అన్నిటి కన్నా ముఖ్యమైన కారణం. పెళ్ళి కాగానే ఒకరినొకరు ఆకర్షించడం మానేస్తారు.

మోహం పోయినా, పోయిందని చాలా మందికి తెలీదు. తెలిసినా వప్పుకోరు. అంత రాత్మలోనూ వప్పుకోరు. చాలామందికి పోవడానికి మోహమే ఉండదు. తిండి కడుపు నిండా దొరుకుతున్నన్నాళ్ళూ, చీరెలూ నగలూ ఉన్నన్నాళ్ళూ స్త్రీకీ: అభ్యంతరం లేకుండా కామేచ్ఛతీరి వేళకి భోజనం లభిస్తున్నన్నాళ్ళూ పురుషుడికీ, లోకమంతా చక్కగా జరిగిపోతున్నట్టే ఉంటుంది. ఒకరినొకరు వదలడానికీ వప్పుకోరు. వదుల్తామన్నా సంఘం వప్పుకోదు. మోహం ఉన్నా లేకపోయినా భార్యభర్తలు ఒక కాపరంగా ఉంటే సంఘానికి చాలా ఉపయోగం. శ్రమ ఉండదు. సమస్యలుండవు.

మోహమే పెళ్ళికి ప్రధానమనీ, పెళ్ళి అనేది మోహం ఉన్నప్పుడు సంఘం ముందు స్త్రీ పురుషులు చేసుకునే ఒడంబడికగాని ఇంకెన్నడూ ఏమైనా వదలని అతుకు పిశాచం కాదనీ, పెళ్ళి మంత్రాలు మోహాన్ని కల్పించి శాశ్వతంగా ఉంచలేవనీ, మోహం పోయినతర్వాత భార్యనీ భర్తనీ భయపెట్టి ఒక ఇంట్లో ఉంచి పిల్లల్ని కనేట్టు చేస్తున్న సంఘం బలవంతంగా సంసార వ్యభిచారాన్ని జరిపిస్తో ఇన్ని పవిత్ర వ్యభిచార గృహాల్ని శాశ్వతంగా నెలకొల్పినట్టేననీ గ్రహించే స్థితికి సంఘం అభివృద్ధి పొందాలి.

ఇంక 'వివాహ సంస్కారం' ఈశ్వరుడే చేస్తున్నాడు. మోహంపోతే, అది మనుషుల లోపం. కనక ఒకరినొకరు వదలడం పాపమంటారు. ఈ వివాహం ధర్మమనీ, దాన్ని అతిక్రమించడం అధర్మమనీ అంటారా?

పూర్వం రాజులు విష్ణుయొక్క అవతారాలనీ, వాళ్ళనీ ఎదిరించడం పాపమనీ అనుకున్నారు. ఆ విష్ణులందర్నీ పరరాజులు ఓడించి దిక్కులేకుండా తరిమారు. ప్రజలే ఎదిరించారు. ఆ రాజులకి అంతటితో ఆపిచ్చి వదిలింది. కులాలు బ్రహ్మదేవుడి దగ్గిర్నించి పుట్టాయి, అవి ధర్మాలన్నారు. ఆపిచ్చిన్నీ వదిలింది. చాలా మట్టుకు కులాలు ధ్వంసమవుతో ఉంటే ఆ బ్రహ్మ చూస్తూ ఊరుకున్నాడు.

ఈ సంసారం ఈశ్వరుడేర్పరిచాడనే భావం ఇంకా వదల్లేదు. స్త్రీలలో ప్రబోధం హెచ్చాలి. ఈ భర్తలేమీ దేవుళ్ళు కారనీ, సంసారాలేమీ శాశ్వతంగా ఈశ్వరుడేర్పరచలేదనీ, ఇవన్నీ అబద్ధాలనీ, ప్రతి స్త్రీకీ తెలుసు. నీతులూ, పురాణాలూ ధర్మాలూ బోధించే దొంగల నోళ్ళల్లో తప్ప ఈ సంసార పవిత్రత లోకంలో ఎక్కడాలేదు.

మోహమే వివాహాని కాధారం కనక, భార్యాభర్తలలో ఒకరికైనా మోహం తగ్గిపోగానే, వివాహబంధం దానంతట అదే తెగిపోతోంది. మోహం ఎందుకుపోయిందో, ఎప్పుడు పోయిందో నిర్ణయించుకోవడం ఆ పోయిన వారిలోనే ఉంది. వారి నడగడం, హాస్యాస్పదమని గ్రహించే స్థితికి ప్రజలు రావాలి. విడిపోయి తరువాత మళ్ళీ ఇతరులని మోహించే అధికారం ఉండాలి. మోహిస్తోనే ఉన్నారు, కాని ఒప్పుకోరు.

ఇట్లాంటి ఏర్పాటువల్ల లాభాలు:

1. అప్పుడు జరిగే దొంగ వ్యభిచారాలు చాలావరకు తగ్గుతాయి.

2. ఇష్టం లేనివాళ్ళు ఇద్దరు కలిసి ఒక ఇంట్లో ఒక మంచంమీద కాపరం చెయ్యడంవల్ల కలిగే తగాదాలూ, బాధలూ, అసహ్యాలూ అన్నీపోతాయి.

3. భర్తలు భార్యలమీద చేసే అక్రమమైన అధికారం, భార్యలకుండే మనోబాధా, వేదనా పోతాయి.

4. ఇతరుల మీద మనసుని పెట్టుకుని పడే వ్యధ పోతుంది.

5. మోహం పోతే రెండోవారు వొదిలేస్తారేమోనని ఇప్పటికంటే స్త్రీ పురుషులు ఎక్కువ జాగ్రత్తగా ప్రవర్తిస్తారు.

ఇట్లాంటి ఏర్పాటువల్ల కలుగుతాయనుకునే నష్టాలు:

1. మాటి మాటికీ చిన్న చిన్న పొట్లాటలవల్ల ఒకరినొకరు ఒదిలేసి ఇతరులతో కాపరం, ఏర్పరచుకుంటారు. అపవిత్రత ఎక్కువౌతుంది. రోజుకో భార్యా భర్తనా?

జవాబు: నిజమైన మోహమున్నచోట చిన్న చిన్న పొట్లాటలవల్ల లేచిపోరు. లేచిపోయినా, మళ్ళీ కలుసుకుంటారు. మోహం పోతే, పొట్లాటలేకుండానే లేచిపోవడం నయంకదూ? అదీగాక, స్వేచ్ఛనియ్యటంతోటే, ఒకరినొకరు వదిలేసి లేచిపోతారనే పవిత్రవంతుల అభిప్రాయం వల్లనే తెలుస్తోంది ఈ కాపరాలు ఎంత దృఢమైనవో. ప్రజలు ఈ కాపరాలవల్ల ఎంత ఆనందం అనుభవిస్తున్నారో! భార్యాభర్తలకి ఒకర్ని చూస్తే ఒకరికి ఎంత రోతగా ఉండాలి, అట్లా దూరంగా పరిగెత్తడానికి? అట్లా సహజంగా పారిపోయేవాళ్ళని కట్టివెయ్యడమా ఈ పవిత్రమైన వివాహం చేస్తున్న పని!

వివాహం మనుష్యులలో ఏ విధంగా మొదట్లో ఏర్పడ్డదో తెలిస్తే మొదటినించీ జంటగా ఏర్పడ్డం వాళ్ళ స్వభావంలోనే ఉన్నదనీ, అస్వభావికమైన ఈ వివాహ ఆటంకాలు తీసివేసినా, ఒక స్త్రీ, ఒక పురుషుడూ ఒకరినొకరు వాంఛించుకుని ఎడబాయరనీ, అనురాగం మనుషుల్లోంచి పోయేది కాదనీ తెలుస్తుంది. కొన్ని పశువులూ, పక్షులూ కూడా జంట అలవాటు చేసుకుంటాయి. కానీ ఆ జంటని అతుకు పిశాచం పనిచెయ్యక తెలివిగా వాటి జీవనాలకీ, కార్యాలకీ, అనుభవాలకీ ఉపయోగపడేట్టు చూసుకుంటాయి. ఆ తెలివి ఈ మనుష్యులకి లేదు. మోహం లేకుండా బలవంత వివాహాలు చెయ్యడంవల్లా, స్వచ్ఛమైన ఈ మిథునానురాగంతో ధనమూ, మర్యాదా, నీతీ మొదలైన భావాల్ని కలిపి, సంఘం అధికారం చెయ్యడంవల్లా, ఒకరినొకరు వొదిలి, ఇతరులని పొందాలనే ఈ అస్వభావిక కాంక్ష బైలుదేరింది. మనుష్య హృదయంలో నిర్వ్యాజంగా కలిగే ప్రేమా, కృతజ్ఞతా, సత్యమూ, విశ్వాసమూ, ఆనందమూ — వీటివల్ల ఏర్పడ్డది సృష్టి ఆకర్షణ. మతమూ, మూర్ఖమూ, నీతీ, అనుమానమూ, నిర్భంధమూ, వీటివల్ల ఏర్పడ్డది — ఈ వివాహబంధం.

స్వేచ్ఛగా ఇంక ఏ అభిప్రాయమూ ఉంచుకోక, కామేచ్ఛతో 'ఇన్‌స్టింక్ట్' ప్రకారమే ఏరికోరి పెళ్ళి చేసుకున్నా, ఇంతకన్నా చాలా సుఖంగా ఉంటాయి కాపరాలు. తమ స్వభావాన్ని విరిచి, కట్టి, అణిచి, రోగిష్టుల్నీ, మూర్ఖుల్నీ, ధనంకోసం, కులంకోసం, బంధుత్వంకోసం ముసలమ్మల కోసం పెళ్ళిళ్ళు చేసుకుని, ఆ మురుగునీ, అసహ్యాన్నీ ధర్మమనీ, సంస్కారమనీ, ఈశ్వరేచ్ఛ అనీ, పవిత్ర వివాహమనీ — ఈ పేర్లతో కప్పుతారు. జీవనానికల్లా ముఖ్యమైన ఈ కార్యాన్ని ఇంత దురుపయోగపరచి, పైగా స్వేచ్ఛనీ, ధైర్యాన్నీ, సౌఖ్యాన్నీ, ఆరోగ్యాన్నీ బోధిస్తే — "ఛీ, ఇదేమిటి పశుత్వం! మృగాలకంటే ఆధిక్యం ఏముంది?" అంటారు. మృగాలకున్న తెలివి

ఉందా వీరికి? మృగాలకన్న అధికం వీరు నేర్చుకున్నదల్లా భీరత్వమూ, క్రూరత్వమూ .... ఇంతేగా!

2. తండ్రో తల్లో తరచూ మారుతోంటే పిల్లలు అవస్తపడిపోతారు. వారిమీద ఎవరికీ బాధ్యత ఉండదు. వారి అభివృద్ధికి భంగం కలుగుతుంది.

జవాబు: పిల్లలున్న దంపతులు సాధారణంగా విడిపడరు.

అయిష్టంతో తగాదాపడే తల్లిదండ్రులతో పెరగడం పిల్లలకి చాలా చెరుపు. పోట్లాడే ఇద్దరికంటే శ్రద్ధతో చూసే ఒకరు నయం.

తల్లికి బిడ్డమీద ప్రేమ చాలా బలీయమయింది. ఎందరు భర్తలు మారినా తల్లి తన పిల్లల్ని నిర్లక్ష్యం చెయ్యదు.

తండ్రో, తల్లో లేక ఇద్దరూనో చచ్చిపోతే, ఏం చేస్తున్నారు? తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకుంటే పిల్లలగతి ఏమవుతుంది? తండ్రి మారడం కంటే తల్లి మారితేనే పిల్లలకెక్కువ నష్టం. పిల్లల క్షేమమే సంఘం విచారిస్తే, తల్లులు మారు పెళ్ళిళ్ళు చేసుకోనీయవచ్చును గానీ, తండ్రుల్ని చేసుకోనీకూడదు.

ఆర్థికంగా స్త్రీ స్వతంత్రురాలైతే ఈ సమస్య అసలు ఉండనే ఉండదు, తన పిల్లల్ని తనే పోషించుకుంటుంది.

ఇంక ఆస్తి తగాదా: ఏ భర్త దగ్గిర పిల్లల్నికంటే, ఆ భర్త ఆస్తికి ఆ పిల్లలు హక్కుదారులవుతారు.

3. ఒకరు మోహంలేక వెళ్ళిపోతే, మోహం ఇంకా పోని రెండో వారికి బాధగా ఉంటుంది.

జవాబు: పడివుంటే మోహం పోయిన వారికి బాధగా ఉండదూ?

4. వివాహమప్పుడు ఒకరినొకరు చేసుకున్న వాగ్దానాలు నిలుపుకోవాలి కదా?

జవాబు: పెళ్ళి ఈడుకి చాలామంది ఆ వాగ్దానాలని అర్థం చేసుకునే స్థితిలో ఉండరు.

ఆ భాష అర్థంకాదు. అందులో గుడ్డిగా ఏకరువు పెట్టేవాడినోట్లోంచి వచ్చే ఆ మంత్రాలు అసలు ఏ భాషో ఎవరూ తెలుసుకోలేరు. అర్థమై మనఃపూర్వకంగా చేసినా, ఆ వాగ్దానాలని బట్టి మోహం పోయినా అక్కడే పడివుండమనడం రాక్షసం. మోహం సంగతి అర్థమైన వాళ్ళెవరూ అట్లాంటి వాగ్దానాలని చెయ్యరు. డబ్బుతోకాదు హృదయంతో పని.

తనకి ఇష్టంలేని పనిని చేస్తాననడమే కాకుండా, దాన్ని ఇష్టంతో ప్రేమతో చేస్తాననీ, ఆజన్మాంతమూ చేస్తాననీ, ఎవరన్నా అన్నారంటే వాడు పిచ్చివాడనుకుంటాము. ప్రమాణాలు చేసుకున్న స్నేహాలు తగలపడిపోవడం ప్రతిదినమూ మనం చూస్తున్నాము. తానెరగని కుర్రవాణ్ణెవణ్ణో ప్రేమిస్తాననీ, అతను చెప్పిందల్లా ఇష్టంగా చేస్తాననీ, వాడు ఎట్లా తయారైనా ప్రేమించి అతన్ని గౌరవిస్తాననీ వొప్పుకోడం కంటే పిచ్చి ఇంకేదన్నా ఉంటుందా? అట్లాంటి అజ్ఞానపు వాగ్దానాన్ని పట్టుకుని దాన్ని అనుసరించి తీరాలని యావజ్జీవం బంధించడం కంటే క్రూరత్వం ఉందా? ఒకమూల ఏడుస్తున్న పిల్లని ఇవతల బ్రహ్మాస్త్రతుల్యాలైన ప్రమాణాలతో అందరు దేవుళ్ళనీ ఆహ్వానించి పెళ్ళి బంధంలో అంటకడతారే!

వివాహం చాలా ఉత్తమమూ, ఆనందకరమూ అని చిన్నపిల్లల్ని బోనులో మిఠాయి పెట్టి పిలిచినట్టు పిలిచి, మోసపుచ్చి, నమ్మి లోపలికి రాగానే బోను తలు

పులు వేసి, "జన్మమంతా అంతే, ఇంక విడుదల లేదు" అనడం ఎవరుచేసే పని! చిన్నవాళ్ళకీ అనుభవం లేనివాళ్ళకీ ఏం తెలుసు? పెళ్ళి చేసుకుని, కష్టపడి, దాంట్లో పడి తన్నుకుని, వదిలించుకోలేక ఏడ్చి పైకి మాత్రం ఏదో సుఖం అనుభవించినట్టే నటించి, తక్కిన చిన్నపిల్లల్ని మళ్ళీ ఆ లీలలో పడవేసి సంతోషించడం పైశాచికం. దేశం మీదా, తోటి ప్రజలమీదా, చిన్న పిల్లలమీదా ప్రేమగలవారు చేసే పనికాదు.

వివాహ బంధానికి రెండు ఆధారాలు:

1. మోహము.
2. విధీ, లేక సంస్కారము.

మోహమే వివాహానికి ఆధారమంటే మోహంపోగానే వివాహబంధం తెగుతుం దనే అభిప్రాయాన్ని వొప్పుకోవాలి. హిందూ సాంప్రదాయంలో వివాహం సంస్కారం. వ్యక్తి స్వాతంత్ర్యానికీ, మోహానికీ, చోటు లేదు. స్త్రీకి భర్త సేవా, పతిభక్తీ, పాలి వ్రత్యమూ చిన్నప్పట్నించి బోధించి ఆ భర్తలో సహజంగా లేనప్పటికీ, తన ఆరాధన చేత ఔన్నత్యాన్నీ, ప్రతిభనీ ఆమె కల్పించు కునేటట్టు చేసి సంసారాలు నిర్విఘ్నంగా సాగేటట్టు చేశారు. ఎందుకు భర్తని పూజి స్తోంది? విధి గనక. భార్యాధర్మం గనక. అది మత సాంప్రదాయం. ఈ అభిప్రాయం చెదరకుండా ఉండేందుకే. తక్కిన నీతులన్నీ స్త్రీపట్ల లోపంచేసి, భర్త భక్తి నొక్కదాన్నే ప్రధానం చేశారు. భక్తికీ, విధికీ, మోహానికీ, కామానికీ, సంస్కారానికీ, మతానికీ, ధర్మా నికీ భేదమేమీ తెలీదు స్త్రీకి. అన్నీ కలిపి భర్తమీద భక్తి. కామమూ భక్తే. వాంఛా సంస్కారమే. ఇట్లా ఏకమైనాయి. ఈ పద్ధతి ఆ కాలానికి సరిపోయింది. "భర్తని పూజిం చడం ఎట్లా స్త్రీకి ధర్మమయింది?" అని అడిగితే 'రుషులు విధించారు కనక, శాస్త్రాలు అలా చెపుతున్నాయి కనక' అని జవాబు! ఆ రుషులలోనూ, శాస్త్రాలలోనూ, గుడ్డిభక్తి ఉన్నన్నాళ్ళు జరిగింది ఆ పద్ధతి. కానీ ఈ కాలంలో తక్కిన విషయాలన్నింటి లోనూ శాస్త్రవచనాలు ఎలా చులకనై నాయో, ఎలా కొత్త అభిప్రాయాలు అమలు లోకి వచ్చాయో, ఈ విషయంలోనూ అంతే అయింది. శాస్త్రవచనాలలో నమ్మకమున్న న్నాళ్ళూ కులభేదం నిర్విఘ్నంగా సాగలా? ఇప్పుడేమయింది? శాస్త్రవిధానం ఈ కొత్త యుగంలో అన్యాయంగా తోచి తిరగబడు తున్నారు. అలాగే స్త్రీలూనూ. ఇంక దేశోద్ధార కులూ, దేశభక్తులూ ఎంత తన్నుకుని పెనుగులాడినా పూర్వపు పరిస్థితులురావు. ప్రకృతి జ్ఞానమూ, స్వతంత్రాభిలాషా, మూఢ విశ్వాసం లేని శాస్త్ర పరిశోధనమూ, భర్త దైవమనడమూ, ఈ మాటలు చాలించి, స్త్రీ స్వాతంత్ర్యము తెచ్చిపెట్టే సమస్యలని ధైర్యంగా అంగీకరించి ఆలోచించేందుకు ప్రయత్నిస్తే మంచిది.

శాస్త్రంలో మూఢనమ్మకం, ముందు పురుషుల్లో పోయింది. కాని అట్లాంటి నమ్మకం తన స్త్రీకి కూడాకలగడం పురుషు డికి ఇష్టంలేదు. కనక ఆమెని మూఢత్వంలో అదుపు ఆజ్ఞలలో ఉంచాలనే అతని ప్రయత్నం. ఎందుకు? ఆమె శాస్త్రాలలో నమ్మకం పోయిందో తనని పూజా పీఠం నించి కిందికి ఒక తన్ను తంతుందని భయం. తాను తన స్వతంత్ర శక్తిచేత గౌరవం సంపాయించుకోవలసి వస్తుంది. కనక ఇప్పటివలె ప్రతి నీచుడూ భర్త ఐనంత మాత్రం చేత భార్యనించి సేవ పొంద గలడా? అసలు భార్యగా ఉంటుందా?

ఇప్పుడెందుకు దంపతులు విచ్చల

విడిగా ఉండక ఏకపత్నీవ్రతులై పతివ్రతలై ఉన్నారూ అంటే,

1. అలవాటు
2. భయం.
3. మర్యాద.
4. ఇంకొకరిచేత ఆకర్షించబడే గుణాలూ, రసికత్వమూ లేక పోవడంచేత.

ఈ కాలంలో నమ్మకమైన భర్త ఎటువంటివాడు? ఇతర స్త్రీలెవరూ అతన్ని వాంఛించనివాడు. ఇతర స్త్రీలచేత ఆకర్షింపబడనివాడు. ఏ స్త్రీలూ కోరనంత అధముడు, అతని భార్యకి మాత్రం పనికి వొస్తాడా అప్పుడు? అతనితో తృప్తిపడితే భార్య ఎంత అధమురాలై ఉండాలి? ఇంక ఇతర స్త్రీలచేత ఆకర్షింపబడలేనివాడు భార్యచేత ఆకర్షింపబడగలడా? అందం చూసే రసికత్వమేలేదు. భార్య విషయమూ అంతే.

ఎటువంటి భర్త కావాలి? తమకి అతను కావాలని ఇతరులు కోరతగినవాడూ, ఇతరులచేత ఆకర్షించబడేవాడూ, ఆకర్షింపబడికూడా వాళ్ళ వెంట పోనివాడూ కావాలి. వరూధిని అందం చూడలేని ప్రవరాఖ్యుడు ఎవరి అందమూ చూడలేడు. తన భార్య అందమూ చూడలేడు. తన అందం గుర్తించని భర్తని ఎంతవరకు మెచ్చుకుంటుంది భార్య? వరూధిని అందం గుర్తించి నిగ్రహించుకునే ప్రవరాఖ్యులు ఉత్తములు అంటారు. భార్యలో తప్ప ఇతరులలో ఆకర్షణ తెలుసుకోలేనివాడు ఉత్తముడు అంటారు. అది అసంభవం. అందంవల్ల ఆకర్షింపబడి, దానిని అంతా తనదిగానే చేసుకోవాలనీ, తనే మింగాలనీ చూడక, దూరంనించి ఆకాశాన్నీ, సముద్రాన్నీ చూసినట్టు చూసి వదిలిపెట్టగలవాడు కావాలి. అట్లా మనుషులు పరిణామం చెందడానికి ఎన్ని వేల ఏళ్ళు పడుతుందో!

కానీ సంఘ చట్టాలు మాత్రం మనుషులు అప్పుడే అంత ఉన్నతులైనట్టూ, దేవతలుగా రుషులుగా మారినట్టూ అనుకుని, మనుషులకి చేతగాని, వారి స్వభావాలకి విరుద్ధాలూ అతీతాలూ, అయిన నిగ్రహాలని విధిస్తున్నాయి.

అదీగాక ఒకరు రెండోవారిని లోకంలోని సమస్త ఇతర సౌందర్యాల్నీ, గుణాల్నీ, ఆకర్షణనీ, మరిచిపోయేటంత భ్రమింపచెయ్యాలి. అప్పుడే ఉత్తమ దాంపత్యం ఏర్పడుతుంది.

మోనాగమీ

పెళ్ళి అంటే ఒక స్త్రీ — ఒక పురుషుడు యావజ్జీవమూ కలిసికాపరం చేసే ఏర్పాటు. ఈ పెళ్ళి సంస్థ అవసరం, ప్రస్తుతం మానవ స్వభావంలో చాలా లోతుగా నాటుకుని ఉంది. ప్రస్తుత నాగరికత కుటుంబ పద్ధతి మీద ఆధారపడి ఉండడంచేత, కుటుంబం అనేది లేకపోతే లోకమే లేనట్టు కనపడుతుంది మనుషుల మనసులకి — అదీగాక —

1. మోహం కలిగినప్పుడు ఒకరు ఇంకొకరితో చాలా కాలం ఒకే చోట అన్నిటిలో కలిసి మెలిసి జీవించాలనే కోర్కెవల్ల.
2. తక్కినవారికి గాకుండా తమకే తమవారనే సంతుష్టితో బతకాలనే కోర్కెవల్ల.

3. ఒకరి బాధ్యతలు ఒకరు, ఒకరి కష్ట సుఖాలు ఒకరు, ఒకరి జాగ్రత్తలు ఒకరు, తీసుకోగలరనే ఆశవల్ల.

4. ఒంటరితనం భయం కావడంవల్ల.

5. తన వారనే వారు ఒకరుండాలనే తపనవల్ల.

సంసారం ఇంత గట్టిపట్టుగా ఉంది మనుషుల్లో.

పురుషుడికన్న స్త్రీకి సంసార అవసరమూ ప్రాముఖ్యమూ ఎక్కువ; ఎమోషనల్ (emotional)గా, ఆర్థికంగా, పిల్లల కోసమూనూ. అందువల్లనే రాజ్యాలు మారడం, విప్లవాలు, మతధ్వంసం వొప్పుకుంటారుగాని కుటుంబం విచ్ఛేదం అంగీకరించరు. కానీ కాలం మారింది. సంసారం నిలబడడానికి తన స్వేచ్ఛ నర్పించుకున్న స్త్రీ తన యుగాల నిద్రలోంచి మేలుకుంది. దేశశాంతివల్ల పురుషుడి రక్షణ స్త్రీకి అనవసరమయింది. దేహబలానికి, ప్రాబల్యం తగ్గి జీవితం ధనంమీదా, తెలివిమీదా ఆధారపడడంవల్ల స్త్రీ ఆ ఉద్యమానికై ప్రయత్నించి స్వేచ్ఛని పొందడం నేర్చుకుంటోంది. పిల్లల్ని కనకుండా వీలిచ్చే పద్ధతులు చేతిలో చిక్కాయి. కమ్యూనిజం మొదలైన పద్ధతులు స్త్రీకి రాజ్యాంగంలో ఆర్థికంగా సంపూర్ణ వ్యక్తిత్వమిస్తున్నాయి. కనక సంసారం ఘోరమైన కొద్దీ పురుషులకైనా స్త్రీలకైనా సంసారమిచ్చే సుఖాలూ, హామీలు, వీళ్ళూ, స్నేహాలూ, కావాలి. కానీ బాధ్యతలూ, బాధలూ, బంధాలూ అయిష్టం. సుఖాల కోసమే బాధల్ని అంగీకరిస్తారు.

కానీ సుఖాలు తక్కువై, వికాసమూ, స్వేచ్ఛా అడుగంటి, ఉత్త ఆచారమూ, విచారమూ మాత్రం మిగిలితే ఎంత అలవాటైనా, ఎప్పటికొప్పటికి యోచన కలిగి తీరుతుంది ఎంత మూఢులకైనా.

ఈ స్త్రీ పురుష సంబంధంలోంచి సుఖం రావాలంటే, వికాసం కలగాలంటే, దేశపు ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారాలి. వంటా, చాకిరీ, పిల్లల్ని కనడం, పెంచడం, ఇంతకన్న చాలా సులభమూ, సుఖమూ కావాలి స్త్రీకి. నెల తప్పిందంటే ఇంత బెంగ పోయే పరిస్థితులు, త్వరలో రావా? స్త్రీ ఎండి మాడిపోతుందిగాని, కనడానికి ఒప్పుకోదు. పిల్లలు లోకంలోకి రాకపోతే తరిగిపోయిందేమీ లేదుగాని, స్త్రీ స్వభావానికి గొప్ప కొరత. మాతృత్వం లేకపోవడం. తనకి పూర్తిగా తెలీని గొప్ప బాధ పడుతుంది. ఆమె స్వభావపు హక్కుని సుఖప్రదం చేసితీరాలి, ప్రభుత్వమో సంఘమో. తినడం, సంభోగించడం, కనడం అనే పనులు ఏ బాధనీ, ఇబ్బందినీ కలిగించని పరిస్థితులు తప్పకుండా ఏర్పడాలి. అట్లాంటి మార్పుని తీసుకొచ్చే మార్పులకై అభయమిచ్చేదిగా ఒక్క కమ్యూనిజమే కనబడుతుంది. అట్లాంటి అభయమిచ్చే ప్రణాళిక తక్కిన ఘోరాలెన్ని చేస్తేనేమనిపిస్తుంది.

పెళ్ళి అనేది మనుషుల్లో ఏ కారణాలవల్ల అమలులోకి ఒచ్చి ఉండినా, ప్రస్తుతం దాంట్లో ఎన్ని లోపాలు ఉండినా రానురాను దాని ఆదర్శం ఒకే పురుషుడు, ఒకే స్త్రీ భార్యాభర్తలుగా ఉండాలి. మోనోగమీగా అంగీకారమౌతుంది. ఈ మోనోగమీ ఆదర్శం ఎవరో ఎప్పుడో, ఏ పద్ధతులకో ఏ పరిస్థితులకో సంఘ శాంతికో అక్రమంగా విధించిన శాసనమా లేక మనుష్య స్వభావంలోంచి దానంతట అది ఉత్పన్నమయిందా?

మనుష్య స్వభావానికి విరుద్ధమైనదేదీ ఇంత కాలం నిలిచి ఉండదు. మనుష్య స్వభావానికి విరుద్ధం కానంత మాత్రాన అది మనుష్య స్వభావానికి చాలా అనుగుణ్యమనీ, అవసరమనీ అనడానికి వీలులేదు. ఆ కాల పరిస్థితుల ప్రకారం, ఆ అవసరం కొద్దీ మనుషులు ఆ పద్ధతిని ఆదర్శంగా అంగీకరించి ఉండవొచ్చు. పైగా ఈ ఆదర్శం ఆయా మతాలనిబట్టి వాటిమీద ఆధారపడుతో, వాటి ఆజ్ఞల ప్రకారం మారుతో వచ్చింది. ఆనాటికి ఉపకరించింది కనక, ఈ నాటికీ ఉపకరిస్తోందని ఒప్పుకోవలసిన అవసరంలేదు.

ప్రస్తుతం మనుషుల స్వభావం ఈ "మోనాగమీ" అనేదానికి చాలా వరకు ఎడ్జస్టుకాలేదు. కానీ మనుష్య స్వభావంలోని అపాయకరమైన ఉద్రేకాల్నీ, శక్తుల్నీ, ప్రజాక్షేమంకోసం, విద్యవల్లా, శిక్షణవల్లా చట్టాలవల్లా అదుపులో ఉంచినట్టే, ఈ కామవాంఛల్ని కూడా, అదుపులో ఉంచి ఈ మోనాగమీ ఆదర్శంవేపు మళ్ళించే ప్రయత్నం చెయ్యాలి. మోనాగమీయే వాంఛనీయమైతే, ప్రభుత్వమూ, లా, కళా, ఆ అన్నీ ఆ ఆదర్శాన్ని ప్రచారం చెయ్యాలి. ప్రయత్నించాలి. వ్యక్తి అనుభవం కోసం, స్వంత కోర్కెలకోసం మాత్రమే స్వేచ్ఛని వినియోగించడం, లోక క్షేమానికేగాక, వ్యక్తి 'అల్టిమేట్' (ultimate) సుఖానికి కూడా ఎదురీదడమూ, నాశన హేతువూ అవుతుంది.

మనుష్యేతర జీవులలో, కొన్ని పక్షులలో తాత్కాలికమైన మోనాగమీ తప్ప, ఇంక ఎక్కడా కనపడదు. మృగాలలో అక్కడక్కడ మాత్రమే ఆ ప్రయత్నం కనపడుతుంది. మొదట్లో అడవి మనుషుల్లో మోనాగమీలేదు. ఇప్పుడు కనబడే వాళ్ళలోనూ గట్టిగాలేదు. పూర్వం నాగరికత వృద్ధి కావడానికి కుటుంబం అవసరమయింది దానికోసం ఈ నీతి నిబంధన ఏర్పడ్డది. ముందు బహు భర్తృత్వం పోయింది. దాని వెంట బహుభార్యత్వం పోతుంది. కానీ చరిత్రని పరిశీలిస్తే, చరిత్రలో ప్రసిద్ధికెక్కిన మహా పురుషులు చాలా వరకు స్వేచ్ఛాప్రియులు.

మోనాగమీ నాగరిక సంఘానికే కాక, వ్యక్తులకీ క్షేమకరం. బలమూ, ధనమూ, అధికారమూ గల పురుషులు చాలామంది స్త్రీలని తీసుకుపోతే, హీనులైన వాళ్ళకి స్త్రీలు దొరకరు. మోనాగమీలో ప్రతి స్త్రీ పెళ్ళి చేసుకుంటే, సగటున ప్రతి పురుషుడికీ స్త్రీ దొరుకుతుంది. కాని రేస్ గొప్పది కావాలంటే, ఒక గొప్ప అతనికి పదిమంది స్త్రీలు కనడమే ఎక్కువ ఉపయోగకరం. హీనులైన వాళ్ళకి స్త్రీ పురుషులు దొరకక పోవడమూ అట్లానే మంచిది.

సుఖప్రదమైన సంసారాలలో ఒక స్త్రీ, ఒక పురుషుడూ స్థిరపడడం వల్ల, కొన్ని నిజంగా వ్యక్తికి కలిగే లాభాలూ కొన్ని సంఘానికి కలిగే తాత్కాలిక శాంతులూ ఉన్నాయి.

1. పిల్లల క్షేమం: పిల్లల క్షేమం అభిలషించి ఐనా, వాళ్ళని వదల లేక కలిసి ఉంటారు, భార్యా భర్తలు చప్పున విడిపోకుండా.

2. జీవితాలకి ఒక పనీ, ఉద్దేశ్యమూ ఏర్పడతాయి. ఇద్దరూ ఒకే ప్రయత్నంలో నిమగ్నులు కావడంవల్ల దగ్గిర సంబంధాలేర్పడి కొంత మెరుగునీ, వికాసాన్నీ, శాంతినీ ఇవ్వవొచ్చు.

3. బాధ్యతలు ఉన్న మనుషులు చప్పన విప్లవాలకి దూకరు. చట్టాల్ని మీరరు. సంఘానికి పునాదిగా నిలుస్తారు.

4. ఇంకెందుకూ కొరగాని మనుషులకి సంసారంలో కొంత ఘనతా, ప్రాముఖ్యమూ, ఆత్మగౌరవం ఉందనుకుంటో సంతుష్టులౌతారు.

మనుష్యులు జతలు జతలుగా స్థిరపడే ఈ గుణం, మానవ స్వభావంలోనే ఉందా, లేక యుగాల అలవాటా? ఉత్త కామంగాక, మోహమనేది మోనాగమీకి గొప్ప సహాయకారి. కానీ ఆ మోహాన్ని చాలా కొద్దిమందే ఎరుగుదురు. పైగా అది చాలా చంచలం. ప్రస్తుతం రెండు శక్తులూ పని చేస్తున్నాయి — ఏకత్వానికీ, బహుత్వానికీ కూడా. బహుత్వం పురుషులలో ఎక్కువ బలీయం. మరి ధనమూ, సంఘమిచ్చే వీలు వల్లనో, స్వభావం వల్లనో, పురుషుడు కుటుంబంలో స్థిరపడి, ఇటూ అటూ రుచి చూడడం జరుగుతూ ఉంది. నీతిపరులు కూడా కళ్ళు మూసుకున్నారు. ఇది సర్వ సాధారణం కావడంవల్లా, ఇట్లాంటివి ముఖ్యంగా నీతిపరులకే జరగడం వల్లా.

అసలు మోనాగమీ అంటే అర్థ మేమిటి? ఆదర్శమేమిటి? సంఘానికి ఓ అర్థం — గొడవలేకుండా ఇద్దరు పడివుంటే చాలు. నీతి ఓ అర్థం. ఇంకోరికి శరీరం ఇవ్వకపోతే చాలు. దీంట్లో మళ్ళీ ఇబ్బందు లొచ్చాయి. శరీరమంటే శరీరంలో ఏ భాగం? ఎంత? అనేవి? మనసు కూడా ఇవ్వకూడదనే దానికి కూడా వచ్చాయి. కొన్ని శాస్త్రాలు. ఆదర్శం ఏమిటంటే — మనోవాక్కాయ కర్మలతో ఏకత్వాన్ని పాలించడం.

కానీ ఈ ఆదర్శం — ఏ ఇమాజినేషన్, శక్తీ, సౌందర్య పిపాసాలేని జడులకీ, చచ్చు లకీ సులభమౌతోంది. ఆదర్శంగా తీసుకుని యోచిస్తే పాతివ్రత్యానికి వచ్చిన ఇబ్బందులే వస్తాయి దీనికి కూడా — అంతకన్న ఇబ్బం దులు! మనుషులు దానికి సంసిద్ధులు కానీ కాకపోనీ, మోనాగమీని వాళ్ళనెత్తిన రుద్దు తోంది నీతి, ముఖ్యం స్త్రీలమీద. తక్కిన నీతులమల్లే ఆదర్శంగా చూసి, ప్రయత్నిం చడం లేదు. వదలడంలేదు. దీనికి వ్యక్తులు లోబడడం కష్టం. ఎప్పుడు ఒప్పుకుంటా రంటే, వాళ్ళకి వేరు వాంఛలు రానప్పుడు. ఈ రాకుండా ఉండడం ఎప్పుడు తటస్థిస్తుందంటే —

1. మనిషి జడుడో, వృద్ధుడో అయి నప్పుడు.

2. లేక 'సెక్స్' (sex) సౌఖ్యం ఎక్కువ ముఖ్యం కానప్పుడు.

3. లేక తన సర్వశక్తులకీ, ఆశలకీ, కలలకీ తృప్తినివ్వగల వ్యక్తి దొరికినప్పుడు.

మనిషి పరిణామం చెందుతున్న కొద్దీ, తన ఆదర్శ వ్యక్తికోసం అన్వేషణ ఎక్కు వౌతుంది. కట్టుబాట్లకు తిరుగుబాటు అధికమౌతోంది. ఇది మోనాగమీకి విరుద్ధం.

మోహం మారడం, పోవడం, మను షులు చావడం, మాయం కావడం, ఉండి బాధలు పెట్టడం, ఒకరికొకరికి పడక పోవడం — ఇట్లాంటివి ఎన్నో! ఎంతవరకూ మోనాగమీ ఆదర్శమేకానీ, జీవితంలో ప్రవేశపెట్టేటప్పటికి చిక్కులు. మోనా గమీయే మర్యాద అయితే, లక్ష దొంగ తనాలు. చేసిన తప్పు ఏమిటంటే —

1. మోనాగమీ సంఘానికి ఆదర్శంగా ఉంచడంతో ఆగక, వ్యక్తులకి ఆదర్శంగా

పెట్టడం.

2. మోనాగమీని ఆదర్శంగా ఉంచడంతో ఆగక, దాన్ని ఒక నీతి నిబంధన చెయ్యటం.

మనుషుల్లో తెలివినీ, మోహం శృంగారం ఇట్లాంటివి ఎక్కువగా వికసిస్తున్న కొద్దీ, నీతిని ఎక్కువగా భగ్నం చేస్తున్నట్టూ మోనాగమీ ఆదర్శానికి దూరమౌతున్నట్టూ కనపడతారు. కానీ ఇది ఎదిగే ప్రయత్నం. కాంతికోసం వెతుకులాటలో అవస్థ. పూర్వమే సంసారంలో నిలకడ ఎక్కువగా కనపడ్డా, దాంటోంచి ప్రజలు కదులుతున్నారంటే, అంతకన్న ఎక్కువ ఐక్యం కోసం వెతుకుతున్నారన్నమాట. చాలా మంది అవినీతిపరులు వ్యభిచారులనబడే మనుషులు చేసే ప్రయత్నమే ఇది. తనకి ఇంకా ఐక్యమివ్వగల వ్యక్తులకోసం అన్వేషిస్తున్నారన్న మాట.

మోనాగమీ అంటే స్త్రీ పురుషులు, తమ సెక్సు జీవనానికి, ఇతరమైన అవసరం, మనోకర్మలలో ఏమీ అవసరంలేనంత ఒకరిలో ఒకరు లీనం కావడం — ఇది గొప్ప ఆదర్శం. దానికోసం ప్రతిమనిషీ ప్రయత్నం చేసి కలలు కనాలి. కానీ ఆ మోనాగమీ కోసం ప్రయత్నంచేసి తీరాలనిగాని, చేస్తున్నట్టు కనబడాలని కాని, దానికి విరుద్ధంగా కనబడేట్టు ప్రవర్తించకూడదని కాని అనడానికి ఎవరికీ హక్కులేదు.

ప్రేమ

మానవ హృదయం పరిణామం చెందుతున్నకొద్దీ ప్రేమ ఉదయిస్తోంది. అందరూ ప్రేమని గురించి మాట్లాడినా, ఈ యుగంలో కూడా చాలా కొద్దిమందే ప్రేమని ఎరుగుదురు. సాధారణంగా మనుషులు ప్రేమ అనుకునేది ప్రేమ కాదు. కామాన్నీ, అలవాటునీ ప్రేమ అనే పేరుతో పిలుస్తారు.

మోహంకన్నా చాలా అతీతమయింది ప్రేమ. మోహంలో వలె ప్రేమలో శరీర వాంఛ ప్రాముఖ్యం కాదు. శరీరవాంఛ చాలా ఎక్కువగా ఉండవొచ్చు. కానీ, దానికన్న ఎన్నో రెట్లు తక్కిన ఆకర్షణలు బలంగా ఉంటాయి. మోహం కలవాళ్ళు రెండోవాళ్ళని తమ సౌఖ్యం కోసం కోర్తారు. తమకి దక్కనిదైతే ఆ మనిషిమీద మోహం చచ్చిపోతుంది. ప్రేమ గలవారు తాము రెండోవారికిగల ఆనందాన్ని గూర్చి ఆలోచిస్తారు గాని, తమకి వారివ్వగల ఆనందాన్ని గూర్చి తలవరు. రెండో వారి ఆనందంతో తాము ఐక్యమౌతారు ప్రేమగలవారు. తమని ప్రేమించకపోయినా వీరి ప్రేమ పోదు.

ప్రేమకి పూజ్యభావం ముఖ్యం. గౌరవమూ, భక్తీ లేనిది ప్రేమ కాదు — భార్యని చూసినా సరే!

ఇటువంటి ప్రేమ సర్వోన్నతమైన ఆధ్యాత్మిక ప్రేమగా అభివృద్ధి పొందుతుంది. ఒకరిలో ఒకరు సకల భావాల్నీ, ప్రపంచాల్నీ ఈశ్వరుణ్ణి చూసి అనుభవిస్తారు. ఒకరుగాక రెండోవారికి జీవనం లేదు. అనుభవం లేదు. అమ్మాయీ అతనూ

అనే భేదం లేదు. ఇటువంటి రూపమూ, గుణమూ, కార్యమూ, వివాహబంధమూ, హృదయమన్యాయత్తం కావడమూ, సంఘమూ, నీతీ, మర్యాదా వీటితో పని లేదు. వాళ్ళిద్దరిదీ వేరే లోకం! వేరే నీతి.

ఇటువంటి ప్రేమ వెతికితే రాదు. మనుషులు తమ సంసారం చేత, స్వభావౌన్నత్యంచేత ఇటువంటి ప్రేమకి అర్హులవాలి.

'ప్రేమలేని సంబంధం వివాహం కాదు. వివాహమంటేనే ప్రేమ. ప్రేమలేని వివాహం చేసుకోకూడదు' — అనే రూల్సుని లోకంలో ప్రవేశపెట్టడం సాధ్యమైతే ఎవరికీ పెళ్ళికాదు. ఎందుకంటే ప్రేమ అనే పదానికి దూరంగానైనా అర్థం తెలిసినవాళ్ళు అరుదు. తమ మనసుల్లో తోచిన సెన్టిమెంట్లనీ, బలహీనమైన తాత్కాలిక ఆకర్షణల్నీ, వాంఛల్నీ, ప్రేమ అని అనుకుని, ఆ ఇసికమీద శృంగారాలూ, కాపరాలూ నిర్మించాలని చూస్తారు. ప్రేమలేని దాంపత్యంలోంచి, ప్రేమ ఇస్తుందని తాము చదివిన గొప్ప అనుభవాలన్నింటినీ రప్పించుకోవాలని ప్రయత్నిస్తారు. అవి దొరకపు గనక, చాలా త్వరలో ప్రేమ విషయమై, సెక్సు విషయమై, సినిక్సు అవుతారు.

ప్రేమ నెరగని మనుషులందరూ వివాహంలోంచి, ప్రేమ సంబంధంలేని ఇతర సుఖాల కోసమే చూసుకోవాలి. ఎట్లానూ చూసుకుంటోనే ఉన్నారు. మొదటినించీ ఆ ప్రేమ సంగతి తమకి తెలీదని వొదిలేసుకుని తిరిగితే డిజప్పాయింటు మెంటూ ఉండదు, ప్రేమ అబద్ధమనే దురవస్తలోనూ పడరు. మన అనుభవానికి రాని విలవల్ని ఆదర్శాలుగా కూడా అబద్ధమనడం, లోపల అభివృద్ధికి భంగకరం. తమకి చేతకానివి ఇంకోరు అనుభవిస్తున్నారని వాళ్ళ అధిక్యతను వప్పుకోడం తను మనసుకి చాలా న్యూనత. అందుకని ఆ విలవల్ని నిరాకరించడానికి ప్రయత్నిస్తుంది మనసు.

శృంగార జీవనం

శృంగారపు ఆనందాన్ని అనుభవించాలంటే దానికి అర్హత పుట్టుకుతోనే కలగాలి. కొంతవరకు ప్రయత్నించి సంపాయించవొచ్చు. ప్రతివారి మనసులోనూ కొంత కుతూహలం ఉండనే ఉంటుంది — కామం అనేది కలగని రోగులకి తప్ప, తక్కిన వారందరికీ. కాని కొంతమందికి మాత్రమే, చాలా తక్కువ మందికేమో — శృంగారంకన్న విలువైన అనుభవం ఇంక వేరే ఉండదు. 'ధనం, అధికారం, కీర్తి, స్నేహం, దేశ సేవా మొదలైన వాటికన్న చాలా ఎక్కువ వాంఛనీయం శృంగారం' అనుకునేవాళ్ళే తక్కువ. బైటికి అనగలిగిన వాళ్ళు అంతకన్నా తక్కువ. అసలు చాలా మందికి ఈ అదృష్టాలలో ఏవీ ఉండవు. మోహదృష్టి లేనివారికి కూడా జీవితాలలో ఎప్పుడో వృద్ధాప్యంలోనైనా సరే ఏ స్త్రీనో, ఏ పురుషుణ్ణో కలుసుకోవడంవల్ల శృంగారం ఎన్నడూ ఎరగనివారికి అకస్మాత్తుగా కొత్త వెలుగు గోచరించవచ్చు. కానీ చాలా సహజ

మైన ఈ సంతోషాన్ని తృప్తిగా అనుభవించని జీవితం సగం చీకటిలోనే, అసంతుష్టిలోనే గడుస్తుంది. ఈ లోకంలో విపరీతంగా డబ్బు దాచుకునేవాళ్ళూ, విప్లవాలు తెచ్చేవాళ్ళూ, భక్తులూ వీళ్ళందరూ ఈ వాంఛ తీరక తడుముకునేవాళ్ళే. ఈ అనుభవం గల వాళ్ళకి తక్కినవి గట్టిగా మనసుకి పట్టవు.

చాలామంది మనసులకి సహజంగా మోహపు విలువలున్నా, అవి పరిస్థితులవల్ల నాశనమైపోతాయి. పూర్తిగా యవ్వనం రాకుండానే సెక్సు జీవితాలలోకి దిగడమూ; తమకి రోతా, భయమూ, వెగటు కలిగించే పరిస్థితులలో మొదటి అనుభవాలు రావడమూ; పెద్దవారో, సంఘమో తెలుసుకుని దండిస్తుందని రహస్యంగా జరగడమూ; బయటపడి నిందరావడమూ; బలవంతమూ..... ఇట్లాంటి వాటివల్ల శృంగార జీవితం ఆజన్మాంతం ఒకే సారిగా దెబ్బ తినేస్తుంది. పైగా పాపం చాలామంది స్త్రీ పురుషుల్లో ఇతరుల్ని ఆకర్షించగలశక్తి ఉండదు. అందం, ఆరోగ్యం, ముఖ్య విషయాలు. కురూపులకి ఎంత శృంగార వాంఛ ఉండీ లాభం లేకుండాపోతుంది. అనారోగ్యం అంతకన్నా అభ్యంతరం. పైగా తగిన స్త్రీ పురుషుల్ని కలుసుకోడానికి వీలులేని పరిస్థితులు. స్త్రీకి పెళ్ళి ఖైదు. స్త్రీ పురుషులకి మర్యాద నీతికట్టు.

ఇంతకన్న ఎక్కువమందికి, మామూలుగా జరిగేదేమిటంటే పెళ్ళి. దాంటోంచి శృంగారానుభవం రాదు. ఎన్నటికీ రాదు. కలుగుతోందని ఎవరన్నా అంటే శుద్ధ అబద్ధం. అదర్శం ఏమిటంటే (ఇది ఉత్త ఆదర్శమే! ఎన్నటికీ జరిగేది కాదు) గొప్ప ప్రియులు, విరహపడి, కష్టాల్నీ, అభ్యంతరాల్నీ దాటి, స్వేచ్ఛగా బహిరంగంగా కలుసుకోగలిగితే, ఆ మొదటి రోజుల్లో పాతబడకముందు, ఎట్లాంటి ఆనందాన్ని అనుభవిస్తారో అది జీవితమంతా అనుభవించగలగటం. దీనికి ముఖ్యమైన విరుద్ధం ఏమిటంటే ఎంత ప్రేమతో శృంగారంతో ప్రారంభించినా, వాళ్ళెటువంటివాళ్ళు కానీ, పాతబడి మామూలౌతారు. అనుభవమూ అట్లానే అవుతుంది. కాలేదనే వాళ్ళు నిశ్చయంగా అబద్ధమాడుతున్నారు. అసలు ఈ శృంగార వాంఛలోనే గొప్ప మోసం ఉంది. ఎన్నిసార్లు మోసగించి కూడా, మళ్ళీ చూపగలశక్తి ఉంది మన్మథుడికి.

తను వాంఛించిన స్త్రీ, దూరం నించి దయాపూర్వకంగా ఓ చిరునవ్వు నవ్వితే చాలుననుకుంటాడు మొదట. ఆమె తాకిన కాయితమో ఆమె తొక్కిన ధూళో కొంచెం దొరికితే చాలుననుకుంటాడు. అవి లభ్యమైనాయా, ఒక్కమాట, ఒక్క చూపు, తరువాత చేతిని తాకనిస్తే చాలు. పోనీ తాకకుండా దగ్గిరగా కూచుంటే చాలు. దుర్లభమైన స్త్రీతో అంటాడు కూడాను — "ఆ మాత్రం తనకి చాలు, ఇంకేం అక్కర్లేద"ని. ప్రేమ కవిత్వం, ప్రేమలేఖల నిండా ఇవే అబద్ధాలు! కానీ అబద్ధాలుకావు. నిజంగా నిజమే అనిపిస్తాయి ఆ నిమిషాన. ఈ మాటలూ, ఈ రాతలూ తరవాత, తరవాత కంఠం చుట్టుకుంటాయి. ఏ మూర్ఖురాలో, ఏ జాలిగల స్త్రీ హృదయమో, లేక ఏ కొంటె కన్యో సంశయించనని అంతమాత్రం అనుగ్రహిస్తే, క్రమంగా పైకి పాకుతాయి పురుషుడి వేళ్ళు. కష్టమైన కొద్దీ, అంగుళం, అంగుళం ఎప్పటికప్పుడు. 'ఇంతే, చాలు పీటితో' అనడం; ఆపితే ఆగ్రహం. బతిమాలడం, ప్రాధేయపడడం.

ఇంక ఏమీ శేషించకుండా, తన వాంఛ పూర్తిగా తీర్చిందాకా విశ్రాంతి నివ్వడు. ఇదంతా చూసి, పురుషుడు ఇంత దుర్మార్గుడా, మోసగాడా అంటాడు. కానీ అది చాలా సహజం! మోసం ఏమీలేదు. సృష్టి మార్గమే అంత. కానీ త్వరలోనే వ్యవహారమంతాస్థిమిత పడుతుంది. ఆమె తాకిన వస్తువులు గొప్పవిగా కనపడవు. ఆమె మాటల్లో తేనె, పెదవుల్లో అమృతం, చూపుల్లో వెలుగు, ఈ కవిత్వమంతా సామ్మసిల్లుతుంది.

"ఇట్లా అయిందే! కొద్దికాలం కిందటే అట్లా మాట్లాడావే ఇంతలో మారావే!" అని అతన్ని నిందించడం చాలా అన్యాయం. కానీ సహృదయులు శృంగారపు మెరుపులు తగ్గినంత మాత్రాన ఒకరి నొకరు వొదులు కొనిపోరు. జ్ఞాపకాలు, కృతజ్ఞత, ఇష్టం, ఇవన్నీ నిలుపుతాయి. పెళ్ళి అయినాసరే కాకపోయినాసరే. పెళ్ళి అయితే తక్కిన సంఘ ధర్మబంధాలు కూడా గట్టిగా బిగించి ఉంచుతాయి. ఈ లోపల ప్రేమే తట స్థించిందా ఇంక శృంగారం మాయమై ఏ లోపం కనపడదు. కానీ ఎంత ప్రేమరానీ శృంగారంలేని లోటుని భర్తీ చేయలేదు. అందువల్లనే కొంతమంది భార్యాభర్తలు తమ భర్తల్నీ, భార్యల్నీ ఎంతో ప్రేమిస్తూ కూడా మాయమైన శృంగారానుభవం కోసం పై సంబంధాల్ని వాంచిస్తారు.

శృంగారానుభవమే ప్రధానమైన వాళ్ళకి సంబంధం పాతది కాగానే తిరిగి ఇంకో నూతన సంబంధం వెతుక్కోడం కన్న గత్యంతరం లేదు.

కానీ శృంగారం కన్నా అధికమైన విలువగలదీ, ఇంకా దుర్లభమైనదీ ప్రేమ. శృంగారాన్నన్నా గుర్తించడానికీ, కొలవడానికి సాధనాలు ఉండవచ్చును గాని 'ఇది ప్రేమే' అని నిర్ణయించడానికి ఏ విధమైన కొలతలూ లేవు. ఎవరికి వారు తమ అనుభవం ప్రేమేనంటారు. ఏ విధమైన ఆకర్షణాలేని మనిషితో పడివుండడాన్ని కూడా ప్రేమే నంటాడు. 'ఏం చూసి ఆ ప్రేమ' అని అడిగితే మా కళ్ళతో చూడమని జవాబు. దాంటో అబద్ధమూ లేదు. శృంగారానికి శరీరానుభవం ప్రాముఖ్యం. దీనికి సహాయకులు కవిత్వం, తీవ్రవాంఛా, హృదయస్పందనా, ప్రేమ. వీటన్నిటిని మించిన లయం. ఏకత్వం. చాలాసార్లు మనుషుల్నీ, ఎమోషన్స్‌నీ, కవిత్వాల్నీ, కలలనీ మించిన ఐక్యసిద్ధి, పైకి చాలా శాంతం. ఎవరూ గుర్తు పట్టలేనంత సుకుమారం. నిగూఢం. ఇట్లాంటి ప్రేమ కలిగినప్పుడు శృంగారం వేరే కావాలనే గుర్తే లేకపోవచ్చు. శృంగారం నిరంతరం వారిద్దరిమధ్యా ఉండనూ వచ్చు. చాలా సకృతంగా శృంగారాతీతమైన తృప్తి కలగనూ వచ్చు. శృంగారవాంఛ విడిగా దిగపడిపోనూ వచ్చు.

తాగుతాడు. తంతాడు ఇతర స్త్రీలతో తనముందే రమిస్తాడు. సమస్తమైన నీచ కార్యాలూ చేస్తాడు. తనకి డబ్బుగానీ, సౌఖ్యంగానీ ఇవ్వడు. వీలుండి కూడా అతన్ని విడవని స్త్రీ స్థితిని ఏ పేరులో పిలుస్తాము? అతనితో లేచి వచ్చిందనుకోండి. పోవడానికి నీతిలేదు. మర్యాద లేదు. సలక్షణమైన ఇంకో పురుషుడు ప్రేమించి ఆహ్వానిస్తున్నాడు. మొదటి పురుషుడు ఆమె వదిలితే చాలునని పొమ్మంటాడు. ఊరికే ఇది ప్రేమా, కామమా, అలవాటా, అని కాయితాల మీద పేర్లు పెట్టి పద్దులు

వెయ్యాలని చూస్తాం అంతే.

అట్లాంటి దిక్కుమాలిన స్త్రీ చాలా నీచురాలనిపిస్తుంది. తిడతారు. విసుక్కుంటారు. స్త్రీలేకాదు. ఆ విధంగా ఓ స్త్రీకి దాసులైన పురుష పుంగవులనేకులున్నారు. గొప్ప యుద్ధవీరులు, రాజ్యదక్షులు, కవులు, గాయకులు, యోగులు, సన్మార్గులేకాదు, దుర్మార్గులైన స్త్రీకి వశ్యులై, సర్వవిధాలా నాశనమైన వాళ్ళున్నారు. వాళ్ళలో కొందరు తమ శృంగారానుభవం ముందు తక్కిన జీవితపు నాశనాన్ని ఒక నాశనం అనుకోని వాళ్ళూ, కొందరు పశ్చాత్తాపంతో కుమిలిపోయినవాళ్ళూ, ముఖ్యంగా సర్వమూ నాశనమైన తరువాత తమని ఆ స్త్రీ కూడా త్యజించినపుడు ఘోరమైన వేదన పాలౌతారు. సాధారణంగా ఈ విధంగా పురుషుల్ని ధ్వంసంచేసి ఒదిలేది వేశ్య. అంతకన్నా ఎక్కువగా చాలా సాధారణంగా పురుషుడు స్త్రీ జీవితాన్ని విశేషంగా నిర్మూలిస్తాడు. ఏ అధమ స్థితిలోనన్నా పురుషుడు తిరిగి తన జీవితాన్ని తట్టుకోగలడు. కానీ, ఒకసారి నాశనమైతే స్త్రీ అంతటితో ఆఖరు. అందువల్లనే ఎంత ఘోరంగావున్నా భార్య సంసారాన్ని వదలదు, ఒదలకూడదు, ఇంకా గట్టి నమ్మకమైన పట్టు చిక్కిందాకా, నాశనమే సంసారంకన్నా నయమని స్థిరంగా తెలిసినప్పుడు తప్ప.

ఈ చిక్కులన్నిటికీ దడిసి, విసిగి, శృంగారం జోలికిపోరు బుద్ధి మంతులు. మామూలు వాంఛల్ని పెళ్ళిలో, పిల్లల్లో తీర్చుకుంటారు. శృంగారాసక్తిగల వాళ్ళకి ఇబ్బందులూ, చిక్కులూ లేకుండా నూరేళ్ళూ ఆవిధంగా ఊపిరి పీల్చడమే పనిగా బతక్కపోతేనేమనిపిస్తుంది.

గొప్ప శృంగారం కలగాలంటే ఎవరిని వాంఛిస్తామో వాళ్ళు చాలా అద్భుతంగానూ, అంటే ఈ భూలోకంలో ఇటువంటి మనుషులు ఉండడం అసంభవము అన్నట్టూ, చాలా కొత్తగానూ, అపురూపంగానూ, చాలా ఉన్నతంగానూ వారిని పొందడం చాలా అలభ్యమైనదీ కష్టభూయిష్టమైనదీ గానూ, అదొక ప్రత్యేకమైన అదృష్టంలాగూ కనబడాలి. కనక శృంగారం నిలవాలంటే ఈ మనోభావాలన్నీ చిరకాలం అట్లా నిలిచిపోవాలి. తెలివిగల స్త్రీలు పురుషులకి సులభులుకాక ఎప్పుడూ జారిపోతున్నట్టే దొరకనట్టే గాలం చివర చాపమల్లే ఆడిస్తారు పురుషుణ్ణి. తామిచ్చే వరాల్ని చాలా సకృతుగా ఆలోచించి రేషన్ చేసి ప్రసాదిస్తూ ఉంటారు. మళ్ళీ గాలం దారం తెగకుండా చూసుకుంటో.

ఎప్పటికప్పుడు మార్పుకి సిద్ధమై, కొత్త రొమాన్సుల్ని తెచ్చుకుందామంటే దాంట్లో చాలా చిక్కులున్నాయి. పాత సంబంధంలోని స్నేహం, అలవాటూ ఒక పట్టాన వొదలవు. ఇద్దరూ విడాకులకి ఒకేసారి సిద్ధంగాక ఒక వాంఛ బలీయంగా ఉంటే వారి దుఃఖాన్నీ, విరహాన్నీ రెండో వారు భరించలేక విడిపోవడానికి బాధపడతారు. అదీగాక గొప్ప రొమాన్సు సాధారణంగా యవ్వనంలోనే తటస్థిస్తుంది. ముఖ్యంగా కొంచెం వయసు గడిచిన స్త్రీకి కష్టమౌతుంది. పురుషుడిలో ధనం, కీర్తి, సాహసం ఇట్లాంటివి ఆకర్షిస్తాయి స్త్రీలని. స్త్రీలో అందం — శరీరానిది, మాటది, తీరుది, ఏదైనా అందం — ఆకర్షిస్తుంది పురుషుణ్ణి. యవ్వనంలోనూ, తక్కిన విధాలా తగి ఉన్నా, ముఖ్యంగా ఈ దేశంలో

మనుషుల ఆదర్శాల్నీ కలల్నీ రేపగలిగిన మనుషుల్ని కలుసుకోవడం, కలుసుకున్నా స్నేహం కావడం చాలా కష్టం.

అందువల్ల ఏ అదృష్టం మూలానో దొరికిన గొప్ప రొమాన్సుని కొంచెం పాత బడిందని వొదిలేసుకుంటే చాలాసార్లు ఇంక ఏమీ లేకుండా పోవచ్చు. కనక పాత బడ్డప్పుడు మళ్ళీ కలుసుకునే పరస్పరో ద్దేశ్యంతో తాత్కాలికంగా విడిపోవడం మంచిది. అలాకాక కలిసి ఉంటే గొప్ప రొమాన్సు త్వరగా గొప్ప ప్రేమకింద స్థిర పడడం కూడా తటస్థించవచ్చు. గొప్ప ప్రేమ సంభవించినవాడు తాత్కాలికమైన శృంగారంకన్న ఎక్కువ స్థిరమూ, లోతూ, రమ్యమూ అయిన అనుభవం దొరుకు తుంది. అంతేకాదు, వరసగా శృంగార న్వేషణలో గడిపినా, మనుషులేగాక, ఆ శృంగారానుభవమే మామూలై కొన్నాళ్ళకి ఏ విధమైన త్రిల్‌నీ ఇవ్వకుండా పోతుంది. సహృదయులైన మనుషులకి స్పష్టంగా తెలుస్తుంది కూడాను. ఈ లోకంలో వీలై నంతవరకు తమ ఆదర్శం దొరికిందని. అట్లాంటి గొప్ప భాగ్యాన్ని పోగొట్టుకుంటే, ఎంత వెదికినా, చాలా స్వల్పమూ, క్షుద్రమూ అయిన ప్రణయ సౌఖ్యాలు మాత్రమే మిగలవొచ్చు. ఇన్ని కారణాలవల్ల వయసు లోనే ఒక సంబంధంలోనే స్థిరపడడం చాలా వివేకం. అదే వివాహం కావచ్చు. ప్రేమ దొరకని వాళ్ళకి రొమాన్సు, ఆ రొమాన్సు కూడా మాయమైనా, ఆ మనిషిని తోసేసు కోకపోవడం వివేకం. ఎందుకంటే ఒక్కొక్క మనిషిలో తనకి సరిపడే అందం, చాతుర్యం, శీలం వాక్యార్థంవల్ల? ఇతరు లతో పూర్తిశరీర సౌఖ్యంకన్న ఎన్నో రెట్లు పవిత్రం.

కామానికి ఏ అభ్యంతరాలూలేని సంఘ పరిస్థితుల్లోంచి ప్రేమ, శృంగారం కలగడం అరుదు. అట్లా కాకూడదు. కానీ మనుషులు, సంపూర్ణమైన పరిణామం చెందినవారు. ఆదర్శానికి చాలాదూరం జీవితం. ఈ కామ వ్యాపారానికి అనేకమైన మాయ రంగులూ, కలలూ కప్పుకుంటేగాని వాస్తవాన్ని తెలుసుకోలేని మనుషులు! ముందు శృంగారభావం మనిషి మనసులో పుడుతుంది. ఆ రంగుల వెలుగు ఎవరి మీదనో పడి, తన కళ్ళకి మాయగప్పగల మనిషిలో, తన మనసులోని కలల్నీ, బాధల్నీ, అందాల్నీ కల్పించి, వొప్పుకుని ఆశ పడుతుంది. అందువల్ల ఎవరిమీద మోహం కలుగుతుందో, వాళ్ళనెప్పుడూ పెళ్ళిచేసుకో కూడదంటారు. ఎందుకంటే మోహమాయ లేని గొప్పతనాన్నీ, ఆకర్షణనీ, గుణాల్నీ మోహింపబడ్డ మనిషికి ఆరోపిస్తుంది. తం వాత అవన్నీ ఆ మనిషిలో లేవనే నిజం తెలిసినప్పుడు ఆ మోహమంతా తనే కల్పిం చుకున్నానని మరచి, ఆ మనిషిదే ఆ తప్పని, తనని మోసగించారని ఆగ్రహమూ, విరోధమూ, విముఖత్వమూ కలుగుతాయి. డబ్బుకోసమో, విద్యకోసమో, వీలుకోసమో, పెళ్ళిచేసుకుంటే మోసానికి ఎక్కువచోటు ఉండదు కానీ అట్లా పెళ్ళి చేసుకుని అనుభ వించేదేమిటి? ఏ ఒక్కదినమూ, ఏ వెలు గునీ అనుభవించని బతుకెందుకు? "మూణ్ణాళ్ళ ముచ్చటైతేనేం జీనా! మోహ జీవనాన్నే ఏరుకో!" అంటాను. కారణం? మోహజీవనమంత గొప్ప వెలుగు జీవితాని కిక లేదని అంటారు చలం బోధి రొమాన్టిసిస్టులు.

టాహితీ ద్వీపంలో ఈ కామజీవనం చాలా విషయాలలో తక్కిన ప్రపంచంకన్న భిన్నం. అదొక ఆదర్శ జీవన మనవచ్చు. అక్కడ స్త్రీల మనసు స్పష్టం. ఒక పురుషుణ్ణి చూసి ఇష్టపడతారు. ఇష్టపడరు. ఇష్టపడక పోతే ఏ విధానా అతనికి ఆమె లభించదు. ఎంత ధనానికీ, గొప్పతనానికీ అయినాసరే, ఇష్టపడితే వాళ్ళు పురుషుడినుంచీ ఏమీ కోరరు. స్త్రీ నుంచి ఎంత సౌఖ్యం పురుషుడికి వచ్చిందో స్త్రీకి కూడా పురుషుడి నుంచీ వచ్చిందనే వారి నమ్మకం, అనుభవం. తక్కిన ప్రపంచంలో పెళ్ళిలో కూడా స్త్రీ పురుషుడికి సంతోషాన్నిస్తోందే కాని, పురుషుడు స్త్రీకి ఇచ్చే సౌఖ్యం సంగతి ఎవరి మనసుల్లోనూ లేదు. పవిత్ర వివాహంలో కూడా. స్త్రీ పురుషుడికి తన శరీరాన్నిస్తుంది. పురుషుడు తిండీ, బట్టా, నగలూ ఇస్తాడు. ఎంత గొప్ప సంబంధాలలో కూడా ఈ విధమైన భావం స్త్రీ పురుషుల మనసుల్ని వదలదు. ఈ పురుషుడు స్త్రీకి ఇవ్వడమంటే ధనం, సౌఖ్యమంటే తిండీ బట్టా. ఎవరో నీచస్త్రీలు తప్ప పురుషుడి శరీరం నించి తమకి సౌఖ్యం వచ్చిందని ఒప్పుకోరు. అందువల్లనే అనేకమైన ఘోరమైన వికారాలూ, వంకర్లూ, ఈ సంబంధంలో పురుషుడు ప్రయత్నించడం స్త్రీ అంగీకరించడం జరుగుతున్నాయి. టాహితీద్వీపంలో పురుషుడు ప్రయత్నించనక్కరలేదు. చూపులూ, మాటలూ, ప్రజంట్లూ, బేరాలూ, వాగ్దానాలూ ఇవేమీ అవసరంలేదు. సరాసరి " ఇష్టమా? అయిష్టమా?" అని అడిగేయవచ్చు. చాలా సరళం. సులభం, ఆరోగ్యం. తరవాత ఇష్టం ఉంటే ఎంత కాలమయినా కలసి ఉండవచ్చు. ఇష్టం లేనప్పుడు విడిపోవచ్చు. రాత్రి పురుషుడితో ఉండి పొద్దున్నే ఏ కారణం లేకుండానే స్త్రీ వెళ్ళిపోతుంది ఒంటరిగానో ఇంకో పురుషుడితోనో. పురుషుడికీ ఆ స్వేచ్ఛ ఉంది. దిగులు పుట్టినా, దిగులుగానీ, నిందగానీ, వాగ్దాన భంగంగానీ, పిల్లలుగానీ, ఏవీ స్వేచ్ఛకి ఆటంకం కానీరు. ఇవన్నీ ఓ నియమాలకింద ఏర్పరచుకుని చేసుకునేవికావు. వాళ్ళ స్వభావమే, ఆచారమే అంత. దేశం, జాతి ఇవేమీ అభ్యంతరాలు కావు వాళ్ళకి.

కనక అక్కడికివెళ్ళి బతకడానికి తగ్గ డబ్బున్న యూరపు, అమెరికా దేశస్తులు టాహితీ వెళ్తుంటారు. అందమైన ఆ స్త్రీల కోసం అట్లా వెళ్ళినవాళ్ళు ఏమంటారంటే ఆ దేశస్తులకి శృంగారం, ప్రేమ అంటే అర్థం కావని. ఓ విధమైన అనురాగం ఉంటుంది కాని ఆ సంబంధంలో ఏ రంగూ, ఎమోషనూ, తీవ్రమైనకాంక్షా, ఏవీ ఉండవని. అని లేకపోతే చాలామందికి శృంగారం కనపడదు. ఎందువల్లనంటే తమ హృదయంలోని కలల్నీ, రంగుల్నీ ఆపాదించుకునే అవసరంలేదు. మొదటిరోజునించీ వివాహమంత చప్పగా ఉంటుందట. దీనివల్ల ఏం తెలుస్తుందంటే శృంగారం ఉద్భవం కావాలంటే మనదేశంలో ఉన్న లోపాలన్నీ ఉండాలి. ఈ కామజీవితంలో ఒకరికొకరి బంధం, ప్రత్యేకం తనదో ఇంకోరిదో అనుకోడం, ఈర్ష్య, తీరనివాంఛ, కష్టతరమయిన ప్రయత్నం, తన ఘనతవల్ల ఆకర్షించి సాధించగలిగానన్న తృప్తి — ఇట్లాంటి లోపభూయిష్టమైన మాయా పరిస్థితులు అవసరం. ధనం ఇచ్చి పుచ్చుకోడాలు అన్నిటికన్న ముఖ్యం. శృంగారపు విలువ చాలామందికి ధనంమీద ఆధారపడుతుంది.

భక్తి గౌరవాలు చాలా ముఖ్యం ప్రేమకి.

"అతను ఉత్త పనికిమాలినవాడే. కాని నాకు ప్రేమ" అనే మాట ఎక్కడో సకృతంగా కాని నిజంకాదు. ఒకవేళ ఆనాటికి నిజమయినా ఆ ప్రేమ చాలా వరకు తగ్గిపోయే రోజు అట్టే దూరాన ఉండదు. కానీ లోకానికి పనికిమాలినవాడైనా స్త్రీ హృదయంలో అతనికి గొప్పస్థానం ఉండవొచ్చు. ఇతర విధాల చాలా తక్కువస్థితిలో ఉన్నా శక్తిహీనుడైనా సంఘంలో అతనికేం పెద్ద స్థానం లేకపోయినా, స్త్రీ తానే పరిస్థితుల్లో అతన్ని వలచిందో, గౌరవపడ్డదో ఆ విషయాల్లోనన్నా అతని మీద మెరుగుని మాపుకోకూడదు. ముఖ్యంగా పురుషుడి మనసులో స్త్రీ మీద ప్రాముఖ్యత సులభంగా తగ్గిపోతుంది. తన మాటలలో గానీ, మనసులోగానీ స్త్రీ చవక అయిపోయిందా, ప్రేమగానీ, శృంగారంగానీ నిలవవు. ఆమె స్త్రీలలో ప్రత్యేకంగానే ఉండాలి. ఆమె సహవాసం ఒక వరంగానే స్వీకరించాలి.

స్త్రీకి ఎక్కువ సహజం సులభంగా ప్రియుణ్ణి దేవత్వానికి ఎత్తడం. కాని నాగరికత పొందుతున్న కొద్దీ, విద్య ఎక్కువౌతున్న కొద్దీ హక్కులకోసం ప్రచారం సాగిస్తున్న కొద్దీ స్త్రీ పురుషుణ్ణి దిగలాగడం జరుగుతుంది. అందరి పురుషుల్నీ ఎంత విరోధులుగా, దుర్మార్గులుగా చూసినా, తన పురుషుణ్ణి ఎన్నడూ తాను తక్కువ చేసుకోకూడదు. భర్తని ఎంత తక్కువగానన్నా చూడవచ్చును కాని ప్రియుణ్ణి మాత్రం గొప్ప స్థానాన్నే ఉంచాలి. తన మనిషినే వెక్కిరించడం, హీనుడనడం క్రూరుడనడం, బుద్ధిహీనుడనడం ఒక ఫాషన్ అయిపోయింది. కానీ తానెవరి హస్తాల్లో రాత్రులు గడుపుతోందో అతణ్ణి రాత్రులు తిట్టిపోసి, పగలు ఇతరులముందు హీనం చెయ్యడం కన్న శృంగార హత్య ఇంకోటిలేదు. ఎవరితో స్త్రీ తన భర్తని నిందిస్తోందో వాళ్ళకి తప్పకుండా ఆ స్త్రీ మీద గౌరవం తగ్గుతుంది. తమ ప్రియులు మొదట గొప్పగా ఉండేవారనీ, తరవాత మారిపోయినారనీ సాకు చెప్పుకుంటారు. స్త్రీ పురుషులు మారిపోవడమే నిజమయితే ఆ దాంపత్యం నించి తప్పుకోడం ముఖ్యమైన ధర్మం. కాని విడిపోక, ఒకరి ప్రాణాలు ఒకరు కొరుక్కు తినడం ఎవరికీ సౌఖ్యం ఇవ్వని మూర్ఖం. తమ గోడువల్ల నన్నా, చుట్టుపక్కలవాళ్ళ బోధనవల్లనన్నా మనుషులు మారి బాగుపడతారనుకోడం గుడ్డితనం. మొదట్లో పరస్పరం చాలా ఇబ్బందులు వస్తాయి. తాము శృంగారంకోసం అనవసరంగా కల్పించుకున్న మాయ క్రమంగా త్వరలోనే విడిపోతుంది. కాని నిజమైన ఆకర్షణ ఉన్నప్పుడు, ఆ పై మెరుగులు పోయినాయని ఏడవడం భావ్యంకాదు. ఏ స్త్రీ పురుషులూ, ఆదర్శ స్వరూపులూ, లోప రహితులూ కాదన్న సంగతి తిరిగి తిరిగి జ్ఞాపకం చేసుకోడం వివేకం. ఇంకేం లేకపోయినా, ఏకాంత సమయాల్లోని వాళ్ళ శృంగారానుభవమన్నా, తక్కిన కాలాన్ని కాంతితో కప్పాలి. లోకంలో తక్కిన సంగతుల మల్లేనే, శృంగారపు మెరుగుకూడా తరిచి చూస్తే నిశిత దృష్టిముందూ తర్కం ముందూ నిలవదు. అందువల్ల మనోబలంలేని మనుషులు, ఇతరులు తమ ప్రియుల్ని దిగతీసే పరిస్థితులలో నిలవకూడదు. మాయలన్నిటిలో అందమయిన మాయ శృంగారం. దాన్ని పోగొట్టుకున్న జీవితం ఉత్త దౌర్భాగ్యం. అసలు సత్యమేమిటని తరిచిన

కొద్దీ దేంట్లోనూ సత్యం కనపడదు. ఎంత గొప్ప సత్యాన్నీ సత్య సౌందర్యాన్నీ మనసే కల్పించుకుంటుంది.

నిజానికిపోతే, తన మనస్సుకన్న తన కన్న అబద్ధం ఇంకోటిలేదు. ప్రతి మనిషీ తను నిజమనీ, తన మనసు అబద్ధం పలకదనీ, దృఢమయిన విశ్వాసంతో ఎదటి వస్తువుల నిజాన్ని పరిశీలించడానికి పూనుకుంటాడు. గొప్ప నేర్పుగల మనుషులు, తమ ప్రియులు తమ చుట్టూ అల్లుకున్న ఇంద్రజాలాన్ని చెడకుండా, ఎప్పటికప్పుడు కొత్తరంగుల మబ్బులతో, ఆశలతో, అన్వేషించే కలలతో విభ్రమం కలిగిస్తో ఉంటారు. కావలసి చెయ్యరు. కాని వాళ్ళకి సృష్టే నేర్పుతుంది సహజంగా. ఏదో జ్ఞానమనీ, స్వేచ్ఛ అనీ, ఆధిక్యత అనీ భ్రమించి తమ శృంగారానుభవాన్ని కూలదోసుకుంటారు మూర్ఖులు. ప్రియులకి గొప్ప గర్వం ఉండాలి — తాము ప్రియులైనందువల్లనే అధికులమని. కానీ ఆ గర్వం తమ ప్రియులపైన ప్రయోగించకూడదు. లోకంలో చాలా ఉన్నత స్థితిలో ఉన్న పురుషుడు తన ప్రియురాలి ముందు దాసుడుగా ప్రవర్తించాలి. శ్రీకృష్ణ సత్యభామల సంబంధం ఆదర్శం. కానీ నవీన సత్యభామల్ని ఆ పురాతన శ్రీకృష్ణుడు కూడా భరించలేడు. స్త్రీ తన హక్కుల కోసం తిరగబడుతున్నకొద్దీ, తన శ్రేష్ఠత్వంమీద, జ్ఞానం మీద అభిమానం ఎక్కువై ఆ అహంభావాన్ని తన ప్రియుడి నెత్తిమీద రుద్దుతోంది. కనకనే ఈ స్త్రీలు ఎండి కర్కశులై ఏ శాంతీ లేకుండా తమ మిత్రులందరికీ దుర్భరులౌతున్నారు.

స్వేచ్ఛ ఉండాలి స్త్రీకి, తన ప్రియుణ్ణి అంగీకరించడానికీ, నిరాకరించడానికీ. అట్లాంటి స్వేచ్ఛలేక పోబట్టే పెళ్ళిలో శృంగారం మృగ్యం. వేశ్య స్వేచ్ఛ, డబ్బు మీద ఆధారపడడంవల్ల అక్కడా శృంగారానికి ఎక్కువ తావులేదు. తనని మనస్ఫూర్తిగా కోరి వరించారనే భావం కలగాలి స్త్రీ పురుషులికి. కానీ స్వేచ్ఛనీ ఎదిరింపుకీ, వెక్కిరింపుకీ, నీచపరచడానికీ ఉపయోగించకూడదు. శృంగారంలో దిక్కులేని తనం చవక పరుస్తుంది మనిషిని మళ్ళీ. ఎంత వ్యామోహం ఉన్నాసరే నిరాకరణకి స్వేచ్ఛని ఒక చేతిలో కనబరుస్తూనే ఉండాలి. ఉపయోగించుకోడానికి అవసరం కలగకూడదు గాని, ఎప్పటికీ తాము దుర్లభులమనీ తమ విలాసాలూ, ప్రేమ దృష్టులూ, చర్యలూ తమ అనుగ్రహం మీదనే జరుగుతున్నాయనిపించాలి. అందువల్లనే శృంగారం రాజపుత్ర కథలలో అంత ఉన్నత స్థాయిని పొందింది. ఇప్పటికీ కొన్ని అనాగరిక జాతుల్లో విరివిగా ఉంది. ఈ రసపుత్రిక సగం గోషా. దుర్లభురాలు. ఎంతో ప్రయత్నించి గానీ తన ప్రాణాన్ని వొడ్డిగానీ ఆమె అనుగ్రహాన్ని సంపాయించలేడు ప్రియుడు. ఆమెకి అయిష్టమయిందా ప్రాణాలు తీసుకుంటుంది, తీస్తుంది. కానీ అంగీకరించదు. ఎంత కష్టంమీద ప్రియులు అందితే అంత విలువ ఎక్కువ. కాని పూర్తిగా దుర్లభులైతే ఆకర్షణ ఎండిపోతుంది. ఈ మాత్రం శృంగారం జీవితం అంతలోనూ జీవించే ఉండాలి.

నిందించుకోవడం చాలా అల్పం, మూర్ఖం. ఇబ్బందులు చెప్పుకోవచ్చు. ఎంత సేపటికీ మెచ్చుకోవడం మీదనే ఉండాలి దృష్టి. ప్రియుల మధ్య ఎప్పుడూ శాంతమైన

వాతావరణం చాలా అవసరం. ఇంటి దగ్గర ఉండే స్త్రీ, పురుషుణ్ణి ఒక మహారాజుని, దైవాన్ని ఆహ్వానిస్తున్నట్టు తానూ, తన పరివారమూ ఎదురుచూస్తో అతనికోసం తయారుకావాలి. జాగ్రత్తగా అతనికి ఏ విషయాలపై అభిలాషో, గర్వమో తెలుసుకుని, వాటి విషయమై అతనికి బలమూ, ప్రోత్సాహమూ, అతను సాధించినదానికి మెప్పూ, సాధించలేని దానికి సానుభూతినీ ఇవ్వగలిగిన ఔదార్యం చాలా అవసరం. అట్లానే పురుషుడు, స్త్రీ తనకోసం చేసిన ప్రయత్నాలపైన, ఆమె కోర్కెలపైన గొప్ప మర్యాదతో, మన్ననతో సంతోషం చూపాలి.

పురుషుడి కీర్తి, బలం, పలుకుబడి, సమర్థత..... వీటిమీద స్త్రీకి ఎక్కువ మమకారం. అతని సత్ప్రవర్తనా, సూనృతం, సహనం ఇటువంటి పురాణాలు పొగిడే ప్రాశస్త్యం మీద ఆమెకి ఎక్కువ మక్కువ లేదు. ధర్మరాజు మీదకన్న భీమార్జునులమీదే ద్రౌపతికి ప్రీతి. అతను లోకంలో ఔన్నత్యాన్ని పొందేందుకు ఎన్ని దుష్టత్వాలు చెయ్యనీ, స్త్రీని అవి ఎక్కువ ఇబ్బంది పెట్టవు. ఎక్కడనించి తీసుకొస్తేనేం ఎట్లా తెస్తేనేం, పురుషుడు ధనాన్నీ, కీర్తినీ స్త్రీ పాదాలముందు అర్పిస్తే చాలు ఆమెకి తృప్తి! ఆమె ఎడల దుష్టత్వం చూపకపోతే చాలు. లోకాన్నంతా అన్యాయం చేసినా, ఆమెకి ఇబ్బంది లేదు. మండోదరివంటి స్త్రీకి రావణుడి మీద అందుచేతనే అంత పట్టు. పురుషుడిలో స్థిరత్వాన్నీ వజ్రబలాన్నీ కోరుతుంది స్త్రీ. నవీన యువకుల నాజూకు షోకులు ఆమెని స్థిరంగా ఆకర్షించవు. లోకపు ధూళినీ, రక్తాన్నీ ఎంతైనా భరిస్తుంది స్త్రీ తన ప్రియుడి వొంటిమీద. స్త్రీ ముందు పురుషుడు ఎప్పుడూ లోకువకాకూడదు. చాతకానివాడు కాకూడదు. బలానికీ, ఉత్సాహానికీ, ధైర్యానికీ, ధనానికీ ఆమెపైన ఆధారపడరాదు.

గొప్ప ఇష్టం కలగగానే, ఇద్దరూ ఒకటి కావాలనీ, దగ్గర అవాలనే కోర్కెలవల్ల ఒకరి అభిప్రాయాలు ఇంకోరివి కూడా కావడం చాలా అవసరమనుకుని, ముఖ్యంగా పురుషుడు స్త్రీ అభిరుచుల్ని సరిదిద్దచూస్తాడు. అంతకన్నముందు అతనీ విధంగా మారాలని చూసి, అతని ఆలోచనల్నే చిలక పలుకులు పలుకుతో ఉంటుంది ఆమె. ఆ మోహం తగ్గగానే ఈ మానసిక ఫోటో అంత అసహ్యం ఇంకోటి ఉండదు. స్త్రీ అతని ఫోటో కూడా కాకుండా, వికృతమైన కారికేచర్‌గా తయారౌతుంది. అతనికీ అసహ్యం పుడుతుంది. పైగా ఒకరికొకరు ఎంత భిన్నంగా ఉంటే అంత అనురక్తి నిలుస్తుంది. సహనం, క్యూరియాసిటీ నేర్చుకుంటే చాలు.

మొండి వాళ్ళు

'సం'ఘంలో ఇన్ని లోపాలున్నాయి! మార్పు కలగచెయ్యాల'ని ఎవరన్నా అంటే, ఆ మార్పు అప్పుడే జరిగినట్టూ, లోకం తల్లకిందులైనట్టూ గోల పెగతారు. ఎవరో సంఘనీతికి వీరిని కావలి పెట్టినట్టు సంఘం పాడౌతోందని బిగ్గరగా అరుస్తారు.

వీరి అరుపుల్లో వీరు చేసే పనులు పైకి రావని వీరి ఆశ. కానీ సంఘాన్ని మార్చడం ఒకరివల్ల ఒకరోజులో అంత సులభం అయే పని కాదు. మార్పు కావాలనే వారొకరుంటే, కూడదనేవారు వెయ్యిమంది ఉన్నారు. ఒక వేళ కొత్త మార్పు వొచ్చినా వరదవలె మీదపడి చంపదు. సంఘం దానికి వీలుగా తనూ మారి స్థిమితపడుతుంది.

పోనీ, ఈ వివాహబంధంవల్ల నీతి వంతులన్నట్టు అందరికీ సౌఖ్యంగా, ఆరోగ్యంగా, సుందరంగా ఉంటే అనుకోవచ్చు. అట్లా లేంది, ఎక్కడ చూసినా కుళ్ళూ, దుర్నీతి, దొంగతనం, హింస, బానిసత్వం, కళ్ళున్న వాళ్ళందరికీ కనపడుతోనే ఉండగా, ఈ వివాహబంధమే శాశ్వతంగా ఉండాలనడం మూర్ఖం.

"అవును, ఈ వివాహంలో లోపాలున్నాయి! కాని ఇదే లేకపోతే ఇంతకంటే ఎక్కువ ఘోరాలు సంభవిస్తాయి" అంటారు.

ఉన్నదేదో మంచిదనీ, రాబోయేది ఎప్పుడూ అరిష్టమనీ వీరి నిశ్చితాభిప్రాయం. కొత్త మార్పులని గురించి ఆలోచించడం గానీ, అనుష్ఠించడానికి కానీ ఓపికా, ధైర్యమూ లేవు. పుట్టబోయే వారికి పేరెక్కడ పోతుందో, తమ భార్యలూ, భర్తలూ ఎక్కడ లేచిపోతారో అనే భయం ఎంతసేపటికీ. అక్షరజ్ఞానం లేని మూర్ఖులకి, రైలుబండినీ, భూకంపాన్నీ ఎలక్ట్రిక్ ఎన్జైన్నీ చూస్తే ఎంత భయమో, ఎక్కడ ఏ మరని ముట్టుకుంటే ఏం మొహాన పేలుతుందో అని ఎంత వణుకో, ఈ నీతిపరులకీ మర్యాదస్తులకీ మార్పులని చూస్తే అంత భయం. వివాహంలో ఏం కదిలిస్తే ఏం తన నెత్తిమీదికి వస్తుందో అని వీళ్ళ కంపం. వీళ్ళకీ, ఈ నీతి మూర్ఖులకీ భయం కలుగుతుందేమో, కష్టం కలుగుతుందేమోనని సంకోచిస్తే ఎన్నటికీ అభివృద్ధి అనేదే ఉండదు. వాళ్ళు నీతి మంతులనీ, ధర్మపరులనీ సంక్షేమం కోరే ఆ మాటలు చెపుతున్నారనీ అనుకుని విశ్వసించడం తప్పు. వాళ్ళ సుకుమార నీతి హృదయాలని ఎంత వొణికించి చీలిస్తే అంత మంచిది. వాటిలోంచి నీరంతా బైటికి కారి లోకానికి శుభం కలగజేస్తుంది.

"సంఘంలో ఇన్ని దురాచారాలు ఉన్నాయి, ఇంతమంది నలిగి పోతున్నారు అన్యాయంగా" అని అన్నా, రాసినా,

"నీకెందుకయ్యా అదంతా? నీకు కావలసినవి మాతో చెప్పడమెందుకు? అట్లాంటి కల్మషాలు వినడం, తెలుసుకోవటం కూడా మాకు ఇష్టంలేదు. వాటిని దూరంగా తరిమి, మీద నాలుగు రాళ్ళేసి, కుళ్ళుబెట్టు" అంటారు.

వాడు ఊరుకోకపోతే, "వీడు చెప్పే వన్నీ అబద్దాలు. అప్రాచకాలు, దుర్నీతి. వీడూ అట్లాంటివాడే. వాడితో మాట్లాడకండి" అని గోల పెడతారు.

కథలూ, నాటకాలూ, అన్నిట్లోనూ పవిత్రవంతులే ఉండాలి. దుర్మార్గులుంటే వాళ్ళకి శిక్షపడి తీరాలి. లోకమంతా అట్లా ఉందని వీరి మనసుకి వీరు ఆ పుస్తకాలు చదివి శాంతి తెచ్చుకోవాలి. వ్యభిచారం చేసేవాళ్ళూ, లేచిపోయేవాళ్ళూ వీరి లోకంలో లేనేలేరు. అంతా ధర్మమే. చికరికి భార్యా భర్తా సుఖంగా తెర వెనకాలికి వెడితే గాని వీరికి నాటకం రుచించదు.

"భర్తలు లేని అనాథలు ఉన్నా"రంటే "వాళ్ళ సంగతి మాకెందుకు పోనిద్దురూ" — అని నిశ్చింతగా, సోమరితనంగా, ఏ ధర్మాత్ముల సంగతో, పతివ్రతల కథలో చదువుకుంటో, రాత్రి శుభ్రంగా భోజనంచేసి, భార్యతో ఒక పక్కమీదే పడుకుని నిద్ర పోతారు.

నిజంగా దయా, అంతరాత్మా ఉన్న వాళ్ళు కూడా చాలామంది ఉన్నారు. కాని వాళ్ళకి ఈ ఘోరమైన సంగతులు చెప్పే వాళ్ళు లేరు. చెప్పే మార్గంలేదు. వాళ్ళకి తెలీదు. వాళ్ళు చదివే నిర్మలమైన పుస్తకాల్లో, పత్రికల్లో ఇట్లాంటి వాస్తవమైన సంగతులు ఉండవు. పవిత్రమైన పత్రికలు, పెళ్ళాం మొగుడూ కొట్టుకుని, తిట్టుకుని గతిలేక మళ్ళీ మొహాలు తిప్పేసుకుని కావలించుకున్నారన్న కథ పెద్ద అక్షరాలతో అచ్చువేస్తాయిగాని, బాధలుపడి, భర్త దగ్గిర్నుంచి లేచిపోయిన పిల్లల సంగతి అచ్చువెయ్యవు. నిర్మలాత్ములూ, ఆచారపరులూ, పతివ్రతలూ ఐనంత మోసగాళ్ళూ, భయస్తులూ, స్వార్థపరులూ, ఎవరూలేరు. వాళ్ళ కూతుళ్ళూ భార్యలూ లేచిపోయి ఎక్కడ అప్రదిష్ట తెస్తారో, వారి వితంతు తోబుట్టువులూ, తల్లులూ తిరగబడి ఇంటి చాకిరీకి ఇబ్బంది కలగజేస్తారో అని భయం వాళ్ళకి. వారి పవిత్రతా, నిర్మలత్వమూ, మోసమూ, బైట పడతాయి. కనక నిజం చెప్పేవాళ్ళ నోరు నొక్కాలని ప్రయత్నిస్తారు.

ఈ సంస్కరణం చాలామందికి అక్కర్లేదు. వారి వంట భార్యలతోనూ, ఆఫీసు భర్తలతోనూ సుఖంగానే ఉంటారు. తినికూచోలేక కొందరు మార్పులని అరుస్తా రెందుకా అని ఆశ్చర్యం వేస్తుంది వారికి. వారి వేదాంతం ప్రకారమే, వారివలెనే స్వార్థమైన లాభం కోసమే ఈ సంస్కర్తలు పాటుపడుతున్నారని నిశ్చయించుకొని తృప్తి పడతారు. భోజనమూ, కామమూ తీరుతో వుంటే వారికి లోకమెట్లా ఉన్నా బాధలేదు. వాకిట్లో బిచ్చగాడూ, పక్కగదిలో బాల వితంతువూ వారి పవిత్రాత్మల్ని బాధపెట్టరు. కర్మ వేదాంతం వారి ఆనందానికీ, నిశ్చలత్వానికీ సాయపడుతుంది. కాని అమలులో ఉన్న పరిస్థితిలో తృప్తిపడక ఏ కారణంచేత నైతేనేం, వేరు విధమయిన జీవనాన్ని కాంక్షించే వారున్నారు. వారినన్నా సుఖంగా వారి మార్గాన పోనీక, అణగతొక్కి తన స్వస్థతకోసమై సంఘం బాధ పెడుతోంది. తమ కోర్కెలూ, తమ బాధా, ఆశలూ, తిరుగుబాటు నైజమూ ఉత్తమములని తెలీక, లోపలే వాటి నణచుకొని, బాధలకీ, నీచత్వానికీ లోపడేవారున్నారు. వారికి ఈ పుస్తకం. తాము చేసే నిరంకుశ ప్రభుత్వం, తాము చూపే క్రూరత్వం న్యాయమనీ, అవసరమనీ, సంఘానికీ క్షేమదాయకమనీ, మోసపోయి, నమ్మి, ధర్మబుద్ధితో బాధలు పెట్టే బుద్ధిమంతులున్నారు. వాళ్ళ కళ్ళు తెరిపించేందుకీ పుస్తకం. ఇది మర్యాదలో, నీతిలో, ప్రవర్తనలో, మెట్టవేదాంతంలో, సంఘసంస్కారపు మిషలో, దేశాభ్యుదయ ప్రచారంలో, మతంలో గడ్డకట్టి పాషాణులైన మహాత్ములకి కాదు. వారిని ఏదీ చలింప చెయ్యలేదు. వారి మృదు ఆత్మలని చీల్చి, పాషాణ హృదయాల్ని బద్దలుకొట్టి, మీద నించి నడిచిపోవాల్సిందే. కదలరు.

"సంఘం పాడయింది, లోకం తల్ల

కిందులయింది, కులాచారాలు మంట కలిశాయి, కలియుగం అంతమౌతుంది" అని గొణగడం తప్ప ఆ కాలిటూ, ఈ చెయ్యి అటూ కదిలించే శక్తికూడా లేదు వారికి.

యవ్వనంనించీ వృద్ధాప్యం వరకూ, ప్రజల జీవితాన్ని పాలించే ఈ మహాశక్తిని గురించి రాయడంగానీ, మాట్లాడడం గాని బూతైపోయింది. అందువల్ల ఈ విషయమై నిర్మలమయిన జ్ఞానం నశించి, ఎవరి ఊహలు వాళ్ళ మనసుల్లోనే కుళ్ళి చెడిపోతున్నాయి. ఒకరు పొందగలిగిన అనుభవ లాభం ఇంకొకరికి లభించడంలేదు. కామం సిగ్గుపడవలసిన విషయం అనుకోడంవల్ల, వారి ఊహలూ, కోర్కెలూ ఎవరితోనూ చెప్పుకోకపోవడంవల్ల ప్రజలలో దీని గురించి చాలా తప్పు అభిప్రాయాలు బైలుదేరాయి. ఈ అజ్ఞానం అధికమైన దుఃఖాన్నీ, బాధనీ కలిగిస్తోంది.

కామమూ, ప్రేమా సంబంధమైన ఇన్ని మూఢాభిప్రాయాలూ, అన్యాయమైన నిబంధనలూ కలగడానికి ఈ విషయాల్లో అనుభవమే కారణం. కామం లేనివాడికి కామం గలవాడు పాపాత్ముడివలె కనపడతాడు. భార్య మీద ఇష్టం గలవాడికి వ్యభిచారం అర్థంకాదు. ఎప్పుడూ ఒక భార్యతోనే కొందరు ఎట్లా కాపరం చెయ్యగలరా అని వ్యభిచారికాశ్చర్యం. అందం అర్థం కాని వాడికి, అందంకోసం చెవులు కోసుకునే వాడు ఉన్మత్తుడివలె తోస్తాడు. ఒకరి మొహం ఇంకొకరికి రాదు. ఒకరి స్వభావం ఇంకొరికి రాదు. కొందరు కామాన్ని అణుచుకుంటారు! అణుచుకోగలిగినంత కొంచెమయి ఉంటుంది. అణుచుకోలేని వాళ్ళు, అణుచుకోలేనంత ఎక్కువ కామోద్రేకం కలవారూ ఉంటారనే సంగతి మరిచిపోయి అందరూ అణుచుకొని తీరాలి అని శాసిస్తారు. స్త్రీ స్వభావమూ, కామమూ పురుషుడికి అర్థంకాదు. పురుషుడి వ్యవహారం స్త్రీకి అర్థంకాదు. ఇండియా స్త్రీలని చూసి కూడా బానిసలనడం పాశ్చాత్యులకి మామూలు. పాశ్చాత్యుల్ని చూడకుండా వాళ్ళందరూ దుర్నీతిపరులనడం ఈ దేశస్తుల మర్యాద.

ఈ గోలంతా ఈ విషయమై మనుషులు బైటికి మాట్లాడకపోవడం చేత వచ్చిన తిప్పలు. చర్చలూ, పుస్తకాలూ, అభిప్రాయాలూ విచ్చలవిడిగా ఈ జ్ఞానాన్ని వ్యాపింపచేయాలి. చాలామంది పెద్దమనుషులూ, స్త్రీల విషయంలో మనసే ఉన్నట్టు కనపడని వాళ్ళూ, వంటరిగా మిత్రమండలితో కలిసినప్పుడు నాలికలు సళ్ళువేసి ఇంక వినరాని అనరాని మాటలన్నీ మాట్లాడతారు. కాని ఆ సంభాషణకీ, స్పష్టమయిన బూతులకీ కారణం వేరు. సరైన మార్గాన తృప్తిపడడం చాతకాక, దప్పిక తీరక, నాలికద్వారా వాగి తృప్తిపడతారు. పతివ్రతల మనుకునే గొప్ప స్త్రీలు ఏకాంతంగా నలుగురు పోగైనప్పుడూ ఇంతే. కానీ శాస్త్రీత్యా, ఆరోగ్యవంతంగా, సిగ్గుపడకండా, బహిరంగంగా మాట్లాడే వారు అరుదు.

దొంగ అమాయకత్వాన్ని మనదేశం క్రిష్టియను మతస్థులదగ్గిర్నించి నేర్చుకుంది. పూర్వం సన్యాసులు స్త్రీని వర్జించేవారుగాని, గృహస్తులు కామమన్నా, కామ శాస్త్రాలన్నా, కామ విధులన్నా, స్త్రీని అనుభవించడమన్నా సిగ్గుపడే దుర్నీతిలో ఎన్నడూలేరు. మొహమాటం లేకుండా అన్ని విధాలా సౌఖ్యం

పొందేవారు. వారి మనసులు పరిశుభ్రంగా ఉండేవి. క్రిష్టియను మతం సాంగత్యం వొచ్చిం తరువాత స్త్రీ సాంగత్యమే బూతు పని అయింది. ముఖ్యంగా స్త్రీలకి పురుష వాయువులు నరకంనించి వీచే విషజ్వాల లైనాయి. ఆ పని తమకే తెలీకుండా పొద చాటున శరీరవాంఛని ఓర్చుకోలేక బల హీనత్వంచేత, ఆ పురుష పశువు ప్రోద్బలం చేత చేసే పాపకార్యంగా మారింది. సైతాను ప్రోత్సాహం చేత ఆ పని జరిగినా దానిని గురించి మాట్లాడకూడదు, తెలుసుకో కూడదు, తలుచుకోకూడదు. తెలిసినా, తెలిసినట్టు ప్రవర్తించకూడదు, జరగనట్టే ఉండాలి. భార్యాభర్తలైనా సరే, రాత్రిం బగళ్ళు విడిగా ఉన్నట్టే కనపడాలి. ఎవరికీ తెలీని సమయంలో, చీకట్లో, అర్ధరాత్రి దొంగతనంగా, సిగ్గుపడుతో, తిట్టుకుంటో, ప్రార్థనలు చేసుకుంటో, ఒక్క నిమిషంలో కళ్ళు మూసుకుని, బహిర్భూమికి వెళ్ళినట్టు ఏమూలో ఆ కార్యం ముగించి, చడీచప్పుడు కాకుండా మర్యాదస్తులవలె ఏమెరగనట్టు ఇంకో ధ్యాసలో కనపడాలి. సంసార కార్యం వల్ల సౌఖ్యం కలుగుతోందని ఒప్పుకో కూడదు. దానిసంగతి నేర్చుకుని ఇంకా ఎక్కువ ఆనందాన్ని సంపాయించుకోడా నికీ, తెలుసుకోడానికీ ప్రయత్నమన్నా చెయ్యకూడదు. ఇట్లాంటి గతికి వొచ్చింది అతి సుందరమైన సరళమయిన సృష్టి కార్యం.

ఈ సాధారణ ప్రజలందరికీ ఈ వివాహ బంధం అవసరమే. అవసరం కనకనే ఈ సంస్థ అమలులోకి వచ్చింది. నిలిచివుంది. ఇంకా దాన్ని అతిక్రమించగల పరిణామం రాలేదు ప్రపంచానికి. కానీ ప్రత్యేక వ్యక్తు లనేకులు వివాహబంధం అవసరం లేనంత అభివృద్ధి చెందారు. వారికి వివాహం ఆటంకం. వారిని లోకం బహిష్కరించి బాధి స్తోంది. స్త్రీ తన బానిసా, తన సొత్తూ అను కునీ, పురుషుణ్ణి స్త్రీ అట్లాగే అనుకునీ ఈర్ష్య పడ్డన్నాళ్ళు ప్రపంచ మంతకన్నా అభివృద్ధి చెందదు. కానీ ఇట్లా కొందరు బంధనాలు వదిలి, వెలివడి, ప్రయత్నించి, బోధించి మార్పు తీసుకునివస్తే కాని, దానంతట అదీ ఏ సంస్కారమూ రాదు. ఈ నూతన ప్రతి స్థాపనకి స్త్రీయే ముఖ్యసాధనం. ఆమె స్వేచ్ఛ నభిలషించి, తిరగబడి పురుషుణ్ణీ, సంతతినీ, ప్రపంచాన్నీ పునరుద్ధరించాలి. ఇట్లా తను బానిసైపడి ఉన్నన్నాళ్ళూ పురు షుడిట్లా అల్పుడూ, క్రూరుడూ, అయి ఉంటాడు. సంతతి నీచులూ బానిసలూ అయి ఉంటారు. ఈ నూతనయుగ ప్రతి ష్టాపకులు ఈ నీచత్వం నించి, అల్పత్వం నించి, "జలసీ"నించి, అధికారంనించి ఉన్నతులు కావాలి. స్వార్థాన్నీ అహంకారాన్నీ జయించాలి. అప్పుడుగాని స్వేచ్ఛకీ, నూతన సంస్కరణానికీ యోగ్యులు కారు. స్వాతంత్ర్యం కావాలన్నప్పుడు, ఈ నీచత్వా న్నంతా ఇంకా హృదయంలో దాచుకుని, తాము స్వతంత్రత ననుభవిస్తో, ఆ స్వతం త్రమే తమ బంధువులకీ, ఇతరులకీ ఇవ్వక, ఉత్త నియమ రహితులూ, అతి స్వార్థ జీవనులూ కావాలనికాదు ఆశయం. ఈ అల్పగుణాలున్న వారికీ, తమ తామస గుణాల్ని అణుచుకోలేని వారికీ, ఈ సంఘ నిబంధనలు అవసరమే.

సృష్టికార్యంలో సిగ్గుపడవలసింది ఏమీ లేదు. సౌఖ్యాల్లోకెల్లా సౌఖ్యమయింది అది. ఇంకొక జీవితో శరీరమే కాకుండా ఆత్మ

కూడా ఏకీభవించిందా, ద్వంద్వమనేదే ఆ నిమిషాన నశించిందా అన్నంత సమీపానికి వస్తాము. అప్పుడు ప్రపంచాలు సృజించే ఈశ్వరుడి అంశని మనలో వ్యక్తీకరింప చేసుకుంటాము. ఆ శక్తిని చూసి ప్రతి మనుష్యుడూ గర్వపడవలసిన విషయము. అది ఈ కాలంలో నీచంగా మారింది. దానికి సంబంధించిన పనులన్నీ దొంగతనాలై పోయాయి.

సాయంత్రమే కచేరినించి వచ్చేప్పుడు ఒక అణా పకోడీలు కొని, ఆ పొట్లాన్ని ఎక్కడో తక్కినవారు చూడకుండా రాత్రి పదింటిదాకా సంరక్షించాలి. 'కాణీ' పువ్వులు కొని వాటిని ఇంట్లో తక్కిన స్త్రీల కందకుండా భార్య కొప్పుకి అందించాలి. ఇంక రాత్రి కావడంతోటే, ఎవరూ చూడకుండా గదిలో దూరడం. ఆ గదికి తలుపులూ, కిటికీలూ, ఉండవు. తరతరాలనించి ఒక మంచం మూల మురుగుతో ఉంటుంది. పూర్తిగా పొట్టనిండా భోజనంచేసి, ఆ అయాసంలో, సగం నిద్రలో, దుమ్ములో మురికిలో, కుళ్ళు అత్తరు పూసుకుని, నిష్కామంగా, సంతానాన్ని కని, పైగా ఆ పేరు పెట్టుకుని ప్రవర్తిస్తారు దంపతులు. ఒకరి మీద ఒకరికి ద్వేషం గలవారు ఒక్కొక్కప్పుడు ఏ విషయమో తగాదా పడుతూనే — ఒకరి మొహం ఒకరు చూడడమే భరింపలేనివారు — అనుమానాలతో, కోపాలతో, చిరాకులతో బాధపడేవారు — వీళ్ళూ చప్పున రెండు నిముషాల్లో పూర్తిచేసుకుని ఒకరినొకరు చూసుకోలేక, భరించలేక, విడిపడి దాటిపోతారు. పాపం దూరంగా కూడా పోలేరు. ఆ గది దాటడానికి వీల్లేదు. ఒకరిమీద ఒకరికి అసహ్యం. వీళ్ళని బైట చూస్తే తక్కినవాళ్ళకి అనుమానం. ఆ మంచం మీదే, మళ్ళీ తగాదా ప్రారంభం. బిగ్గరగా మాట్లాడ్డానికి వీల్లేదు — మోహంతో గానీ, ద్వేషంతోగానీ. గది పక్కన ఇంకో జత! పక్కన పిల్లలు! నరకం!

స్వేచ్ఛగా, శుభ్రమైన, స్థలాల్లో సిగ్గులేక అనుభవించమంటే పశుత్వంట! అడవుల్లో, పచ్చిక బయిళ్ళలో, అకాశంకింద కలుసుకునే పశువులు ఈ గదుల్ని చూసి, రోత పడవూ? ఈ గాలిని ఒక్క నిముషం భరించగలవా? పశువులా? కాదు. బొద్దింకలు, పందికొక్కులివి.

అసలు సృష్టిలో ఈ స్త్రీ పురుష నీతి సమస్య చాలా తక్కువ. ఈ వ్యభిచారాలూ, జెలసీలూ, ఏడుపులూ, విరహాలూ, లేనే లేవు. అక్రమంగా, అసహజంగా, జీవితమే కామంకోసం గడిపే మనుషుల్లోనే ఎక్కువయింది. స్త్రీనించి సహజమైన స్నేహ మాధుర్యం స్వీకరించే శక్తిని పురుషుడూ, పురుషుడి దగ్గర్నించి గౌరవాన్నీ, భక్తినీ పొందే గొప్ప తనాన్ని స్త్రీ పోగొట్టుకుని, ఒకరినించి ఒకరు సంపాయించే సౌఖ్యం ఇది తప్ప వేరేలేక, ఒకర్ని ఒకరు ఆకర్షించే పుపాయాల్ని కనుక్కుని అందుకే ఆశించి, ఉపయోగపడుతో ఉండకపోడంవల్ల ఈ సమస్య ఇంత తీవ్రంగా పరిణమించింది. ఇద్దరూ ధీరులై మేధావంతులై, ఆరోగ్యవంతులై ఉంటే వొకరి పనులలో, మాటలలో, ఆలోచనలో ఒకరికి అపరిమితానందం కలుగుతుంది. స్నేహమే ప్రధానమవుతుంది. ఎప్పుడో ఏ మహదానందంలోనో సిగ్గుపడక, నిర్మలంగా, చక్కని స్థలాలలో, అతిప్రేమతో, కాంక్షతో కలుసుకుని సౌఖ్యపడతారు.

సంఘమూ - స్త్రీ

సహజమైన కామం తీర్చుకోడం ఒక్కటే ఉద్దేశ్యమైతే వివాహం అనవసరం.

సంఘానికి వివాహం అవసరం —

1. పిల్లల క్షేమం కోసం తల్లిదండ్రులిద్దరూ పాటుపడడంకోసం.

2. భార్యభర్తలు కాపురాలుగా ఉంటే, స్త్రీకోసం పురుషులూ, పురుషుడి కోసం స్త్రీలూ తగాదాలు పడరు.

3. సంఘం ఆరోగ్యం.

వ్యక్తులు వివాహం ఉండాలని ఎందుకు వాంఛిస్తారంటే....

1. మోహంవల్ల స్త్రీ గానీ, పురుషుడుగానీ, ప్రత్యేకంగా తన హక్కు కావడానికీ.

2. ఒకరు ధనం సంపాయిస్తే రెండోవారూ, పిల్లలూ బతకడానికీ.

మోహంవల్ల స్త్రీ పురుషులు ఆకర్షింపబడ్డా ఆ మోహం సాధారణంగా చంచలం కావడంచేత, సహజంగా స్త్రీ పురుషులు స్వేచ్ఛనే కోరుతారు. కానీ సంఘం తన క్షేమం కోసం వ్యక్తుల్ని బాధించాలని కోరుతుంది. కనక వ్యక్తికీ, సంఘానికీ ఎప్పుడూ ఈ యుద్ధం ఉంటోనే ఉంది. ఈ వ్యక్తుల్ని బంధించడానికి సంఘం ఉపాయాలని పన్నింది.

1. వివాహం ఈశ్వర నిర్మితమనీ, శాస్త్ర నియుక్తమనీ,పుణ్యమనీ, ధర్మమనీ శాసించారు. ముఖ్యంగా హిందూ సాంప్రదాయంలో. పైగా భర్తకేకాక సమిష్టి కుటుంబ క్షేమంకోసం స్త్రీని పూర్ణంగా ఆధీనురాల్ని చేశారు.

2. పిల్లలకి ఆస్తిమీద హక్కులు ఏర్పరిచారు.

3. సంఘ బహిష్కారంతో బెదిరించారు. అవుమర్యాద అనే పెద్ద భయం వల్ల పాలిస్తున్నారు.

ముఖ్యంగా సంక్షేమం స్త్రీమీద ఆధారపడి ఉన్నదని ఆమెని సంఘ దాసిగా చెయ్యాలనే ఉద్దేశ్యంతో హిందూ పూర్వ సంప్రదాయంలో చాలా కట్టుదిట్టాలు చేశారు. వివాహంమీద భక్తేగాక, ప్రత్యేకం భర్త మీద భక్తిని అమితంగా పెంచారు. భర్తే దైవం — ఎటువంటి వాడైనా, అతని రూపం కాదు, గుణంకాదు — కాని అతనే భర్త అయినంత మాత్రం చేత పూజ్యుడైనాడు. పుట్టినప్పటినించి వివాహం స్త్రీకి ఆదర్శమనీ, పెళ్ళికై కన్నామనీ, పసిపిల్ల అయినప్పటినించి కూడా భర్త నేర్పరచి భర్తకి ఆధీనమూ, సేవా, భర్త గుణాలు పొగిడి ఉగ్గుపాలతో సేవా ధర్మాన్ని బోధించారు. పెళ్ళి అయినప్పటినించీ ఆ భర్త ఆయువు కోసం పూజలూ, వ్రతాలూ, నోములూ అనేకం చేయించి, పాటలు పాడించి అతనితోనే తన జీవితమనీ, సమస్తమూ, తన అందం, కళ, శోభ, ఆనందం, ప్రాణం అంతా అతనేననీ అభిప్రాయం నాటారు. ఒక్క భార్యేగాక, అత్తా, మామా, మరదళ్ళూ, బంధువులూ అందరూ గౌరవం చేశారు అల్లుణ్ణి. ప్రేమ, మోహం, కామం, వీటి ప్రసక్తేలేదు. దేహం, మనసు, ప్రాణం అన్నీ భర్తకి అర్పితమైనాయి. రెండోవిధి — ఇంక పిల్లల్ని కని తల్లియై వాళ్ళని పెంచి

ధన్యురాలు కావడం, ఇట్లాంటి ఆదర్శాలతో స్త్రీ జీవితాన్ని అద్భుతంగా పాలించారు. అనేక యుగాలు వేరే ఆలోచనకీ, ఆకర్షణకీ, దుర్నీతికీ, తిరుగుబాటుకీ ఎడం లేదు. వ్యవధి లేదు. కాపరానికి వెళ్ళినప్పటినుంచి భర్తతో కలసి నిరంతర కర్మకాండ. వ్రతాలూ, పూజలూ, అగ్నిహోత్రాలూ, తద్దినాలూ, విచక్షణలేని బండసేవతో స్త్రీకి ఊపిరాడకుండా జీవితం నింపేశారు. ఈ విధంగా భర్తతోటీ, సంసారంతోటీ, పత్నికుండే సంబంధం కామబద్ధమూ, మోహబద్ధమూ కాక, మత, ధర్మ బద్ధం చేశారు. చివరికి భర్త శవంతో కాలడమే మహావరంగా పరిగణించుకునేటంత భక్తీ, మహిమా కల్పించగలిగారు, అద్భుతంగా.

వర్ణ సంస్థ వలెనే ఈ వివాహ సంస్థ కూడా ఎంతోకాలం నిలిచింది. కానీ ప్రత్యేక వ్యక్తులు ఈ ఇనప నిబంధనలని ప్రతి యుగంలోనూ మీరుతోనే ఉన్నారనీ, ఇంత ప్రయత్నమూ కూడా, రసికతగల హృదయాలపట్ల వ్యర్థమే అయిందనీ, పురాణ కథలే సాక్ష్యం. కాని ఈనాటికి కూడా ప్రజా సామాన్యానికి మాత్రం ఆట్టే శ్రమ పెట్టకుండా ఉండేవాడూ, ఇద్దరు ముగ్గురు పిల్లల్ని ఇవ్వగలవాడూ అయిన భర్తా, కాపురమూ చాలును. అంతకన్నా ఎక్కువ వాంఛించరు. కనకనే వివాహాన్ని చూస్తే ప్రజలకి అంత యిష్టం.

ప్రత్యేక వ్యక్తికీ స్వాతంత్ర్యమే ఇష్టం. స్వతంత్రం ఇస్తేనేం? ఒక భర్తతో కామం దీర్చుకోవడం ధర్మమని ఒప్పుకున్నారు. శరీరేచ్ఛ అని తిట్టడం లేదు. కనక ఇరవై మందితో కామం తీర్చుకున్నా భేదం లేదు. కాని పిల్లలూ, సంసారమూ నిలవదు. కానీ ఇప్పటి సంసారాల వల్ల పిల్లలెంత వరకూ క్షేమపడుతున్నారని ఆలోచిద్దాం. పిల్లల క్షేమం కోసం—

1. తల్లిదండ్రులు ఆరోగ్యవంతులూ, బుద్ధిమంతులూ అయివుండాలి. ఇద్దరూ, అట్లా ఉన్నారా? ఆ ఉద్దేశ్యాలతో పెళ్ళిళ్ళు జరుగుతున్నాయా? మరి పిల్లల క్షేమంకోరే సంఘం అనారోగ్యవంతుల్నీ, బుద్ధిహీనుల్నీ కనకుండా చేస్తోందా? పోనీ జతలని మారుస్తోందా?

2. తల్లిదండ్రులు పిల్లలపైన ప్రేమ కలిగి వారిక్షేమాన్ని విచారించే వారుగా ఉండాలి. పోనీ సాధారణంగా సృష్టి ఇచ్చే ప్రేమ ఏదో ఉంది. గనక, ఏ మార్గంగానో పెంచుతున్నారనే అనుకుందాము. కాని వారి క్షేమం సరిగా చూడనపుడు సంఘం ఏం చేస్తోంది? తల్లీ, తండ్రీ ఏం చేసినా అప్పీలు లేదు. వారు చేసేదంతా ధర్మమే నంటోంది.

3. బిడ్డకి కావలసిన శరీర విద్యా సౌకర్యాలని కలగచేసేందుకు తల్లిదండ్రులు ధనవంతులై ఉండాలి. అట్లా ఉందా? బీదవారికే పిల్ల లెక్కువ. మరి సంఘం ఏం చేస్తోంది?

కనక ఈ ప్రస్తుతపు వివాహబంధం పిల్లలకే మేలు చేస్తోంది అనుకోవడమేగాని, అది గొప్ప పొరపాటు.

కాలం మారింది. పరిస్థితులు మారాయి. పూర్వం ప్రజల మనసుల్ని పాలించగలిగిన ధర్మాలు ఇప్పుడు వ్యర్థమై పోతున్నాయి. స్వతంత్ర యోచన బలమైంది. మన దేశంలో ఇదివరకు చేస్తున్నట్టు ఆడ పిల్లలు భర్తల కోసం వ్రతాలు, ఆ భక్తితో చేస్తున్నారా? ఈ కట్నాలూ, ఈ

పెళ్ళికొడుకుల్ని కొనడాలూ, ఈ బేరాలూ, ఈ తగాదాలూ, ద్వేషాలలో పతిభక్తి నిలుస్తుందా? ఎందరు భార్యలకి నిజమైన పతి భక్తి ఉంది భర్తమీద? ఇంతగా ప్రజలు మారినప్పటికీ, పూర్వపు కాఠిన్యంతోనే సంసారాలని నిలబెట్ట చూస్తోంది సంఘం. సంసారాన్ని ఆనందంలో ముంచి కాల మంతా మధుర గానమువలె గడిపే భక్తి నశించిన తరవాత, ఈ శూన్య అంధకార గృహాలలో ఎందుకు మనుషుల్ని బంధించి ఉంచడం?

అన్నిటికన్నా ముఖ్యం ఆర్థిక సమస్య ఎక్కువయింది. కామం తీర్చుకోవాలన్నా, మోహించిన మనిషిని అనుభవించాలన్నా, సంసార సుఖమూ, శాంతీ కోరినా, పిల్లలపై మనసుపడినా, పెళ్ళి చేసుకు తీరాలంటుంది సంఘమూ, ప్రభుత్వమూ. కానీ పెళ్ళికాగానే డబ్బుకావాలి— అది ఏ సంఘం కటాక్షిస్తుంది? చిన్న చిన్న పిల్లలకి ఈ దేశంలో ముళ్ళు పెట్టేసరదాలేగానీ, తొందరగా కాపరాలు స్థాపించి వాళ్ళు యావ జ్జీవమూ డబ్బు కోసం పడేపాట్లూ పిల్లల్ని పెంచలేక డాక్టర్లకి డబ్బు పొయ్యలేక అవస్థలూ ఏ ముసలమ్మలు తీరుస్తున్నారు? పశ్చిమ దేశాల్లో వివాహ స్వాతంత్ర్యం ఉండడంవల్ల స్త్రీ పురుషులు బీదవారు, పెళ్ళి అసలు మానేస్తారు.

స్త్రీ స్వాతంత్ర్యాన్ని కూడా హద్దులలో పెట్టడం కష్టమైంది. పెద్దవారు సంబంధం నిర్ణయిస్తే బుద్ధితెలీక పూర్వమే కట్టా రంటారు. వాళ్ళనే నిర్ణయించుకోమంటే మేము పొరపడ్డామంటారు. చిన్నప్పుడే పెళ్ళి చేసుకోమంటే పూర్ణానుభవం రాలేదంటారు. పెద్దదయిన తర్వాత చేసుకోమంటే ఈ లోపున ఎట్లానంటారు. భర్తల్ని మార్చు కోడానికి అనుజ్ఞ ఇయ్యకపోతే వాళ్ళే మార్చు కుంటారు. అజ్ఞ ఇస్తే కాపరాలు నిలవవు. పిల్లలకి ఇళ్ళుండవు.

కాని సంఘమూ, పురుషుడూ, శాస్త్రాలూ స్త్రీని ఇంత నొక్కి పట్టినా, ఇంత శాసించినా, పై చూపులకి అణిగి ఉన్నదన్న మాటేగాని నిజంగా తన ఆత్మని కోల్పో లేదు. స్త్రీ తనలో ఐక్యమైందని పురుషుడి బడాయి. కాని నిజంగా అది పురుషుడి ప్రజ్ఞకాదు. సంఘం శాసించింది. కనకా, అది మర్యాదా, ఆధారమూ కనక భర్తమాట వింటోంది. కానీ సంఘాన్నెదిరించి, తన భర్త తనని అనుకరించమంటే, భర్తని వొదులు తుంది గాని సంఘాన్ని వొదలదు స్త్రీ. సంస్కర్తలైన పురుషుల కందరికీ అది అనుభ వేద్యమే. అంతమాత్రం ప్రేమ ఉంది ఈ సంసారాల్లో — కానీ నిజంగా ప్రేమ స్త్రీకి తటస్థించినప్పుడు ఆ ప్రియుడు ఆమెచేత ఎన్ని త్యాగాలన్నా చేయించ గలడు. ఎన్ని విధాలనన్నా సంఘాన్ని తృణీకరించేటట్టు చెయ్యగలడు.

కానీ, చిరకాలంనించి ఉన్న వివాహ సంస్థని కదిలిస్తే ఏమి ఉపద్రవాలు వస్తాయో అని భయం. ఒకవేళ వివాహం రాజశాసనాల వల్ల ఈనాడు నిషేధింపబడు తుంది అనుకుందాం, ఏం జరుగతుంది?

వివాహమనే పేరు లేకుండా ఇప్పటి వలెనే కలిసి ఉంటారు, చాలా మంది ప్రజలు. క్రమంగా మార్పులు వస్తాయి. కానీ ఒక్కసారి అల్లకల్లోలం కాదు. పోతే కాల క్రమేణా రావచ్చుననే ఉపద్రవాలేమిటి?

1. స్త్రీ స్వేచ్ఛకీ, పురుష స్వేచ్ఛకీ యుద్ధం — ఇప్పుడు సంఘాన్ని పాలించే

కట్టుబాట్లే (Conventions) తొలగడంవల్ల ధర్మమనేది ఉండదు. స్త్రీ తన స్వేచ్ఛని కోరితే, పురుషుడు న్యాయవిరుద్ధంగా అడ్డు పడతాడు. ఆమె కొత్త ప్రియుడితో పాత వాడికి యుద్ధాలు తటస్థిస్తాయి. పురుషుడి కోసం స్త్రీలూ అంతే!

ధర్మాన్నీ, న్యాయాన్నీ, స్వేచ్ఛనీ అపుడు ప్రభుత్వం నిలబెడుతుంది. ఇప్పుడు వివాహాన్ని గౌరవించినట్టే, అప్పుడు ఆ సంబంధాన్ని గౌరవిస్తారు.

కానీ ఇది విద్యవల్లా, జ్ఞానంవల్లా మనుష్య స్వభావంలోకి ఔన్నత్యమూ, పరిణామమూ వస్తేనే కాని — ఈ అనర్థం తప్పదు. యుగాలనించి స్త్రీ తన హక్కు అనుకునే పురుషుడు ఆ అభిప్రాయాన్ని త్వరలో మానలేడు. కాని మాన్పడానికి స్త్రీ స్వాతంత్ర్యం ఒక్కటే మార్గం.

2. సంసారాలు — ఇప్పటివలె ఉండవు. భార్యభర్తకి లోబడి ఉండటం పోతుంది. తాత్కాలికంగా దంపతులు మారుతారు. దీనివల్ల పిల్లలకి నష్టం కావచ్చుననే సంగతి అదివరకే వివరించాం. దీనివల్ల ఆర్థిక పరిస్థితులు మారి, స్త్రీకి ఆస్తి హక్కులూ, ఆర్జన హక్కులూ కలిగినప్పుడు ఈ సమస్య మాయమవుతుంది.

3. ఆరోగ్యం — ఇప్పుడున్నంత కంటే వ్యభిచారం తప్పకుండా తగ్గుతుంది. జ్ఞానాభివృద్ధి కలుగుతుంది. కనక ఆరోగ్యం విషయమై ఏమీ భయపడ నక్కర్లేదు.

ఒకసారి స్వాతంత్ర్యపు రుచి ప్రజలలో ప్రబలిన తరువాత దాన్ని అణచడం ఎవరి చేతాకాదు. తక్కిన జాతులలో వలెనే స్త్రీలలో కూడా ప్రబోధం కలుగుతుంది. ఆమె అభివృద్ధికి పురుషుడెంత అడ్డుపడితే, అంత శీఘ్రంగానూ, తీవ్రంగానూ ఆమె అతనిపై తిరగబడుతుంది. ఎట్లాగో ఇంద్రజాలంవలె, ఈ దేశంలో మాత్రం స్త్రీ స్వతంత్రురాలై ఇంకా పతిభక్తిలో పూర్వపు పతివ్రతలవలె సంసారాన్నంటి పెట్టుకుని పడివుంటుందని గుడ్డి దేశాభిమానుల నమ్మకం. ఎప్పుడు వ్యక్తిత్వం కలిగిందో, అప్పుడే వివాహ విచ్ఛేదనమూ, పురుష అధికార నిరాకరణమూ తప్పదు.

వివాహం, పతిభక్తీ, సేవా ఈశ్వరాదేశాలనీ, స్త్రీ జీవిత ధర్మాలనీ శాసించి, సంఘమే భర్తనేరి, స్త్రీ స్వేచ్ఛా, మోహమూ అనే పేర్లు వినపడకుండా పాలించనన్నా పాలించాలి. కాకపోతే స్త్రీకి వ్యక్తిత్వమూ, ఇష్టమూ, స్వతంత్రతా ఉన్నవని అంగీకరించారా, ఇంక భర్తలూ, సంసారాలూ, పిల్లలూ, ధర్మాలూ, విధులూ, అన్నీ ఆమె పూర్తిగా లోబరచుకుని నిర్ణయించుకున్నదాకా, సంఘంతో అంతంలేని యుద్ధం చేస్తుంది. కనక సంఘ ప్రభు అధికారం నించి, ఉండి ఉండి, విధవా వివాహమనీ, విద్య అనీ, ప్రౌఢ వివాహమనీ ఈ గుక్కెడు గుక్కెడు రిఫారాలతో ఆమె ఎన్నటికీ సంతృప్తి పడదు.

పశ్చిమ ఖండాల్లో యుద్ధానంతరం స్త్రీ స్వతంత్రురాలయింది. సంఘ క్షేమం అనే పేరుతో, పురుషుల ఆనందం కోసమూ, సంసార నిర్మాణంకోసమూ తన స్వాతంత్ర్యాన్ని త్యాగం చెయ్యడానికి వప్పుకోక తిరగబడ్డది. స్త్రీ తన స్వాతంత్ర్యాన్ని తను తీసుకుంది. కనక ఇప్పుడు ఆమెకి స్వతంత్ర మిచ్చి కూడా, సంసారాన్ని నిలబెట్టి పిల్లల క్షేమాన్ని ఎట్లాకాపాడాలా అనే సమస్య ఆ దేశస్తులని బాధిస్తోంది. కొన్ని సాధనాలతో వాళ్ళు "ఎక్స్‌పరిమెంటు" చేస్తున్నారు.

1. కొన్ని పరిస్థితులలో వివాహం రద్దు చేసి, వేరే వివాహం చేసుకోడానికి భార్యా భర్తలకి అనుజ్ఞ ఇవ్వడం.

2. కన్యగానీ, వితంతువుగానీ బిడ్డని కంటే, ఆమెకి ఆ బిడ్డని కల్పించిన వాడిచేత ఆ బిడ్డ ఖర్చు భరింపచేయడం.

3. కొంతకాలం నిర్ణయించుకుని, స్త్రీ పురుషుడూ కలిసి ఉండి చూసి, ఒకరి కొకరు తగిన వారమని ఇద్దరికీ స్థిరపడితే, అప్పుడు పెళ్ళి చేసుకోడం. లేకపోతే విడిపోయి వేరేవారితో 'ఎక్స్పెరిమెంట్' చెయ్యడం ఇదే "ట్రయల్ మ్యారేజ్" అంటారు.

4. ఇంకో పద్ధతి. చిన్నప్పుడే అనగా కామవాంఛ కలగగానే పెళ్ళిచేసుకోడం. ఇద్దరూ వారి తల్లిదండ్రుల బాధ్యతతోనే ఉండి సంతాన నిరోధక మార్గాలవల్ల పిల్లలను కనకుండా ఉండడం. వేరే కాపరం లేదు గనక ఆర్థిక సమస్య తొలగింది. స్వతంత్రం కలిగి తగిన ధనాన్ని సంపాదించుకున్నప్పుడే విడి సంసారమూ, పిల్లలూ. ఈలోపున మనసు మారితే విడిపోయి వేరే పెళ్ళి చేసుకోవచ్చు. దీనినే "కంపానియనేట్ మ్యారేజ్" అంటారు.

కానీ, నిబంధనలకీ, వేటికీ లోబడక, అసలు పెళ్ళే చేసుకోక, స్త్రీ పురుషులు స్వేచ్ఛగా ఉంటో సంతానమూ సంసారమూ లేకుండా ఉండడం పెరిగిపోతోంది ఆ దేశాలలో.

త్వరలోనే ఇట్లాంటి సమస్యే మనని బాధించబోతోంది. దేశభ్యుదయానికి పురుషులతోబాటు త్యాగం చేస్తున్న స్త్రీలు తిరిగి వంటింటిలో ప్రవేశించరు. ఇప్పుడు ఈ హడావిడిలో స్వతంత్రత పొందినవారు తోటి సంసార స్త్రీలని ప్రబోధించి, ఇళ్ళలోంచి బైటికి పిలిచి, స్వేచ్ఛా ప్రపంచంలో తిప్పక మానరు. ప్రభువర్గాన్ని ఎదిరించి, పోలీసులనీ, జైళ్ళనీ ధిక్కరించినవారికి భర్తలూ, తండ్రులూ ఒక లెక్కా? పురుషులు చేసేవన్నీ చెయ్యడంవల్ల పురుషులంత దైవాలు స్త్రీలూ అవునని స్పష్టమయింది.

తొరతొరగా మారిపోతోంది. స్త్రీలోకం. గడిచిన యాభై ఏళ్ళలోనూ పురుషలోకం మారింది. ఇంతవరకూ గుమ్మాల వెనక నిలిచి ఉన్న స్త్రీ ఇప్పటికి కదిలింది. తన భర్తతో, సంసారంతో, వ్రతాలతో, పిల్లలతో, వంటతో తృప్తిచెంది ఉండే స్త్రీ అమితమైన "అన్‌రెస్టు" యోచన, ప్రారంభించింది. పూర్వం వితంతువులు, తమ అన్నలు, మేనల్లుళ్ళు, వాళ్ళ పిల్లలు, దూరపు బంధువులు, వాళ్ళ సంసారాల్లో ఐక్యమై, మతంతో తృప్తిపొంది ఉండేవారు. ఇప్పుడు స్త్రీలు భర్తల్నీ, వారి నడవడినీ, విధినీ, న్యాయాన్నీ ధర్మాన్నీ, శాస్త్రాల్నీ అన్నిటినీ ప్రశ్నిస్తున్నారు. పూర్వపు రకం స్త్రీలు మాయమౌతున్నారు. ఈ కొత్తతరం కొత్త ప్రశ్నలతో కొత్త సందేహాలతో, యోచనలతో, ఆవేశాలతో పెనుగులాడుతోంది. ఈ స్వతంత్రపు యోచనలు పశ్చిమదేశ వాసులవనీ, అవినీతి బోధితులు నరకానికి పోతారనీ, ధర్మాత్ములెంత బోధించినా ప్రపంచం ఆగటంలేదు. ప్రతిదినమూ అనేకం విని అశాంతితో, అసంతుష్టితో ఆరాటపడే స్త్రీ జనాన్ని చూస్తున్నాం. ఏమిటో వాళ్ళకే అర్థంకాని బాధ, ఆరాటం కలిచివేస్తోంది. స్వేచ్ఛగా తమంతట తాము సంపాయించుకునే స్త్రీలని చూసి చాలా ఈర్ష్య కనబరుస్తున్నారు. 'ఎట్లా ఈ సంసారంలోంచి బైటపడగలమా మర్యాదగా' అనే

యోచన అనేక మందిని వేధిస్తోంది. తృప్తి పడని రొమాన్సుతో, ఇంకా ఏదో అనుభవించాలనే ఆశతో, తీరని కోరికలతో, రసమూ, కళా, విద్యా, జ్ఞానమూ, స్వేచ్ఛా, నిర్మలత్వమూ, వీటికోసం పెనుగులాడుతో, కష్టపడుతో, కలలుకంటో, తమ ఆత్మ విస్తీర్ణం కోసం అనుభవ వైశాల్యం కోసం, పంజరాల్లోంచి నలుదిక్కులా చూస్తో అవస్థపడుతున్నారు. సరిగా, నిర్మలంగా, క్రమంగా, జీవితాన్ని నడుపుకోవటం తెలీక, తమ గృహాల్ని విచారంతో కోపంతో, విసుగుతో నింపుతున్నారు. లేచిపోతున్నారు. పిల్లల్ని వదులుతున్నారు. పైన సంఘమూ, బంధువులూ, భర్తా పెట్టేటటువంటి నిరంకుశాధికారం వల్ల ఆత్మలు నలిగిచచ్చి తమ సహజవాంఛల్ని వంకరతిప్పి, వంచకులూ, నీచులూ, అధములూగా మారుతున్నారు పాపం. దీనికంతా ఎవరు జవాబుదారీ? ఈ నలిగిపోయే ప్రాణాలకి ఎవరు బాధ్యత వహిస్తారు? త్వరలో మేలుకుని సంఘం వీరి కోసం మార్పు చెందిందా, పురుషుడు తన స్వార్థపరత్వం త్యజించాడా, శుభ యుగం ప్రారంభమౌతుంది. లేదా స్త్రీ ఈ విధంగా వెనక వెనక గోతులుతవ్వి అధమ స్థితిలో పడి, తన సంతతిని అధమంగా చేసి కుళ్ళపెడుతుంది.

బాధ్యతలు

'సం'క్షేమం' అనేటంత దొంగమాట ఇంకోటి లేదు. "ఫిలాసఫి" పుస్తకాలలో చర్చ చేయాల్సిందేగాని ఆ సంగతి, ప్రత్యేక వ్యక్తుల ప్రవర్తనని అరికట్టడానికి సంక్షేమాన్ని అడ్డు తెచ్చేవాడు మానవ జాతికి విరోధి.

సంఘమంటే వ్యక్తులు. వ్యక్తుల క్షేమం, అభివృద్ధి, ఆనందం — సంఘ క్షేమం. వ్యక్తి స్వతంత్రానికీ సంఘక్షేమానికీ వైరుధ్యం ఏమీలేదు. ఒక వ్యక్తి స్వతంత్రం ఇతరుల న్యాయమైన రైట్సుకూ (Rights) స్వతంత్రానికీ అభ్యంతర (interfere) పెట్టకూడదు.

కానీ చాలామంది అన్యాయమైన రైట్సు కావాలంటారు. ఒక మనిషి మీద ఇంకో మనిషికి (భార్యమీద భర్తకి రైట్సు ఒప్పుకోము. అట్లాగే భార్య జడురాలిగా, పూర్వాచారురాలిగా, దుర్మార్గురాలిగా ఉండడానికీ, పిల్లలు క్రూరులుగా, అబద్దీకులుగా, కృతఘ్నులుగా ఉండడానికి స్వతంత్రత ఉంది. మంచి ఉద్దేశ్యంతో కూడా బలవంతం వీలులేదు.

భార్య, భర్త ఆస్తికాని మాట నిజం. కానీ ఇతరులు (అన్యాయంగా అయినా) తమ ఆస్తి అనుకుని స్త్రీ జోలికి పోయేముందు తన ఆస్తిమీద హక్కుల్ని ఒదులుకోవాలి. భార్యమీదే కాదు. తను మోహించే స్త్రీ మీద కూడా. ఏ విధంగానూ వాళ్ళ స్వేచ్ఛని ఆటంక పరచకూడదు. అంత వరకూ ఇతరుల హక్కుని ప్రశ్నించే అధికారం కలగదు.

స్వతంత్రం అంటే ఇతరులమీద అధికారమని అర్థం చేసుకోవడం వల్ల వొచ్చిన అనర్థం ఇది. స్త్రీ కూడా అట్లానే అనుకుంటోంది. స్వతంత్రత పొందిన స్త్రీలు తమ భర్తలమీదా పిల్లలమీదా 'టైరెంట్సు' అవు

తున్నారు. భార్యలు చదువుకున్న కుటుంబాలలో 'ఎడ్జెస్టుమెంట్ ఫెయిల్' అవుతోంది.

ప్రస్తుతం 'ఎడ్వాన్స్‌డ్ ఆర్ ఎడ్యుకేటెడ్ ఆర్ పబ్లిక్ స్పిరిటెడ్' తెలుగు స్త్రీలని చూసినకొద్దీ, వాళ్ళు తమ పురోభివృద్ధి ప్రయత్నంలో పెడదారి పట్టినట్టు తోస్తోంది. వాళ్ళు నేర్చుకున్న విద్యా లోపమేమో, చదువుకున్న కొద్దీ దొంగనీతిలో విశ్వాసమూ, సాధనా ఎక్కువవుతున్నాయి. సంఘంలో ప్రవేశించినకొద్దీ అబద్ధపు జీవిత రహస్యం ప్రబలుతోంది. నవీన స్త్రీ భార్యగా, వంట ఆమెగా, పిల్లల తల్లిగా, హోస్ట్‌గా, శారీరకంగా, మానసికంగా కూడా ఫెయిల్ అవుతోంది. నిజమైన స్వతంత్రత గానీ, ఎదిరింపుగానీ, ఓపెన్‌మైండ్‌నెస్‌గానీ, విజ్ఞానంగానీ సంపాయించడంలేదు. కపటీ, బీరురాలూ, స్వార్థపరురాలూ, సంకుచిత మనస్కురాలూ, కారెక్టర్‌లో ఇండివిడ్యువాలిటీలో; నూనృతంలో, ఆరోగ్యంలో, మనోబలంలో, పాత స్త్రీ కొత్త స్త్రీకన్న నయం. విద్య కుతంత్రాలకీ, అల్పత్వానికీ, ఫ్యాషిన్స్‌కీ, సక్సెస్‌ఫుల్ డూప్లిసిటీకీ, ఫాల్స్ రీజనింగ్‌కీ, తోడ్పడుతోంది. అర్థంలేని స్వతంత్రపు మాటలకీ, భర్తల పేర్లు చివర చేర్చుకుని మర్యాద కప్పుకోడానికీ ఉపయోగపడుతోంది. వ్యభిచారం తనలో తప్ప ఇతరులలో ఏ మాత్రమూ సహించదు ఈ నవీన స్త్రీ. ఈర్ష్యా, ఆత్మవంచనా చాలా ఎక్కువ. పాత స్త్రీ ఇతరుడి మీద ఇష్టం కలిగితే బహిరంగంగా లేచిపోతుంది. నవీన స్త్రీ ఆ అవసరం లేకుండా చేసుకుంది. అసలు ఇతరులకి ఇవ్వడానికి హృదయం లేకుండాపోయింది పాపం! తనని తప్ప ఎవరినీ ప్రేమించదు. ఇబ్బందుల్లోకి తెచ్చే టంత ప్రేమ ఆమె హృదయానికి రానేరాదు. పురుషుడు ఇదివరకంతా స్త్రీని సాధనం (ఇన్‌స్ట్రుమెంట్) కింద ఉపయోగిస్తే స్త్రీ ఇప్పుడు వేరే అవసరాలకి అతన్ని ఆ విధంగా సాధనం చేసుకుంటోంది. ఇదంతా పురుషులు తమ స్వబుద్ధితో ఆమెమీద హక్కులు ఒదులుకోకపోవడంవల్ల వచ్చిన అనర్థం.

పురుషులు కూడా స్త్రీని పురాణ పద్ధతులలో నిర్బంధపెట్టి ఉంచడానికి సిగ్గుపడుతున్నారు. ఆమెకి చదువురావాలి, స్నేహితులతో మాట్లాడాలి. ఆమె సినిమా నటకుల వలె అందం చేసుకోవాలి. కానీ తనమాట వినాలి. ఇతరులని ఇష్టపడకూడదు. జమునాని అనుకరించాలిగాని, సైగల్ని ఇష్టపడకూడదు. కన్నాంబేవి, ఫిల్ములో జుట్టు కట్టుకున్నట్టు కట్టుకోవాలిగాని, ఫిల్ములోవలె ఇతర పురుషుల్ని ఇష్టపడకూడదు. ఈ విచక్షణ స్త్రీ చూపతలుచుకోడంలేదు.

విద్యవల్లా, పురుష నిర్బంధంవల్లా స్త్రీ స్వేచ్ఛకి సరైనమార్గం, వీలులేక ఈ సాహస మార్గాన పడ్డది. కానీ ఈ స్వతంత్ర సమరం ఆగేది కాదు. "బానిసని" అనే జ్ఞానం (కాన్షియస్‌నెస్) రానేకూడదు. ఎొచ్చిందా సమరం తప్పదు. దేశాల్లోనూ, కులాల్లోనూ, స్త్రీలలోను కూడా అంతే.

పురుషుడు ఆర్థికంగా, రాజకీయంగా, ఉద్యోగరీత్యా బానిసకాడా అంటారు. అవును కాని ఆ బానిసకి బానిస స్త్రీ. బానిసత్వం హీనంకాదు. "బానిసని" అనుకుని అట్లానే పడివుండటం భరించరాని స్థితి. కానీ బానిసలమని తెలియనన్నాళ్ళు స్త్రీలు

సుఖంగా శాంతంగా ఉన్నారు. తెలిసిగూడా స్వతంత్రతని పొందే జవసత్వాలు లేక పోవడంచేతనే నవీన స్త్రీలు ఇట్లా టైరెంట్సూ, అబద్ధీకులూ అయినారు. ఇతరుల్ని క్షోభ పెట్టడమూ, స్వతంత్రులమని డాబులు చెయ్యడమే స్వతంత్రత అనుకుంటున్నారు.

ఈ పురుషులు అసలే ఇతర విధాల బానిసత్వం అలవాటైనవారు గనక, స్త్రీ మీద కనికరం చూపరు. ఆమె బానిసత్వంమీద వీళ్ళకి కరుణ రాదు.

బానిసత్వం మనసులో ఉందిగానీ బైట తక్కువ. దేహానికీ, వాంచలకీ బానిసలం. ఎట్లా తప్పించుకోవడం? నాలుగే పద్ధతులు.

1. దేహమే నా యజమాని, లొంగిపడి ఉండాలి.

2. దేహం తోవ దేహంది, ఆ బాధ నాకెందుకు?

3. దేహాన్ని త్యజించాలి.

4. దేహమే నేను. భేదంలేదు.

ఈ నాలుగూ చేతగాకపోతే అయిదోది మనకీ, దేహానికీ, నిరంతర యుద్ధం.

స్త్రీ పురుషుల సంబంధమూ ఇంతే.

మొదటిది పూర్వపు పద్ధతి.

రెండోది ప్రస్తుతం పూర్వాచార కుటుంబాల పద్ధతి.

మూడోది అసహజం, చాలాపరకు అసంభవం.

నాలుగోది ఆదర్శం.

చివరిది ప్రస్తుతపు నవీన కుటుంబాల పద్ధతి.

నవీన పురుషుల్లో కూడా స్త్రీమీద గౌరవమూ భక్తీ తగ్గాయి. అసహ్యంగా స్త్రీని గురించి, మాట్లాడ్డం ఫాషన్. శరీర సంబంధం, వీళ్ళ మనసుల్లో అతి నీచం. కానీ అతి ప్రాముఖ్యం. భార్యాభర్తలమధ్య అది చెప్పుకోకూడని స్వల్ప విషయం. ఏదో బాధ తీర్చుకోడం. ఇతరుల మధ్య చాలా ముఖ్యం — దండనీయం, గర్హనీయం. స్త్రీ స్వభావమూ, ఆమె మీద గౌరవమూ, ఆ విషయం మీదనే ఆధారపడి ఉన్నాయి. ఈ మెంటల్ కన్ఫ్యూజన్ పోవాలి. రతిని మాటల మల్లేనే, చాలా 'అన్ ఇంపార్టెంట్'గా 'కాజువల్'గా నన్నా చూడాలి; లేక చాలా 'సీరియస్', 'డివైన్'గా నన్నా చూడాలి.

నీతీ - వ్యక్తీ

నీతివంతుల్నీ, నీతిని బోధించేవారినీ ఏ మాత్రమూ క్షమించవొద్దనిరాసి, నేనే నీతిని గురించి రాస్తున్నాను. చాలా మంది నీతిగాళ్ళనన్నా క్షమిస్తారేమోగాని నన్ను క్షమించరు. కానీండి.

ఈ విషయం చాలా విపులంగా రాస్తే గాని నాకు తృప్తిలేదు. కానీ ఈ పుస్తకానికి పూర్తిగా సంబంధించింది కాకపోవడంవల్ల స్త్రీ విషయానికి సంబంధించి క్లుప్తంగా రాస్తున్నాను. ఇష్టమున్నవాళ్ళు జాగ్రత్తగా ఆలోచించుకోండి.

'నీతి అంటే ఏమిటి?' అనే ప్రశ్న చాలా సహజంగా తన మనసుకే తోచనివాడు, ప్రపంచం "నీతి చట్టాలు" అని విధించిన వాటిని మీరడానికి అనర్హుడు. చాలా మందికి ఈ ప్రశ్న రాదు. తనకు అడ్డువొచ్చిన నియమాలను అతిక్రమించాలని తాత్కాలికమైన వాంఛ తప్ప. తాను మీరడం ఇష్ట

ముంటుందిగానీ, ఇతరులు మీరడమూ, ముఖ్యంగా తన ఎడల ఇతరులు మీరడమూ ఇష్టముండదు.

సంఘం వ్యక్తిమీద తమ నిబంధనని విధించకుండా జరగదు. కానీ అట్లా విధించటానికి అధికారం లేదంటున్నాను. చేవగల వారిని ఎదిరించమంటున్నాను. కానీ బహిరంగంగా చెప్పి ఎదిరించండి. నేను "స్త్రీ"లో చెప్పింది అంతా ఇదే.

ఇంకొకరి భార్యమీద మోహం కలిగితే, ఆమె భర్త హక్కుకాదని మీకు తోస్తే, మీ అంతరాత్మలో దృఢనిశ్చయమైతే, ఆమెకి కూడా మీమీద మోహం కలిగితే, ఇంక రహస్యం ఉండకూడదు. మోహించండి. ఆ మోహానికై సంఘంగానీ, ఆమె బంధువులు గానీ, ప్రభుత్వంగానీ ఇబ్బందులు తీసుకొస్తే భరించండి.

రహస్యపు పిరికి పిరికి వ్యభిచారంవల్ల స్త్రీకి గానీ, పురుషుడికి గానీ, సంఘానికిగానీ ఏ మేలూ కలగదు. రహస్యమున్నప్పుడే వ్యభిచారం అని పేరు. అప్పుడే దుర్నీతి.

ఎంత నీతివంతమయిన పని అయినా భయంతో, ఇతర ఆశలతో కూడుకున్నప్పుడు దుర్నీతి అవుతుంది. ఇద్దరూ కోరి ఏ స్త్రీ పురుషులు గానీ, ఎటువంటి బాంధవ్యం ఉన్నాసరే కలుసుకుంటే దుర్నీతి కాదు. కానీ భయపడ్డప్పుడు, వాళ్ళకే ఆ నీతిలో విశ్వాసం లేనప్పుడు, రహస్యంగా దాచుకున్నప్పుడు అది ఎంత మంచి పని అయినా సరే అది దుర్నీతి.

నీతి ఏది? దుర్నీతి ఏది? అనే దానికి మీ మనసే ప్రధానం. మనసుని నిష్కపటంగా అడగండి. ఏది చెపితే అది చెయ్యండి. మనసు ఏదీ చెప్పేస్థితిలో లేకపోతే మతాల దగ్గరికీ, ధర్మాల దగ్గరికీపోయి అడగండి! వాళ్ళు చెప్పిందే నీతి మీకు.

ఏ కార్యమైనా, చేసింతర్వాత దాని ఫలితాలవల్ల గాక ఆ కార్యమే అసహ్యంగా, నీచంగాతోచి దిగులుపడితే, ఆ కార్యం పాపం, అవినీతి.

దీనినించి వెయ్యి సందేహాలు తోస్తాయి. నాకు తెలుసు. వాటికన్నింటికీ జవాబు రాసేందుకు స్థలం లేదు.

చాలామంది దుర్నితిపరులకీ, వ్యభిచారులకీ నా మాటలు ప్రోత్సాహమిస్తున్నాయనీ, ఏమీ తప్పు చెయ్యడం లేదనే ధైర్యాన్నిస్తున్నాయనీ అంటారు. అవును, నా ఉద్దేశ్యం, నిర్భయంగా చేసే ధైర్యం ఇవ్వాలని. వాళ్ళు తప్పు అర్థం చేసుకుంటే నేనేం చెయ్యగలను?

సంఘ క్షోభ, రహస్య కార్యాలవల్ల కలుగుతుందిగానీ, బహిరంగమైన స్వేచ్ఛవల్ల ఎన్నడూ కలగదు. కలిగితే అది చాలా ఆరోగ్యవంతమైన బాధ.

కామోద్రేకం

కామవాంఛ యవ్వనం వచ్చేముందు కనబడుతుంది. ముసలివారయేవరకూ పని చేస్తూ ఉంటుంది. స్త్రీ పురుష సంగమం వల్లగాని అణగదు. మనుషుల నేర్పునీ, మనుషుల్నీ పట్టి ఈ కామోద్రేకాన్ని తీర్చుకోవడం — ఉత్త కడుపునొప్పి పోగొట్టు

కున్నట్టు బాధని పోగొట్టుకోడంగానో లేక అద్వితీయమైన ఆనందాన్నీ, సాఫల్యాన్నీ సంపాదించుకోడంగానో పరిణమిస్తుంది.

బాలికలకన్న మొగపిల్లలలో ఎక్కువ విజృంభిస్తుంది. ఎందుకంటే పురుషుడు మొదటిసారి మేల్కొలిపినదాకా సాధారణంగా ఈ వాంఛ స్త్రీలలో నిద్రపోతుంది. ఈ కామోద్రేకం పెళ్ళి అయినదాకా యువకులు కోల్పోకూడదనీ, కంట్రోలు చేసుకోవాలనీ నీతిపరుల ఉద్దేశ్యం. యువకులలో సహజమైన కంట్రోలింగ్ శక్తి ఉంది. కామశక్తిని కవిత్వంలోకీ, కలలోకీ, ఆటలలోకీ, ఎడ్వెంచర్‌లోకీ వాళ్ళు సులభంగా మార్చుకోగలరు. అయినా దానికీ పరిమితి ఉంది. పైగా ఈ కాలంలో ముద్దులులేని తెలుగు సినిమాలూ, కావలింతలులేని నీతి కథలూ, పురాణాలూ లేవు. అవి, వాళ్ళ ఉద్రేకాన్ని రెచ్చగొడుతున్నాయి. దానివల్లవెంటనే ఈ కామశక్తికి దోవ చూపకపోతే అది అపాయకరమైన మార్గాలలో పడుతుంది.

1. **పెళ్ళిచెయ్యడం:** ఇది అర్జనాశక్తి తక్కువ కావడంవల్ల చాలా సమస్యల్ని తెచ్చిపెడుతోంది.

2. **పెళ్ళి లేకుండా ఏర్పాట్లు చెయ్యడం:** నీతి ఒప్పుకోదు — గర్భాలూ, రోగాలూ వీటి భయం.

3. **వాళ్ళ గతికి వాళ్ళని వొదిలెయ్యడం:** భయంతో బెదిరింపులతో పాలించడం — ఇదే ఇప్పుడు జరుగుతున్న పని.

పైకి వాంఛని రానియ్యకపోవటంవల్ల ఆ వాంఛ పిల్లలకి లేదనీ, ఉన్నా ఏమీ ఇబ్బంది లేదనీ తల్లిదండ్రులు సమర్థించుకుంటారు. అసలా విషయం ఆలోచించరు.

ఇందుమూలాన మాస్టర్బేషన్, స్పెర్మటోరియాలు ఎక్కువపుతున్నాయి. కాలేజీ కుర్రాళ్ళకి చదువుల మూలాన అసలే శక్తి తక్కువగానీ, లేకపోతే "సోడమీ" కూడా ఇంకా ఎక్కువగా ఉండాలి.

అసహజమైన విధంగా, ప్రయత్న పూర్వకంగా, కామవాంఛని తృప్తిపరచుకోడం మాస్టర్బేషన్ అంటారు. కలలోగానీ, మూత్రంలోగానీ వీర్యనష్టం "పొల్యూషన్సు" అంటారు. ఈ రెండూ యవ్వనం అంకురించే సమయంలో పిల్లలలో కనిపిస్తోంటాయి. నీతిపరులూ, మందుల వర్తకులూ కలసి ఈ రెంటినీ చాలా ఘోరంగా చిత్రించారు. వాళ్ళ వర్ణనలూ, వాళ్ళు పెట్టే భయాలూ చూస్తే గుండె బద్దలవుతుంది. మాస్టర్బేషన్ చాలా చిన్న పిల్లలలో కూడా కనబడుతుంది. పెద్దవాళ్ళు — చూసీ చూడనట్టు ఊరుకోవాలి. దానంతట అదే పోతుంది. దండించడం, భయపెట్టడం విషతుల్యం. యవ్వనంలో కూడా ఈ విషయంలో సానుభూతి చూపి వాటిని నిర్లక్ష్యంగా సహజంగా చూడాలి. అసలు పిల్లలు పెద్దవారికి తెలీనీరు. తెలిసినప్పుడు పెద్దవారు వాటిని ఘోరంగా చూడకూడదు చాలా ముదిరితే తప్ప. ఈ అలవాట్లు ఏమీ అపాయం కావు. భయమూ, విచారమూ, పశ్చాత్తాపమూ ఇవే పిల్లలకి అపాయకరమైనవి. మాస్టర్బేషన్ అసహజమైనదే. కానీ కామోద్రేకాన్ని ఏంచేయాలి పిల్లలు? ఆడపిల్లలకి గర్భాలు తెప్పించేకన్న, ఏమీ తెలీని పసిపిల్లలని "రేప్" చేయడంకన్న, స్త్రీలనించి రోగాలు తెచ్చుకోడంకన్న, మాస్టర్బేషన్ నయంకాదా? "పిల్లలు ఈ ఉద్రేకాన్ని అణుచుకోవాలి. నిగ్రహశక్తి కావాలి" అంటారు రోజూ — భార్యల్ని బాధించే

పెద్దలు. ఏ పిల్లలూ అణుచుకోలేరు. వాళ్ళకి చేతకాదు. అణుచుకుంటున్నట్టు నటిస్తారు. ఆ నటనే పెద్దవారికి కావలసింది. ప్రేమలేని భార్యలతో కలవడం కన్నా పెద్దవారికి కూడా మాస్టర్బేషన్ ఎక్కువ సహజం, నీతివంతం.

చిన్నవాళ్ళకి మాస్టర్బేషన్, పాల్యూషన్ ఇటువంటివి తటస్థించినప్పుడు పెద్దవాళ్ళు కామోద్రేకాన్ని అణుచుకోడానికి సాధనాలు అలవాటు చెయ్యాలి. చన్నీళ్ళ స్నానం, చాప మీద పక్కా, చాలావరకు శరీరానికీ, మనసుకీ పని కలిగి ఉండడం, స్త్రీలనించీ చలం పుస్తకాలనించీ దూరంగా ఉండడం, ఇవన్నీ సహాయం చేస్తాయి.

యోగ ఆసనాలు చాలా ఉపకారం చేస్తాయి. ఈ విషయంలో — ముఖ్యంగా సర్వాంగ ఆసనం.

అవన్నీ పాత పద్ధతులే అంటారు. మనం మరచిపోయినాము కనక జ్ఞాపకం చేస్తున్నాను. మరచిపోయివుండరా? అయితే పిల్లలకి ఇవి ఉపయోగపరచే విధం మరచిపోయినాము.

రోగాలని నివారించుకునే పద్ధతులు, గర్భనివృత్తి మార్గాలు, యవ్వనంలో కనబడే వాంఛారూపాలూ, మోహబలం, ప్రేమ, స్వాతంత్ర్యం — ఈ సమస్యల్ని వేటిని ఎత్తినా, రోజూ సుఖంగా పక్కలమీద తృప్తి పడే మనుషులు, "నిగ్రహం, నిగ్రహం" అని అనే ఇతరులకి సలహాకింద అరుస్తారు. పత్రికలకీ దేశ సేవకులకీ ఇది మామూలయింది. యువకులకి ప్రతివాడూ ఈ బోధన చేసేవాడే.

రెండు సంగతులు ఆలోచించాలి.

నిగ్రహం అవసరమా?

నిగ్రహం సాధ్యమా?

తప్పనిసరి అయితేనేకాని, నిగ్రహంలో ఏమీ ఔన్నత్యంలేదు. పైగా హానివుంది. స్త్రీలనించి తప్పుకునేవాడు కలలనించి తప్పుకోలేడు - పగటి కలలూ, రాత్రికలలూ కూడా. కలలనించి తప్పుకునేవాడికి దేహానికీ, మనసుకీ కూడా జబ్బుచేస్తుంది. సుఖాల్ని వొదులుకోవడంవల్ల దొంగ మహిమలున్నాయని ప్రపంచాన్ని మోసపుచ్చడం తప్ప ఇంక ఏమీ ప్రయోజనం లేదు.

కొందరు నిజంగా "సెక్సు"ని 'సబ్లిమేట్' చేసుకోగలవారున్నారు. అంటే వేరే శక్తికింద మార్చుకోగలిగిన వారు. వారు (రేర్ ఎక్సెప్షన్స్) సకృతు. సామాన్య ప్రజలకీ, యువకులకీ ఈ నిగ్రహం బోధించడం, ఎవరో రుషులకి ఊపిరి బిగపట్టడం చాతనవును గనక "మీరందరూ ఊపిరి బిగపట్టి చావండి" అన్నంత మూర్ఖం.

ఈ కోర్కెల్లో నీచత్వమంతా, దాన్ని అణుచుకోమని బోధించే కుళ్ళు మనసుల్లో ఉంది. వాళ్ళ జీవితంలో కామం విషమించింది. దురదృష్టవంతులూ, నీచులూ ఈ అమరసుఖాన్ని కుళ్ళుపెట్టుకున్నారు. సంభోగం త్యజిస్తే వాళ్ళ ఆత్మకి సుఖం. అందుకని అందరికీ ఆ గతే పట్టిందనుకుంటారు. తమకులేని సుఖం ఇతరులు అనుభవించి పోతారని ఈర్ష్య.

స్త్రీ పురుషులు కలుసుకోకుండా ఎట్లానూ ఆపలేరు. కలుసుకోడం వల్ల వచ్చే సమస్యల్ని ఎదుర్కొనే సాహసంలేదు. కనక "నిగ్రహం, నిగ్రహం" అని చిలక పలుకులు పలుకుతో అంతరాత్మకి ఉపశాంతి నిచ్చుకుంటారు.

నిగ్రహం సహజంగా సాధ్యమైనప్పుడూ, అవసరమైనప్పుడూ చాలా ఆరోగ్యవంతం.

అసలు శక్తిలేనివాడు గొప్ప నిగ్రహం కింద చెలామణీ అవుతున్నాడు. కళ్ళూ, రసమూ లేనివాడు ఏకపత్నీవ్రతుడైనట్టు, కురూపి పతివ్రత అయినట్టు. నిగ్రహం ఉండాలని బోధించేవాళ్ళకి నిగ్రహమెంత కష్టసాధ్యమో తెలీదు. ఎందుకంటే వాళ్ళకి అసలు లేదు గనక. బలపంతమైన నిగ్రహంపల్ల మనసుకీ, శరీరానికీ చాలా అపకారం జరుగుతుంది. ఈ కుహనా వివాహ నిర్బంధంపల్ల నిగ్రహం బోధించడం తప్ప వేరే గతి లేకుండాపోయింది, మతకర్తలకీ, నీతి బోధకులకీ.

దాంపత్య సుఖం

తక్కిన వేదాంతం ఎట్లావున్నా, వ్యక్తి తనకి ఉన్న ప్రత్యేక శక్తుల్ని ఎంత బాగా వినియోగించడానికి వీలుకలగచేసుకో గలిగితే అంత అభివృద్ధి పొందుతున్నాడు. అంత ఆనందమనుభవిస్తున్నాడు అన్న మాట నిజం. ఈ శక్తులూ, వాంఛలూ, ఆశయాలూ, అన్నీ ఈశ్వరుడిలో సఫలీకృత మౌతాయని అంటారు. ఆ సంగతి ఎట్లా ఉన్నా, ఆ ఈశ్వరుడి తరువాత ఈ లోకంలో మనుష్య జీవితాన్ని సౌందర్యంతో నింపి సర్వశక్తులకీ, ఆశ్రయమై సాఫల్యం చేయగల మహత్యంగలది స్త్రీ పురుష ప్రేమ. ఉత్తమ స్త్రీ ప్రేమలో లీనమయ్యే అదృష్టం గల పురుష జీవితం పొందే ఆనందం, తదితరులకి మానసాతీతం. స్త్రీ జీవితమూ అంతే. కనక ఉత్తమ వ్యక్తి నుంచి వచ్చే ఉన్నత ప్రేమ మన జీవితాలకి పరమ అవసరం. మకుటం. మత గ్రంథాలలో వర్ణించే ఈశ్వరుడి భక్తి తప్ప ఇంకొకటి దాంపత్య ప్రేమకన్నా ఉత్తమమైనది లేదు. దాని కోసం ప్రతివారూ ప్రయత్నించాలి.

ప్రతి వారికీ వారి స్వభావాలనీ, సంస్కారాన్నీబట్టి తాము ప్రేమించగల వ్యక్తి గురించి ఒక ఆశయం, ఊహ ఉంటుంది. దేహసౌందర్యం, మానసిక చాతుర్యం, ఆత్మౌన్నత్యం, వీటి అన్నిటిని గురించి కోర్కెలు ఉంటాయి — మృగప్రాయులకి తప్ప. కనక మనసులోని ఆ ఆశయాలికి తగిన మనిషి దొరికేవరకూ ఎవరూ సంతుష్టి చెందకూడదు. తక్కిన రకపు మనుషుల్ని భర్తగానూ, భార్యగానూ స్వీకరించారా, జీవితం శుష్కమైపోతుంది. పొందగలిగిన మానుషాతీతమైన సౌఖ్యానికి అంధులవుతారు. చాలామంది ప్రజలకి ఈ ఆశయం ఉండదు. అట్లాంటివారు వంట బాగా చేయగల భార్యలనీ, డబ్బు సంపాయించే భర్తలనీ ఏరుకోవచ్చును. కాని పరిణామము (ఎవల్యూషన్) జనులలో జరుగుతున్న కొద్దీ సంసారం అభివృద్ధి పొందుతున్న కొద్ది, ప్రజల ఆశయాలూ, ఆశలూ, రుచులూ (టేస్ట్స్) అభివృద్ధి పొందుతున్నాయి. అట్లాంటి వాళ్ళు తక్కువ వ్యక్తులతో, హీన గుణాలతో సంతుష్టి పడకూడదు. అమితమైన సౌందర్యాశయం ఉంటే దానికోసం వేచివుంచవలసిందే. కొంచెం తక్కువ సౌందర్యం ఉన్న భార్యని స్వీకరించ కూడదు. గుణాలూ అంతే! జీవితమంతా వ్యర్థంగా గడిపినా దిగులులేదు. కానీ ఆశయంనించి దిగజారకూడదు. కాని ఆశయాలని పుస్తకాల్లో చదివి, ఇతరులనించి

వినీ, తమవాటిగా చేసుకోవాలనే ప్రయత్నం వ్యర్థమే — పొరబాటే.

పొరబాట్లు తటస్థించవచ్చు. తమ ఆశయానికి సరిపడనివారిని ఒకరిని వివాహమాడి పొరబడ్డామని కొంతకాలంలో తెలుసుకొన్నప్పుడు వెంటనే సంబంధం మానివెయ్యాలి. ఒకప్పుడు, ఇంకొక వ్యక్తిని కలుసుకున్నప్పుడు తాము పొరబడ్డామని అర్థమౌతుంది. అప్పుడు వెంటనే పాత సంబంధం వొదిలివెయ్యాలి. అంతంలేని సాహసంగల "ఎక్స్పరిమెంట్సు" అత్యంత అవసరం, ఆత్మవృద్ధికి.

అసంతృప్తీ, బాధా, ఇతర తృష్ణా లేకుండా చేయగలిగిన సంబంధమే నిజమైనది, తగినది. అది ఒకటే "టెస్ట్". ఇంక వేరు వాంఛ ఉండడం వీలులేనంత ఆత్మ సంతుష్టిని కలగచెయ్యాలి. ఒక్కొక్కప్పుడు రెండు మూడు సంబంధాలు ఏకకాలమందే కావలసి రావచ్చును. తాత్కాలికంగా మార్పు అవసరం కావొచ్చు. కానీ వాటిని గుర్తించే, స్వీకరించే వివేకం ఉండాలి.

ప్రేమ ధనాన్ని వృథా చెయ్యకూడదు. వెదజల్లకూడదు, మనోపరీక్ష చేసుకుని, ఎవరికి హృదయ పుష్పం సమర్పించాలో నిర్ణయించుకోవాలి. అటువంటివారు దొరికిందాకా లోభివలె ప్రేమని దాచివుంచాలి. ఆశయం పూర్తి కాంది తక్కువ ప్రత్యామ్నాయంతో సంతుష్టిచెందే వ్యభిచారానికి లొంగకూడదు.

మన ఆశయం సఫలీకృతం కావాలంటే మన స్వభావం అభివృద్ధి చెందాలి. మనం హీనులమైనకొద్దీ మన ఆశయం హీనమౌతుంది. మనం దేనికోసం తపస్సు చేస్తున్నామో, ఆ వరం మన వాకిలి దగ్గిరికి వొచ్చినప్పుడు మనం గుర్తించలేము. ఆ రెండో వారికి మనమీద ఇష్టం కలగదు. మన నీచ జీవితాన్ని అర్పించడానికి మనకే సిగ్గు గలుగుతుంది. మన ఆశయం, అతి ఉన్నతమైతే దాన్నిఅందుకోడం కోసం జన్మంతా గడిపినా వ్యర్థంకాదు. కాని అది నిజంగా మన ఆశయమే కావాలి.

అటువంటి ఉన్నతాదర్శమే హృదయంలో ఉంటే, ఆ ఆశయానికి అందని మనిషిని తాకడం నీచమూ, పాపమూ, అపరాధమూ అయిపోతుంది. స్త్రీగానీ, పురుషుడుగానీ, ఈ శరీరాన్నీ, మనసునీ నిర్మలంగా, జాగ్రత్తగా ఉంచాలి — రాబోయే ఆ దివ్యమూర్తికి ఆనందంతో అర్పించడానికి.

ఇటువంటి ఆశయం గల మనుషులు ప్రజాసామాన్యాని కేర్పడ్డ ఈ సాధారణపు చట్టాలకీ, సంఘం కట్టుబాట్లకీ, ఆచారాలకీ లొంగడం మహాపాపం. అన్నీటికీ తిరగబడాలి. లెక్కచెయ్యకూడదు. ముఖ్యంగా తన 'ఇన్స్టింక్ట్'ని పరీక్షించి, దాని నిర్దేశానుసారం తన జీవితాన్ని నడుపుకోవాలి. ధర్మమూ అధర్మమూ, నీతీ అవినీతీ అన్నీ హృదయస్తములు. అన్నీ సామాన్య ప్రజల్ని అల్లరినించి తప్పించి, శాంతిని నిలబెట్టడానికి ఏర్పడ్డ మూఢనమ్మకాలు. హృదయ దేశానుసారం నడపడానికి జంకే ధీరులకి గతులులేవు. అభివృద్ధిలేదు. అందమైన అవయవం, ఉన్నతమైన గుణం, కనపడ్డ ప్రతివ్యక్తీ తనని ఆకర్షించేటట్టయితే, ఆ ఆకర్షణ కన్న వేరే ఆశయం లేకపోతే, అట్టే ఆకర్షింపబడి వీలైనప్పుడల్లా అనుభవించడమే పరమ ధర్మం. కానీ ఉన్నతాదర్శం ఉన్నప్పుడూ, ఇన్స్టింక్ట్ వద్దన్నప్పుడూ సర్వ

సంబంధాల్ని తృణీకరించడమూ ధర్మమే. ఎంత ప్రేమగల భర్తనిగానీ, భార్యనిగానీ ఉన్నతాశయం కోసం అంత కన్నా ఆత్మతృప్తి కరమైన సంబంధం కోసం వదలడం ఉత్కృష్టమైన ధర్మం. విధి. బుద్ధుడు సంసారం వొదిలిన ఆశయం ఎటువంటిదో ఇదీ అటువంటిదే.. సాహసం చేసి జీవితాన్ని అనుభవ సముద్రంలో ముంచగల ధీరులకే అభివృద్ధి. లెక్క పెడితే, రోగాలు అనీ, అవినీతి అనీ, నరకమనీ, అమర్యాద అనీ శుష్కించే నిర్భాగ్యులకి ఈ జీవితమే నరకం. బతకడం వృధా.

ఆత్మే ప్రమాణం. ఏ కార్యం చేసిన తరవాత నీచంగా 'ఫీల్' అవుతారో ఆ కార్యం పాపం. ఏ కార్యం ఆరోగ్యంగా, ఆనందకరంగా ఉంటుందో అది ధర్మం. ప్రకృతి హృదయంలో ఈశ్వరుడు ప్రకాశిస్తున్నాడంటారు. ఉంటే అతడే అడుగుతాడు. అడిగి తెలుసుకోవాలి. తెలుసుకున్న తరవాత సాహసంతో ఆచరించాలి.

లోకంలో ఉన్న మనుషులందరూ ఒక పరిణామావస్థలో లేరు. ఒక ఆత్మౌన్నత్యంలో లేరు. సంస్కారాలూ, కర్మలూ వేరు. హెరిడిటీ వల్ల గానీ, జన్మ పరంపరవల్ల గానీ మనుషులు వివిధములైన స్టేజస్‌లో ఉన్నారు. పేద పురుగుకూ, ఏనుగుకూ ఉన్న తారతమ్యం మనిషికీ మనిషికీ ఉంది. అందర్నీ కలిపి మనుషులనడం పొరపాటు. అందరికీ ఒకే ధర్మాన్నీ, నీతినీ విధించడం అవివేకం. కనక ఎవరి స్వభావాన్ని వారు పరీక్షించుకుని, ఎవరి నీతిని వారు నిర్ణయించుకోవాలి. ఎవరి ఆశయాన్ని వారు అనుష్ఠానంలో పెట్టుకోవాలి. కొందరికి భౌతిక సౌందర్యం తప్ప ఏమీ అర్థంకాదు. వారు దాన్నే అనుభవించాలి. కొందరికి ఆత్మ సౌందర్యం, కొందరికి "డివోషన్", సేవ, కొందరికి అధికారం, మాతృప్రేమ. ఇన్ని విధాల కోర్కెలు ఉంటాయి. వారు వారి వారి వాంఛల ప్రకారం అనుభవించవలసిందే. ఊరికే ప్రజల్ని చూసి, భయపడి, తమవి కాని ఆశయాలని ప్రకటించడం, నటించడం మర్యాద అనుకుని తమ సహజ వాంఛలని నొక్కి వంకర తిప్పి, ప్రజలు భ్రష్టులై స్వేచ్ఛగా ఆనందాన్ని తమ తాహతుకు తగినట్టు పొందక, కుళ్ళి అన్నిటికీ చెడుతున్నారు. జీవితం అనంతం. ఈనాడు భౌతికంగా శరీరాల్ని అనుభవిస్తేనేం? అదే మార్గం ఉన్నతాదర్శాలని కనుక్కోడానికి. విరక్తివల్ల, త్యాగంవల్ల హృదయం శుష్కించడమే ఫలం.

సుఖంగా, దేహసౌఖ్యాన్ని కోరే మనిషి, పురాణాల మనుషుల్ని నమ్మి గుణాలని ప్రేమించాలనీ, ఏకపత్నీ వ్రతం చెయ్యాలనీ ప్రయత్నిస్తే, అతనికా ఔన్నత్యం స్వతస్సిద్ధం కాదు గనక, గుణాలనీ ప్రేమించడు; పైగా అన్యాయంగా తనకీ సహజమైన శరీర సౌఖ్యాన్నీ పాడుచేసుకుంటాడు. సౌందర్యారాధకుడైన చిత్రకారుడు వంశమనీ, సంస్కారమనీ కురూపియైన పతివ్రతని పెళ్ళిచేసుకుంటే, ఈ పాతివ్రత్యాన్ని అనుభవించనూ లేడు; సౌందర్యారాధనా రాదు. వ్యభిచారి అయినా ఒక సుందర విగ్రహాన్ని ఆరాధించడమే అతనికి ముక్తి — ఆమె ఇంకెవరి భార్య అయినా సరే!

మంచి వంటవాళ్ళూ, పతివ్రతలూ, కురూపులూ, స్వార్థపరులూ, ఉద్యోగస్తులూ, మర్యాదపరులూ సామాన్య ప్రజలకు కావాలి. కవులకీ, రసజ్ఞులకీ, అధ్యాత్మిక

సంపన్నులకీ, చిత్రకారులకీ కావలసిన వారు విశాల హృదయంతో నీతినిచ్చేదనం చేసేవారూ, సౌందర్యంతో లోకాన్ని దిగ్భ్రమ చెందించేవారూ, హత్యలూ విప్లవాలూ కలిగించగల చేవగలవారూ, ఒక్క గంట అనుభవం చేత జీవితం సాఫల్యమయిందని పించే వారూ..

నిజమైన మోహం, ఎవర్ని మోహిద్దామా అని వెతుక్కుంటూ, బైలుదేరితే వొచ్చేది కాదు. స్త్రీ పురుషులు స్వేచ్ఛగా కలుసుకుంటో ఉంటే ఎవరిమీదో మోహం కలుగుతో ఉంటుంది. అప్పుడు కలగాలి పెళ్ళి వాంఛ. ఇంకా ఆ రెండోవ్యక్తీ, తానూ ఐక్యమైనామనీ, ఆ వ్యక్తిగాక ఇంకెవరూ తనకి లోకంలో లేరనీ తోచినప్పుడు కలగాలి వివాహానికి అవసరం.

మోహం కలక్కముందే, బాల్యమందే గర్భాదానాలు కానియ్యడంవల్ల అనర్థాలున్నాయి.

1. శరీరాలు లేతగా ఉండడంవల్ల అనారోగ్యం.

2. సంతానం బలహీనం.

3. అందం నలిగిపోవడం, ముఖ్యంగా స్త్రీది.

4. భార్య మనసు లేతది కావడం చేత స్వతంత్రంగా ఆలోచించుకునే శక్తిలేక, భర్త అభిప్రాయాలే తనవిగా చేసుకుని మానసిక బానిసత్వం చేయడం.

5. సంసార బాధ్యతా, భర్త అధికారమూ, కాన్పులూ, బంధువుల, అధికారమూ, వంటా, చాకిరీ, చివాట్లూ అన్నీ ఆడుకునే వయసులోనే భరించవలసి రావడంవల్ల జీవితంలో సంతోషమే నశించడంతో ఎదిగే శరీరం ఆగుతుంది. వికసించే బుద్ధి మందగిస్తుంది. త్వరలో ముసలిదై, అనుభవించవలసినవన్నీ, పెళ్ళీ, భర్తా, పిల్లలూ, చావులూ బయస్కోపులో పటాల్లా చాలా త్వరలో కళ్ళ ఎదుట, నిమిషంలో ముగియడంచేత, నూరేళ్ళూ నిండినన్నీ, ఆశా, అందమూ ఏమీలేక, జీవించే కళ బరంగా తయారౌతుంది.

6. పిల్లల్ని పెంచడానికి, వారి శిక్షణకి కావలసిన జ్ఞానమూ, క్షమా ఉండకపోవడం. ఇది పిల్లలకి చాలా బాధా, నష్టమూ.

భార్యనీ, పిల్లల్నీ పోషించగల సంపదన కలిగేవరకూ మొగవాడు పెళ్ళి చేసుకోకూడదు. చేసుకున్నాడా తనేగాక, తన భార్యనీ, పిల్లల్ని ఆర్థికంగా తల్లిదండ్రులు, అత్తమామలమలు మొదలైన వారికింద బానిసల్నిచేసి, అతి నీచస్థితిలో పడతాడు. తన ఆదర్శాలూ, ఔన్నత్యమూ, అభివృద్ధీ, సంసారంకోసం అనవసర త్యాగంచేసి భ్రష్టుడౌతాడు.

పెళ్ళి చేసుకోడానికీ, పిల్లల్ని కనడానికీ, అర్హతలేని వాళ్ళనేకులున్నారు.

1. తమద్వారా సంతానానికి రాగల జబ్బులు కలవాళ్ళూ,

ఉదా: పిచ్చివాళ్ళూ, చెవిటివాళ్ళూ, సుఖరోగులూ.

2. తాగుడూ మొదలైన దురభ్యాసాలు కలవారు.

3. బలహీనులూ, దీర్ఘ రోగగ్రస్తులూ.

వీరికొకవేళ సంస్కారమున్నా, పెళ్ళీ పిల్లలూ కలిగించుకోడం పాపపాటు. సంఘం ఎడల గొప్ప అపచారం.

పెళ్ళికి తగిన వయసు స్త్రీ పురుషులకీ ముప్పై, నలభై సంవత్సరాల మధ్య వయసు. ఈ లోపల స్త్రీలూ, పురుషులూ

ఒకరి విషయం ఒకరు బాగా తెలుసు కుంటారు. చంచలమైన బుద్ధి కుదుట పడు తుంది. మార్పులూ, రుచులూ, ఉద్రేకమూ అనుభవంవల్ల తగ్గుతాయి. జీవితంలో, ధనంతో, అనుభవంతో స్థిరపడతారు. ఇంక శాంతీ, పిల్లలూ, సంసారమూ కావాలని పిస్తుంది. ఈలోపుగా సంసారాలుగా ఏర్పడ కుండా, స్త్రీ పురుషులు శరీర హృదయాను భవాల ద్వారా, ధర్మార్థ కామమోక్షాలు సమ ర్పించుకోవాలి. కాని వయసు ముదిరిన తరువాత కలిగిన సంతానం అంత ఉత్త మంగా ఉండదని శాస్త్రజ్ఞులు కొందరు అభిప్రాయపడుతున్నారు. ఆ అభిప్రాయం తో ఏకీభవించినవారు —

ఇద్దరూ పద్దెనిమిదేళ్ళ తరువాత పెళ్ళి చేసుకుని, ఒక పదేళ్ళనుభవించి, కావలిసిన పిల్లలను కని, వారిని పాఠశాలలో ప్రవేశ పెట్టి, సంసారబంధం అట్టే లేకుండా, ఎవరి పని వారు చూసుకోవచ్చు, విడిపోవచ్చు.

భార్యా భర్తలు పెళ్ళికి ముందు, పెళ్ళికి తాము తగినవారవునో కాదో డాక్టరుచేత పరీక్ష చేయించుకోవాలి. డాక్టరు సర్టిఫికెట్ లేనిది పెళ్ళి చేసుకోకూడదనీ ప్రభుత్వం వారు నిర్ణయించడం ఉత్తమం.

ముందు ముందు తగాదాలు రాకుండా పెళ్ళికి ముందే దంపతులు కొన్ని విషయా లలో, ఉద్దేశ్యాలు వెలిబుచ్చుకుని అర్థం చేసుకుని, నియామకాలేర్పరచుకు తీరాలి. మొదట ప్రేమ ప్రవాహంలో ఉన్నప్పుడు తమ కెన్నడయినా అభిప్రాయ భేదాలు వస్తాయా అనుకుంటారు. వచ్చి తీరుతాయి.

1. పిల్లల్ని ఎప్పుడు, ఎంతమందిని కనడమో, అసలు లేదో!

2. వారి బాధ్యతని ఎవరెంతవరకు తీసుకుంటారో మొదలైనవి.

3. ఇప్పుడు యావజ్జీవ సంబంధం ప్రకారం పెళ్ళి చేసుకోవటం అతినీచం కనక ఈ వివాహ చట్టాలు మారాలి. అవి మారిం దాకా, వేరే వివాహ విధిని ఏర్పాటు చేసు కోవాలి. ఇందులో ఎవరికన్నా విడిపోవాలని ఉంటే ఏ కారణమూ, ఎవరికీ నివేదించుకో నక్కర్లేకుండానే విడివడే స్వతంత్ర పద్ధతి మీదనే వివాహం చేసుకోవాలి. జన్మమంతా గాని, ఒక్క గంటకైనా గాని వాగ్దానాలడ గడమూ, వుచ్చుకోవడమూ మూర్ఖం.

ఇంకా వారివారికి సంబంధించిన విష యాలు, వృత్తీ బంధువులూ, సంసారానికి ధనం ఎవరెంత వినియోగించేదీ, ఇంకా రహస్య విషయాలూ తమ కింకెవరిమీదన్నా మనసూ, చనువూవుంటే అదీ, అన్నీ మర్మం విడిచి మాట్లాడాలి. ఒకరి గత జీవిత రహ స్యాలూ ఇంకొకరితో చెప్పుకోనవసరం లేదు. కాని చెప్పక, చెప్పామనే అబద్దాలు మాత్రం కూడదు.

ఇద్దరికీ వివాహం ఇష్టమైన తరవాత, ఇంకా లోకంలో ఏదీ వారి వివాహానికి అడ్డం రాకూడదు.

పెళ్ళి అయినవారికైనా మొదట్లో కామం అమితంగా ఉంటుందిగనక కామ జ్యోతి ముందు కురూపులు సౌందర్య వంతులూ, గుడిశ సౌధమూ, వెకిలితనము బుద్ధికుశలతావలే తోస్తుంది. తమ హృద యంలో ఉండే సరసమూ, కవిత్వమూ కలిపి రెండోవారికి రంగువేసి చూసుకుని, మోసపోయి, సంతుష్టి చెందుతారు. ఉన్నత మైన ప్రేమ సంగతి మాట్లాడేటప్పుడు తన కున్న ఈ నూతన కామం సంగతే వారు సూచించేది. కొద్దికాలం గడిచి, కామం తగ్గి,

ఒకరికొకరు భార్యాభర్తలు పాతబడగానే నిజం బైట పడుతుంది. రాత్రులు అప్పుడప్పుడు మాత్రమే భార్య అందంగా కనపడుతుంది. తక్కినప్పుడు పచ్చడి రుచుల్లోనూ, పిల్లల ఏడుపు మొహాల్లోనూ కాళ్ళు పట్టించుకోవడంలోనూ భార్య సుగుణాల్నీ, పాతివ్రత్యాన్నీ, శీలాన్నీ రుచిచూస్తో ఉంటాడు భర్త. నగల్లోనూ, చీరల్లోనూ అతని ప్రేమ ఆమెకి ప్రత్యక్షమౌతుంది. పోట్లాటలు మొదలు. చిరాకూ, కోపమూ, దూషణా అన్నీ ఎక్కువౌతాయి. కాని ఒకరి నొకరు వొదలరు. వొదిలేశక్తి ఇద్దరిలో ఒకరికీ ఉండదు. అందుకని మనసులో ఆ సంసారస్థితే మంచిదనీ, మోహం ప్రేమగా మారి, అధ్యాత్మిక మయిందనీ, అసలు పెళ్ళికి మోహం అక్కర్లేదనీ,శాశ్వతమైన సద్గుణాలు కావాలనీ, ఈ పోట్లాటల్నీ, దూషణల్నీ, దెబ్బల్నీ చాకిరినీ, మురికినీ లక్ష్యం చెయ్యని ఉన్నతమైన తమకి ఎవరికీ కనపడని దివ్య ఆధ్యాత్మిక మహా ప్రేమానుబంధం అడుగున ఎక్కడో సంస్కారమై, ఈ సంసారాన్ని పాలిస్తోందనీ అంటారు పైకి. వంటకీ, పిల్లలకీ, నగలకీ, మర్యాదలకీ, శరీరాలకీ, మంచాలకీ, అలవాటై, ఆ అలవాటే ఆ వొకర్ని వొకరు వొదలలేని అసహాయత్వమే, భయమే, మహా ప్రేమగా పరిగణించుకుని, భోజనం వేళకి చేసినట్టే సంతోషమూ, విచారమూ ఏమీ లేకుండా, యధావిధిగా రాత్రులు కలుసుకుంటో, వేదోక్తంగా నిష్కాములై కర్మకాండ జరుపుతో ఉంటారు. ఇటువంటి దురవస్థకన్నా వ్యభిచార మింకొకటి లేదనీ, మృగాన్ని చూసి సంతోషించే మృగం, వేశ్యని చూసి ఆనందించే విటుడి సంబంధం దీనికన్నా చాలా ఉన్నతమూ, సహజమూ అనీ గుర్తించే స్థితికి ప్రజలు ఎప్పుడు వస్తారో కదా!

నిజమైన ప్రేమ ఉంటే అదెన్నడూ పోదనీ, ఏమి చేసినాసరే, ఎటువంటి వారైనాసరే, ఎన్నాళ్ళయినా సరే, ఎట్లా ఉపయోగించినా సరే పోదని సామాన్యాభిప్రాయం. ఇది గొప్ప పొరపాటు. అసలు సాధారణంగా ఈ దంపతులకి కామం తప్ప ప్రేమ ఉండనే ఉండదు. వీరు ప్రేమ అనుకునేదంతా కామమే. మోహంకూడా చాలా మందికి కలగదు. ప్రేమ కలగడానికి కారణాలు తెలీడం కష్టంగానీ, ఒకసారి కలిగింతరవాత నశించడానికి కారణాలు అనేకం.

అదర్శమైన ప్రేమ అదెన్నడూ పోదేమోగానీ, సాధారణ ముసుగులలో ఉండేది, ఆ అదర్శమైన ప్రేమకాక, వారి స్వభావాల వల్లా, లోపాల వల్లా, సంకుచితమైనది కావడంవల్లా, మోహాన్నీ, కామాన్నీ ప్రేమ అని అనుకోవడంచేత, జాగ్రత్తపడలేక పోయినట్టయితే పరస్పరాకర్షణ చాలా త్వరలో నశిస్తుంది.

1. భార్యభర్తలకి మొదట కొత్తలో కామం విస్తారంగా ఉండడం వల్ల ముందు వెనకలాలోచించక అన్నివేళలా, విస్తారంగా కలుస్తోవుంటారు. ఈ దంపతులు అందుకు తప్ప ఒకరికొకరు ఉపయోగించరు. ఆ విధంగా తప్ప ఒకరినించి ఒకరికి ఆనందం వచ్చే మార్గంలేదుగనక ఇంక వారికి పని లేదు. గతిలేదు. కానీ అట్లాంటి సందర్భం వల్ల ప్రేమ త్వరలో నశిస్తుంది. ప్రేమ నిలవాలంటే నూతనత్వం చెడకూడదు. ఒకరికొకరు సాధారణమూ, అలవాటూ, పాతా కాకూడదు. ఒకరి పలుకూ, తలపూ ఇంకోర్ని పులకింప చెయ్యాలి. అందుకోసం

అమిత నిగ్రహం కలిగి ఆనందాన్ని కొంచెం కొంచెంగా, పువ్వునించి వాసనవలె గ్రహించాలి. ఒకరి దేహం ఒకరికి ఆశ్చర్యమూ ఆనందమూ ఎప్పుడూ కలిగించాలి: నిగూఢమై అద్భుతమై ఉండాలి. ప్రేమ సౌందర్యంమీద ఆధారపడదని మతాభిమానులెంత చెప్పినా, అంధులకూ, అందం అంటే అర్థం కాని పశువులకూ తప్ప తక్కినవారి ప్రేమ కొద్దో గొప్పో అందాన్ని ఆశ్రయించే ఉంటుంది. కనక ఇద్దరూ, ముఖ్యం స్త్రీ, తన సౌందర్యాన్ని కాపాడుకోవాలి. స్త్రీ శరీరం తనదికదా, తనకి చిక్కిందికదా అని పురుషుడు నలిపి, పాడు చెయ్యకూడదు. స్త్రీ అందుకు ఒప్పుకోకూడదు. ఒప్పుకున్నదా, త్వరలో ఇతర స్త్రీలని పురుషుడు వెతుక్కుంటాడు. పెళ్ళి అయిందికదా, ఇంక తన భర్తకాకపోడుకదా అని, తను తన అందంచేత గానీ, బట్టల చేతగానీ, శృంగారం చేతగానీ, ఆకర్షించడాని కేమాత్రమూ శ్రమపడదు. పురుషుడు అంతకన్నానూ.

పురుషుడికి స్త్రీ శరీరం తాకితే అపవిత్రమౌతుందేమో అన్నంత సుందరంగా కనపడాలి. మోకరించి భక్తితో పూజింపగల రసజ్ఞతా సౌందర్యారాధనా ఉండాలి.

ఎప్పుడూ మారుతో కొత్తరకాల భర్త హృదయాన్ని దినదినమూ నూతనంగా ఆకర్షించి జయించే నేర్పు ఉండాలి స్త్రీకి. స్వతస్సిద్ధమైన అందంకన్నా ఈ జీవకళ, ఈ నేర్పు అతి ముఖ్యం, పురుషుడి మనసుని ఆకర్షించడానికి. ఎప్పటికప్పుడు తన లోకానుభవంచేత, తన బట్టలు, ధరించే విధం, పాపిడి తీసుకునే తీరు, కళ్ళచూపుల నేర్పరితనం, వొంటి విరుపులు, మాటల మాధుర్యం, కంఠపు మార్థవత్వం, అన్నీ స్టడీ చేసి, నేర్చుకుని ఉపయోగించాలి. ఇదంతా వేశ్యాత్వమంటారు. ప్రేమ లేనిదే ఇవన్నీ చూపడం వేశ్యాత్వంగాని, హృదయమిచ్చిన వాణ్ణి రంజింపచెయ్యడానికి పూనుకోడం ఏమాత్రమూ కాదు. వేశ్యాత్వమని మానుకున్న నిర్భాగ్యుల్ని వొదలి, భర్త ఇవన్నీ ఉపయోగించే వేశ్య దగ్గిరే చేరతాడు.

పువ్వులూ, సంగీతం, నాట్యం, నగలూ అన్నీ ఆకర్షణకి తోడ్పడాలి. తననేకాక, లోకాన్నే సమ్మోహింప చేస్తోందా అన్నట్టుండాలి, భర్త కళ్ళకి స్త్రీ.

ప్రేమకొత్తలో ఏ మాటలచేత, చూపుల చేత, నవ్వులచేత భర్తని వశం చేసుకుందో, ఆ చేష్టల్ని జీవితంలో ఎన్నడూ మరవకూడదు.

భార్యా భర్తలు ఒకరికొకరు అన్ని అవస్థలలోనూ కనపడి అసహ్యం కాకూడదు. ఒకరి శరీరం ఒకరికి కొత్తగా ఆకర్షకంగా ఉంచుకోవాలి. ఎవరి బాధ్యతా, ఖర్చూ వారు వహించి వేరే ఇళ్ళలో కాపరముండి, అవసరమైనప్పుడు కలుసుకోడం చాలా ఉత్తమం.

ఒక్కొక్కప్పుడు భార్య కాపరం జీవనానికి తయారై ఉండదు. సిగ్గుపడుతుంది. లేక భయపడుతుంది. అసహ్యపడుతుంది. ఆమె అసహ్యాన్ని అర్థం చేసుకుని ఓపికపట్టి — జాగ్రత్తగా, నాజూకుగా పురుషుడు ఆమెతో పరిచయం చేసుకోవాలి. స్వార్థపరుడై పశువువలె ప్రవర్తించాడా, అతని మీద ఆమెకెంత ప్రేమ ఉన్నా, అదంతా భయంగా, ద్వేషంగా మారవచ్చు.

పురుషుడివల్ల తృప్తిని పొందలేని స్త్రీ నరాల సంబంధమైన రోగాల పాలపడు

తుంది. ముసలివాళ్ళ పడుచు భార్యలకి వచ్చే హిస్టీరియా, పిచ్చి, భూతాలూ, ఆత్మ హత్యలూ మొదలైన వాటన్నిటికీ ఇదే కారణం. డాక్టర్లకి ఈ సంగతి తెలీదు. తెలిసినా చెప్పరు. చెప్పినా ప్రజలు వినరు. కనక భార్యకి సంతృప్తినిచ్చే చాతుర్యాన్ని నేర్చుకోవాలి భర్త. ఇది సులభమైన పనికాదు. స్త్రీకి "అర్గాజమ్" ఉంటుందని తెలియని భర్త లెందరో ఉన్నారు. తమకు అది ఉంటుందని తెలీని భార్యలెందరో ఉన్నారు. పదిహేనేళ్ళ కాపురాలుచేసి, పది మంది పిల్లల్ని కన్నవారు కూడా పురుషుడి ఆనందానికి స్త్రీ సృష్టించబడ్డదనే అనేక మంది స్త్రీపురుషుల ఊహ. స్త్రీ ఆనందంతో పురుషుడికి పనిలేదు. ఆయనగారికి తృప్తి కలిగితే చాలు. స్త్రీ తృప్తిని గురించి ఆలోంచించే భర్తలు అరుదు.

స్త్రీని తృప్తిపరిచేందుకు ఆరోగ్యమూ, బలమూ అవసరాలేగాని, అంతకన్నా చాతుర్యం ముఖ్యం. దీనిలో మనసు 'ఇన్‌ఫ్లుయెన్స్' చాలా ఉంటుంది. పురుషుడు ముఖ్యంగా తొందరనీ ఆత్రుతనీ మాని నెమ్మదిగా తన మనసునీ, శరీరాన్నీ స్వాధీనంలో ఉంచుకుని, ఆనందాన్ని వీలైనంత కాలం ఎక్కువగా అనుభవించాలి. చాలాసార్లు సిగ్గువిడిచి స్త్రీని ఆమెకి ఆనందం కలుగుతోందో లేదో, ఏ విధంగా ఎక్కువ ఆనందం కలుగుతోందో, తృప్తి కలుగుతుందో కనుక్కుంటూ ఉండాలి. పురుషుడికన్నా స్త్రీకి తృప్తి ఆలస్యంగా కలుగుతుంది. ఊహామాత్రంగా పురుషుడు సన్నద్ధుడు కాగలడు. కాని, స్త్రీ చాలాకాలం తీసుకుంటుంది. నేర్పరీ, దయాళుడూ అయిన పురుషుడు తన మనసునీ, కుతూహలాన్నీ అణిచిపట్టి పరిపరి విధాల స్త్రీని ఉద్రేకింప చేస్తాడు. ఆ విధాలు సృష్టించే నేర్పు తుంది. ఏ కామ శాస్త్రంలో చూసినా అతి నేర్పుతో 'సయింటిఫిక్ ఎనాలిసిస్'తో చేయ బడ్డాయి ఆ వర్ణనలు. కనక ప్రత్యేకంగా రాయనక్కరలేదు.

వీర్యస్తంభనకి మందులనేకము లమ్ముతున్నారు. వాటి ఉపయోగం నాకు తెలీదుగాని అవి ఎక్కువ ఉపయోగకరం కావనీ, శక్తిహీనులకేగాని, ఆరోగ్యవంతులకి సహాయమక్కర్లేదనీ, మందులు సహాయకారులు కావనీ, ఆ నిమిషాన కొంత సహాయం చేసినా, ఆరోగ్యానికి ప్రతికూలమనీ కొన్ని హాని చేస్తాయనే నా ఉద్దేశ్యం. ఈ ఉద్దేశ్యం తప్పు కావచ్చును. పూర్వం యోగులు సాధనవల్ల వీర్యస్థంభన చేసే వారని ప్రతీతి. ఒక విధమేమంటే, ఆసనం బిగపట్టడం. ఆ బిగపట్టడం ఇచ్చా స్వాధీనం చేసి, ఎంత కాలమయినా అలాగుననే ఉంచగలిగితే వీర్యస్తంభన కుదురుతుంది. అంతవరకూ వాస్తవంగా కనపడుతోనే ఉంది స్వానుభవంలో. కానీ ఆ స్వాధీనం కుదిరేందుకు కొన్ని సాధనాలు చెపుతారు. అవి మాత్రం "ప్రాక్టికల్"గా కనపడవు. కావలసినవారు ఈ విషయాలు "గాంబర్జు" గారి పుస్తకాలు చదవవచ్చును. కానీ స్వాధీనం చేతకావడానికి కావలసిన యోగసాధన చేసేప్పటికి ఈ విషయాసక్తి అసలే తప్పిపోయి యోగమార్గంలో పడతారేమో ననుకుంటాను.

భార్యాభర్తా వివరంగా ఈ సంగతులు మాట్లాడుకోరు. ఒకరి పరిస్థితి ఒకరికి అర్థం కాదు. ఒకరిని సంతోషపెట్టడమెట్లానా అని రెండోవారు ఆలోచించరు. పురుషుడు స్త్రీని

సంతృప్తిపరచకపోతే, ఆ విషయాలు స్త్రీ మాట్లాడదు. తన బలాన్ని ఒప్పుకోడం ఆమెకి అభిమానం. అసలు కామం ఉందనీ, ఉండడం సహజమనీ అనుకోవటమే ఆమెకి అవమానం. తనకి అంత కోర్కె ఉండడమే పాపమనీ, నీచమనీ ఆమె అభిప్రాయం. ఈ అన్యాయం విద్యలోనూ, చాతుర్యంలోనూ లోపమని ఇద్దరికీ తెలీదు. తెలుసుకోవడం బూతు. సకలమయిన బూతు తిట్లూ తిట్టవొచ్చు గాని, శుభ్రంగా నిష్కపటంగా మాట్లాడకూడదు ఈ విషయాలు. ఇట్లా కష్టపడి తృప్తినెరగక, ప్రేమ చచ్చి కుళ్ళడం నీతి. అదీగాక చిన్నప్పటి నుంచీ ఆ కార్యం దుర్నీతి అనీ, అన్యాయమనీ, రహస్యమనీ, నీచమనీ సూచించడం వల్ల స్త్రీలు విజృంభించి తాము స్వతంత్రతను పూని పురుషుడికి ఆనందమియ్యరు. తాము అనుభవించరు. అతనేం చేసినా జడులవలెలొంగి ఉండటమే ధర్మమనుకుంటారు. తనకు ఇష్టం లేనప్పుడు నిరాకరించే శక్తినీ, తనకు అక్కర ఉన్నప్పుడు సుఖాన్ని స్వీకరించే స్వతంత్రాన్నీ పోగొట్టుకున్నారు. పూర్తిగా వయసు వచ్చి స్త్రీకి కోర్కె ముదరక పూర్వమే, బాలికలనే ఈ భర్తలు బలాత్కరించడంవల్ల స్త్రీలు విముఖులౌతారు.

ఈ విధంగా స్త్రీని నొక్కిపట్టడంవల్ల స్త్రీ సౌఖ్యాన్ని చెడగొట్టడమేగాక, ఆమె స్వతంత్రించి సౌఖ్యాల్ని కోరి పురుషుడికి ఇవ్వగల మహదానందాన్ని కూడా పురుషుడు నాశనం చేసుకున్నాడు. అందుకనే పురుషుడికి భార్య కంటే వేశ్యని చూస్తే ఇష్టం. వేశ్య నెరిగిన పురుషుడు తిరిగి భార్య ముఖం చూసేవాడెంత దౌర్భాగ్యుడై ఉండాలి! వేశ్య స్వేచ్ఛగా తన వృత్తికోసం కామ రహస్యాల్నీ, రసత్వాన్నీ, రతిపద్ధతుల్నీ కొంచెమో గొప్పో నేర్చి ఉంటుంది. పురుషుణ్ణి ఆకర్షించడమే ఆమె ఉద్దేశ్యం. బిడియం లేదు. ఆ ఆకర్షణా ప్రయత్నాలు చెయ్యక, చెయ్యడం చేతకాక, పురుషులు దుర్మార్గులని స్త్రీలు ఏడిస్తే ఏం లాభం? వేశ్యని ధిక్కరించగల మాధుర్యాన్నీ, భావప్రకటననీ, ఆకర్షణనీ భార్య సంపాయించాలి. రోజూ కొత్తగా అతని మనసుని కొత్తరకాల జయించి కట్టి వేసుకోవాలి. ముందు ఇంటివద్ద తల్లి దండ్రులే ఈ నేర్పరితనాన్ని నేర్పాలి. తరవాత భర్త అభివృద్ధి పరుచుకోవాలి. స్వతంత్రంగా స్త్రీ నేర్చుకోవాలి. పురుషుడు ప్రౌఢ స్త్రీల నెరిగినవాడై ఉండి, నేర్పరై ఉండి, తన భార్య కూడా తనకి అంత ఆహ్లాదమూ, సంతృప్తి కలగచెయ్యాలని ఆశపడతాడు. కానీ ఈ పెళ్ళికూతురికి సరిగ్గా ముద్దు పెట్టుకోవడం చాతకాదు. కొత్తలో ఆ ముగ్ధత్వం సొగసుగానే ఉంటుంది. కానీ అది ఎన్నాళ్ళకీ జాణతనంలోకి మారక, మొద్దుతనంగానే ఉంటే విసిగి, ఆమెని వంటకి మాత్రమే ఉపయోగిస్తాడు పురుషుడు.

భర్త ప్రేమని ఆకర్షించి నిలుపుకోవడమెట్లానో, తన అందాన్నీ శరీరాన్నీ కాపాడుకోడమెట్లానో ఆడపిల్లలకి తల్లులు నేర్పాలి. స్త్రీకి పురుషుడి మోహాన్ని పేరేపించే పద్ధతులు, కాలం వచ్చేటప్పటికి సృష్టే నేర్పుతుంది. కానీ పెద్దవాళ్ళ తిట్లతోనూ, నీతిబోధనలతోనూ, వాటిని నాశనంచేసి, అనాథలనీ, అవివేకులనీ చేస్తాడు.

"స్త్రీని తన చేతుల్లో కావలించుకుని అనుభవిస్తో కూడా ఇంకా ఆమెని తీవ్రంగా వాంఛించే పురుషుడే దేహాన్ని కామానికే కాక

కవివలె, రసజ్ఞుడివలె ఆమెలో, ఆమె శరీర సౌందర్యంలో, మనోలావణ్యంలో పరవశత్వం పొంది, ఆనందాన్ని తన కళ్ళల్లో, మాటల్లో, స్పర్శలో చూపగలిగినవాడే స్త్రీని లాలించి సంతోష పెట్టగలడు." (ఎడ్వర్డ్ కార్పెంటర్)

స్త్రీ ప్రేమని నిలుపుకునేందుకు పురుషుడు ఇంత జాగ్రత్తపడాలి. ఆమె ప్రేమని ఆకర్షించే లక్షణాలు వేరు. ఆమెకి నగలూ, దేహాలంకారమూ అవసరంలేదు. కానీ శుభ్రతా, చురుకుదనమూ అవసరము. మాటలు, గుణాలు, ధైర్యం, లోకజ్ఞానం, పాండిత్యం మొదలైన గుణాలు ఆమె కోసమన్నా అతను అలవరచుకోవాలి.

పూర్వంనించీ మనదేశంలో బంధనాలు అమలులో ఉన్నాయి. సాధారణంగా ప్రతి ఇంటిలోనూ ఈ బంధనాలూ, స్త్రీ లక్షణాలూ, మందులూ, మంత్రాలూ మొదలైనవి కలిసి ఉన్న అచ్చు ప్రతి ఒకటి ఉంటోనే ఉంది. ఆ పుస్తకాలలో చెప్పిన మందులూ, మంత్రాలూ, అసాధ్యాలూ, హాస్యాలుగా ఉంటాయి చాలా మట్టుకు. కాని ఎక్కడో వాస్తవమైన రహస్యాలు ఉండవొచ్చు. వాటి నిజం పరీక్షించడానికి కృషి చెయ్యవలసిందే! స్త్రీ పురుష లక్షణాలు తెలుసుకోడం కూడా ప్రస్తుత కాలంలో ఉపయోగకరమైనవే కదా. ఇవేకాక, కొన్ని పుస్తకాల్లో కామ సంబంధమైన కార్యాలని విడతీసి, ఛేదించి అన్నిటికీ పేర్లు పెట్టి విశదీకరించారు. ఇవన్నీ రసజ్ఞలకి స్వభావసిద్ధంగానే చేతనౌతాయి. అది శాస్త్రం. అంతేగాని అనుష్టానానికి ఎక్కువ సహాయం చెయ్యదు. వ్యాకరణం ముందు నేర్చుకుని అటు తరువాత ఆ ప్రకారం మాట్లాడాలని ప్రయత్నించే మూర్ఖులుంటారా? కానీ మొత్తానికి ఆ పుస్తకాలు చదవడంవల్ల కొన్ని కొత్త విషయాలు గోచరించకమానవు.

బంధనాలు వాటిలో ముఖ్యమైనవి. ఆ విషయమై శ్రద్ధ వహించే వారికి చదవకుండా అవన్నీ స్వతంత్రంగానే మనసుకి తట్టినా, అన్ని విశేషాలూ తెలియకపోవచ్చును. అదిగాక సిగ్గువల్లా, బద్ధకంవల్లా మామూలు కావడంచేతా, పరలోక వాసనవల్లా, నిరాశతోటీ ఆ విషయమై ప్రజలాలించి సాధకం చెయ్యరు..... వారంతట వారు ప్రయత్నంచేసి కనుక్కుని సుఖపడరు. అట్లాంటప్పుడు, ఈ పుస్తకాలు చదవడంవల్ల సులభంగా చతురత్వం, వెరైటీ చాతనౌతాయి.

వాటిలో కొన్ని బంధనాలు నేర్చుకోడం చాలా కష్టంగా కనపడుతుంది. గురువులు అవసరంగా తోస్తుంది. కొన్నిటివల్ల, ఇన్ని బంధనాలు వచ్చుననే సంతుష్టి తప్ప, ఇతరంగా వాస్తవమైన సుఖమేమీ కనపడదు. కొన్ని, మార్పు (వెరయిటీ) కావడంవల్ల విసుగును తగ్గించి ఆనందాన్ని హెచ్చిస్తాయి. అదిగాక వ్యక్తిభేదాన్నీ, శరీరభేదాన్నీ పట్టి కొందరు కొందరికి ఒక్కొక్క బంధనం ఉపకరించవచ్చు. ఈ విషయాలు అచ్చువేసి అమ్మకూడదని నా శాసనం. కాని ఈ జ్ఞానం సర్వత్రా వ్యాపంచడమే శ్రేయోదాయకమని నమ్మకం. స్త్రీ పురుషులు పరస్పరం ఆకర్షించే పద్ధతులూ, రంజింపచేసే సూత్రాలూ కొన్నిట్లో బాగా రాశారు. ఈ విషయంలో స్వతంత్రయోచన తక్కువైన వారికి చాలా ఉపయోగం. ఈ బంధనాలు మొదలైనవి జీవితంలో అమలులోకి వచ్చి, ప్రజలకి ఉపయోగపడాలంటే పునస్సంధా

నానికి పూర్వమే పిల్లల్ని ఈ విషయాల్లో సిద్ధం చెయ్యాలి. ఇంగ్లీషూ, కుట్లూ, హార్మోనియమూ నేర్పుతారు గాని, రస జ్ఞతా, రుచిగల వంటా, గదిలో నేర్పూ జాణతనమూ నేర్పరు కద! ఈ విషయాలు నేర్పే గురువులు ఉండాలి. కాలేజీలు స్థాపించాలి. పోనీ సమర్థులూ, అనుభవజ్ఞులూ, వేశ్యలూ ఈ విషయాలు నేర్పడానికి "బోర్డు" కట్టుకోకూడదా? అన్నట్లు వాళ్ళకీ పెళ్ళిళ్ళు చేసి, మతిహీనుల్నీ, రసహీనుల్నీ చేశారు కదా!

చీకటీ, మురికీ, ఇరుకూ, మోహాన్ని చంపుతాయి. కనక దంపతులు — ముఖ్యంగా స్త్రీ, ఇంట్లో బంధితురాలు కాకూడదు. గదుల్లో దూరి రాత్రనక, పగలనక తలుపులు వేసుకోడం మానెయ్యాలి. మిగిలిన జీవితం ఎక్కడ గడిపినా, కామ జీవనం మాత్రం సుందరప్రదేశాలలో గడిపి తీరాలి. సుందర భావాలతో ఆ కాలాన్ని నింపుకోవాలి. కానీ సంసారం ఈ అనందానికీ, సౌందర్యానికీ గర్భశత్రువయింది. సాధారణంగా మనుషులు గడిపే సంసార జీవనం ఎట్లా ఉంటుందో చూద్దాం. కొత్త దంపతులు కాపరం మొదలుపెట్టినప్పుడు ఎంతో రసం హృదయాల్లో ఉండడంవల్ల బాహ్యపరిస్థితులని అందంగా ఉంచడానికి శ్రమపడరు. కొందరు ప్రయత్నించినా, పరిస్థితులు అనుకూలించవు. గదులు సాధారణంగా ఇరుకుగా, చీకటిగా ఉంటాయి. వాటిలో ప్రవేశిస్తేనే ఉన్న ఉత్సాహమంతా చస్తుంది. దాని నిండా సామాను, బూజు, పెద్ద బరువైన మంచం. అది గొప్ప. దాని మీద పీచుపరుపూ, దోమలూ, చెమటా, పాత పటాలూ, ఇట్లా ఏడుస్తాయి గదులు. కిటికీలు రోడ్లమీదికి ఉంటాయి. తెరిస్తే ప్రమాదం! పక్కగదిలో ఇంకా ఎవరో దంపతులు ఉండడంవల్ల బిగ్గిరగా మాట్లాడమూ, నవ్వడమూ భయం.

అప్పటికీ పాపం ఏవో ప్రయత్నాలు చేస్తారు. జీవితం అందంగా చేసుకోడానికి ప్రయత్నిస్తారు. కానీ ఆ ప్రయత్నాలు చూస్తే జాలీ, నవ్వూ కలుగుతుంది. ఒక్క ఏడాదిలో బిడ్డ కలుగుతుంది. కలిగేటప్పుడు చాలా ఉత్సవాలు చేస్తారు. సంతోషిస్తారు. కాని ఆ గర్భంతోనే ప్రేమ చచ్చిందని అర్థం చేసుకోరు. ఆ చిన్నతనంలోనే ఈ బలహీనురాలైన తల్లి కనడంతోటే, ఉన్న అందం పోయి, వొళ్ళంతా జావలాగు వేళ్ళాడి, ఎటువంటి తుచ్ఛులూ కన్నెత్తి చూడలేనంత వికార రూపాన్ని ధరిస్తుంది. అటు తరువాత బిడ్డల ఏడుపుల్లో, ఉచ్చ వాసనలలో, భార్యాభర్తా కడుపునిండాతిన్న ఆ పులుసు కూర కంపుకొడుతో, భర్త ఆఫీసు పాత రికార్డు వాసనవేస్తో, భార్య ఇంగువవాసన వేస్తో అదో కర్మకాండకింద ఆ తిన్న మిరపకాయల కారమూ, అవా ప్రేరేపించగా, అదో యథావిధిగా సంతోషమూ, విచారమూ రెండు లేక, కళ్ళు మూసుకుని ఒక్క నిమిషంలో, ఏమీ ఉపోద్ఘాతమన్నా లేకుండా ఔషధం మింగినట్టు నిష్కామకర్మకాండ జరుపుతారు. ఒకరిదేహం చూసుకోడానికి ఒకరికి రోత. అందుకు దీపం కూడా అర్పుతారు. ఒకరితో ముద్దుగా మాట్లాడడానికి ఒకరికి మాటలు లేవు. ఒకరిని చూస్తే ఒకరు భరించలేరు. అంతకుముందే పోట్లాడుకుంటో, చీదరించుకుంటో ఉంటారు. ఇంతలో పిల్లలు లేస్తేకొడతారు. ఆరోగ్యాలు చెడడంవల్ల దేహంలోని మురికి

వాసనలు. ఆ సమయమే భార్యకి తన అధిక్యత చూపడానికి వీలు. నగలకోసమో, లేక చీరలకోసమో, ముందే వాగ్దానాలు జేయించుకోవాలని ప్రయత్నం. కాని భర్త చిక్కుతాడా? ఇదీ ఆధ్యాత్మికమైన సంసార సుఖం.

పాపం కొంచెం "రొమాన్సు" రసజ్ఞతా గల మనుషులు ఈ కక్కుర్తినించి బైటపడే ఉపాయం లేక స్త్రీ పురుషుల్ని వెతుక్కుని ఆనందించడానికి ప్రయత్నిస్తారు.

ఆరోగ్యవంతులైన స్త్రీ పురుషులు వెన్నెల రాత్రులు సముద్రతీరాల, నదీ తీరాల, చల్లగాలిలో, తెల్లని ఇసకమీద, నీళ్ళ చప్పుడులో, లేక అందమయిన అడవులలో, పచ్చిక బయళ్ళమీద తమ సుందర దేహాన్ని దాచుకునే అవసరమూ, అసహ్యమూ లేక, జతలుగా విహరిస్తూ, అడుతో, పాడుతో, నవ్వుతో, స్వేచ్ఛగా నిర్మలాకాశం కింద, పువ్వుల వాసనలో, భూమే శయ్యగా, తిరిగి కలుసుకునే అదృష్టం ఎప్పుడు కలుగుతుందో కదా! ఈ మందులూ, కషాయాలూ, చమటా, రహస్యమూ, అందవికారమూ, తొందరా, బలహీనత్వమూ, తిండివల్లా, బట్టల్లేని బొమ్మల వల్లా కలిగే కుహనా ఉద్రేకమూ, దొంగ మాటలూ, అనుమానాలూ, అగ్రహాలూ, నీరసాలు ఎప్పటికి పోతాయో? అసలు పోనేపోవో?

భార్యాభర్తలు పొద్దున్నా, సాయంత్రమూ, వెన్నెల్లో, చల్లని శుభ్రమైన గాలిలో షికార్లు పోవాలి. ఆటలాడాలి. పుస్తకాలు చదవాలి, క్లబ్బుల్లో సొసైటీలలో మెంబర్లయి ఎవరి పనుల మీద వారుండాలి. అనేక "సిట్యుయేషన్లలో" పరిచయాలు కావాలి. అనేక స్త్రీ పురుష స్నేహితులతో కలవాలి. తామే లోకంలోకల్లా ఒకరికొకర మనుకుని ఇద్దరూ ఒకరి నొకరు చూసుకుంటూ ఉంటే, ఇంత త్వరగా ఒకరినొకరు ఎన్నడూ చూసుకోడానికి ఇష్టంలేకుండా అయిపోతారు. మొదట్లో ఒకరికి ఒకరం చాలమా అనిపిస్తుంది. కాని ఆ అభిప్రాయాన్ని నమ్మితే చాలా మోసం. అనేక పనులలో ధ్యాసలలో కాలంగడిపి, కామం మరిచిపోవాలి. ఇతరుల్ని ఇతర విధాల ఒకరి నించి ఒకరు ఆనందం పొందే పద్ధతులు తెలుసుకుని అనుభవించాలి. కవిత్వం, సంగీతం, కళాభిరుచి, సృష్టి సౌందర్యం, గ్రంథ పఠనం — వీటిలో ఐక్యంకావాలి. ఒకరి నొకరు చూస్తే చాలు. వేలు తాకితేచాలు. పరవశమయ్యేట్టు మనసుని ఉంచుకోవాలి. అప్పుడప్పుడు ఒకరినొకరు వదిలి మళ్ళీ కలుసుకోడం మంచిది.

ఈ కాలపు నాగరికత పొందిన ప్రజలకి అసహజమైన కామరోగం పట్టుకుంది. స్త్రీ ధ్యాసలేనిదే ఆరోగ్యవంతుడైన మనిషికి ఎన్నిసార్లు కోర్కె కలుగుతుంది? చాలా తక్కువసార్లు. భోజనం వల్లా, మాటలవల్లా, తలపువల్లా, కథలవల్లా, నాటకాలవల్లా, బయస్కోపువల్లా, అసహజంగా ఈ వాంఛని వృద్ధిచేసుకుంటున్నారు. స్త్రీ దగ్గిర ఉండగానే ఆ కోర్కె సహజంగా కలగకపోయినా, అనేక కృత్రిమ విధాల ప్రేరేపించుకుంటున్నారు. భార్య అయినంత మాత్రాన ప్రతి రాత్రీ ఉపయోగించడం ధర్మమూ, హక్కూ అనుకుంటున్నారు. స్త్రీ ఇంకా పురుషుడంత నాగరికతా ప్రవాహంలో పడకపోవడం చేత ఈ నిత్య కామ జీవితానికి ఇష్టపడదు. కాని విధిలేక పురుష ప్రభు శాంతికోసం దేహం

ఒప్పుచెపుతోంది. "అఫ్‌కోర్స్", అసహజమైన వాంఛగల స్త్రీలూ లేకపోలేదు. ఇంక మితి మీరి కామవాంఛ దానంతట అది కలిగినప్పుడు తీర్చుకోవలసిందే! కానీ కాఫీ హోటలు చూస్తే ఆకలి కలిగినట్టు ఈ వాంఛని అసహజం చేసుకోకూడదు.

ఈ స్థితికి ఇంకో కారణం: ఈ దుస్తులలోనూ, చూపులలోనూ, సిగ్గులలోనూ ఆకర్షణ. స్త్రీని ఇట్లా దాచి, రంగుచీరలు కట్టి, జుట్టు పెంచి, పూలు అలంకరించి, సిగ్గుచూపులూ, దాక్కోడాలూ, బలహీనత్వమూ, అబలత్వమూ ఇవన్నీ లేకపోతే ఇంత వాంఛ ఉండదు. పడకగదుల్లో తమ ప్రియులకి ప్రేమ సమయంలో చూపవలసిన అందాలనీ, మర్యాదలనీ, జాణతనాలనీ, వీధి గుమ్మాలలోనూ, తెరచాటునా, వీధుల వెంబడీ ప్రతి పురుషుడికీ చూపుతున్నారు ధర్మపత్నులు. భర్త అతి సమీపవర్తి అయినప్పుడు చూపవలసిన సిగ్గుని ప్రతి పురుషుడి ఎడలా చూపడ మెందుకు? "అదుగో నన్ను బలాత్కరింపబోతున్నావు. అది నా భర్త ఒప్పుకోడు" అన్నట్టు ప్రవరిస్తారు. పురుషుణ్ని చూడగానే గుమ్మాల వెనక దాక్కోడం అర్థంఏమిటి? సిగ్గుపడే ప్రతి స్త్రీ సబ్‌కాన్షియస్‌గా వ్యభిచారి. లేకపోతే ఆ దొంగభయమేమిటి? ఇదంతా ఆకర్షణకి ప్రథమసోపానం. ఈ పతివ్రతలు బహిరంగంగా కాన్షియస్ లెవెల్‌లో నించి తొక్కిపట్టిన "రొమాన్సు" సబ్‌కాన్షియస్ ఫలమిది.

ఇంకొకటి: దంపతులు విద్యలవల్ల నేమి, సంస్కారంవల్ల నేమి, లోకజ్ఞానం వల్లనేమి చాలా భేదం కలిగి ఉండి, ఒకరిలో ఒకరికి ఈ సంబంధం తప్ప ఇంకేమీ చాతగాక పోవడంవల్లా, తెలివితక్కువవల్లా ఉన్న ఆనందాన్నీ, రసజ్ఞతనీ చంపుకోవడం వల్లా, మోహంపోయిన దంపతుల్ని సంఘం బలవంతంగా బంధించిపుంచడంవల్లా, ఆ కార్యం వల్ల తప్ప ఇంకో విధంగా ఏ ఆనందాన్నీ పరస్పరంగా పొందడం చేతకాక ఇంక వేరుగతిలేక, ఈ వాంఛని పెంచుకుంటారు. ఇష్టం లేనప్పుడుకూడా విధిలేక కలుస్తారు. ఒకరు రెండోవారికి దగ్గిరిగా ఉండడమే, ఒకరి నొకరు చూడ్డమూ, మాటలే ఆనంద మిస్తే ఈ జాడ్యం తగ్గుతుంది. సంగీతం, సంభాషణ, రసికత్వం, వివేకం, లోకజ్ఞానం ఉండి స్నేహమూ ప్రేమా కలిగి, సంసారంలోనేగాక, లోకంలో ఇద్దరూ సహచరులు కాగలిగినట్లయితే ఆ సౌఖ్యంలో, ఆ మాధుర్యంలో, పడకటింటి తాత్కాలిక సౌఖ్యం ఒక గొప్పదిగా కనిపించదు.

ఆధికమైన స్నేహం కలిగినప్పుడు ఇద్దరు మగ స్నేహితులయినా కొన్ని సమయాలలో ఒకరి నొకరు బుజ్జగించుకుంటారు. ఎట్లానన్నా ఇంకా ఆత్మీయమైన సంబంధం కుదరాలని ఆశపడతారు. (అదీ అనేక మంది జీవితాలలో ఈ అనుభవమూ ఉండదేమో!) ఆ విధంగానే స్త్రీ పురుషులు స్నేహితులై లోకంలో జీవించేప్పుడు అన్ని విషయాలలోనూ ఒకరి నొకరు సలహానిచ్చుకుంటో సహాయంచేస్తే అనుభవాలనీ అభిప్రాయాలనీ పంచుకునేప్పుడు ఒకరిపైన ఒకరికి కలిగే ప్రేమవల్ల ఒక్కొక్కప్పుడు ఆకర్షణ కేంద్రీకరించి, ఇంకా అంతరంగికంగా ఐక్యం కావాలనే వాంఛ సకృత్తుగా కలుగుతుంది. అదే సహజమైన సమయం. తక్కినది వ్యభిచారం. అందులో ఆనంద మివ్వని, నీచమయిన నైతిక శాస్త్రయుక్త

వ్యభిచారం. అది తటాలున కాంతిపలె సంభవించదు. ఎంతో ప్రేమపైన, ఉపో ద్ఘాతం తరవాత భరింపలేనంతటి ఆకర్షణ ఫలం — ఆ కలయికలో రెండు జీవితాలూ ధన్యమై సంతృప్తిని పొందుతాయి.

భార్యా భర్తలు ఒకరి నీతి నింకొరిపైన విధించుకోకూడదు అందరి స్వభావాలకీ, ఒకటే నీతి సరిపోతుందనుకోడం తప్పు. హృదయ పూర్వకంగా ప్రేమిస్తేగాని, శరీరాన్ని తాకనియ్యనివాళ్ళు కొందరు. శరీరానికీ మనసుకీ సంబంధం లేక మనసుతో పూర్ణంగా ప్రేమించి కూడా శరీరవాంఛల్ని ఇతర విధంగా తీర్చుకోగలవారు కొందరు. ఇట్లా అనేక విధాలుగా వుంటారు. కనక ఎవరి నీతికి వారిని వదిలి, రెండోవారు తాము అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. భర్త దగ్గర లేనప్పుడు భర్త సంపూర్ణమైన తృప్తిని కలిగించనప్పుడు, శరీరవాంఛ తీర్చుకోడం కోసం నౌకర్ని జీతానికేర్పరచుకున్నా భర్త అర్థం చేసుకుని ఆమె నీతి అభిప్రాయాలతో సానుభూతిని చూపే ఔదార్యం కలిగి ఉండాలి. ఇట్లాంటి సూక్ష్మభేదాలనేకం వుంటాయి. ముఖచిహ్నాల, కంఠస్వరాలలో ఇన్నిలో ప్రత్యేక భేదాలున్నప్పుడు, స్వభావాలతో ఎంత భేదముంటుందో ఆలోచించవచ్చు?

ముఖ్యం ఈ సమస్యలన్నీ పరిష్కారం కావడానికి స్వార్థత్యాగం కావాలి. అన్ని విషయాలలో త్యాగం భోదిస్తారుగాని ఈ విషయంలో ఒప్పుకోరు. నిజమైన ప్రేమగలవారే అయితే, తప్పకుండా భార్యలూ, భర్తలూ రెండోవారి సౌఖ్యమూ, ఆనందమూ విచారించాలి. భర్తకి సౌఖ్యమివ్వలేనప్పుడు, భార్య ఇంకో వివాహం అతన్ని చేసుకోమంటే "ఎంత పతివ్రత అమ్మా!" అంటారు. భర్త భార్యకే అట్లాంటి వీలు కలగచ్చేస్తే ఆకాశం విరిగి నెత్తిన పడుతుంది. జంకక రెండోవారి తృప్తికీ, ఆనందానికీ ఎంత త్యాగాన్నైనా చెయ్యగలిగింది ఉన్నతమైన ప్రేమ. ఇట్లా సౌఖ్యపడే విధాలు బోధించే మాటల్ని చూస్తే ప్రజలకి ముఖ్యంగా ఈ దేశపు ప్రజలకి కోపం. ఇదంతా స్వార్థమనీ, తమ ఆనందాన్నీ, భౌతిక కాంక్షనీ వృద్ధి పరచుకోవడమనీ అంటారు. స్త్రీ పురుష సంబంధంలో సౌఖ్యం అనుభవిస్తూ ఉన్నారా, లేదా! భౌతిక కాంక్షని వదిలి సంసారాన్ని వదిలి సన్యసించే వాళ్ళని సన్యసించవద్దనడం లేదు. నిష్కామంగా కళ్ళు మూసుకుని, హరిధ్యానం చేసుకుంటో, పుత్రులు కలగడానికి మాత్రమే ఆవస్థ పడేవాళ్ళని పడవద్దనడం లేదు. కానీ స్త్రీ సంభోగవాంఛగల యే పదిమంది పాపాత్ములో ఈ లోకంలో ఉన్నారుగా, ఈ కలియుగంలో! వారికే ఈ పద్ధతులన్నీ. ఇన్ని వేదాంతాలు బోధిస్తున్నా స్త్రీని కావలించుకున్నప్పుడు సౌఖ్యం కలగని అవస్థ ఇంకా మనుషులకి కొంతమందికైనా పట్టలేదు కదా! "మీరు సౌఖ్యపడాలనే చూస్తున్నారుకదా, పడే సౌఖ్యం కుళ్ళు సౌఖ్యం కాకుండా ఆరోగ్యవంతమూ నిష్కల్మషమూ, అధిక ఆమోదకరమైన దాన్నే అనుభవించరాదా!" అంటాను.

మూడోయేటే పసిబిడ్డల్ని పుట్టించుకుని, భార్యని అయిదోయేటే ముసలిదానిగా చేసుకుని, ఏమిటి మీరు పడే సౌఖ్యం? తరువాత ఇతరుల భార్యల్ని వెతకడమేగా! భార్యనే శుభ్రంగా, కొత్తగా ఉంచుకునే పద్ధతులాలోచిస్తే ధర్మాత్ములు

కోరెట్టు వ్యభిచారం తగ్గుతుందిగా!

వివాహం ఆనందానికి కాదుట! సంస్కారం అట! ఆనందానికి కాకపోతే, లోకోపకారార్థమేనా మీరు పెళ్ళి చేసుకునేదీ, పిల్లల్ని కనేదీ? కని వాళ్ళని వదిలేసి దంపతుల్ని సుఖపడమనటం లేదుగా! ఇట్లాంటి సుఖాలు ప్రజల్ని ఈ లోకంలో సుఖాల్లో ముంచి పరలోకాన్ని మరచేట్టు చేస్తాయట! పరలోకాన్ని తలుచుకుంటోనే సంసారం చేస్తారుగావును వీళ్లు! మరి ఆ గదులూ, పరుపులూ, చీరెలూ, అత్తర్లూ, ఎందుకో, పరలోకానికే! గర్భాదానాలకి ఈ తొందరపడడాలూ, పెళ్ళాం చచ్చిన మూడో నాడు ఈ పెళ్ళిళ్ళూ, ఇవన్నీ పరలోకానికే!

వివాహం ధర్మమనీ, సంస్కారమనీ, పతిదైవమనీ, ఎంత బోధించినా, ప్రేమ గుణాలమీద ఎంత ఆధారపడాలని నివేదించుకున్నా, చివరికి దాంపత్యం ముఖ్యంగా సంభోగ సుఖంమీద ఆధారపడుతుంది. రాత్రి పక్కమీద తృప్తిపడ్డ భార్యాభర్తలు పగలంతా చాలా ఆన్యోన్యంగా ఉంటారు. ఆ సుఖం తక్కువ కాగానే కీర్తీ, నగలూ, వంటలూ, అంట్లూ వీటిమీద ప్రేమ ఎక్కువవుతుంది. నూతనంగా స్త్రీలని పట్టుకునే దెయ్యాలూ, హిస్టీరియాలూ, బలహీనత్వాలు, పురుషుడివల్ల వాంఛ తీరకపోవడంవల్లనే కలుగుతున్నాయి. లేచి పోవడాలూ అంతే. స్త్రీ శరీరాన్నే గాక ఇమాజినేషన్ కూడా తృప్తిచెయ్యాలి పురుషులు. కొంతకాలంవరకు రొమాన్సుని కూడా. ఈ గతి పురుషుడికి శరీరంలో శక్తి తగ్గడంవల్లా, స్త్రీని "స్టడీ" చెయ్యకపోవడంవల్లా, నేర్పరితనం తెలుసుకోకపోవడంవల్లా కలుగుతోంది.

సహజమైన ఈ వాంఛకి ఈ తెలివీ, నేర్పరితనం నేర్చుకోడం ఎందుకని అడిగితే...

మృగాలకీ, పూర్వ పురుషులకీ, శరీర వ్యాయామం, వంట చేసుకోడం, చదువుకోడం బోధించాలా? పరిస్థితులు మారడంవల్ల ఇల్లాంటి నేర్పరితనాలు అవసరమైనాయి. అన్నిట్లోనూ విద్యా, విజ్ఞానమూ, తర్కీదూ ఒప్పుకుంటారు — ఈ ఒక్క విషయంలో తప్ప. నోటితో ఒప్పుకునే ఈ విద్యావంతులు, సమయం వచ్చేప్పటికి పరమ మూఢులకన్న అన్యాయంగా ప్రవర్తిస్తారు.

స్త్రీ పురుష సంబంధం పిల్లలకోసమే గాని, సుఖమివ్వడానికి అనే సంగతి ప్రజలు మరిచిపోయినారు. అంతరాత్మలలో కూడా ఒప్పుకోరు. మళ్ళీ పిల్లలు అఖ్ఖర్లేదు. అఖ్ఖర్లేదన్నా కలుగుతున్నారు. "ఏం చెయ్యం?" అని ఏడుస్తోనే ఉంటారు. ఎవరో భార్యా భర్తల్ని బలవంతంగా పడుకో పెడుతున్నట్టు. సుఖదాయకం కాకుండా, బాధా నివృత్తి కింద సృష్టిమార్గం కావడంవల్ల వచ్చిన ఖర్మమిది.

పురుషులకేగాని, కొందరు స్త్రీలకి సౌఖ్యం కాదుకదా, బాధకూడా పోదు. పురుషుడికి ఆ విషయమై శ్రద్ధలేదు. ఏదో తన సౌఖ్యానికి ఏర్పడ్డ మెషీను అనుకుంటాడు ఆమెని. విసుగు వచ్చినప్పుడల్లా "ఈ ఆడవాళ్ళు..." అని తిడుతోవుంటాడు. ఆ కార్యం పాపకార్యమనీ, అసహ్యమనీ అనుకోవడంవల్ల చాలా కాంప్లెక్సెస్ ఏర్పడ్డాయి. భార్యని తృప్తి పరచడం చాతకాక, ఆమె తృప్తికై కళ్ళెత్తితే, ఆమె గుణాల్నీ ఆమె వంశాన్నీ తిట్టి, బంధించి పిచ్చెక్కిస్తాడు పురుషుడు.

శరీరాల్ని తృప్తిపరిచే జ్ఞానమూ, నేర్పూ బోధించేందుకు పాఠశాలలు వుండాలి. ప్రతి యూనివర్శిటిలోనూ లెక్చరర్లు వుండాలి. 'సెక్స్‌చెయిర్' అని ఒక శాఖని వినియోగించాలి. ప్రతి ఊరిలోనూ ఈ విషయమై కొత్తవీ, ప్రాచీనమైనవీ, పుస్తకాలూ, గ్రంథాలయాలూ ఉండాలి.

పురుషుడు వీర్యశక్తికీ స్థంభనశక్తికీ ఆరోగ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి. మరి అవసరమైనప్పుడు నమ్మకమైన మందులు కొన్ని తప్పితే (అవీ నమ్మకస్తులైన మిత్రులు గానీ, డాక్టరుగానీ చెప్పినవితప్ప) బజారులో ఆమ్మే ప్రతి మందూ వాడితే స్వల్ప ఉపయోగానికై (అసలు ఉపయోగం ఉంటే) చాలా నష్టపడవలసి ఉంటుంది తరవాత.

స్త్రీ వాంఛనీ, ఆమె స్వభావాన్నీ, కామాన్నీ, తృప్తినీ పురుషుడు జాగ్రత్తగా స్టడీ చెయ్యాలి.

తమకి చాతనైనంత వరకు ఈ కామ శక్తిని ఇతర విధాల మార్చుకుని అనుభవించాలి. ముద్దులలో, నవ్వులలో, స్నేహంలో, కళలలో కలలలో శరీర సంబంధం అవసరమైనప్పుడే వాంఛనీయం. కాని ప్రస్తుతం కొంచెం మనసులో ఏ మాత్రం కోర్కెగలిగినా, తేరగా ఒకరికొకరు ఉన్నారుకదా అని పక్కమీద చేరతారు. ఆ మనసులో వాంఛకూడా లేకుండానే, అలవాటు ప్రకారం ఆ గంటకి తక్కిన కాలకృత్యాలవలె నెరవేరుస్తారు.

ఏదో పుస్తకాలలో చదివే ఆదర్శ ప్రేమ, కవిత్వంలో, కథలలో రాసిన ప్రేమని చదివి, అట్లాంటిది కావాలని కలలు కని, యువకులూ యువతులూ ఒకరినొకరు అనవసరంగా ఐడియలైజ్ చేసుకుని, పెళ్ళి చేసుకుంటారు. కవిత్వం, పోనీ కథలలోనన్నా నిజమైన జీవితం చూపక పోవడంవల్ల సినీమా ప్రేమల్ని నమ్మి — చాలా త్వరలోనే డిస్‌ఇల్యూషన్ అవుతారు. చదువుకోని మనుషులు పెళ్ళి అంటే ఏమిటో, మనుష్య స్వభావమేమిటో ఉన్నదున్నట్లుగా తెలుసుకోవడంవల్ల, ఒకరినించి ఒకరు అసందర్భమైనదీ, ఈలోకానిక ిచెందనిదీ తమకు లభించాలని కోరరు. ఈ కలలుకన్న యువతీ యువకులు తమ అసమర్థతని మరిచి, ఆ రెండోవారు తమ కలలన్నీ భగ్నం చేశారనీ కోపిస్తారు, కుమిలిపోతారు.

కవిత్వంలో చెప్పే ప్రేమా? ఏమీ అబద్ధం లేదు. ప్రేమలో వున్న గొప్పతనాన్ని ఏ కవిత్వమూ అందుకోలేదు. కాని అట్లాటి ప్రేమకి అర్హత కలిగిన పురుషులు చాలా స్వల్పమే. నిజమైన గొప్ప కవిత్వం నేర్చుకోవడమన్నా సాధ్యమౌతుందిగాని, ప్రేమ నేర్చుకోడం సాధ్యం ఏ మాత్రమూ కాదు. తపస్సుకి ఎందరు అర్హులో ప్రేమకి అందరే అర్హులు. తపస్సులోని ఆనందం అని పురాణాలూ — శాస్త్రాలూ, ఋషులూ, యోగులూ కీర్తిస్తున్నారు. చాలామంది ఆశించనూ ఆశిస్తున్నారు. కానీ ఎంతమందికి సాధ్యం? ప్రేమా అంతే? To be in love means to find one's God (టు బీ ఇన్ లవ్ మీన్స్ టు ఫైండ్ వన్స్ గాడ్)

ప్రేమ అంటే అర్థం తన ఆహాన్ని చంపుకోడం, రెండోవారి ఆరాధన. తనని ఆరాధించాలని తప్ప, తను ఆరాధించాలనే సంగతి ఒకరి మనసుకీ పనికిరాదు. స్త్రీకి చాలా సులభం అది, సహజంగా. కానీ, సహజత్వాన్ని చంపుకునే యీ నవీన స్త్రీకి చాతకాదు అది.

గర్భ నివృత్తి మార్గాలు

గర్భాదానం చేసుకునే భార్యాభర్తలకి ఆ సంతోషంలో పిల్లలు పుట్టవచ్చుననే సంగతి జ్ఞాపకం వుండదు. కానీ అవసరం లేనప్పుడు పిల్లలు కలగడంవల్ల చాలా నష్టాలున్నాయి. పిల్లలు పుట్టి నెత్తిమీది కొచ్చినదాకా ఆ నష్టాలు తెలీవు దంపతులకి. తెలిసినవాళ్ళు చెప్పరు. జబ్బులూ, ముళ్ళూ, అగ్నిప్రమాదాల వలెనే, సహజంగా అనుభవించే బాధలలో పిల్లలు ఒకటను కుంటారు.

1. ఎదగని చిన్న పిల్లలకి పిల్లలు పుడితే ఆరోగ్య నష్టం.

2. చిన్నతనంలో దంపతులు స్వేచ్ఛ అనుభవించకుండా పిల్లలు అడ్డు.

3. పూర్తిగా ఇంకా సంపాదన లేక ముందే, పిల్లలు పుడితే బీదతనంవల్ల కష్టాలు

4. తల్లికి త్వరలో అందం పోతుంది. పెనిమిటికి అసహ్యం కలుగుతుంది. నీతి వేత్తలు అసహ్యం కలగకూడదంటారు. కలగకూడదేమోగాని, కలుగుతున్నమాట వాస్తవమని వేలకు వేలు ఉదాహరణలున్నాయి.

5. తల్లి చిన్నదీ, అనుభవం లేనిదీ అయితే బిడ్డ శరీరాన్ని పోషించడంగానీ, సరైన శిక్షణలో పెట్టడంగానీ చాతగాదు.

6. ఏటేటా శిశువుల్ని కంటే తల్లి బలహీనురాలౌతుంది.

7. చాలామంది పిల్లలుంటే సంసార భారం ఎక్కువ అవుతుంది. వారి పోషణకి ధనం కావాలి. చాకిరీ కావాలి, శ్రద్ధ కావాలి. ఇవన్నీ చాలక బిడ్డలు చెడిపోవచ్చు. ఇతర పనులకి తల్లిదండ్రులకి వ్యవధి లేక పోతుంది, ఈ పనులతో.

8. జబ్బువల్లనైతేనేమి, సృష్టి లోపం వల్లనైతేనేమి, కొందరు స్త్రీలు గర్భం కలిగి కూడా కనలేని వాళ్ళుంటారు.

9. సుఖరోగులూ, కుష్టులూ, పిచ్చి వారూ, బలహీనులూ, తాగు బోతులూ పిల్లల్ని కనడానికి యోగ్యతలేదు. ఆ రోగాలు పిల్లలకీరావచ్చు.

10. కొందరికి పిల్లలు కావాలనే ఉండదు. పిల్లలమీద ఇష్టమే ఉండదు.

11. వితంతువులకీ, పెళ్ళికాని వారికీ పిల్లలు పుట్టినట్టయితే సంఘంలో చిక్కులు. ఆ పిల్లలకు కూడా ఆజన్మాంతమూ హీనత్వం.

ఇట్లా అసహజంగా పిల్లలు పుట్టకుండా ఆపడం తప్పంటారు. మరి అక్కర్లేని పిల్లల్ని కని, తల్లీ తండ్రీ తమ సుఖాన్నీ, వృద్ధినీ పోగొట్టుకుని, బిడ్డకి తగిన శ్రద్ధా, ధనమూ ఇవ్వలేక, ఆ బిడ్డ పురోభివృద్ధిని పాడు చెయ్యడం మంచిదేనా? స్త్రీ బానిసత్వమూ, బీదతనమూ, ఒకే స్త్రీకి పదినెల్లకొకరు చొప్పున పిల్లలు పుట్టడమూ, రోగాలూ, ఇవన్నీ సహజమేనా? అనహజమని మందులు పుచ్చుకోడం మానారా? తెల్లారి లేచింది మొదలు ఎన్ని అనహజమైన పనులు చేస్తున్నారు? ఇది ఒక్కటే అసహజమయిందా? ఈశ్వరుడు ఇచ్చే పిల్లల్ని అట్లా ఆపకూడదట! ఈశ్వరుడు కంటున్నాడా, మనుషులా? ఈశ్వరుడు ఇచ్చిన కురుపు

లకి మందులు వేస్తారేం? ఈశ్వరుడిచ్చే జుట్టుని కత్తిరిస్తారేం? ఈశ్వరుడిచ్చే భూకంపాల్ని తప్పించుకో చూస్తారేం?

కొందరు పురుష రేతస్సుని వృధా చెయ్యకూడదంటారు. రేతస్సులో ఒక అణువు గర్భం కలగజేసేది, తక్కినదంతా వృధా పోతోంది గదా! సృష్టి భయపట్టం లేదు, రేతస్సుని వృధా చెయ్యటానికి! మనుషులూ భయపడరు. కాని ఈ నీతివేత్తలు మాత్రం పైకి ఈ వెకిలి అభ్యంతరాలు వాదించుకుంటూ తిరుగుతారు. అన్ని విధాలా కుళ్ళు బతుకు బతికి అసలురేతస్సు లేకుండా ఎండిపోయేవారూ, కుళ్ళి పోయే వారూ చేప్పేది ఈ నీతి సిద్ధాంతాలే! పోనీ వృధా కాకుండా ఆ రేతస్సునంతా దాచుకుని ఉపయోగపరచుకోరేం? ఎందరు బిడ్డలు వీలైతే అందర్నీ పందులవలె కనాలని ఎక్కడన్నా రాసి ఉన్నదా?

ఈ నివృత్తి మార్గాలని అసహ్యించుకోడం "ఫాషన్" అయింది. వాటికి అభ్యంతరం కనబరచగానే "అబ్బో! ఎంత నీతిమంతుడో" అనుకుంటారు గదా అని ఆశ. అదిగాక వాటిని అనుష్టించే ఓపికా ధైర్యమూ శక్తీలేనివారూ, భార్యలచేత ఒప్పించలేనివారూ, ఆ సంగతి బైటపెట్టక పైకి "ఓ మాకంతా తెలుసు. వీటి సంగతి! అవేం లాభంలేదు. అబద్ధం, వాటివల్ల జబ్బులు కలుగుతాయని ఆ డాక్టరన్నాడు, ఈ ఘనుడన్నా"డని వెక్కిరించి నవ్వుతో ఉంటారు. నిశ్చయంగా వాళ్ళు ఈ పద్ధతుల్ని అనుసరించి ఉండరు. అనుసరిస్తే సరిగా అనుసరించి ఉండరు.

నివృత్తి మార్గాలు:

రేతస్సు స్త్రీ అండంలో కలవకుండా చేసే మార్గం ఏదన్నా పనికి వొస్తుంది. కొందరు మహాత్ములు అసలు ఈ సంబంధం మానుకుని, ఇంద్రియ నిగ్రహం చెయ్యడమే ఉత్తమమంటారు. జబ్బు చెయ్యకుండా ఉండడానికి తిండి మానమన్నట్లుంది. మానడం అందరూ రుషులై నప్పుడు. ఈలోగా ఈ దిక్కుమాలిన ప్రపంచానికేదన్నా విధానం కనిపెట్టాలి కద! దీనికి అనేక విధాలున్నాయి. వాటిని గురించి ఇంగ్లీషులో అనేక మార్గాలు చర్చింపబడి ఉన్నాయి. మన దేశంలో కూడా రెండు మూడు పుస్తకాలు ఉన్నాయి. కొన్ని మంచి మార్గాలు రాస్తాను.

స్త్రీలు ఉపయోగించేవి:

ఈ పనికి ఉపయోగపడే "చెక్ పెసరీ"లు ప్రతి మందుల షాపులోనూ దొరుకుతున్నాయి. ఇప్పుడు దొరకకపోతే మద్రాసులో ఏ మందుల షాపుకి రాసినా పంపుతారు. అదీ చాతగాకపోతే నాకు రాయండి.

సాధారణంగా రెండు రకాల "పెసరీలు" ఇప్పుడు అమలులో ఉన్నాయి.

డయాఫ్రెమ్ వెజీనల్ రబ్బర్ పెసరీ [Diaphragm Vaginal Rubber Pessary)

చిన్నపిల్లకి చిన్నదీ, కాన్పులైన ఆమెకి మరీ పెద్దదీ సరైన సైజు తీసుకోడం ముఖ్యం. ఈ విషయమై తెలిసిన డాక్టరు దగ్గిర సలహా మంచిది. కాని నూటికి తొంభయిమంది డాక్టర్లకి తెలీదు. తెలీని వాళ్ళు తెలీనట్టు మాట్లాడక, తమకి తెలుసు ననీ ఇవేమీ ఉపయోగం లేవనీ, పైగా ఆరోగ్యానికి హానికరమనీ, అవినీతి మార్గాలనీ బోధిస్తారు. చాతనైతే ఆ డాక్టరు తెలీని ఆ అబద్ధాలు మాట్లాడకుండా మీరు ఏదన్నా

శాశ్వతమైన శాస్తి చేస్తే లోకానికి మహోప కారం చేసిన వారౌతారు. సానుభూతి చూపే డాక్టరు దొరక్కపోతే, సందేహాలు ఉంటే, ఉపయోగించడం చాతగాక పోతే నాకు రాయండి.

ఈ పెసరీలని కడిగి పొడిగా శుభ్రంగా ఉంచుకోవాలి. చేతుల్ని ముందుగా సబ్బుతో కడుక్కోవాలి, గోళ్ళు గుచ్చు కోకుండా కత్తిరించుకోవాలి. చూపుడు వేలుని సృష్టి అవయవంలోకి చాచినట్ట యితే ఆ మార్గానికి ఎదురుగా ఒక ఉండ వంటిది తగులుతుంది. అదే గర్భాశయం లోకి మార్గం. దీనిపేరు 'సెర్విక్సు'. ఆ మార్గం కప్పి రేతస్సుని దానికి తగలకుండా చెయ్యడమే ఉద్దేశ్యం.

ఉపయోగించే ముందు పెసరీకి కాంట్రాసెప్టాలిన్ (Contraceptaline) అనే మందు కొని పూస్తే మంచిది. ఆ మందు లేకపోతే —

1. క్వైనామిక్శ్చరుగానీ
2. నిమ్మకాయ రసంగానీ
3. పుల్ల మజ్జిగగానీ
4. నీళ్ళు కలిపిన వినిగర్‌గానీ
5. వాసలైన్‌గానీ

పూసి, ఆ మార్గానికి ఎంత లోపల వీలైతే అంత లోపల సెర్విక్సుకి అడ్డంగా ఆ పెసరీని అమర్చాలి.

ఆ పెసరీ లోపలికి ఎక్కడికో పొట్ట లోకో, గుండెలోకో పోతుందని కొందరికి భయం. ఏమీ లేదు. పోవడానికి మార్గం లేదు.

పొద్దున్నే వేలు పెట్టి సులభంగా తీసి వెయ్యవచ్చు. తీసివెయ్యక ముందు వేడి నీళ్ళతో 'డూషూ', తీసిం తరవాత సబ్బు నీళ్ళతో 'డూషూ' చేసుకుంటే మంచిది.

'డూషూ' చెయ్యటానికి వీలుకా నప్పుడూ, 'డూషూ' పరికరాలని కొనుక్కోలే నప్పుడూ ఈకింది రెండు పనులలో ఏదో ఒకటి చెయ్యటం మంచిది.

కాంట్రా సెప్టాలిన్ (Contraceptaline) అనే మందుని ఒక అర చంచా లోపల పెట్టేసుకోవాలి.

లేకపోతే కొంచెం శుభ్రమైన దూదిని నిమ్మకాయల రసంలో తడిపి దాంతో పెసరీ తియ్యకముందూ, తీసింతరవాతా, ఆ మార్గాన్ని శుభ్రంగా తుడవాలి.

2. రెండో విధమైన "చెక్ పెసరీ" Rubber cervical cap (రబ్బర్ సెర్వికల్ కాప్).

ఈ పెసరీ సెర్విక్సుని కప్పుతుంది.

ఇదికూడా మూడు సైజులలో ఉంటుంది. సరైన సైజు డాక్టరు సహాయంతో ఏరుకోవాలి.

ఇదికూడా పై డయాఫ్రామ్ (Diapharagm) పెసరీవలెనే ఉపయోగించవచ్చు.

3. ఈ మూడో మార్గం చాలా చవక. సామాగ్రి తక్కువ. ఈ కింది వస్తువుల్ని స్త్రీ అవయవ ద్వారంలోంచి సెర్విక్సు దగ్గిరికి వీలైనంత లోపలికి తొయ్యాలి. బాగా లోపలికి తోసెయ్యాలి. అవి చాలా శుభ్రమైన వస్తువులు అయి ఉండాలి.

1. డాక్టరు ఉపయోగించే దూది. అది కాకపోతే ఇంక ఏ శుభ్రమైన దూది అయినా సరే.
2. చేతి రూమాలు.
3. పల్చని కాగితాలు ఉండచేసి.
4. స్పాంజి (రబ్బరువైనా సరే). ఇది మందుల షాపులో దొరుకుతుంది. పెద్ద

ముక్కయితే చిన్నముక్కలుగా కోసుకోవాలి.

ఈ పై పదార్థాలని ఈ కింది ద్రవాలతో తడిపి ఉపయోగిస్తే మరీ మంచిది.

1. లాక్టిక్ అసిడ్ (Lactic acid) నూటికి ఒక వంతు చొప్పున నీళ్ళలో చేర్చి.

2. పుల్ల మజ్జిగ

3. Contraceptaline (కాంట్రా సెప్టాలిన్) పూయవొచ్చు.

4. Olive oil (ఆలివ్ నూనె).

5. నిమ్మకాయల రసం.

6. నీళ్ళు చేర్చిన "వినిగర్."

7. వేసలైన్.

ఈ పదార్థాలని ప్రతిసారీ పారేసి కొత్త వాటిని ఉపయోగించాలి. వీటిని తెల్లారే దాకా బైటికి తియ్యకూడదు. తీసేముందు 'డూష' చేసుకుంటే మంచిది.

4. ఒకవేళ ఈ పద్ధతులు ఏవీ ఉపయోగించకుండానే, సంగమం జరిగిందనుకోండి. అప్పటికైనా ఆ హడావుడి అయిపోయిన వెంటనేనన్నా బుద్ధితెచ్చుకుని, ఈ కిందిపనులు చేస్తే చాలావరకు ఉపయోగం ఉండవొచ్చు.

1. పల్చని కాయితమో, దూదో, శుభ్రమయిన పీలికో, నిమ్మరసంలోనో, పుల్లని మజ్జిగలోనో ముంచి కుడిచేతి బొటనవేలి పక్కన ఉండే రెండువేళ్ళకి చుట్టి, ఆ మార్గాన్ని శుభ్రంగా తుడిచి పూడ్చివెయ్యాలి. చివరికి సబ్బునీళ్ళతోనూ, ఉత్త నీళ్ళతోనైనా శుభ్రం చెయ్యాలి.

మొగవాళ్లు ఉపయోగించేవి

ఆడవాళ్ళు నివారణ పద్ధతులు ఉపయోగించని పక్షంలో మొగవాళ్ళు కన్డోం లేక ఫ్రెంచిలెదర్ ఉపయోగించవచ్చును. ఇది రబ్బరు గొట్టం. ఖరీదు ఒకటికి పావలా నించి ఉన్నాయి. సులభంగా చిల్లులు పడతాయి. మధ్యలో చిరుగుతాయి. కనక ఒక్కసారికన్నా ఉపయోగించడం మంచిది కాదు. ఒకసారే ఒకదానిపైన ఒకటి రెండు ఉపయోగించవచ్చును. కొన్ని కడిగి దాచుకోడానికి వీలుగా ఉండేవి కూడా ఉన్నాయి.

ఈపైన చెప్పినవిగాక, చాల పద్ధతులు నమ్మకంగా చెబుతారు కాని సందేహించవలసిందే.

వీటిలో మొదటిది నిగ్రహం

ఇది చాలా పుణ్యకార్యమని, యోగ్యమనీ, సాధ్యమనీ, దొంగమాటలతో పూజిస్తారు. దీన్ని నమ్ముకున్న దౌర్భాగ్యులు చాలాకాలం అతి ప్రయత్నంతో బిగపట్టుకుని ఇతరత్రా మనసులు తీర్చుకునేవాళ్ళు. అసహజ కార్యాలతో తృప్తిపడేవాళ్ళు. రక రకాలవాళ్ళు బైలుదేరారు. ఆర్నెల్లు బిగబట్టి ఏ మంచి ముహూర్తానో, వొళ్ళు తెలీక జారి, ఇంక చూడండి. ఒకరిమీద ఒకరికి ద్వేషం. తమమీదే ద్వేషం. ఆ కార్యంమీదే ద్వేషం. తిట్లూ, ప్రార్థనలూ, నిందలూ, రెండోవారు తమని గోతిలో దింపారని. ఆ పుట్టబోయే పిల్లని ఇప్పటినించీ, రాక్షసిగా తలచుకోడం. అనేక ఉద్దేశ్యాలతో నిగ్రహం చెయ్యమనడం రాక్షసం. ఆ భయంతో స్త్రీ పురుషుల్ని విడిపరచ చూడడం దౌర్జన్యం. పిల్లల మీద తల్లిదండ్రులకీ, స్త్రీ పురుషులకీ పరస్పర సహజ వైషమ్య కారణం. గర్భనివారణోపాయాలు అసహజమంటారు గానీ, ఈ నిగ్రహమంత అసహజం, ఘోరం, దుర్నీతి ఇంకోటి ఉంటుందా? ఈ సూత్రాన్ని అనుష్టించే వారికన్నా యువకులకి బోధించే ఖద్దరు వృద్ధులు చాలామంది ఉన్నారు — రైళ్ళల్లో, ఇళ్ళలో, మీటింగులలో. జాగ్రత్త!

రోగాల భయంతో నీతినీ, పిల్లల భయంతో అభివృద్ధినీ అరికట్టాలని చూసే మహాను భావులు వీళ్ళు! చిన్నప్పుడే సంసారాలలో కుంగతీసి కట్టెయ్యకపోతే, ఈ యవ్వనులూ, బాలురూ, బాలికలూ ఎదిగి స్వేచ్ఛని పొంది, తమ హక్కుల్నీ, తమ ఆస్తుల్నీ, తమ మర్యా దల్నీ మానాల్నీ, కుళ్ళు దొంగదేశాభి మానాన్నీ, దొంగదేవుళ్ళనీ, ఎక్కడ కూల తోస్తారో అని భయం — ఈ నీతి ధర్మ బోధకులకి.

డాక్టర్లకన్నా, మందులకన్నా, ప్రజల్ని మోసగించే జనద్రోహులూ, క్షుద్రులూ, అబద్ధీకులూ ఉన్నారు పత్రికా రచయితలు! వాళ్ళు పేర్లు బైటపెట్టకుండా విసురుతో ఉంటారు — సలహాలూ, అభిప్రాయాలూ. అచ్చుని చూసి మోసపోకండి. వాళ్ళు ఏ మదరాసులోనో కూచుంటారు గనక దేవ తలు అనుకుంటారు. ఎందుకూ పనికిరాక, డబ్బున్న పత్రికా యజమానుల అరికాళ్ళు నాకి, పదిహేను రూపాయలకై ఆత్మల నమ్ముకున్న శుష్క ప్రయోజకులు. కాసు న్నర ఆలోచనాశక్తిగానీ, సాహసాగ్నిగానీ లేని చవటలు. ఈ "వ్యాఖ్యలూ, విమర్శలూ" అనే పెద్ద పేర్లు పెట్టి రాసి ప్రజల్ని మోసగిస్తారు.

వీళ్ళకి ఉన్న సంస్కారానికీ, మెదడుకీ తోడు వీళ్ళు విమర్శించడానికి సిద్ధం! పెద్ద పట్టణాల్లో సైడుకాలవల పక్కన పదేసి మంది పిల్లల్ని పెట్టి కుళ్ళుతో ఈ నవీన పద్ధతుల్ని వెక్కిరిస్తారు. అవినీతి అంటారు. పైకి ధర్మాలని బోధించినా, గుండెలు విప్పి చూస్తే లోపలంతా "జెలసీ", ఓర్వలేనితనం, ఏడుపు, మురికి. యువకులమీదా, ప్రపం చాన్ని బంధాలనించీ, బాధలనించీ, దారి ద్ర్యాన్నించీ తప్పించాలని చూసే ప్రతి ప్రయత్నం మీదా కోపం. తమవి కాని కాయితాల్ని చెరిపే ఈ పేరులేని పురుగులకి ఏ ఆశయమూ, ఏ విశాలత్వమూ, హోప్, గతీ, ఇంకలేక, బాగుపడే వాళ్ళని చూడలేక, ఆ చీకట్లోంచి, ఎట్లానన్నా, చదివే ప్రజల్ని మోసగించి తమ మల్లే ఎండు వితంతువు ల్నిగా మార్చాలని చూస్తారు. నమ్మకండి.

రెండోది — రజోపతనం కాకముందే ఆపడం. అది చాలా క్రూరమైన కార్యం. సంభోగంలో ఉద్రేకింపబడే రసాలవల్ల పరస్పర ఆరోగ్యం హెచ్చుతుందని నవీన సిద్ధాంతం. అందువల్లనే "కాన్డం" ఆరో గ్యానికి మంచిది కాదు.

బహిష్టు అయిన రోజుల్లోనూ, నెలల మధ్య రోజులలోనూ గర్భం కలగదంటారు. ఇది నమ్మతగినది కాదు.

పిల్ల పాలు కుడుచుకుంటున్నన్నాళ్ళూ, గర్భం రాదన్న సంగతి కొంతవరకే నిజం. పిల్లలు చచ్చిపోయినప్పుడూ, పాలు వొదిలి నప్పుడూ, పిల్లలకి బదులు తామే ఆ పనిని చేసే పురుషులున్నారు. ఇట్లాంటి నమ్మకాల వల్ల పెద్దవాళ్ళమని, నీతులు బోధించే ప్రతి వాడూ దొంగ. దేవుడూ, మతమూ, పుణ్యమూ, ధర్మమూ,అనుభవమూ, ఇవన్నీ మాట్లాడేవాడు వంచకుడు. నవీన యువ కులు నవీన పద్ధతుల్ని నమ్మి ఆచరించాలి. ఎంతో సాహసం కలవారూ, యోచించే వారూ, తిరగబడేవారూ, క్రమేపీ దేశంలో ఎక్కువవుతున్నారు. కానీ, ఈ చదువు చెప్పే బడులకీ, విద్యకీ, పెళ్ళిళ్ళకీ, పిల్లలు కలగ డానికీ తిరగబడేవాళ్ళు చాలా అరుదు. భార్యనీ, పిల్లలనీ త్యజించగలిగిన కాఠిన్యం

లేకా, కామశక్తిని పరిపాలించుకోలేకా ఆశ యాలకీ, సాహసాలకీ, దూరస్తులై, చాలా త్వరలో సంసారాలూ, ఉద్యోగాలూ, మింగి వేస్తే, మిటకరిస్తో, ఏమీ చెయ్యలేక తమ పూర్వ ఉత్సాహాలకి తామే విరోధులవు తున్నారు. ఎవరో ఒకరు తప్ప ముఫైయేళ్ళ తరవాత ఇంకా బతికివున్న మనుషుల్ని ఈ దేశంలో కనుక్కోవడం చాలాకష్టం. తల్లి దండ్రులకీ, పుట్టే పిల్లలకీ తగిన పరిస్థితులు ఏర్పడ్డదాకా పిల్లల్ని కనకూడదు అని నిశ్చ యించుకోవాలి. ఇప్పటిమల్లే సృష్టికి లోబడి ఈని, లిట్టర్స్ (Litters) పెట్టడం మానె య్యాలి. పెళ్ళాల్నీ, సంసారాల్నీ, మీకు బుద్ధి తెలిక పూర్వమే కట్టి మిమ్మల్ని కుంగ తియ్యాలని చూస్తున్నారు పెద్దలు.

కామానికీ, సృష్టి అధికారానికీ లోబడి పిల్లల్ని కనడం తప్పించుకోలేని ఘోర నరకంనించి తప్పించారు ప్రజల్ని యీ మాల్థూజియన్స్. ఈ మహావరాన్ని వినియోగ పరుచుకోక భ్రష్టులు కావొద్దు. పద్ధతులు కూడా సులభమవుతున్నాయి. దూది, బట్ట ముక్క చాలు. శుభ్రమైనవి దొరక్కపోతే మురికివైనా సరే. మురికివల్ల ఏదన్నా జబ్బు చేస్తే, తరవాత కుదుర్చుకోవచ్చు. పిల్లలు పుట్టడంకన్న నయం, ఆ జబ్బు.

చివరికి ఈ సులభమైన పద్ధతికూడా ఉపయోగిస్తుంది.

నూలు వొడకగా మిగిలిన ఏకులు దూదిని విడిపోకుండా దారంతో చుట్టి (అర చేతి వెడల్పున, అరచేతి మందాన ఉండాలి) నీళ్ళతో తడిపి స్త్రీ సృష్టి అవ యవం లోపలికి బాగా తోసేసినా గర్భాన్ని నివారణ చేస్తుంది. దాన్ని తెల్లవారికి అవ తల పారెయ్యాలి.

ఈ పద్ధతులుగాక, మొగవాళ్ళకీ ఆడ వాళ్ళకీ ఆపరేషనులు కూడా ఉన్నాయి — సులభమైనవీ, కష్టమైనవీ. వాటి విషయమై తెలుసుకో కోరేవాళ్ళు నాకు రాయండి.

సుఖ రోగాలు

ఇటువంటి జబ్బులున్నాయని తెలు సును. తెలీనివారికి చెప్పి అప కలిగే విధా నాల్నీ, వాటి చిహ్నాల్ని పరీక్షించి, వాటినించీ కాపాడుకునే మార్గాల్నీ బోధిస్తేగాని ఇవి ఫలించవు. కాంతీ, జ్ఞానమూ, మంచి గాలీ, శుభ్రమైన ఆలోచనలూ ఉన్నచోట వ్యాధి కీటకాలు వృద్ధిపొందవు. ఒకవేళ తగిలినా వ్యాపించవు. సిగ్గుపడి, మొహమాటపడి, నీతి అనే పేరుతో బట్టకప్పితే దానిచోట వ్యాధి మరింత కుళ్ళుతుంది. యవ్వనం రాగానే ఈ విషయాలు అందరికీ చెప్పాలి. ఆడవాళ్ళకీ, మగవాళ్ళకీ వ్యభిచారం చేసే వాళ్ళకీ తటస్థించే న్యాయమైన శిక్షలే ఈ రోగాలని తలిచి ఉపేక్ష చెయ్యకూడదు.

ఈ రోగాలూ అన్ని జబ్బులూ అటు వంటివే. దురదృష్టంవల్లా, తెలివితక్కువ వల్లా. ప్రజల శక్తికి మించి తటస్థించాయి. ఎక్కువగా తిని అజీర్ణంవల్ల బాధపడుతున్న వారికి మందియ్యడం మాన్తారా! ఆకలివలె కామమూ ఒక సహజమైన కోర్కె. ఈ రోగాలు దానికి తగినశాస్తి అనుకోడం రాక్షసం. అన్ని అంటు జాడ్యాలవంటివే

ఇవీనీ! స్ఫోటకమూ, క్షయా పాపంచేస్తే కలుగుతున్నాయా? ఏ పాపానికో అవి శిక్షలే అయితే, అనభవించనీక నయం చేస్తారేం? ఈ సుఖరోగాలమీద మాత్రం అంతకోప మెందుకు?

విచ్చల విడిగా అనేక మందితో కలి యడంవల్ల ఈ రోగాలు వస్తాయనుకోడం అజ్ఞానం. రోగాలు లేనివాళ్ళనించి ఈ రోగాలు రావు. ఉన్నవాళ్ళల్లో ఏ ఒక్కరి దగ్గిర్నించో రావచ్చు. ఈ రోగాల విషయమై అనుభవం పొంది, గుర్తించి తప్పించుకునే వివేకవంతుడు ఎంత వ్యభిచారం చేసినా రోగం రాదు. అవి ఉంటాయని తెలియని మూఢుడికి ఒక్క అనుభవంతో ఇవి తటస్థిస్తాయి. పాత దొంగలకి, వంట్లో ఈ రోగాలు జీర్ణించిన వారికి రానేరావు. ఎవరిని నీతిమంతులుగా తయారు చెయ్యాలని ఇట్లాంటి తుచ్ఛమైన విషయాల సంగతు లేమీ తెలీకండా దాచి ఉంచి, పురాణాల్లోని నీతులు మాత్రమే నేర్పి మోసపుచ్చుతామో, వాళ్ళే గోతుల్లో పడేది. చిన్నప్పటినించీ విచ్చల విడిగా పోకిరీ వాళ్ళతో తిరిగి, ఈ మాటలూ, బూతులూ వింటో, లోకజ్ఞానం సంపాదించుకున్న పాగరుబోతులు సుఖం గానే ఉంటారు.

కనక నీతీ, దుర్నీతులకీ, ఈ రోగాలకీ సంబంధం లేదు. లోకమంతా నీతిపరులైనా ఈ రోగాలు మాయం కావు — అందరూ జ్ఞానవంతు లైతేనేగాని! సాధారణంగా ఈ రోగాలు నీతికి ప్రసిద్ధికెక్కిన మనుషుల్నే అంటిపెట్టుకొని ఉంటాయి. అందరికీ తెలి సిన దుర్మార్గుడు భయపడక వెంటనే డాక్టరు దగ్గిరికి వెళ్ళి నయం చేసుకుంటాడు. ఈ నీతిపరులు ఎంత కానట్టు నటించినా మను షులే గనకనూ, మనుష్య అవయవాలు గల వారు కనకనూ, వాళ్ళ అబద్ధ హృదయాలలో కూడా రసికుడైన ఈశ్వరుడు ప్రకాశించడం మానలేదు కనకనూ, సహజమైన కార్యాలు కొన్ని చేసి రోగాలు ఎట్లానూ తెచ్చుకుం టారు. నీతిపరులు కావడంచేత డాక్టరు దగ్గిరికి పోరు. రహస్యంగా దాచుకుని, కుళ్ళి శాశ్వతంగా ఈ రోగాలకి శరణమిచ్చి, పైకి మాత్రం నీతి ఉపన్యాసాలిచ్చుకుంటూ, ఈ రోగాలు అందరికీ వొచ్చి బాధపడాలనే ఆశతో వాటిని కుదుర్చుకోకూడదని వాంఛిస్తూ తిరుగుతారు. సహజంగా వ్యభి చారంచేసి సౌఖ్యం అనుభవించే రసికుల్ని చూసి ఈర్ష్యపడే పిరికిపందలూ, అనాథలూ, సమయం దొరకని పతివ్రతలూ, ఎవరూ దొరకని కురూపులూ సంతోషిస్తూ ఉంటారు — ఈ రోగాలు ఉన్నాయి కదా ధైర్యంగా పాపంచేసే పురుషుల్ని బాధపెట్టడానికని! అందుకనే ఈ నీతిపరులూ, మతా చార్యులూ సంఘ సంస్కర్తలూ ఈ నివృత్తి మార్గాల జ్ఞానాన్ని వ్యాపించనీరు.

ఈ రోగాలు తెచ్చుకునేవారు చేసినట్టు తక్కిన రోగాలు రావడానికి ఏదో పాపపు కార్యం చెయ్యరుకదా అంటారు. రోగానికి అజ్ఞానం కారణం గాని పాపం కాదు. ప్రాణం రక్షించడానికైనా నీళ్ళలో దూకితే జలుబు చెయ్యడం మానదు. అట్లానే ఈ పాపం చేసే ప్రతివాడికి ఈ రోగం వస్తుందా? తెలివితక్కువగా చేసేవాడికి వొస్తుంది. అదీగాక ఒక్క నిమిషం చేసిన సహజకార్యానికీ, జన్మంతా ఘోరమైన బాధపడమనడం నరకంలో కూడా జరగదు. ఆ మనిషేకాక, ఆ కుటుంబం, సంతతీ బాధపడతారు కద!

ఈ రోగాలు తెచ్చుకున్నందుకు, వాటి బాధని అనుభవించడం న్యాయమను కున్నా, బుద్ధిపూర్వకంగా తెచ్చుకున్న వాళ్ళ కంటే, ఏమీ ఎరక్క, ఏ తప్పూ చేయక, అన్యాయంగా ఈ అంటుడు జాడ్యాలతో బాధపడే వాళ్ళు ఎక్కువమంది ఉన్నారు. మతం ప్రకారం, నీతి ప్రకారం రోగిష్టి అయిన భర్తకి భార్య లోబడాలా లేదా? భర్త దగ్గిర్నించి జబ్బులంటుకున్న భార్య బాధ పడుతోందా? తల్లితండ్రులకి ఆ జబ్బు లుండడంవల్ల పుట్టడమే ఆ జబ్బులతో పుట్టిన పిల్లలేమి పాపం చేశారు? వాళ్ళకన్నా కుదర్చాలా? ఈ పుణ్యాత్ముల బోధనవల్ల జబ్బులు కుదుర్చుకోక, సిగ్గుపడి మురగ పెట్టుకుని, ఒకళ్ళనించి ఇంకోరు వ్యాపకం చేసుకుని నీతిపరులూ, అవినీతిపరులూ, బిడ్డలూ, ముసలివారూ అనేక తరాలు వీటిలో పుచ్చిపోతే, నీతి సంఘంలో ఎక్కు వవుతుందా? ఈ పుణ్యాత్ములు జబ్బులున్న వాళ్ళని అంత నీచంగా చూడకపోతే, ఆ రోగులు సిగ్గుపడి దాచుకోక నయం చేయించుకుని వాళ్ళూ సుఖపడతారు. సంఘమూ ఆరోగ్యవంతమౌతుంది.

కనక ముందు ఈ జబ్బుల్ని తక్కినవాటి వలెనే చూసి ప్రజలకి సిగ్గూ, భయమూ పోగొట్టాలి. రెండోది ఇట్లాంటి రోగాలున్నా యనీ, వాటిని అంటించుకోవద్దనీ చిన్న వాళ్ళందరికీ చాటింపువేయాలి. ఈ రోగాలు రాకుండా జాగ్రత్తపడే పద్ధతులున్నాయని అవేమిటో దేశమంతటా విరివిగా బోధిం చాలి. ఈ పద్ధతుల్ని నేర్పడమే కాకండా ఉపయోగించేట్టు బతిమాలి, ప్రోత్సహించి బలవంతం చేయాలి. ఈ రోగాలు ఉన్న వాళ్ళకి ధర్మంగా బాగుచేసే ఆస్పత్రులు దేశమంతా స్థాపించాలి. తక్కిన జబ్బుల కంటే ఇవి అతిశ్రద్ధగా కుదర్చాలి. ఎందు కంటే ఒకరినించి ఒకరికి, ఒక తరంనించి ఇంకో తరానికి వ్యాపించి మనుషుల్ని పీల్చి పిప్పిచేస్తున్నాయి. జాగ్రత్త తీసుకుంటే, వీటి పేరులేకుండా రూపుమాపడానికి వీలుంది.

1. సుఖరోగాలు రాకుండా ఉండా లంటే ఒకటే ఉపాయమనీ, అది అసలు బ్రహ్మచారులుగా, ఉండడమనీ;

2. ఈ రోగాల భయంతో దుర్వృత్తి తక్కువ వుతుందనీ, అందువల్ల ఈ రోగాలు రావడం చాలా అవసరమనీ, కనక ఈ రోగాలు ఇంకా భయంకర రూపంలో ప్రబ లాలనీ :

3. వ్యభిచారాన్ని అణిచి ఉంచడానికి ఈశ్వరుడు వీటిని సృజించే ప్రపంచాన్ని ఉద్ధరించాడనీ చాలా మంది నీతిమంతుల అభిప్రాయం.

సుఖరోగాలు ఉన్నాయని తెలిసి, వాటిని అంటించుకుని నరకబాధపడి, కుదుర్చుకుని, ఆ మర్నాడే మళ్ళీ వాటిని ప్రజలు తెచ్చుకుంటున్నారని, డాక్టర్లందరికీ తెలుసు. కనక ఆ రోగాల భయంవల్ల వ్యభి చారం తగ్గుతుందన్నమాట అబద్ధం. ఎంత భయపెట్టీ, ఎంత బాధపెటీ ఆ సహజ వాంఛని ఆపరు — సత్పురుషులు గానీ, రోగాలు గానీ! ఇట్లాంటి భయాలు కల్పించా ప్రజలలో నీతిని స్థాపించేదీ? రోగం లేకుండా పరీక్ష చేసుకుని స్త్రీని ఏలుకోవా లనా వీరి అభిప్రాయం? కన్యల్ని మాత్రమే పొందాలనా?

పూర్వకాలంలో దొంగతనం చేస్తే చేతులూ కాళ్ళూ తెగకొట్టేవారు. ఆ భయం చేతనైనా దొంగతనాలు తక్కువైనాయా?

ఇప్పటికంటే అప్పుడే ఎక్కువ. పైగా దొంగ తనానికి కారణం దారిద్ర్యం. అది తగ్గితే దొంగతనం తగ్గుతుంది. కరువు కాలంలో దొంగతనం ఎక్కువని అందరికీ తెలుసు. శిక్షవల్ల నేరం ఆగదు. ప్రతిసారీ కడుపునొప్పి రావడం నిశ్చయమైనా భోజనం మానగలరా?

స్త్రీ పురుషుల ఆకర్షణని అరికట్టడ మంటే సముద్రానికి అనకట్ట కట్టడమే కనక స్త్రీ పురుషులు కలుస్తున్నా, వారు కొంచెం జాగ్రత్తపడి, కొన్ని మందులు ఉపయోగించి నట్లయితే ఈ రోగాల వ్యాపకం తగ్గుతుంది. ఈ ఘోరమైన విపత్తునుంచి తప్పించు కోవచ్చు. కాని పుణ్యాత్ములు జ్ఞానాన్ని వ్యాపకం చెందనీరు. కనక పాపాత్ములైనా శ్రద్ధ వహించి ఈ యవ్వనం సమీపించే వారికి తెలియచెయ్యాలి.

నిర్మలాత్ముల భయమేమంటే, ఈ రోగాల భయం లేకపోతే ఇంక అదే పనిగా ప్రజలు దుర్మార్గం మొదలుపెడతారని. ఈ పవిత్రవంతులకి సృష్టికార్యమంటే అసహ్యం. తాము చేస్తూనే ఉంటారు. కానీ పైకి దొంగ వైరాగ్యమూ, పశ్చాత్తాపమూ నటిస్తారు. ఇతరులు తమ సంసారాన్ని పాడుచేస్తారని భయం. ధైర్యమే ఉంటే "ఈ ఇంట్లో రోగాలున్నాయి జాగ్రత్త" అని లెక్క కట్టి, విటుల్ని దూరాన ఉంచే ప్రయత్నం చేద్దురు.

కానీ లోకులు రోగాలకి భయపడరని తెలుసు. ఈ పుణ్యాత్ములే భయపడేది. ఎందుకు? పిరికివారుగనక. తమకేగనక నివారణా పద్ధతులు తెలిపే పుస్తకం సంగతి తెలిస్తే, పది రూపాయలైనా వి.పి. తెప్పించు కుని రహస్యంగా అర్ధరాత్రివేళ చదువుకుని ఇనప బీరువాలో పుస్తకం పెట్టి తాళం వేస్తారు. ఎవరైనా ఈ పద్ధతులు తెలిసిన వారున్నారంటే, వాళ్ళచుట్టూ తిరిగి, ఆ జ్ఞానం ఎవరో తమ స్నేహితులకి కావాలని యాచించి, రహస్యంగా కాళ్ళు పట్టుకుం టారు. కానీ ప్రజలకి తక్కినవాళ్ళకి బోధించ కూడదంటారు. ఎందుకంటే ప్రజలు మూర్ఖులు — దుర్మార్గులు. వాళ్ళు ఈ జ్ఞానాన్ని దురుపయోగ పరుస్తుంటారు. దురుపయోగమంటే వీరి అర్థమేమిటంటే — జబ్బులు రాకుండా చేసుకోడమూ, వారి సంసారాల జోలికి రావడమూ.

సంఘంలో ఉన్న కుళ్ళుని లేదని పాతిపెడితే అది అంతటితో అంతరిస్తుం దనుకొంటారు పుణ్యాత్ములు. కానీ లేదు పొమ్మని ఓట్రిస్తే మాత్రం రోగం దాగు తుందా? ఆఖ్ఖర్లేదంటే బాధ తప్పుతుందా? ఇట్లాంటి రోగాలు సంఘారోగ్యాన్ని పీల్చి పిప్పిచేస్తున్నాయి. వీటినెట్లా ఎదిరిద్దామని అడిగితే — దుర్నీతి తగ్గితే, అసలీ కార్యాలు మాని ఇంద్రియ నిగ్రహం కలిగి ఉంటే సరి అని సమాధానం చెపుతారు. ఈ మాటలనే వారు ఆ నిగ్రహాన్ని కలిగి ఉండరు, ఉండ లేరు. తమ కార్యాలు మానరు. మానలేరు. కానీ ఇతరులు మాత్రం తమ ఆదేశం ప్రకారం నడుచుకోవాలని వారి ఉద్దేశ్యం.

స్త్రీ పురుష ఆకర్షణ, నీతిగానీ అవి నీతిగానీ, లోకంలో ఉంది. లేదనీ, ఉండ కూడదనీ, ఏదో తమ చిత్తమొచ్చిన విధం గానే ఉండాలనీ ఎంత వాదించినా, ఎన్ని వేదాంతాలు చెప్పినా, అది మాయంగాదు. కనక వెర్రి వేదాంత బోధనలు మాని సహజ మైన ఈ శరీరాకర్షణవల్ల కలిగే ఈ రోగాల నించి ఎట్లా తప్పించడమా అని యోచిం

చాలి. ఇన్ని యుగాలు ఈ నీతుల్ని బోధిస్తున్నారు. రోగాలు ఎక్కువై సంఘ దౌర్బల్యం నానాటికీ ఎక్కువ కావడమేగాని, ఇంక ఏమీ ఫలితం కనపడలేదు. ఎంత నీతి బోధించినా శరీరాలు శరీరాలుగానే ఉన్నాయి.

ఈ రోగాలు వేశ్యల దగ్గిరే ఉంటాయని చాలామంది నమ్మకం. సంసార స్త్రీలతో పోలిస్తే వేశ్యల దగ్గిర ఈ జబ్బులు చాలా తక్కువ. ముందుగా మంచంవేపు చూసే స్త్రీ, తనంతట తనకి పురుషుడిమీద మోహం వచ్చిందని మీదపడే స్త్రీ — వీళ్ళ విషయం ఏమాత్రం నమ్మకూడదు. వెర్రి యువకులు, తమ రూపంచూసి, నిలువలేక స్త్రీ వొచ్చిందని దిగులుపడి తమ ప్రభావానికి గర్వపడి సులభంగా బోల్తాపడతారు.

ఈ నివారణోపాయాలు మంచివేనా అని డాక్టర్లని అడిగి లాభం లేదు! రోగాలూ, గర్భాలూ రాకపోతే వాళ్ళ ఆదాయం సున్నా! కనక నివారణోపాయాలు ఉపయోగం లేదంటారు. అదీగాక వాళ్ళకి ఈ సంగతులు కాలేజీలలో చెప్పరు. వాళ్ళు తెలుసుకోరు.

ఈ జబ్బు రాగానే మాత్రం డాక్టరు దగ్గిరికి వెళ్ళి తీరాలి. క్యాటలాగుల్లో పత్రికల్లో చూసి మందులు తెప్పించి వాడడం చాలా అపాయకరమైన పద్ధతి.

ముఖ్యమైన సుఖరోగాలు రెండు:

'సిఫిలిస్' లేక 'సవాయి'

ఇది ముఖ్యంగా సృష్టికార్యంవల్లనే ఒకరినించి ఇంకొకరికి వ్యాపిస్తుంది. ఈ రోగం అసలు ఒకరి దగ్గిర ఉంటేనేగాని రెండోవారికి రాదు. దానంతట అది పుట్టదు, ఏం చేసినా సరే, ఎంతమంది ఆరోగ్యవంతులతో కూడినా సరే!

అదీగాక తల్లిదండ్రులకి ఉంటే పుట్టేటప్పుడే బిడ్డలకీ ఉంటుంది. బిడ్డలు గర్భంలోనే చచ్చి వికార రూపులయి పుట్టవచ్చు.

ముద్దులవల్లా, కావిలింతల వల్లా, ఎంగిలివల్ల కూడా రావచ్చు. పాలదాయినించి పిల్లకీ, పిల్ల నించి పాలదాయికీ రావచ్చు.

ఇది భయంకరమైన రోగం. మనిషిని వదలక జన్మమంతా ఏదో ఒక రూపాన ఏడిపించి, తరతరాలా వంశాన్ని వదలక పీడించి పీల్చి పిప్పి చేస్తుంది.

చాలా ముదిరితేనేగాని ఏ మనిషి దగ్గిర ఈ రోగం ఉందో తెలుసుకోడం దుర్ఘటం. ముఖ్యంగా స్త్రీలలో ఈ రోగం నాలుగు స్థితులు కలది.

మొదటి స్థితి : ఈ రోగం అంగానే ప్రారంభం. రోగం కలిగిన నెలరోజులలో రహస్యావయ వాలపైని ఒక చిన్న కురుపు లేస్తుంది. దానివల్ల బాధ ఉండదు. తక్కిన సుఖరోగపు కురుపులకున్నూ దీనికినీ అదే భేదం. తక్కినవి మొదటినించే అమిత మయిన బాధ కలిగిస్తాయి. స్త్రీలలో ఈ కురుపుని కని పెట్టడం కష్టం. తరవాత వెంటనే గజ్జలు వాస్తాయి.

రెండవ స్థితి: తరవాత ఆరువారాలలో జ్వరమూ, వొళ్ళునొప్పులూ, తలనొప్పీ కీళ్ళలో నొప్పి, బుగ్గలలోపలా పెదిమల మీదా మచ్చలూ రహస్యావయవాల మీద మచ్చలూ, జుట్టురాలటం తటస్థిస్తాయి. లోజ్వరం, పాలిపోవటం, రాత్రులు తల నొప్పి, కీళ్ళనొప్పులు, కంటిరోగం.

మూడో స్థితి: ఇది రెండోస్థితికి ఒకటిన్నర సంవత్సరం తరవాత కలుగుతుంది. వొంటి మీద గుంటలు, మధ్య గుంటలలో చర్మం తినివెయ్యడం, కాళ్ళమీద రసికారే కురు

పులు, ఎముకలు తిని వెయ్యడం, రాత్రులు ఎముకలలో బాధ, ముక్కు దగ్గిర వెముక తినివెయ్యడం, శరీరంలో ఎక్కడన్నాగానీ గుంటలుపడడం, కీళ్ళు వాచి నిరుప యోగం కావడం, కంటి జబ్బు — ఇవన్నీ కానీ, కొన్ని గానీ తటస్తిస్తాయి.

నాలుగో స్థితి : ఆరేళ్ళ తరువాత, బుద్ధి మాంద్యం, పిచ్చి ఎక్కుతున్నట్టుండడం, కళ్ళ జబ్బు, జ్ఞాపక శక్తితగ్గడం, పక్షవాతం, చివరికి పిచ్చి, తరవాత చావు.

చికిత్స: ఒకసారి రోగం తగిలిందా ఇంకా కొన్ని సంవత్సరాల దాకా ఏ మందులు తిన్నా ఆ రోగం వదిలిందని నిశ్చయంగా చెప్పడం కష్టం. కాని ఎంత త్వరలో చికిత్స ప్రారంభిస్తే అంత మంచిది. మూడు నెలలన్నా చికిత్స చేయించు కుంటేనేగాని కుదరదు. కాని ప్రారంభ దశలో తప్పక కుదిరి తీరుతుంది.

సిఫిలిస్‌ని పోలినదే ఇంకో జబ్బు ఉంది. దానికి ఆ చోటనే పొక్కులు లేస్తాయి. కానీ ఇవి చాలా బాధ. కొద్ది రోజుల్లో "కార్బాలిక్ ఆసిడ్" వేస్తే నయ మవుతాయి. వాటివల్ల ఉపద్రవం లేదు. ఇది సిఫిలిస్ అనుకుని గాబరాపడే వారూ, 'సిఫిలిస్ కురుపు ఈ పొక్కులే' అనీ, 'పోయింది కదా' అనీ మోసపోయేవారూ ఉన్నారు.

గనేరియా లేక పచ్చ సెగ : ఇది చాలా విస్తారంగా వ్యాపించి ఉంది. దీనివల్ల నపుంస కత్వమూ, గొడ్రాలితనమూ కలుగు తాయి. ఇది గల తల్లికి గుడ్డిపిల్లలు పుట్టవచ్చు.

ఇది పురుషుల్ని చాలా బాధపెడు తుంది. అందుకని కుదుర్చుకుంటారు. స్త్రీల నంత బాధపెట్టదు, కనక నిర్లక్ష్యం చేస్తారు. అసలు ఈ వ్యాధి ఉన్నదనే స్త్రీకి తెలీదు. కనక మూర్ఖంగా దీన్ని ఇతరులకు ప్రసా దిస్తూ ఉంటారు. భోగంవారికన్నా సంసా రులే ఈ రోగాన్ని ఎక్కువగా వ్యాపింప చేస్తున్నారు.

మొగవాళ్ళ విషయం: జబ్బు తగిలిన రెండు మూడు రోజుల లోపునే ఆ అవ యవం దగ్గిర దురదా, వాపూ బయలుదేరు తుంది. దాని మూతి ఎర్రనై చీముచుక్క కనబడుతుంది. తరవాత ఇంకా ఎర్రగా అయి, పసుపుపచ్చ పదార్థం బయలు వెడలుతుంది. అల్పాచ మానం చేసేప్పుడు బాధ, అల్పాచమానం మురికి, ఇదివరకట కన్న తక్కువధార, అసలు మూత్రం పొట్ట లోపలే ఉండిపోవడం, ఇవన్నీ తటస్థిస్తాయి.

తరవాత ఆ అవయవం వంకరగా పోతుంది. కొంచెం లోజ్వరం, బలహీనం. ఈ చిహ్నాలు పది పదిహేను రోజులలో పట్టుకుంటాయి. తరవాత వంటజితించి అనేక రోగాలకి కారణమౌతుంది.

స్త్రీల విషయం: చాలా త్వరలోనే ఒక్క రోజులోనే చిహ్నాలు కనబడతాయి. కానీ బాధ తక్కువ. అసలు చిహ్నాలు గుర్తించకనే పోవచ్చును. ఆ అవయవం వాయడం, ఎరుపు బాధ, అల్పాచమానం బాధ, తరవాత పచ్చని చీము వస్తుంది. అటు తరువాత వంటజితిస్తుంది.

చికిత్స: ఈ రోగం తగిలిన రెండు దినాలలో అది అభివృద్ధి చెందకండా చికిత్స చెయ్య వచ్చు. తరవాత డాక్టరు మెల్లిగా కుదర్చవలసిందే.

ఈ రెండు రోగాలుగాక ఇంకా చిన్న సుఖ రోగాలు అనేకం ఉన్నాయి. కానీ అవి

ముఖ్యంగా కురుపులు, పొక్కులు రూపాన కలుగుతాయి. ఏదన్నా "పొటాషియం పర్మాంగనేట్" లేక "కార్బాలిక్ అసిడ్ మలాం" వేసినట్లయితే నయమవుతాయి, శుభ్రంగా ఉంచితే సరి.

కానీ ఈ రెండు రోగాలూ తగిలితే మాత్రం సిగ్గుపడక వెంటనే వైద్యుడి దగ్గిరికి వెళ్ళి నయమయిందాకా పట్టుబట్టి వైద్యం చేయించుకోవాలి. ప్రజల్ని మోసగించి డబ్బు లాగటానికి ప్రచురించే మందులు వాడకూడదు. జబ్బుకుదిరే లోపల ఈ రోగాల్ని ఇతరులకి అంటించడం మహా పాపం. ప్రభుత్వంవారు శిక్షించవలసిన విషయం. చిహ్నాలు మాయమైనా జబ్బు నిర్మూలంకాదు. కనక చాలా కాలం పరీక్షచేసి, వైద్యుడు పూర్తిగా నయమయిందని చెపితేగాని మళ్ళీ ప్రారంభించకూడదు. ఏమెరగని పసిపాపల్ని ఈ రోగాలతో పుట్టించేటంత ఘోరం, వాళ్ళని రోగిష్టులుగానో, ఏ అవయవ లోపంతోనో కనడమంత రాక్షసం ఇంకోటిలేదు.

తనని నమ్మి తన దగ్గిరకి వచ్చిన స్త్రీకి పురుషుడూ, పురుషుడికి స్త్రీ ఈ రోగాల్ని అతికించడం కూడా చాలా అన్యాయం.

ఈ కింద నేను రాస్తున్న పద్ధతుల్ని అనుసరించినట్టయితే ఈ సుఖరోగాలు అసలు అంటకుండా కాపాడుకోవచ్చు.

తగిన శ్రద్ధ వహించి అనుమానమున్న విషయంలోనల్లా ఈ జ్ఞానాన్ని ఉపయోగించి, దాన్ని విరివిగా వ్యాపింపచేయాలి.

పద్ధతి:

1. ఇది ఏమీ కష్టమయిన మార్గంకాదు. తొందరపడి, నిరాశపడి మానెయ్యకూడదు. ఈ రోగాలు రాకుండా చేసుకోడం ప్రజల విధి. ఇతరుల ఎడల, తమ సంసారాల ఎడల, ముందు రాబోయే ప్రజల ఎడల అనుష్ఠించవలసిన విధి, బాధ్యత, ధర్మం.

2. ఇవి తప్పకుండా పనిచేస్తాయి. ఈ మార్గం అవలంబిస్తే ఎటువంటి రోగాలతో సంబంధం కలిగినా అవి అంటవు, నిశ్చయం.

3. కానీ, రోగం అంటించుకున్న తరువాత ఈ మందులు ఏ మాత్రమూ ఉపయోగపడవు. అప్పుడు వెంటనే డాక్టరు దగ్గిరికి వెళ్ళవలసిందే!

పురుషులకి కావలసిన మందులు :

1. పొటాసియం పర్మాంగనేట్ (Potassium permanganate)

2. కాలొమెల్ ఆయిస్టుమెంటు (Calomel Ointment, Special strength Calomel 3 parts, Lomoline Hydros 4 parts, White Vaseline 2 parts) కాలొమెల్ 3 పాళ్ళు. లామొలైన్ (హైడ్రాస్) 4 పాళ్ళు, తెల్ల వాసలైన్ 2 పాళ్ళు.

ఈ రెండు మందులూ అన్ని ఇంగ్లీషు ఆస్పత్రులలోనూ దొరుకుతాయి. ఏ డాక్టర్ని తయారుచేసి ఇమ్మన్నా ఇవ్వగలడు. ఖరీదు చాలా స్వల్పం.

చెన్నపట్నం ఏ మందుల షాపుకి రాసినా పంపుతారు.

ఈ మందులు ముందు తెప్పించి దగ్గిర ఉంచుకోవాలి. ప్రతి మనిషి దగ్గిరా ఇవి ఉండాలి, ఏ నిమిషాన ఏ బుద్ధిపుట్టి ఎటువంటి స్థలానికెడతారో!

అనుమానమున్న స్థలానికి వెళ్ళిన వెంటనే ఈ చెప్పబోయే పనులు చెయ్యాలి.

ఒక గంటలోపల చేసితీరాలి. ఎంత త్వరగా చేస్తే అంత మంచిది.

1. అల్పాచమానం చెయ్యాలి.

2. సబ్బు నీళ్ళతో ఆ స్థలాన్ని బాగా

కడగాలి.

3. పొటాషియం పర్మాంగనేట్ ఐదు గ్రైన్, ఒక పెద్ద గ్లాసెడు నీళ్ళతో కరిగించి, శుభ్రమయిన దూదిని దాంట్లో ముంచి, ఆ అవయవం ముందు తోలు పైకిలాగి, ఆ దూదితో గట్టిగా రాయాలి. ముఖ్యంగా రంధ్రం దగ్గిరా, తోలుకిందా.

4. తరవాత కాలొమెల్ అయింట్‌మెస్టు తోలుకింద చర్మానికి ఇంకేట్టుగా బాగా రుద్దాలి.

ఇవన్నీ వెంటనే గంట లోపల చెయ్యటానికి వీలులేకపోతే తరువాత 12 గంటల లోగా ఈ కింది ప్రకారం చెయ్యాలి. (12 గంటలు దాటితే అట్టే లాభంలేదు.)

పైన చెప్పిన నాలుగు పనులూ ముందు చెయ్యాలి. ఆ పైన ఇది కూడా చెయ్యాలి.

రెండు చిటికల పొటాషియమ్ పర్మాంగనేట్ రెండు గ్లాసుల నీళ్ళతో కలిపి, చిన్న పిచికారీతో ఆ నీళ్ళని రంధ్రంలోకి మూడుసార్లు పిచికారీ చేయాలి.

(కెతీట్రల్ సిరింజ్ (Cathetral Syringe) అని అమ్మబడుతుంది మందుల షాపులో చిన్న పిచికారీ.)

5. ఆ నీళ్ళతో మూడోసారి రంధ్రం నిండిన తరువాత, వేళ్ళతో అవయవపు మూత బిగించి రెండు నిమిషాలు ఉంచి వదలాలి.

ఆడవాళ్ళకి: మొగవాళ్ళకి చెప్పిన మందులున్నూ డూష్ డబ్బానున్నూ కావాలి. (డూష్ డబ్బా రబ్బరు గొట్టం డూష్‌నాజిల్, మందుల షాపులలో దొరుకుతాయి.)

సంయోగము ముందే :

1. రెండువేళ్ళకి "కాలొమెలు" ఆయింటుమెంటు పట్టించుకుని ఆ అవయవం ద్వారానికి అన్ని వేపులా బాగారుద్దాలి. ముఖ్యంగా రెండు రెప్పలకీ, లోపలివేపు.

2. ఇంకా కొంచెం వేళ్ళతో తీసుకుని, గొంతుకూచుని వీలైనంత లోపలికి వేలు పోనిచ్చి, అన్ని వేపులా ఆ మందే పట్టించాలి.

(మందు పట్టించేముందు ఆ భాగాలు నీళ్ళతో కడగకూడదు.)

సంభోగమైన తరవాత :

1. అల్పాచమానం చెయ్యాలి.

2. సబ్బు నీళ్ళతో అవయవమంతా కడగాలి.

3. పది చిటికల పొటాషియం పర్మాంగనేటు పొడుం తీసుకుని, మూడు పెద్దగ్లాసుల నీళ్ళలో కరిగించి, డూష్ డబ్బాలో పోసి, డూష్ గొట్టాన్ని బాగా లోపలికి పోనిచ్చి నీళ్ళు వదలాలి.

4. తడి పోయేటట్టు ఆ అవయవాన్ని లోపలా బైటా తుడిచి 'కాలొమెల్ ఆయింట్‌మెంట్' మొదటిమల్లేనే పుయ్యాలి.

ఈ నిరోధ విషయాలు, (గర్భానికీ, రోగాలకీ) డాక్టర్ల నడిగి ప్రయోజనంలేదు. చాలామందికి తెలియవు. తెలిసినా చాలా మంది మూర్ఖులకి నమ్మకంలేదు. ఉన్నా, లాభం లేదంటారు. ప్రజలకి కడుపులూ, జబ్బులూ వస్తేనేగానీ వాళ్ళు బతకడమెట్టా?

ఈ ఉపాయాలు సాధ్యం కానప్పుడు రెండోపక్షం ఇలాగు చెయ్యవచ్చు.

1. ముందుగా ఆ అవయవానికి వాసలైన్ పట్టిస్తే కొంత రక్షణ కలుగుతుంది.

2. మూత్రంలో ఆ రోగాల్ని నిరాకరించే గుణం ఉంది. కనక సంభోగమైన వెంటనే అల్పాచమానం చెయ్యాలి. క్యాటలాగు మందుల్ని నమ్మకండి.

చిన్న పిల్లలకి జ్ఞానం

కొమ విషయమైన జ్ఞానం చిన్న పిల్లలకి సహజంగా ఏర్పడదు. వాళ్ళకి యవ్వనం వచ్చి ఈ జ్ఞానోదయ మయే వరకూ, వాళ్ళని అజ్ఞానంలో ఉంచడం అన్యాయం. అట్లాంటి జ్ఞానం అవసరమయే పరిస్థితులు చిన్నపిల్లల జీవితంలో కూడా చాలాసార్లు కలుగుతూ ఉంటాయి. సరైన జ్ఞానం లేకపోవడంవల్ల వాళ్ళకి పొరపాట్లూ, బాధలూ తటస్థిస్తున్నాయి. అన్ని విషయాల్లోనూ పెద్దవారు తమ అనుభవాలవల్ల చిన్నపిల్లలకి సహాయం చేస్తూ ఉంటారు. నిప్పు కాలుతుందనీ, నీళ్ళలో మునిగితే చచ్చిపోతారనీ, పెద్దవారు చెబుతారా, లేక పిల్లలకే తెలుస్తుందిలే అని ఊరుకుంటారా? కాని ముఖ్యమైన ఈ వాంచ విషయమై ఎవరూ మాట్లాడరు. అడ్డమైన బూతులూ పెద్దవాళ్ళు మాట్లాడతారు. పిల్లలు మాట్లాడుకుంటున్నారని పెద్దవాళ్ళకీ తెలుసు. కానీ పెద్దలూ, పిల్లలూ కలిసి మాట్లాడటం అమర్యాద. అజ్ఞానంవల్ల పిల్లలకి హాని కలిగితే మాత్రం, అప్పుడు పిల్లల్ని తంతారు. వాళ్ళ కర్మ అంటారు. "ఆమాత్రం తెలీదా, ఇన్నేళ్ళొచ్చాయి" అంటారు.

పెద్దవాళ్ళు కళ్ళు మూసుకుని, పిల్లలకేమీ తెలీదని సంతోషిస్తున్నా పిల్లలు అజ్ఞానంలో ఉంటున్నారా? ఎవరి దగ్గిర్నించో కావలసిన సంగతులన్నీ నేర్చుకుంటూనే ఉన్నారు. ఈ విషయాలు బహిరంగంగా మాట్లాడకూడదని తెలుసుకుని, రహస్యంగా, కుళ్ళుగా, బూతుల రూపంగా మాట్లాడుకుంటారు. సగం సరిగా తెలిసీ తెలియని ఈ గూఢాభిప్రాయాల్ని ఒకరికి ఇంకొకరు అసహ్యంచేసి, అబద్ధాలతో నింపి నేర్పుతారు. ఈ నీచత్వమూ, రహస్యమూ ఇదంతా చిన్నతనంలో నాటుకుని శాశ్వతంగా ఉండిపోతుంది.

ఈ సందేహాలూ, తదుపరి జ్ఞానమూ లేకుండా ఉండే పిల్లలు ఉండరని చాలా మంది తల్లిదండ్రులకి తెలీదు. తెలుసుకోరు. తమ పిల్లలు ఇటువంటి విచారణలేని రుషీశ్వరులనే వాళ్ళ ఉద్దేశ్యం. వాళ్ళీ జ్ఞానం ఎక్కడో సంపాయించారని తెలిసినా, పిల్లలతో వాళ్ళకాజ్ఞానం ఇంకా ఉండనట్టే ప్రవర్తిస్తారు. సహజంగా ఎన్నడూ మాట్లాడరు.

పిల్లలకి చిన్నప్పుడే ఈ విషయమై ఆలోచనలూ, సందేహాలూ కలుగుతాయి. లోకంలో, మనుషులలో, మృగాలలో ఏమీ చూడకుండా వాళ్ళ కళ్ళు కప్పలేరు. పిల్లలు సహజంగా ముందు ఈ సంబంధమైన ప్రశ్నలడుగుతారు. కాని పెద్దవాళ్ళు ఆ ప్రశ్నలకి నవ్వి ఊరుకోవడమో తప్పనికోపడడమో చేస్తారు. దానివల్ల ఆ విషయమై ఏదో రహస్యమున్నదనీ, పెద్దవాళ్ళు చెప్పరనీ తెలుసుకుని పిల్లలు ఆ జ్ఞానంకోసం ఇతరులని ఆశ్రయిస్తారు. ముఖ్యంగా వాళ్ళ స్నేహితుల్ని. ప్రతి నిమిషమూ తెలుసుకోవాలని వారికి ఉండే సహజమైన ఆసక్తీ ఈ విషయం తెలుసుకున్నదాకా వారికి నిద్ర పట్టనీయదు.

ఇంక కొంతమంది తల్లిదండ్రులు, పిల్లలు ఈ విషయమై మాట్లాడినా, ప్రశ్నించినా కసురుతారు. అబద్ధాలు చెపుతారు. కనక వారిలో పిల్లలకి విశ్వాసం చెడి, ఇతరుల్ని ఆశ్రయించి, తెలుసుకుని వారి మాటల్ని నమ్ముతారు. ఆ ఇతరులు ఈ పిల్లలకి జ్ఞానమిచ్చి అభివృద్ధికి తెచ్చే ఉద్దేశ్యంతో మాట్లాడరు. సాధారణంగా ఆ జ్ఞానమిచ్చే వాళ్ళు ఈ పిల్లలకన్న కొంచెంగానే పెద్దవారు అయి ఉండడంవల్ల తమకి తెలిసిన కొంచెం జ్ఞానాన్ని అనేక అబద్ధాలతో కలిపి, ఈ చిన్న శిష్యులకి బోధిస్తారు.

పిల్లలకి రాబోయే ఆపదల్నీ, దురభ్యాసాల్నీ ముందే చెప్పి ఉంచితే, వాళ్ళు వాటి విషయమై జాగ్రత్త తీసుకుంటారు. అప్పటికీ వాటికి లోబడే వాళ్ళ సంగతి వేరు. కానీ అజ్ఞానంవల్ల ముందు వాటిలోపడి, తప్పించుకోటమెట్లానో తెలీక, ఎవరితోనూ చెప్పుకోడానికి భయపడి, చివరకవే అలవాటై నాశనమయ్యేవాళ్ళు అనేకులు. ముందే వాటి అపాయాలూ, అసహ్యమూ తెలీడంవల్ల జాగ్రత్తపడి తీరుతారు. స్నేహితుల దగ్గిర్నించి వాటి ఘోరం తెలీక పిల్లలు తమాషాగా నేర్చుకునే అభ్యాసాలున్నాయి. ఎవరి ఎడల భక్తి పిల్లలకుందో, ఆ పెద్దవారే బాలుర ఎడలా బాలికల ఎడలా జరిపే అపచారాలున్నాయి. ఈ ఆపదల్ని కూడా జ్ఞానంవల్ల తప్పించుకోడానికి వీలు ఉంది.

ఇటువంటి దురభ్యాసాలూ, ఇటువంటి అసహజమయిన కార్యాలూ లోకంలో ఉన్నాయని బిడ్డలకి చెపితే వాళ్ళు వాటిని తీర్చుకోడానికి కారణమౌతాయని చాలామంది భయం. పెద్దవాళ్ళు చెప్పకపోతే వాళ్ళు నేర్చుకోకుండా ఉన్నారా? తెలుసుకోకుండా తాళం వెయ్యటం సాధ్యమా? పెద్దవారు గౌరవంగా, ప్రేమతో వొద్దని చెప్పిన హీనకార్యాల్ని కావలసి పిల్లలు పోయి చేస్తారా? తల్లిదండ్రులపైని ఏమాత్రం గౌరవమున్న వాడూ అట్లా చెయ్యడు. సిగరెట్ కాల్చడం అనారోగ్యమని చెప్పగానే వెళ్ళి బాలుడు కాలుస్తాడా? ఈ అలవాట్లు ఇట్లా కాదు ఏర్పడేది. సాధారణంగా స్నేహితుల ప్రోత్సాహం ప్రధానం. వాళ్ళ మాటలు విని, ఆ కార్యాల హీనత్వం తెలుసుకోక, పెద్దవాళ్ళకి తెలిస్తే తంతారనే భయంతో రహస్యంగా చేస్తారు. వాటి ఆపదలు తెలీవు. కానీ వాటి జ్ఞానం మాత్రం ఏ బాలుడూ ఆచరణలో పెట్టడు.

ఈ కామజ్ఞాన విషయమై పెద్దవాళ్ళు అమితమైన శ్రద్ధ వహించాలి.

1. ఇతరులు జ్ఞానం ఇవ్వకముందే, తామే పిల్లలకి భక్తితో, ప్రేమతో ఈ జ్ఞానమివ్వాలి.

2. దానివల్ల ముందే సంభవించబోయే ఆపదలు తెలుసుకుంటారు.

3. ఇప్పుడున్న కుహనా పవిత్రాభిప్రాయాలకి లోబడక, కామమంటేనే, రహస్యంగా బూతుగా చూడక, ధైర్యంగా, సహజంగా, ఆరోగ్యంగా ఆలోచించుకునే విధం నేర్పాలి.

4. స్త్రీనీ, స్త్రీ సాంగత్యాన్నీ, హీనంగా, నీచంగా, అపవిత్రంగా చూడక, తగిన గౌరవం ఇచ్చేటట్టుగా నేర్పాలి.

5. తమలో క్రమంగా అభివృద్ధి పొందే శక్తుల్నీ, వాంఛల్నీ ఎట్లా వినియోగపరచాలో, ఏది ఆరోగ్యమో, ఏది హానికరమో నిర్ణయించుకోవాలి.

ఈ విషయమై సంపూర్ణంగా చర్చించ

డానికి ఇది స్థలంకాదు. కాని ప్రస్తుతాంశానికి సంబంధించిన విషయాలు మాత్రం రాయడం అవసరం.

ముఖ్యంగా పెద్దవారు ఈ విషయమై శ్రద్ధ వహించాలి. ఈ కామ విషయాలని రహస్యంగా, బూతుగా, అపరాధంగా, అసహ్యంగా చూడక దిన జీవితంలో వాటి విషయమై మాట్లాడవలసి వచ్చినప్పుడు తడుముకోక సహజంగా మాట్లాడాలి. పెద్దవారు సంపూర్ణ విశ్వాసమిచ్చినప్పుడు పిల్లలు ప్రశ్నలువేసి తీరతారు. ప్రశ్న లేసినట్టయితే, అది ఎటువంటి ప్రశ్నగానీ, కొంచెమైనా దాపరికమూ, మోసమూ లేకుండా స్పష్టంగా చెప్పాలి. ఈ విషయమయి పిల్లలు తెలుసుకోవలసిన జ్ఞానం రెండు విధాలు.

1. చిన్నతనంలో అవసరమయినది:

ఇది సృష్టి ఎట్లా జరుగుతుందో, ఇతర పిల్లలు బాలుడికీ బాలికకీ చెడు అలవాట్లు నేర్పుతారనీ, వీరితో కలిసి చెడు పనులు చేస్తారనీ, ఆ అలవాట్లు అసహ్యమైన కార్యాలనీ, పెద్దవారు కూడా పిల్లల్ని పాడు చేసేవారు ఉన్నారనీ, వాటికి లొంగవద్దనీ, ఇట్లాంటివి. ఎవరన్నా పిల్లల్ని అక్రమంగా బలవంతం చేస్తే, పెద్దవారితో చెబితే, ఆ నేరస్తుల్ని శిక్షిస్తామని నిశ్చయంగా చెప్పాలి. బిడ్డలు తప్పుచేసినా భయపడక పెద్దవాళ్ళతో చెప్పి, ఆ అలవాట్లనించి తప్పించుకునే ఉపాయం ఆలోచించుకునే పద్ధతి నేర్పాలి. చేసిన తప్పుకై పెద్దవాళ్ళు శిక్షించారా, పిల్లవాడు ఇంక ఏమీ వాళ్ళతో చెప్పడు. రహస్యంగా చేస్తాడు. కనక ప్రేమతో అతని వ్యవహారం విని, ఆలోచించి, అతనికి కావలసిన సహాయం చెయ్యడానికి పెద్దవాళ్ళు వినియోగపడాలి. అట్లా చెప్తారనే విశ్వాసం పిల్లవాడికి కుదర్చాలి.

పిల్లవాడు, ఈ విషయాలు ప్రశ్నించకపోయినా పెద్దవారే జోక్యం కలగచేసుకొని ఈ ఆపదలని గురించి మాట్లాడి ఈ సృష్టి విషయాలను పాఠాలవలెనే నేర్పాలి.

2. యవ్వనంలో ఉపయోగపడేవి:

ఇవి పిల్లవాడికి యవ్వనం వొచ్చే ముందు నేర్పాలి. యవ్వన చిహ్నాలు, యవ్వనంవల్ల కలిగే జబ్బులు, వాటి భయాలు, నష్టాలు, స్త్రీ పురుష సంపర్కం, పవిత్రత, ప్రజాభిప్రాయం, నీతి చట్టాలు, వాటి వాస్తవమయిన విలువ, బ్రహ్మచర్యం, గర్భనివృత్తి మార్గాలు, సుఖరోగాలు, నివృత్తి మార్గాలు, వివాహము, దాని అర్థము, సంఘాచారము మొదలైనవి.

ఈ విషయాలు, ఇంకా జ్ఞానం కావాలంటే నేను రాసిన "బిడ్డల శిక్షణ" చదవండి.

గర్భం

గర్భాన్ని పదినెలలు మొయ్యడమనే విషయం స్త్రీ జీవితంలో గొప్ప మార్పుల్ని కలిగించింది. పురుషుడి కన్న ఆమెని సృష్టి సూత్రానికీ, ఎమోషన్స్‌కీ, రహస్యానికీ, సన్ని

హతురాల్ని చేసింది. ఆ గర్భంవల్ల ఆమెపడే యాతనా, కనే నొప్పులూ బాధా అటుంచి, గర్భం ఎదుగుతూ ఉండగా, పిల్లకదులుతూ ఉండగా, పాలు పడుతూ ఉండగా, బిడ్డ తాకినప్పుడూ, పాలు తాగినప్పుడూ ఆమెకి కలిగే ఆనందాన్ని పురుషుడు ఎన్నడూ ఎరగలేడు. కాని కాలం మారుతున్న కొద్దీ స్త్రీ నైజం నశిస్తున్న కొద్దీ ఈ ఆనందాలు తక్కువై, బాధలు ఎక్కువవుతున్నాయి. ఈ గర్భత్వం స్త్రీని బానిసనీ, అబలనీ, అధీరురాల్నీ చేసింది. గొప్ప ఎడతెగనీ చిక్కువీడనీ సమస్యలో పడేసింది.

ఈ కొత్తకాలపు ఆర్థిక, రాజకీయ నైతిక మయిన మార్పులవల్ల చాలామంది స్త్రీలకి సంసారాలు పెనుభూతాలైనాయి. ఎట్లా నన్నా పురుషుల అధికారాన్నించి తప్పించుకోవాలని చూస్తున్నారు. ఇంకముందు చాలామంది చూస్తారు. మొన్నటిదాకా పురుషుడితో సంబంధం లేకపోతే గర్భం రావడానికే వీలులేకుండా ఉండేది. ఇప్పుడూ ఆ సంగతి కొంత ఎక్స్‌పెరిమెంటుగానే ఉంది. (టెస్టట్యూబ్ బేబీస్.) గర్భం లేకపోతే పిల్లలు ఉండరు. పురుషులకన్న స్త్రీలకి గర్భమూ, పిల్లలూ చాలా జీవితంలో పెనవేసుకున్నట్టు అవసరం కల్పిస్తున్నారు. ఎన్ని ఉన్నా పిల్లలు లేకపోతే స్త్రీ జీవితానికి తృప్తి ఉండదు. పిల్లలు లేకుండా ఎండిపోయి నిరర్థకత్వమనే బాధలో అణగారాలి. లేకపోతే పెళ్ళిచేసుకుని పురుషుడి అధికారాన్ని భరించాలి. లేకపోతే· తాత్కాలికంగానన్నా పురుషుడి సహవాసాన్ని కోరాలి. దీనికి సంఘం అంగీకరించదు.

పురుషుడి అధిక్యతా, సహవాసమూ లేకుండానే శాస్త్రరీత్యా తల్లుల్ని చేస్తున్న ఈ కాలంలో, తను గర్భవతి కావడానికీ, కాకపోవడానికీ పూర్తిగా శిశువుని కనడానికీ, కనకపోవడానికీ స్వాతంత్ర్యాన్ని సంపాయించాలి స్త్రీ. స్త్రీలు ఓట్లూ, పాఠశాలలూ, పెళ్ళిళ్ళూ వీటిల్లో మార్పులు కోరుతున్నారు. నీతి విషయంలో మార్పు కావాలనడానికి వాళ్ళకి గుండెలేదు. తన మర్యాదకి ఎక్కడ భంగం కలుగుతుందో అని భయం. భద్రంగా, "ఇతర దేశాలలో స్త్రీలు అట్లాంటివి అడిగారా, పురుషులు ఆమోదిస్తారా, ఇది మన ఘనతకి అనుకూలమా" అని యోచించి మరీ "రిజల్యూషన్లు" కానిస్తారు. తమకి స్వాతంత్ర్యం కావాలని కోరడంకన్న, పురుషులకి స్వతంత్రం ఉండిపోయిందనే ఏడుపుతో శాసనాలవల్ల బంధించాలని చూస్తున్నారు. పురుషుడి ద్వారా ఇంకో జీవిని తమలో ప్రవేశపెట్టుకుని ఆశక్తులై పోయినన్నాళ్ళూ, స్త్రీకి స్వేచ్ఛలేదు. గర్భవతి సంపాదించుకోలేదు. ఎదిరించి వెళ్ళలేదు. పిల్ల పుట్టింతరవాత ఆ పిల్లతో, సేవతో కదలలేదు. ఎందరు స్వతంత్రాభిలాషులు పిల్లలమీద ప్రేమతో, పిల్లల బంధంలోంచి తప్పించుకోలేక పంజరాల్లో పడి ఉన్నారు — శాశ్వతంగా తమ ఆశయాలు, కోర్కెలు, కలలు, అన్నీ చంపుకుని. పిల్లల్ని వొదిలి వెళ్ళిందా, హృదయం ఒక్కరవ్వ విశ్రాంతి నివ్వదు. ఈ పిల్లలమీది న్యాయాధికారాన్ని చేతుల్లో పెట్టుకుని ఎందరు దుష్టులు స్త్రీలని తమ బానిసలుగా ఉంచుకోవడం లేదు.

పిల్లని కనని స్త్రీ జీవితం అసంపూర్ణం.

తృప్తిపొందని మాతృత్వం ఆమెని కాల్చి జీవి తాన్ని శూన్యంగా చూపిస్తుంది. కనక తల్లుల ఉద్యోగం గొప్పదిగా ప్రభుత్వంవారు పరిగ ణించి, భర్తతో ఉండకపోనీ, వారిని పోషించే బాధ్యత వహించేవరకు, పిల్లలమీద తండ్రి కన్న తల్లికే ఎక్కువ అధికృతని ఇచ్చేవరకు, స్త్రీలు ఆందోళన చెయ్యాలి. తమ హృద యానికి దగ్గిరగా ఉండి, జీవితాన్ని పరిపా లించే ఈ మార్పుల్ని వొదిలి, వోట్లకీ, సీట్లకీ పెనుగులాడుతున్నారు స్త్రీలు. ఆ వోట్లూ, సీట్లూ దొరకగానే మర్యాదలూ, టీ పార్టీలూ, అలంకారాలూ, తమ పిల్లలకి ఉద్యోగాలూ, కట్నాలూ గొప్ప వియ్యంకులూ, ఇదీ ధ్యాస.

సృష్టి తన స్థిరత్వంకోసం ఈ కామశక్తిని అనివార్యంగా చేసి స్త్రీ పురుషుల్ని ఉపయో గించుకుంటోంది. ఇదివరకంతా ఈశ్వరుడి చేతిలోఉన్న సంతానదానం, గర్భనివృత్తి మార్గాలు కనిపెట్టిం తరవాత మనుషుల చేతుల్లోకి దిగింది. సృష్టి స్త్రీలని మరీ లోకువ చేసుకుని పది నెలలు ఇంకో జీవిని భరించి పోషించమని ఆమె శరీరంలో అతి కిస్తోంది. ఈ గర్భిణీత్వం స్త్రీ బానిసత్వానికి ప్రబలకారణమయింది. ఈ నాటికి కూడా స్వేచ్ఛని కోరే భార్యల్ని అణిచి ఉంచడానికి ప్రతి ఏటా ఆమెకి గర్భం తెప్పించి రెక్కలు విరిచి తమ ప్రతిష్టని నిలబెట్టుకునే భర్తలు ఉన్నారు.

గర్భం ధరించి పిల్లల్ని కనడంవల్ల స్త్రీ దేశానికీ, ప్రభుత్వానికీ గొప్ప సేవచేస్తోంది.

టీచర్లకీ, డాక్టర్లకీ, గుమాస్తాలకీ జీతా లిచ్చే ప్రభుత్వం తల్లులకి జీతాలియ్యడం లేదు. భర్తలద్వారా ఇస్తున్నామంటారు. మరి భర్తలు లేకుండా బిడ్డల్ని కనే స్త్రీలు ఈ ప్రకారం, జీతంలేని దేశ సేవకులలో జత అవుతారు. న్యాయంగా పడితే వారికి ప్రత్యేకం జీతాలు ఏర్పరచాలి.

కామం తీర్చుకోక ఎండిపోయిన స్త్రీ అంత రాక్షసి ఇంకోరు ఉండరు, ఆ కామ శక్తిని ఊర్ధ్వముఖంగా తిప్పగలిగిన గడిచిన కాలపు వితంతువులూ, కొందరు మిషనరీ స్త్రీలూ తప్ప! వాళ్ళలో వెలిగే మతావేశం ముఖానికీ, హృదయానికీ సౌందర్యాన్నిచ్చేది. ఏ మత ఆధ్యాత్మిక సాంప్రదాయమూ, విశ్వాసమూ లేక ప్రతిష్టదేవతనే ఆరాధించే ఈ నవ్య విద్యావతికి అధికార పదవినిస్తే — పెళ్ళి చేసుకోదు. పెళ్ళి చేసుకుంటే అధి కారం చలాయించి భర్తని వెళ్ళకొడుతుంది. ఇంకో పురుషుణ్ణి దగ్గిర చేరదియ్యడానికి గర్వం — ఇట్లా శుష్కించి తన అధికారం ద్వారా, తనకి అందిన వాళ్ళనందర్నీ క్షోభ పెడుతుంది. చాలామంది ఆడపిల్లలు చేతి కింద దొరికే ఈ హైస్కూళ్ళ ఆడటీచర్లూ, ఆడ ఇన్‌స్పెక్టర్లూ గొప్ప తార్కాణం.

పురుష సుఖం పొందుతున్నట్టూ, పిల్లలు కలుగుతున్నట్టూ రూడి పరచలేని స్త్రీలని పాఠశాలలో ఉండనీయకూడదు. నపుంసకులూ, ఆడ విద్యాసంపన్నులూ కాక, తక్కినవారు శరీర విధంగా తృప్తిపడక పోతే సంఘంలో స్థానం తీసుకోడానికి అనర్హులు.

గర్భం రావడంవల్లా పిల్లల్ని కనడం వల్లా ఏ మాత్రమూ తమ గౌరవానికీ, ఆర్థిక స్వాతంత్ర్యానికీ, శరీరారోగ్యానికీ భంగం కలగకుండా, దేశమూ, సంఘమూ వీళ్ళు కలిగించేటంత వరకూ స్త్రీలు ఆందోళన చెయ్యాలి.

గర్భ స్రావం-బాగువోగులు

సృష్టి, తాను కొనసాగడానికి పురుషుల్నీ, స్త్రీలనీ ఉపయోగించుకుంటోంది. కాని పురుషుడి బాధ్యత ఆ నిమిషంతో తీరిపోతుంది. స్త్రీది పది నెలలవరకూ తీరదు. అనారోగ్యమూ, భారమూ, ప్రసవవేదనా అన్నీ స్త్రీల పాలిట పడ్డాయి. శిశు ఉదయానికి తన సౌఖ్యాన్ని ధారపోసే ఆ స్త్రీని సంఘం ఎంతో గౌరవించి పూజించవలసింది. సృష్టి ఆమెని ఇట్లా ఉపయోగిస్తుందనే దుర్భర విషయాన్ని పురస్కరించుకొని సంఘం ఆమెపైన కఠినత్వాన్నీ, నిర్దయనీ చూపడానికి వీలు కలుగజేసుకుంది.

శిశువుని స్త్రీ కనడమే సృష్టికి ప్రధానంగాని, నీతిగానా అవినీతిగానా, భర్తకా, కులంవాడికేనా, వరసగలవాడికా కాదా అనే ప్రశ్నలులేవు. తల్లి కొడుక్కీ, తండ్రి కూతురికీ సృష్టికి తోడ్పడ్డా, సృష్టికి, అభ్యంతరంలేదు. ఈ నీతులూ, పద్ధతులూ అన్నీ మనుషులు తాత్కాలికంగా ఏర్పరచుకున్నవే! కానీ సంఘం నిర్దేశించిన భర్తకో, లేక సంఘం కళ్ళు గప్పి భర్త పేరుకిందో, బిడ్డని కనకపోతే స్త్రీకి కష్టాలు తటస్థిస్తున్నాయి. మొగవాడు సులభంగా తప్పించుకుంటాడు. భర్తలేని స్త్రీ ఎప్పుడూ గర్భమనే భయంకర పిశాచంవల్ల భయపడుతూనే ఉంటుంది.

సృష్టికి సాయపడే కార్యం మొదలు కనేవరకూ ఆనందంతో, సంతుష్టితో, గర్వంతో, పొంగిపోవలసిన మాతృ హృదయం పాపం అన్ని గంటలూ, అన్ని దినాలూ భయపడుతూ, ద్వేషించుకుంటూ, మరణమే శరణ్యంగా చేసుకోవలసి వస్తోంది. ఆ గర్భాన్ని దాచుకోవాలనీ, తను ప్రేమించే శిశువుని నాశనం చెయ్యాలనీ ఎన్నో ప్రయత్నాలు రహస్యంగా జరుగుతున్నాయి. పోనీ స్త్రీని కఠినంగా చూసినా, ముందు సంఘంలో మనిషి కాబోయే ఆ శిశువునన్నా ఆరోగ్యవంతంగా చూసి, బుద్ధిమంతుణ్ణి చెయ్యాలనే బుద్ధిలేదు ప్రజలకి, తమ అనుజ్ఞను మీరి, తమ యాజ్ఞలేనిది పుట్టినందుకు క్రోధమేగాని!

గర్భస్తురాలైన స్త్రీ ఆనందంగా ఉండాలనీ, ఆరోగ్యంగా ఉండాలనీ ప్రతి శాస్త్రమూ వాగుతోంది. కానీ తమ శాసనానికి తప్పిజారి కనే స్త్రీని సంఘం పెట్టే తిప్పలు, ఇంతవరకు ఏ రాజ్యమూ, ఎటువంటి తప్పు చేసినవారినీ పెట్టలేదు. ఈ స్త్రీలు, ఈ గర్భిణులు పడే వేదన, తమ ప్రేమకీ, ప్రతిష్టకూ మధ్య నలిగి, అనేక కష్టాలపాలై తమనీ, తమ సంతతినీ నాశనం చేసుకుంటారు.

ఈ విధంగా సృష్టీ, సంఘమూ, తమకి తోడ్పడే స్త్రీని హింసించడం క్రూరం, అన్యాయం. అధికారమేమాత్రమూ లేనిపని మూర్ఖం. సంతాన నిరోధక పద్ధతులు ఆమెకి చాలా సహాయం చేస్తున్నాయి. అవి విరివిగా ప్రచారంలోకి రావాలి.

గర్భం తెప్పించి పురుషుడు నట్టేట్లో విడిచిపోతే, ఆ స్త్రీలు గర్భ నిర్మూలన మార్గాలకై ప్రయత్నిస్తారు. తెలియక, అనేక కుహనామార్గాల ఆ ప్రయత్నాలుచేసి, మృత్యువు పాలపడే సంఖ్యని కనుక్కున్నట్టయితే, సంవత్సరానికి ఎన్ని లక్షలో! తమ

గర్భాన్ని తీసేసుకునే ప్రయత్నాన్ని ప్రభుత్వం వారి శాసనము ఏడేళ్ళ ఖైదుతో శిక్షిస్తోంది.

ఆ గర్భానికి కారణమైన పురుషుణ్ణి శిక్షించరు. గర్భిణీ అయిన స్త్రీని రక్షించరు. సంఘ దౌర్జన్యం లేకండా కాపాడరు. పోనీ కనేందుకు, ఆ కనే బాధలోనన్నా ఒక్క దమ్మిడీ ఇవ్వరు. పోనీ ఆ పుట్టిన చిన్న బిడ్డ నన్నా కాపాడరు. కాని ఆ బిడ్డ అనే ఆపద నించి తప్పించుకోడానికి ప్రయత్నిస్తే శిక్షిస్తారు! ఏం తెలివి! ఏం న్యాయం!

ఈ భ్రూణ హత్యకి అనేక మార్గాలున్నాయి. నాటువి. ఇంగ్లీషువి. ఏది అయినా ఆరోగ్యానికి మంచిదికాదు. కానీ ఇంక నెత్తిమీదికి వొచ్చినప్పుడు ప్రాణం పోవడమే నయమనుకున్నప్పుడు, సర్వ బంధు, మిత్ర, పుత్ర త్యాగం చెయ్యవలసిన సమయాన, ఆరోగ్యం సంగతి చూసుకుంటారా!

ఇప్పటికైనా, అన్యాయంగా గర్భవతులైన స్త్రీలని స్వీకరించి ఆదరించి, వారిని పోషించి, ఆ బిడ్డలకి తగిన పోషణను ఏర్పరిచే ఉదారుల సంఘాలు దేశమంతటా ఏర్పడాలి.

గర్భస్రావం (ఎబార్షన్) మూడు విధాలు

1. దానంతట అది సంభవించేది. దీనికి అనేక కారణాలు ఉంటాయి. ముఖ్యం స్త్రీ దేహంలో బలహీనం, గర్భకోశంలో బలహీనం, జబ్బూ, సిఫిలిస్ వంటి సుఖరోగమూ లేక స్త్రీ పడడమూ, భయమూ, అదరడమూ కారణాలు కావొచ్చు.

2. స్త్రీ క్షేమంకోసం డాక్టర్లు బహిరంగంగా చేసేది. లోపలి పిండాన్ని ఎదగనిచ్చి, స్త్రీ బిడ్డని మామూలుగా కంటే, ఆమెకి ప్రాణహాని కలుగుతుందని భయపడ్డప్పుడే చెయ్యడానికి డాక్టరుకి న్యాయరీత్యా అధికారం ఉంది. స్త్రీలో బలహీనంగానీ, పాండురోగంగాని కనేమార్గం అభ్యంతరం కలగచెయ్యటంగానీ, ముఖ్య కారణాలుగా ఉంటాయి.

3. రహస్యంగా జరపబడేది. ఇది బలవంతంగా పిండాన్ని విచ్ఛిత్తి చెయ్యడం, ఇది మూడు రకాలు :

1. స్త్రీ తానే ప్రయత్నించి కానిచ్చేది.

2. డాక్టరు కాని వాళ్ళచేత కానివ్వబడేది. మంత్రసానులు. ఎరిక లమ్మలు, మందులవాళ్ళు మొదలైన వాళ్ళచేత.

3. సర్టిఫికెటు ఉన్న డాక్టర్ల చేత చేయించుకునేది.

ఈ మూడు విధాలుకూడా న్యాయ చట్టానికి విరుద్ధాలు కనక రహస్యంగా జరుగుతాయి.

కారణాలు:

1. సంఘ బహిష్కరణ, కన్యలు, వితంతువులు.

2. భర్త దగ్గరలేని భార్యలు, మళ్ళీ భర్త అంగీకరించడని భయం.

3. పిల్లల్ని కనే శ్రమగానీ, పెంచే శ్రమగానీ, పోషించే శ్రమగానీ పడలేకపోవడం.

4. ఆస్తి భాగాలై పోతుందని, పిల్లల సంఖ్య తగ్గించుకోవాలనే కోర్కె.

5. పిల్లల్ని పెంచే ధనం లేకపోవడం.

6. ఆడపిల్లలు మాత్రం అక్కర్లేక పోవడం.

ఎంత మంది పిల్లలు ఉంటే అంత బలంగానూ, ఆస్తిగానూ అనుకునే రోజులూ, అంతా పూర్వజన్మ సుకృతంగా, ఉత్తమ జన్మ సార్థకంగా చూసుకునే రోజులూ పోయినాయి. జనసంఖ్య హెచ్చడమూ, నిరుద్యోగ సమస్యా, దేశదారిద్ర్యమూ ముఖ్య కార

ణాలు. కనక సంసారులుకూడా (వాళ్ళే ఎక్కువగా) గర్భస్రావాల్ని కోరుతున్నారు. గర్భ నిరోధక మార్గాలు విరివిగా ప్రచారం చేస్తే ఈ అవసరం చాలావరకూ తగ్గుతుంది. అప్పటికీ బద్ధకంవల్లనూ, అదృష్టంలో నమ్మకం వల్లనూ, 'ఆ ఈసారికేం కాదులే?' అనుకోవడం వల్లనూ అనుకోకుండానే గర్భాలు వస్తూనే ఉంటాయి. వొచ్చిందాకా వాటి ఉపద్రవం మనసుకి తట్టదు. భర్త లేకుండా గర్భాలు తెచ్చుకుంటున్న స్త్రీలందరికీ ఈ అనుభవం చాలా సన్నిహితం, తండ్రి లేకుండా పుట్టే పిల్లలమీదా, ఆ తల్లులమీదా సంఘం క్రౌర్యం చూపుతున్నాళ్ళూ, ఎన్ని నిబంధన లేర్పరచినా, ఈ గర్భస్రావాలు ఆగవు. ఎదిగిన పిల్లలకే పెళ్ళిళ్ళు చేయమని శాసనం వొచ్చిందికదా, క్రమంగా ఈ గర్భస్రావాల ప్రాక్టీస్ డాక్టర్లకి హెచ్చుతుంది. చాలా పూర్వచారపరులూ, గొప్ప సంఘ సంస్కారులూ, వీళ్ళు కూడా భూతదయ అని గొప్ప ప్రచారాలు చేసిన వారు కూడా, తమ కూతుళ్ళు కనకుండా రహస్యంగా గర్భస్రావాలు చేయించి నమ్మకంగా పెళ్ళిళ్ళు చేసేశారు, చేస్తున్నారు. ఎంత గొప్ప సంఘ సంస్కర్తలైనా తమ పిల్లలకి "పెళ్ళి" అని ఆదుర్దాపడడం ఈ గర్భాల భయంతోనే. తమ కూతుళ్ళకి వితంతు వివాహం కన్న, వ్యభిచారం నయమని వొప్పుకొని చూసీ చూడనట్టు వొదిలే భాందసులు లేరూ? అదేరకం ఈ నవీన రిఫార్మర్లు కూడా! పైపెచ్చు లెక్చర్లలో డాబులుకొట్టి, హిందూ స్త్రీ మనోనిబ్బరం మీద, పాతివ్రత్యం మీద పాగడ్తలు పోసి ఇంటిదగ్గర కూతుళ్ళ పెళ్ళిళ్ళకని బెంగపడి మంచ మెక్కుతారు. వాళ్ళకి గర్భం రాగానే దొంగతనంగా డాక్టర్ల దగ్గరికి పంపిస్తారు.

బలవంతమైన గర్భస్రావాన్ని పుణ్యులు భ్రూణహత్య అని పిలుస్తారు, ముఖ్యం ఇతర కుటుంబాలలో జరిగిన వాటిని. ఇది పాతకమంటారు, ప్రజానీతి గానీ, న్యాయ చట్టం గాని ఏదీ దీన్ని అంగీకరించదు. ఎందుచేత?

న్యాయచట్టాన్ని ప్రశ్నించి అట్టే లాభం లేదు. ఇట్టాంటి అర్థవిహీనమయిన పురాతన చట్టాలు చాలా ఉన్నాయి. సాంప్రదాయం అంటుంది "లా". నీతికర్తల్ని అంతకన్నా లాభంలేదు. దేవుణ్ణి ఉసిగొలుపుతారు మనమీదికి. ప్రత్యుత్తరాలూ, ప్రత్యుత్తరాలకీ ప్రత్యుత్తరాలూ మనమే చెప్పుకోవాలి.

మనుషుల్ని ఎందుకు చంపకూడదో, అందుకనే పిండాన్ని నాశనం చెయ్యకూడదు. అంటే — అసలు ప్రాణమంటే ఏమిటి? ఆత్మ అనేది ఏమిటి? అసలు ఉందా? ఉంటే ఆ ప్రాణమూ, ఆత్మా ఎప్పుడు ప్రవేశిస్తాయి? ఏ మార్గాన? తల్లి దండ్రుల శ్రమ కనిపెడుతూ ప్రవేశించడానికి కాచుకుని ఉంటాయా గాలిలో, గదిలో! ఇవి ఎవరూ చెప్పలేని సంగతులు.

వైద్య శాస్త్రరీత్యా మూడోనెల దాటి తర్వాతగాని భిన్నత్వం ఏర్పడదు పిండానికి. అందువల్ల మూడోనెల లోపల హత్యకాదని కొందరి అభిప్రాయం. మరి పిండం బిడ్డతో సమానమే అయితే, మనిషి చస్తే ఎట్లా మైల పడతారో, కర్మ చేస్తారో అట్లా చెయ్యరేం పిండానికి? కనక ప్రాణమూ ఆత్మా లేవన్న మాట! పుట్టేవరకూ తల్లిలో ఒక కురుపులాగ పెరుగుతోంది అన్నమాట.

భ్రూణహత్య చేస్తే, దేశానికి ఒక ప్రాణి నష్టమౌతోంది గనక, ఆత్మహత్యకి ఉన్న

అభ్యంతరమే దీనికీ ఉంది అంటారు కొందరు. మరి జనసంఖ్య పెరుగుతోంది తిండి చాలటంలేదనేగా ఆందోళన పడుతున్నారు! అట్లా అయితే జనసంఖ్య కోసం, ఈ వితంతువుల్నీ, భర్తలేని స్త్రీలనీ పిల్లల్నీ పుట్టించుకోమని శాసించాలి. పుట్టించుకోవడానికీ, పెంచుకోవడానికీ అన్ని సౌకర్యాలూ కలగచెయ్యాలి! మరి భర్త ఉన్నాడా లేడా అని కూడా చూసుకోకుండా దేశానికి బిడ్డను ప్రసాదించే తల్లి ఎంత గొప్ప వీరవనిత! దేశ సేవాపరురాలు!

తల్లి ఆరోగ్యం చెడుతుంది అంటారు. దొంగతనంగా ఈ పని చేస్తే మరణం కూడా తటస్థిస్తుంది గాని, బహిరంగంగా సరైన డాక్టర్లు చేస్తే ఏ అపాయమూ రాదు.

తిరిగి కాన్పువొస్తే భార్య చస్తుందని డాక్టర్లు చెప్పినా, మళ్ళీ గర్భం తెప్పించి భార్యను చంపుకొని, దేవుడి నెత్తిమీద పారేసినవాళ్ళే స్త్రీ ఆరోగ్యం చెడుతుందనే కారణాన్ని ఇళ్ళ కప్పులెక్కి అరిచేది.

భ్రూణహత్య చెయ్యకపోతే, భర్తలేని స్త్రీకి, వేరే ఆల్టర్‌నేటివ్స్ ఏమిటి? పిల్లల్ని కని పారెయ్యాలి — లేక చంపి పారెయ్యాలి, కని పెంచుకోవాలి.

ఈ మూటివల్లా కలిగే ఇబ్బందులు, భ్రూణహత్య ఇబ్బందుల కన్న ఎక్కువైనవే కాని, తక్కువైనవి కావు.

పోనీ తల్లి ఏదో పాపం చేసిందని వొప్పుకున్నా, ఆ బిడ్డ ఏం పాపం చేసి సంఘ ఆగ్రహానికి బలి అవుతున్నదో కర్మ వేదాంతులకే తెలియాలి.

యూరప్‌లోని కొన్ని ప్రభుత్వాలు కొన్ని కారణాల్ని అంగీకరించి డాక్టర్లకి గర్భస్రావం చేసే అధికారాన్ని ఇచ్చాయి.

(1) బలవంతంగా ఇతర పురుషుడు గర్భం తెప్పించినపుడు,

(2) రోగిష్టీ, వికలాంగీ, జన్మదుర్భతి మొదలైనవాళ్ళు పుట్టుతారని రూఢి అయినప్పుడు,

(3) స్త్రీ ఆరోగ్యం గానీ, మనోస్థిమితం గానీ శాశ్వతంగా భంగమవుతుందని తెలిసినప్పుడు,

ఇంకా కొన్ని అట్లాంటి కారణాలు కనబడ్డప్పుడు.

ఈ ఉద్దేశ్యాల ననుసరించి స్త్రీల బాధల్ని గమనించి "లా" కఠినంగా ఉన్నా జడ్జీలు కనికరించి స్వల్పశిక్షలతో వొదులుతున్నారు. ఈ పని చేసిన స్త్రీలనీ, డాక్టర్లనీ, పతివ్రతా వాసనలు వదలని ఈ దేశం, పతివ్రతలనీ వదులుతుందిగాని, 'పతివ్రతలం కాము' అన్నవాళ్ళని అతి కఠినంగా శిక్షిస్తుంది. "మాకు పతులు లేరు గనక తాత్కాలికంగా పతుల్ని కష్టపడి సంపాయించుకుని పాతివ్రత్యం చేసి తెచ్చుకున్న ఫలం ఇది" అని చెప్పినా కనికరించరు.

భర్తలు వున్న స్త్రీలకి లేని నిబ్బరమూ నిగ్రహమూ, భర్తలు లేని స్త్రీలకి వుండి తీరాలని శాసనం.

కానీ ఎంత శాసించినా ఈ గర్భస్రావాలు మితిమీరిపోతున్నాయి. సరిగా బహిష్టులు కావటంలేదనీ, కడుపులో బల్లలనీ అనేక వంకలతో డాక్టర్ల దగ్గిర మందులు — భర్తలు వున్నవాళ్ళూ, లేనివాళ్ళూ కూడా తీసుకు వెడుతున్నారు. ఏ రెండు మాత్రలతోనో తమపని గడుస్తుందనే వెర్రి ఆశలతో. డబ్బున్న వాళ్ళకి ఈ పని సులభంగా తిరిపోతోంది. ఎప్పటికో వీళ్ళందరూ నరకానికి పోతారనీ, నీతి మీరు

తున్నారనీ, అరిచే తమ అరుపులూ, పాపా తుల్ని తాము పెట్టే శ్రమలూ గమనించి, మెచ్చి, ఈశ్వరుడు తమకి మాత్రం స్వర్గం ఇస్తాడని నమ్మకంలేని నమ్మకాలు తప్ప ఇంకేమీ మిగలదు ఈ పుణ్యాత్ములకీ, గొడ్రాలు యెండు పంతులమ్మలకీ.

ఏ నాటువైద్యమో చేసి గర్భం విచ్ఛిన్నం చేసుకుని ఆ అవయవాలు వాచి, మురిగి, పుళ్ళుపడి, వొంటిలో నెత్తురంతా పోయి "ఏదో జబ్బుగా వుంది, చూడండి" అంటూ ఏమెరగనట్టు మందుకోసం వొచ్చేవాళ్ళు ఎంతమంది! డాక్టర్లు కనుక్కోలేరని వాళ్ళ అభిప్రాయం! డాక్టర్లూ ఎరగనట్టే మందిచ్చి పంపుతారు. ఈ మోసాలకి ఆ స్త్రీలని నిందించి ఏం ప్రయోజనం? గర్భిణి అని అందరికీ తెలిసినా, నోరూ, డబ్బు గల స్త్రీ కడుపులో బల్ల అని వాదించి, ఎక్కడికో వెళ్ళి కని తిరిగి వొచ్చి సంఘంలో క్షేమంగా బతుకుతోంది. ఆ తెలివీ, కపటమూ, ధనమూలేని అనాధ నిందలుపడి, పారిపోయి, కుక్కలపాలవుతోంది. సంఘం ఇంత తెలివిగా వ్యవహరిస్తోంది నీతులనే పేరుతో. ధనం గల స్త్రీ గొప్ప డాక్టర్ల చేత సుఖంగా ఏ అపాయమూ, బాధాలేకుండా ఆపరేషన్ చేయించుకుంటోంది. బీద స్త్రీ పిల్లని కని వెలిపడి, బీదతనంవల్ల సరిగా పెంచలేక బాధపడుతోంది. లేకపోతే ఏ నాటు వైద్యమో చేయించుకుని యమబాధ పడి చచ్చిపోతోంది. నీతులన్నీ ధనం వెనకాల దాక్కున్నాయి ఈ కాలంలో.

గర్భస్రావం దేశంలో మితిమీరిపోతోంది. చాలావరకు డాక్టర్ల దగ్గిరికి రావు ఈ కేసులు. అనాదిగా వస్తున్న మందులూ పద్ధతులూ అచ్చ స్వదేశ రకాలే చాలా ఉన్నాయి. జీవం పొందిన "ఓవం" (Ovam) గర్భకోశ గోడకు అతుక్కుంటుంది. దాన్ని బైటికి తీసుకురావడానికే ఈ ప్రయత్నాలు.

గర్భకోశ మార్గాలు వాస్తాయి. పుళ్ళవుతాయి, గర్భకోశాలు చిరుగుతాయి. రక్తం వరదలవుతుంది. చాలాసార్లు అనుకున్న కార్యంకాదు.

సగం చేసి, బైటపడుతుందని భయంవేసి మంత్రసాని పలాయనమవుతుంది. ఎవరి సహాయమూ అడగడానికి భయం.

లక్షల కొలది స్త్రీలు ఇల్లాంటి ఘోర బాధలు పడుతున్నారు. పతివ్రతలూ, చదువుకున్న స్త్రీలూ, మూడో పెళ్ళి చేసుకున్న వితంతువులూ, వొంట్లో రక్తంలేని జీర్ణ శరీరాలూ, అంటున్నారు; "పడవలసిందే! బాగా అయింది శాస్తి. మరి ఆ పని ఎవరు చెయ్యమన్నారు." అని.

అవును. మీలో కొందరికి సుఖంగా జరుగుతుంది! కొందరికి మీలో "అది మాకు జరిగే వీలులేదే. ఏ మొగాడూ మావంకే చూడడే" అనే ఈర్ష్య. చూస్తే లాభం లేదు. నీతి అనే పేరుతో మీ కుళ్ళుని ఇతర్ల మీదకక్కి పతివ్రతలనే కీర్తితో తిరిగే రోజులు పోయాయి. మీ రహస్యం బట్టబయలయింది. ఇంక "పాలసీ" కోసమన్నా సానుభూతి చూపండి. కర్మ పేరా, నీతిపేరా, సంఘ క్షేమం పేరా, అనాధలమీదా, దరిద్రులమీదా కర్కశత్వం చూపి, నలిపి కాలరాచిన రోజులు ముగిశాయి. ఇంక ఊరుకోరు ప్రజలు. జాగ్రత్త! కులం వెనకా, ధనం వెనకా, బనారస్ చీరల వెనకా, మర్యాదల వెనకా ఏముందో బహిరంగమైపోయింది. మేలుకోండి! బోర్డింగులలో, గవర్నమెంటు

బళ్ళల్లో పెళ్లికాని టీచర్లు ఎదిగిన ఆడపిల్లల్ని పెట్టే హింసలు, ఇళ్ళలో చాలామంది విధవల్ని పెట్టే బాధల్ని మించిపోతున్నాయి. ఉద్యోగాలని పేర్లు పెట్టుకుని సుఖమైన కావరాలు వదులుకుని, ఎండిపోయిన దవడలూ, హృదయాలూ, పాలూ, పళ్ళూ మీ వశత్వం చాలదూ! పైగా సుఖపడపోయే చిన్న పిల్లల్నీ మీ వలెనే రోగిష్టి మనసులతో తయారుకమ్మని ఆదర్శం చూపుతున్నారు!

ప్రస్తుతం సర్వసాధారణంగా జరుగుతున్న ఈ గర్భస్రావాలని జరగటంలేదనీ, జరగకూడదనీ కళ్ళుమూసుకోవడంవల్ల లాభంలేదు. ఇంత చౌర్యమూ, ఇంత బాధా ప్రజలలో లేకుండా నివృత్తిమార్గాలు ఆలోచించడం జ్ఞానుల విధి. పెళ్ళికాని తల్లుల మీదా, వారి పిల్లలమీదా సంఘంలో ద్వేషం పోవడం ఈనాడు జరిగే పని కాదు. గర్భనివృత్తి మార్గాలు ప్రచారం కావడం స్త్రీలు అవలంబించడం కూడా త్వరలో అయ్యే పనికాదు. ఈ లోపల స్త్రీల అవస్థ తప్పించాలంటే గర్భస్రావం అశాస్త్రీయమనే యీ "లా"ని సంస్కరించాలి.

యోగం

స్త్రీకి స్వేచ్ఛ కావాలన్నా, సంసారాలలో మార్పు కావాలన్నా పురుషుల ఆత్మలలో పరిణామం కావాలన్నా, అంతా ఎందుకంటే, వ్యక్తిలో ఆనందమూ, సౌఖ్యమూ వృద్ధి పొందేందుకు. జీవితపు "స్ట్రగుల్" అంతా ఆనందంకోసం. విచారాన్నించీ, చిరాకు నించీ, దుఃఖాన్నించీ, బాధనించీ తప్పించు కోడం కోసం. ఆ ఆనందాన్ని నమ్ముకునే దాన్నే గురిగా పెట్టుకుని కీర్తీ, మర్యాదా, ఎక్కువధనం, నీతులూ, ధర్మాలూ, ఇల్లాంటి ఆ ఆనందపు నీడల్నీ ఆనందమనుకునే భ్రాంతినీ వొదలడం వివేకవంతుల లక్షణం. గొప్ప ఆనందం పొందాలంటే ఆనందమిచ్చే వొస్తువులని, పరిస్థితులని సంపాయించడం కన్న, ఆనందం పొందగల గుణాన్ని వృద్ధి చేసుకోవడం ముఖ్యం. అట్లాంటి గుణం ఉంటే ఆనందమిచ్చే వస్తువుల్ని వెతుకుతూ కష్టపడి సంపాయించడానికి ప్రయత్నించ నక్కర్లేకుండా ఉన్నవాటితోనే అంత ఆనందమూ సంపాయించవచ్చు. ఆ శక్తిలేని వాళ్ళే, ఆ శక్తిలేకనే, లేనంతవరకే, ఆనందాన్నిచ్చే పరిస్థితుల కోసమూ, పదార్థాల కోసమూ తంటాలు పడతారు.

మనం పొందే ఆనందంలో భేదాలూ, వెరయిటిలూ కాక "క్వాలిటీ"లోనే భేదాలున్నాయి. వ్యక్తి సామర్థ్యంలో భేదం దానికి కారణం.

స్త్రీ పురుషులు ఒకరినించి ఒకరు పొందే సంతోషం, చాలా విషయాలతో సమ్మిళితం. గొప్ప ఆనందం పొందేవారికి అది ప్రేమవల్ల కలుగుతుంది. ఆ ప్రేమవల్ల కలిగే ఆనందం, తక్కిన సౌందర్యం, గుణం, చాతుర్యం, రతి మొదలైనవి ఏవీ ఇవ్వలేవు. ప్రేమని స్వీకరించగల గుణం, ప్రేమని ఇవ్వడానికి ఉన్న శక్తీ ముఖ్యం.

గొప్ప ప్రేమ కలగడానికి (అదృష్టం సంగతి అట్లావుంచి) ముఖ్యమైన పరిస్థితి, ఆ ప్రేమకి అర్హత ఉండడం, లేకపోతే సంపాయించడం. అనేకమంది స్త్రీల వెంట

పడ్డా రాదు. ఊరికే ప్రపంచమంతా ప్రేమే అని అరుస్తూ పరువులెత్తినా రాదు. రోజుకో స్త్రీని అనుభవించి ఏ ఆనందాన్నీ ఎరగకుండా ఉండవచ్చు. ఒకే స్త్రీ నిరంతరమూ పరిచయం కలిగి ఉండడంవల్ల ఎట్టా పాతపడి అలవాటైపోతుందో, అట్టానే నిరంతరము స్త్రీలని కొత్తవారిని అనుభవిస్తే, అదీ పాతపడి అలవాటై 'ఇంతేనా' అనిపిస్తుంది. స్త్రీ అంటే అసహ్యంగా చూసేవారూ, ప్రేమని తృణీకరించేవారూ, స్త్రీ సంబంధాన్ని అసహ్యమేసేవారూ, స్త్రీని చవకచేస్తూ కథలు రాసేవారూ, వారందరూ స్త్రీ దొరకని వారో, స్త్రీని అదేపనిగా బావుకుని అనుభవించిన వారో అయివుంటారు.

ముఖ్యం స్త్రీత్వంలో గౌరవం, ప్రేమ మీద విశ్వాసం, ఆ సంబంధంలో "మిస్టరీ", కొత్తదనం పోగొట్టుకోకపోవడం.

ఎంతమందిని మోహించామని కాదు ప్రశ్న, ఎంత గొప్పగా అద్భుతంగా ప్రేమించగలిగాము అనేది.

అందువల్లనే సాగినన్నాళ్ళు భర్తని దైవంగా చూడమనే సాధన అద్భుతంగా స్త్రీ హృదయాన్ని నింపింది. లోపాలు చూడలేని అంధత్వం లోపమే అయినా, జడత్వ లక్షణమే అయినా, స్త్రీని తృప్తితో ఆనందంతో నింపింది.

ఇట్లా ప్రేమని ఆరాధించే గుణాన్ని సాధనవల్ల వృద్ధిచేసుకోవాలి. ముఖ్యం తమ మనసుల్ని మార్చుకోడం, స్వభావాన్ని వృద్ధి చేసుకోడం, తమకి ఏమిస్తుందా అనిగాక స్త్రీని ఆమెకోసమే, ఒక వరంగా ప్రేమించడం.

అదీగాక ఆనందాన్నిచ్చేందుకు ఇంకా ఒకటి రెండు పద్ధతుల్ని చెపుతాను.

మొదటిది:

ఈ క్రింది మూడు విషయాలు ఇది వరకే చెప్పాను.

1. స్త్రీ పురుషులు ఒకొరికొకరు అలవాటు కాకూడదు.

2. ఒకరి నొకరు తిండికిగానీ, డబ్బుకుగానీ, సౌఖ్యానికి గానీ, మోక్షానికిగానీ, చివరకి ఆనందానికి గానీ, ఆధారంగా (ఇన్స్ట్రుమెంట్స్‌గా) చూసుకోకూడదు.

3. తమ జీవితంలో అన్నిటికన్నా గొప్ప ఐడియల్ (ఆదర్శం) రెండోవారిని ప్రేమించగల్గడం కిందనే ఎంచుకోవాలి.

కొత్తది — సంయోగం. సంయోగానికీ, యోగానికీ అట్టే దూరంలేదు. యోగమంటే ప్రస్తుతం మనసుని ఒకదానికే కలపడం అనుకోండి. మనసుని దేనిమీద ఏకాగ్రం చేసినా ఆనందం వస్తుందంటారు యోగులు. సాధారణులకి ఎమోషన్ ఆరాధనతో కలిస్తే సులభంగా మనసు లగ్నమౌతుంది. స్త్రీ పురుష సంబంధంలో ఉన్న 'మోషనల్ ఇంటెన్సిటీ' ఇంకో విషయంలో రాదు కనక ఇక్కడ మనసును కేంద్రీకరించడం సులభమౌతుంది. స్నేహం, కళ, సెక్స్, ఉద్రేకం అన్నీ ఒకచోట ఏకమైనాయి. కళలన్నిటిలోకీ ఉన్నతమైనదీ, సులభసాధ్యమైనదీ ఈ రతి కళ. ప్రేమ కళ.

స్త్రీ పురుషులు ఒకరినొకరు తమ స్వభావమంతటితోనూ ఆరాధించుకోవాలి. ఈశ్వరుణ్ణి సాక్షాత్కారంగా చూచినవాళ్ళు ఉంటే ఉండనీ. తక్కినవాళ్ళకి, తమ ప్రేమను పొందినవాళ్ళే ప్రపంచానికంతా ఉన్నతులు. వారొక్కరే కావలసినవాళ్ళు.

"జీవనం జీవనానాం!" అట్లా ఆరాధించడం చాతకానప్పుడు చాతనయ్యేట్టు హృద

యాన్ని మార్చుకోవాలి. మనిషిని కొత్తవారిని వరించడంవల్ల సహాయం జరిగితే అట్లానే చెయ్యాలి. హృదయాన్ని మార్చాలి. హృదయానురక్తుల్ని అంగీకరించే ధైర్యం తెచ్చుకోవాలి.

పూర్వం భర్తని అట్టి దైవంగా చూచుకోమన్నారు. ఆ సూత్రాన్నే మార్చి ఈనాడు,

"దైవసమానుల్నే యేరుకోండి, మార్చండి. మారండి."

"దైవంకన్న అధికులుగా చూసుకోండి."

అని స్త్రీ పురుషుల్ని అంటున్నాను. ఒక్క స్త్రీలనే కాదు.

రెండోది:

ఈ సంగతులు ఇదివరకే చెప్పాను.

1. సృష్టికార్యాన్ని చవక చేసుకోవద్దు. అసహ్యము అనుకోవద్దు. లేచిపోవడాలు, రహస్య సంబంధాలు, వాటిని గురించి నవ్వొద్దు. స్కాండల్స్ మాట్లాడవొద్దు.

2. అమితమైన కోర్కె కలగందీ, గొప్ప స్నేహం లేందీ, బలీయమైన ఆకర్షణ లేందీ కలవవొద్దు.

3. చక్కని పరిస్థితులు, ఆరోగ్యం, శుభ్రమైన స్థలం, వాతావరణం, చక్కని శాంతమైన కాలం — ఇన్ని కుదరంది పక్క మీద చేరవద్దు.

4. కలుసుకుంటామనే కాంక్షతో 'ఎక్స్‌పెక్టేషన్'తో అడుగోవాలి. కాంక్షకి లొంగక, చూసుకుని, నిదానించి, ఆనందించాలి. తృప్తిపడని కాంక్ష మన యజమాని అయినప్పుడు మనకి బాధ; మనం యజమానులమైనప్పుడు ఆనందం.

కొత్తది:

సృష్టి కార్యమప్పుడు ఏకాగ్రత సాధన చెయ్యాలి. ఒకరిమీద ఒకరు లేక ఇద్దరూ ఆ కార్యంమీద మనసు నిలపాలి.

ఈ సృష్టికార్యం ఈశ్వర కార్యం. అంటే ఈశ్వరుడు ఉంటే అతను సృష్టించడం వల్ల పొందిన ఆనందం అని విశ్వసించండి. దాని ద్వారా అందుకోగలిగిన ఆనందోద్రేకానికి అంతంలేదని, అనుభవిస్తున్నది చాలా స్వల్పమనుకోండి. ఏవేవో సంగతులు యోచించవద్దు. యజ్ఞానికి వలె ఆయత్తులు కావాలి. 'ప్రిపరేషన్స్' చేసుకోవాలి. స్థల, శరీర, మనోశుభ్రం అవసరం. సౌఖ్యాన్ని పొందుతూ, సౌఖ్యాన్ని పొందుతున్నాము అనే భావాన్ని మనసునించి తొలగనీకండి (సెల్ఫ్‌కాన్షియస్‌నెస్).

'ఇంత ఆనందం ప్రపంచంలో ఉంటుందా' అన్నంత స్థితికి వెడతారు.

ఈ పద్ధతివల్ల ఈ యోగం సిద్ధించడానికి —

1. తీవ్రమైన పరస్పరాకర్షణ.

2. ఆరోగ్యం, మనోబలం, సుందర పరిస్థితులు, డిస్టర్‌బెన్సు ఉంటుందనే భయం లేకపోవడం అవసరం.

వంధ్యత్వం

మనుషులకి స్వేచ్ఛ, కళ, స్నేహం, రొమాన్సు, ఇవన్నీ ఎంత అవసరమైనా, ఈ సుఖాలకి అన్నిటికీ ఆధారం, పునాది — భోజనమూ, సెక్సూ. ఈ రెండూ తృప్తిపడ్డప్పుడే తక్కినవి రాణిస్తాయి. రెండురోజులు పస్తులున్న వాడికి మలయమారుతమూ,

మల్లెపూలూ, మందయానాలూ ఏ మాత్రమూ ఆహ్లాదాన్నియ్యలేవు. సెక్సు వాంఛ తృప్తిపడని వాణ్ణి అవన్నీపైగా బాధిస్తాయి. ఈ రెండు వాంఛలకీ చాలా సన్నిహితమైంది బిడ్డలమీది కోర్కె, ముఖ్యంగా స్త్రీలకి.

స్త్రీకి బిడ్డ శరీర సంబంధమైన (ఫిజికల్) అవసరం.... మనసుకీ, హృదయానికీ, ఆమె సర్వశక్తులకీ, ఎమోషన్ అత్యవసరం.... పురుషుడు తనవంక చూసిన నిమిషం నించి, అతని కావిలింతలు, అతని శక్తి ద్రవం తన గర్భంలోకి ప్రవేశించడం, తొమ్మిదినెలలు తనలో పెరగడం, బిడ్డని చూడడం, తాకడం, తన పాలుతాగడం — ఇవన్నీ స్త్రీకి తానే ఎరగని, ఇంకెవరి మనసుకికూడా తట్టనేలేని గొప్ప ఆనందాన్నిస్తున్నాయి. బిడ్డ ఏడుపు, చిరునవ్వు, గంతులు, జబ్బులు, ముద్దుమాటలు, అతని బాధలు — అతనిమీద చెదరని గొప్ప ప్రేమ — ఇవన్నీ స్త్రీ ఎమోషన్‌కి గొప్ప అవుట్‌లెట్స్. మాతృప్రేమ మనుష్య శక్తులన్నిటిలోకీ ప్రబలమైనశక్తి. యోధులకు అలివికాని ధీరకార్యాలు చేయించింది స్త్రీలచేతా, మృగాలచేతా. కళ్ళని చెదరగొట్టే త్యాగాలకి కారణమయింది.

ఇటువంటి గొప్ప మాతృత్వాన్ని చాలామంది స్త్రీలు ఎరగరు పిల్లల్ని మోసి కన్నవాళ్ళుకూడా. భర్తలు లేకపోవడంవల్ల గర్భాన్ని చెడగొట్టుకునేవాళ్ళూ, పిల్లల్ని చంపేవాళ్ళూ, ఇతరులకి ఇచ్చేసేవాళ్ళూ అనేకవేలున్నారు. ఇంత గొప్ప ఆకర్షణని తెంపి మాతృశోకంతో కాలడానికి స్త్రీలని సిద్ధంచేసే ఈ సంఘ క్రౌర్యం ఎంత కర్కశమో ఆలోచించే వాళ్ళు అరుదు. ఈ దేశంలో చాలామంది స్త్రీలు పిల్లల్ని పెంచలేక అమ్ముకుంటున్నారు. అటువంటి కటిక దారిద్ర్యాన్ని కళ్ళారా చూస్తూ ఉపేక్షచేసి ఊరుకుంటోంది ఐశ్వర్య లోకం!

దివ్యమైన మాతృ అనుభవం లోపమైతే స్త్రీ జీవితం శూన్యమవుతుంది. ఈ ఆనందాన్ని ఎరగని స్త్రీ, జీవితంలో సగం ఆనందానికి గుడ్డిదైపోయిందన్నమాట. సకాలంలో బిడ్డని కనక స్త్రీ తనకే అర్థంకాని అశాంతి, చికాకులూ, కోపాలూ, జెలసీలు, నరాల తీపు, జీవితంలో వ్యర్థత్వ యోచనలతో బాధపడుతుంది. ఇంక ఎన్ని సుఖాలూ ఉండనీ అన్నీ వృథాగా తోస్తాయి ఆమెకి. పూర్వ పురాణాలలో బిడ్డలకోసం రాజదంపతులు పడ్డట్టు చిత్రించిన బాధలు అతిశయోక్తులు కావు. కానీ నవీన స్త్రీలు తమకు కలిగే బాధలు బిడ్డలులేని లోపంవల్లనని గుర్తించక భర్తలమీదా, సంఘంమీదా, ప్రభుత్వంమీదా, దేవుడిమీదా, పనిమనుషులమీద రుద్దుకున్నారు. కొంతమంది స్త్రీలకి బిడ్డలు లేకపోవడం వెర్రెత్తిస్తుంది. పిచ్చి పుట్టిస్తుంది. దెయ్యాల్ని పట్టిస్తుంది. అందువల్లనే గర్భం బరువు, అసహాయత్వం, పరాధీనం, డోకులు నెప్పులు, జబ్బు, మరణభయం — వీటన్నిటినీ తిరిగి తిరిగి భరించి, తిట్టుకుంటో, మూలుక్కుంటో, మళ్ళీ మళ్ళీ పిల్లల్ని కంటారు స్త్రీలు.

ప్రస్తుతం పరిస్థితులు మారడంవల్ల స్త్రీలకు బిడ్డలు గొప్ప న్యూసెన్సు, సమస్యలు అవుతున్నారు. పుట్టినవారిలో చాలామంది మట్టిపాలై దుఃఖాన్నిస్తున్నారు. గర్భశోకమంత గొప్పశోకం లోకంలో కనపడదు. ఈ పరిస్థితులకు సగానికి హెచ్చు పట్టణ

జీవితమూ, ఆ జీవితానికి తగినట్టు మనుషుల అలవాట్లు మారకపోవడమూ ముఖ్య కారణాలు. స్త్రీల ఆరోగ్యం, బలహీనత, పూర్వంనించి దేశంలో వస్తున్న కామన్‌సెన్స్ — అవివేకం. అనుభవం, మూఢాచారం కింద జతపడి నశించడం. కొత్త విజ్ఞానాన్ని స్త్రీలకి పాఠశాలలోగానీ, ప్రభుత్వంనుంచి గానీ లభించకపోవడం. స్త్రీలకే పూర్వానుభవం మూఢ నమ్మకమయింది. నవీన నమ్మకం పాశ్చాత్యమయింది. స్త్రీలు ఇంటి పనీ, పిల్లలపనీ కాక, పబ్లిక్ వ్యవహారాలలో ప్రవేశించి, తగినంత శ్రద్ధ పిల్లలకి ఇవ్వలేకపోవడంవల్లా, "బిడ్డలు అన్ని పనులకన్నా ముఖ్యం; మిగిలిన కాలాన్ని మాత్రమే తక్కిన అవసరాలకు ఉపయోగించాలి" అని గుర్తించకపోవడంవల్లా, బిడ్డలకి కావలసిన ఆహారమూ, కాంతీ, గాలీ, విశాలత్వం కరువవటంవల్లా, ధనం చాలక పోవడంవల్లా, భర్తకి వ్యవధి లేకపోవడంవల్లా, ఈ స్థితి ఏర్పడ్డది.

బిడ్డని కనగానే, స్త్రీ, పెంచడానికి సృష్టి ఉపయోగించుకొనే సాధనంగా మారాలని తెలుసుకోవాలి. నవీన స్త్రీకి ఫాషన్లు, ఖరీదుగల చీరెలు, సినిమాలు, మీటింగులు, టీ పార్టీలు — అన్నీ కావాలి. బిడ్డని కనకుండా మానడం, వారిపుటకని స్వాధీనంలో ఉంచుకోవడం, పుట్టినవారి కోసం శక్తినిచ్చి వారి ఆరోగ్యానికి త్యాగం, వీటికి అవసరమైన మనోబలం నేర్చుకోరు. వాళ్ళు చదువుకున్న విద్య సహాయం చెయ్యదు. అందువల్ల పట్టణాలలో అమితమైన దుర్గతిలో బతుకుతున్నారు స్త్రీలు.

గర్భనిరోధక మార్గాలు, స్వంత ఆర్జన, ఓట్లు, హక్కులు, ఇవన్నీ స్త్రీ స్వేచ్ఛకి అవసరమే. స్వతంత్రం చాలా అవసరమైన వస్తువే. స్వతంత్రత ఉండాలి. కానీ, స్వతంత్రతని ఉపయోగించవలసిన అవసరం చాలా తక్కువగా ఉండాలి. ఆత్మహత్య చేసుకోడానికీ; భర్తనీ, పిల్లల్ని విడవడానికీ స్వేచ్ఛా ఉండి తీరాలి. కానీ స్వేచ్ఛని ఉపయోగించుకోవలసిన అవసరం కలగడం ఏమీ గొప్పగానీ, అభిలషించవలసిన విషయంగానీ కాదు. స్వేచ్ఛ దేనికీ? దేనినించి? అని ప్రశ్నించుకోవాలి.

తిండినించీ, ప్రేమనించీ, బిడ్డలనించీ స్వేచ్ఛ కావాలనడం సహజమూ, ఆరోగ్యమూ కాదు. కొందరున్నారు ఆ స్వేచ్ఛ కావాలనే వాళ్ళు. వాళ్ళ స్వేచ్ఛకీ, అభ్యంతరం ఉండకూడదు. ఆ కోరడం తప్పు కానీ, ఒప్పుకానీ. కొన్ని పరిస్థితులలో ఆ స్వేచ్ఛ ప్రతివారికీ అవసరం కావొచ్చు.

ఈ బిడ్డల అవసరం స్త్రీలు అందరికీ ఒక్కటే ఏట కలగదు. మన దేశంలో ముప్పాతిక మందికి పురుషుడి అవసరం గుర్తించందే, పురుషుడి కోసం శరీరమూ మనసూ సిద్ధంకాందే భర్తలు ప్రాప్తించినట్టే; బిడ్డల కోసం శరీరాలూ, హృదయాలూ, స్తనాలూ తయారు కాకముందే బిడ్డలు కలుగుతున్నారు. కలిగారు కదా అని, అవసరంకొద్దీ సృష్టి ఆమె శరీరంలో అవసరమైన మార్పులూ, ఆ మనసులో కావలసిన 'ఇన్‌స్టింక్ట్సు' నీరసంగా కల్పిస్తుంది.

కొందరికి మాత్రం మాతృత్వం మేల్కొన్నదాకా కూడా పిల్లలు కలగరు. బిడ్డలమీద కోర్కెకలగందే బిడ్డల్ని కనవలసిన అవసరం ఏమీ లేదు. బిడ్డల్ని కనడం ఏ మోక్షమూ, ఏ ధర్మమూ కాదు. భర్తకి బిడ్డలు కావలసి, భార్యకి అక్కర్లేకపోతే,

తనద్వారా అతడు కనడానికి స్త్రీ అంగీకరించకూడదు. కాని స్త్రీకి బిడ్డలమీద కోర్కె కలిగిందా, బిడ్డలకోసం అతి తీవ్రమయిన ప్రయత్నం చెయ్యాలి.

బిడ్డలు పూర్వజన్మ సుకృతమనీ, ఏ శాపాలవల్లనో, పాపాల వల్లనో కలగరనీ, ప్రయత్నించి లాభంలేదనీ, జాతకమనీ, అనడం మూర్ఖం. ప్రపంచం కొన్ని రూల్సు మీద నడుస్తోంది. ఎండు తాటాకులకు ఎప్పుడు నిప్పంటించినా అంటుకుతీరతాయి. పురుషుడి వీర్యం స్త్రీ అండంలో కలిస్తే పిల్ల ఏర్పడుతుంది. కలవడానికీ, సరిగా కలపడానికీ, అభ్యంతరం కలిగినప్పుడే కర్మ పనిచేస్తుంది. కనక పిల్లలు కావలసిన స్త్రీ నిరుత్సాహపడక సరైన పరిస్థితులు కలిగించుకోడానికి ప్రయత్నించాలి. పిల్లలు పుట్టడానికీ, పుణ్య పాపాలకీ, నీతి అవినీతులకీ సంబంధంలేదు. బిడ్డ స్త్రీ జన్మహక్కు — భర్త ఉన్న స్త్రీకి, లేని స్త్రీకి కూడా. బిడ్డని కనకూడదని శాసించడానికి ఏ మతానికీ, సంఘానికీ, ప్రభుత్వానికీ అధికారంలేదు. పుట్టబోయే బిడ్డ రోగిష్టీ, పిచ్చిదీ అవుతుందని చెప్పగలిగితే తప్ప.

బిడ్డలు కలగకపోవడానికి కారణాలు స్త్రీ లోపమో, పురుషుడి లోపమో అయివుండాలి. ఇదివరకంతా లోపాలు స్త్రీలలోనే ఎక్కువ అనుకునేవారు. ఇప్పుడు పురుషుడిలోనే అది ఎక్కువగా రుజువు అవుతోంది. స్త్రీలో లోపం కనుక్కోవడం సులభం. పురుషుడి పరీక్షకి లోబడడు గనక కనుక్కోవడం కష్టం. పురుషుడి లోపమని వొప్పుకుంటే సంఘానికి చాలా సమస్యలు తటస్థిస్తాయి గనక, స్త్రీ మీద బాధ్యత వెయ్యడం మామూలు అయింది.

పురుషుడికి ఏ మాత్రం పుంసత్వమున్నా గర్భం కలగచెయ్యగలడు. కాని కొందరికి ఏ మాత్రమూ ఉండదు. పుటకతో ఉండదు. కొన్ని అభ్యాసాలవల్లా ఉండకపోవచ్చు. సుఖరోగాలవల్లనూ కావొచ్చు. ఈ సంగతి తెలిసికూడా పెళ్ళిళ్ళు చేసుకుంటారు. స్త్రీలని దాచుకుంటారు. పరువు ప్రతిష్టలకోసం. చికిత్సకోసం ప్రయత్నం చెయ్యరు. చాలా నీతివర్తనులని కీర్తిని సంపాయించుకుంటారు. వేదాంత శాస్త్రంలో గట్టివారవుతారు. తెలిసీ తెలియకా, భర్తల స్థితిని బైటపెట్టక జీవితమంతా కన్యలుగా గడిపిన గొప్ప సాధ్వీమణులున్నారు. తమ సెక్సునీ, బిడ్డలమీద కాల్చే కోర్కెనీ తమలోనే జీర్ణం చేసుకుని, నాశనమయినవాళ్ళు.

కొందరు పురుషులకి పుంసత్వముంటుంది. కానీ రేతస్సులో జీవాణువులు స్పెర్మటోజా (Spermatoza) ఉండదు. వంధ్యత్వాలకి ఇదే కారణం. కుదరడం కష్టం.

ఇది కొన్ని వంశాలలో తరతరాలుగా వస్తుంది. ప్రతి తరంలోనూ స్త్రీలు ఇతరులకి కని, ఆ వంశాన్ని నిలబెడుతోనే ఉంటారు.

స్త్రీలలో లోపాలు:

1. తిండి తిని, శరీర వ్యాయామం లేక ఊరిపోవడం.
2. రక్తం తక్కువ.
3. బలహీనం.
4. గర్భకోశంలో, పుటకలోనే లోపం; లేక, ఏ జబ్బువల్లనో కలిగింది.
5. సుఖరోగాలు.
6. వంశంలో వస్తున్న వంధ్యత్వం.

బిడ్డమీద అమితకోర్కె జనించిన స్త్రీ మొదటిలో చెయ్యవలసినపని పురుషుణ్ణి మార్చడం. ఆ పనిచేస్తే సూటిగా తొంభై మందికి పిల్లలు కలుగుతారు. కలక్క కలక్క పిల్లలు పుట్టారని ఉత్సవాలు చేస్తారే! అక్కడ సాధారణంగా ఇట్లాంటిది ఏదో జరిగి ఉంటుంది. పురాణాల్లో ఇట్లా పురుషుల్ని ఆహ్వానించి వంశాలు నిలబెట్టుకోడాలు చదివి ఉంటారు. ఈ కాలంలో నీతిని రక్షించాలని ఆ పద్ధతుల్ని నిషేధించారు.

తీర్థయాత్రలు వెళ్ళివొచ్చీ, గుళ్ళచుట్టూ ప్రదక్షిణలుచేసీ, యోగుల దగ్గిర వరాలు పొందీ, పిల్లల్ని కంటారే, అక్కడకూడా పురుషుడు మారడమే తటస్థించి ఉంటుంది.

భర్తలు అంగీకరించాలి. అంగీకరించక పోతే "బిడ్డలు ఇవ్వలేని వాడిని నువ్వేమి భర్తవి!" అని ధిక్కరించాలి స్త్రీ. "పురుషుడిదే తప్పు అని చలం చెపుతున్నాడ"ని వాదించండి. ఆ పురుషుడు మీమీద తప్పు వెయ్యకుండా చలమేకాదు, ప్రస్తుతం ఈ విషయమై పరీక్షలు చేసిన డాక్టర్లూ అదే మాట అంటున్నారు.

ఇదివరకు పిల్లల్ని కన్న పురుషుణ్ణి ఏరుకుంటే మరీ మంచిది. అప్పుడూ లాభం లేకపోతే, డాక్టర్ సలహా తీసుకోవాలి. స్త్రీ తన దేహంలో లోపమేమోనని, సరైన ఆహారం, శారీరక వ్యాయామం, శుభ్రమయిన గాలి, పరదేశ ప్రయాణం ఇవన్నీ సహాయం చేస్తాయి. ఎందుకంటే ఇవి శరీరమనో ఆరోగ్యాల్ని వృద్ధిచేస్తాయి. చెట్లచుట్టూ ప్రదక్షిణాలూ మొదలైన వాటి ఉద్దేశ్యం ఇంతేనేమో!

ఏదో కళాశాస్త్రాలలో వర్ణించిన స్త్రీ పురుష భేదాలు, అవయవపు కొలతల హెచ్చుతగ్గులు, కులభేదాలు, వయోభేదాలు, దగ్గిర వరసలూ రతిలో అసంతృప్తి, మనసులో అసహ్యాలూ, ఇవేవీ కారణాలు కావు వంధ్యత్వానికి.

స్త్రీకి బిడ్డని కనటానికి హక్కు ఉంది. కాని సత్సంతానాన్ని కనే బాధ్యత కూడా ఉంది. తాను ఆరోగ్యవంతుల్నీ, శిష్టుల్నీ కనలేనని తెలిసినప్పుడు తాను కనకూడదు. పిల్లల్ని పెంచుకోవడంవల్ల ఆ కోర్కెని చాతనైనంతవరకు తీర్చుకోవాలి. కనడం చేతనైన స్త్రీలు పాతివ్రత్యం చాదస్తాలు పెట్టుకొని, పెంచుకోడంలో తృప్తిపడడం, అన్నం అనుకుంటూ మట్టితినటం లాగుంటుంది. భర్తవల్ల సత్సంతానం కలగదని తోచినప్పుడు అతన్ని తప్పించడం సంఘం ఎడల స్త్రీకి ముఖ్యమయిన బాధ్యత అవుతుంది.

ధీరులూ, ఉత్తములూ అయిన పురుషులవల్ల అనేకమంది స్త్రీలు బిడ్డల్నికనే వీలు కలిగినట్టయితే దేశ సౌభాగ్యానికి చాలా తోడ్పడిన వాళ్ళవుతారు.

విడాకులు

సులభంగా భార్యాభర్తలు ఏ కారణం చెప్పకుండానే విడిపోగల వీళ్ళు ఉండితీరాలి. కానీ విడిపోయేటప్పుడు, ప్రతివారూ ఆలోచించుకోవాలి! ఎందుకు విడిపోవడం? విడిపోయి, తరవాత? వేరే సంబంధం లేకుండా బతకగలమా? వేరే సంబంధం

ఇంతకన్న గొప్పగా అందంగా ఉండగలదా? ప్రస్తుతాన్ని భరించలేక వెళ్ళిపోతే ఏదో శాంతి వస్తుందని మాయ ఆశకి లోబడుతున్నామా?

మానవ జీవితం సంకుచితం. బాధలూ, ఇబ్బందులూ తప్పవు. కనక సంసారంలోంచి వెళ్ళిపోతే, ఇబ్బందులు పోతాయని నిశ్చయం లేకుండా, ముందేమిటా అని యోచించకుండా, వదులుకోడం మూర్ఖం. ముఖ్యంగా స్త్రీలకి.

వెళ్ళిపోయి ఒంటరిగా బతకడం, లేక ఏ ఉద్యమంలోనో జీవితాన్ని కలిపెయ్యడం, లేక కొత్త సంబంధంతో శాంతి పొందడం. ఇట్లాంటివి ఎవరికో ఒకరికి గాని సాధ్యపడవు.

అందువల్ల ప్రశ్న ఏమిటంటే విడిపోవడానికి బాగా వీళ్ళు సంఘమూ "లా" కలగజేస్తే, ఈ వివాహం నాలుగు నాళ్ళకే అనేది సామాన్య స్త్రీ పురుషుల మనసుల్లో ఉంటే, వివాహంలో ఉండే స్థిరత్వానికి భంగకరం కదా? అని ప్రశ్న వస్తుంది. భంగకరమై, వివాహం విచ్ఛిన్నమైతే వచ్చిన ఉపద్రవం ఏమీలేదు. కానీ మనుష్య స్వభావంలోనే ఓ స్థిరమైన సంబంధం అవసరమనే గుణం ఉంటే, అట్లాంటి స్థిరసంబంధం లేని జీవితాలు ఏ దిక్కూ లేక, ఊరికే అటూ ఇటూ కొట్టుకోవడమే తటస్థిస్తే, జీవితంలో ఆసక్తే, ఆనందమే నశిస్తే వాళ్ళ నష్టాల్ని గమనించకుండా అట్లా వీలైనంత వరకు మనుషుల్ని అతికించి ఉంచడానికి ప్రయత్నించడమే మంచిది. ప్రస్తుతం వివాహ బంధాన్ని తెంచేసుకున్న స్త్రీల చరిత్రల్ని పరిశీలిస్తే చాలా మంది సంసారాల్లో ఉండిపోతేనే సుఖపడేవాళ్ళు అనిపిస్తుంది. పోనీ సుఖం త్యాగమైపోయినా, అంతకన్నా వాళ్ళు ఏ గొప్పనో సాధించారా అంటే అదీ కనబడదు. వాళ్ళల్లో చాలామందిని దగ్గిరిగా భరించలేనంత నీచమైనట్టు కనపడతారు.

కానీ వాళ్ళ క్షేమాన్ని యోచించి, ఓ కాపురంలో బలవంతంగా నిలపాలని చూసినా మనుషులు నిలిచి తీరతారనేది లేదు. ఏ ఇతర కారణమూ లేకుండానే తమని బలవంతంగా సంసారంలో ఉండమంటున్నారనే కారణంవల్లనే బైటికి వెళ్ళడానికి చూస్తారు. కనక బలవంతం అనేది ఎప్పుడూ ఉండకూడదు. ఈ వివాహబంధం ఇంత బలవంతం కాబట్టే దానికి స్వతహాగా లేని గొప్ప విలువలని దానికియ్యడం వల్లనే అది ఇంత రాక్షసి అయింది, మనుషుల ప్రాణాలకి. వివాహానికి ఇప్పుడున్న ఈ మత ధర్మ, నీతి, మర్యాద, తప్పుడు విలువలన్నీ పోయి మనుషులు సుఖపడే పద్ధతికింద మారాలి. పెళ్ళికాని వాళ్ళకీ, సంసారంలోంచి వెళ్ళిన వాళ్ళకీ ఏ విధమైన అమర్యాదా, లోకువా కలగకూడదు.

పురుషుడు అంత నశిస్తున్నట్టు కనపడడు. కాని అతనిలోనూ మార్పు కనపడుతుంది. ఇది ప్రస్తుత పరిస్థితుల వల్ల తటస్థిస్తుందనుకుంటాను. మొత్తానికి ప్రజలు ఇంతకన్నా బాగా పరిణామం చెందితేనే గాని తమ బాధ్యతల్ని, తమకి ఏది సుఖాన్నిస్తుందో నిశ్చయంగా గుర్తించే శక్తిని సంపాయిస్తే గాని, ఉత్త విడాకుల చట్టాలు ఏమీ సహాయం చెయ్యవేమో!

జీవితాన్ని గమనించిన కొద్దీ చాలా మందికి ఏ గొప్పా సాధించే ప్రయత్నం అక్కర్లేదనీ, ఎట్లాగో జీవితం ఏ గోలలూ లేకుండా

సాగిపోవడమే కావాలనీ, దానికి సంసార బంధం సహాయం చేస్తుందనీ అనిపిస్తుంది.

అధికారి తిట్టగానే రోషం కలిగి రాజీనామా నిచ్చేవాడు ధీరుడే. కాని ఆ ధీరత్వం నిలుపుకోవాలి. మళ్ళీ అంత నీచత్వం చేసి, మళ్ళీ ఇంకో ఉద్యోగంలో ప్రవేశించి మొదట తాము చేసిన ధిక్కారానికి బడాయి కొట్టుకుంటూ, లోపల కుళ్ళేవారిని గొప్ప స్వేచ్ఛా కవులని చూశాను నేను.

అట్లానే వివాహబంధాన్ని ఏ ఇబ్బందికో తన్నేసి, దిక్కులేక, అంతకన్న గొప్ప బాని సత్వానికి ఇరికిన పురుషులు అనేకులు.

వివాహంతో శృంగారం కొత్తదనం, త్రిల్ అన్నీ త్వరలో నశిస్తున్నాయి. కానీ ఆ శృంగారం, ప్రేమా ఎందరికి నిజంగా కావాలి? ఎంత మంది వాటికోసం గట్టిగా తపనపడతారు? అవేవో ఉచితంగా రావాలనీ, తటస్థించాలనీ కలలు కనేవారే గానీ, ఈ సంసారంలోంచి దాటితే, ఆ పక్క సందులో సిద్ధంగా ఉన్నాయనుకునే మూర్ఖులు తప్ప! తీరా అవి గడపలోకి వస్తే మాత్రం, గుర్తించి, నిలుపుకోగల వారెందరు?

గొప్ప ప్రేమ, జీవితంలో ప్రాప్తించినప్పుడు ఎట్లానూ ఉండదు, ముందు వెనుకలు చూడడమనేది. ఎవరి సలహాలూ అక్కర్లేదు. వివేకం, ధర్మం ఇట్లాంటి యోచనలే ఉండవు. కాని ఆ పరిస్థితి చాలా సకృతు. కాని సంభవించే గొడవలన్నీ గృహ పరిస్థితులు ఘోరంగా ఉండీ, పురుషుడు స్త్రీ కళ్ళలో నీచపడీ, పైనించి ఎవరిమీదో ఇష్టం కలిగీ స్త్రీలు కదులుతూ ఉంటారు ఇళ్ళలోంచి. ఊపిరి పీల్చుకొనేందుకైనా స్వేచ్ఛలేక తమ శృంగారానికి వీలులేక వెళ్ళిపోతారు బైటికి. కానీ పాపం చాలాసార్లు వాళ్ళ వాంఛలు బైటికి వెళ్ళినా తీరవు.

లేచిపోవడాలు ఎక్కువవుతున్నాయి. కానీ లేచిపోయే వాళ్ళు చక్కగా ఆలోచించుకుని చెయ్యరు ఆ పని. మళ్ళీ బంధువులకే, భర్తలకే, చిక్కుతారు. దిక్కులేకుండా పోతారు. పురుషుడు సుఖంగానే ఉంటాడు. కానీ స్త్రీ చాలా నష్టపడుతుంది. సుఖం, దేహశాంతి, అభిమానం, ఉత్సాహం, విశ్వాసం — ఇన్నిటిని కోల్పోతుంది.

సంసారంలోంచి పోయేముందు స్త్రీలీ విషయాల్ని గమనించాలి:

1. నూటిలో తొంభై తొమ్మిదికి, చాలా ఏళ్ళు శాంతంగా గడపాలంటే, ఎంత నరకంగా ఉన్నా, లేచిపోవడం కన్న సంసారమే నయం. ఎంత బాధ్యతలు ఉన్నా సంసారంలో స్త్రీకి ఒక స్థానం ఉంది. ఎంత నీచమైన స్థానమైనా సరే, దాంట్లోనే ఓ విధమైన రక్షణా, శాంతీ ఉన్నాయి. సంఘం, ఇరుగూపొరుగూ, బంధువులూ కొంతవరకన్నా స్త్రీ వైపు పలుకుతారు.

వెళ్ళిపోవాలనిపిస్తే, గట్టిగా..... ఏ నాలుగురోజులో గొప్ప శృంగారాన్ని అనుభవించి, తరువాత నశిస్తేనేం, చచ్చిపోతేనేం, అనుకుని నిశ్చయించుకుని వెళ్ళాలి. బాధలూ, వొంటరితనం, హేళనా, అన్యాయం, బీదతనం, అన్నీ భరించే శక్తి ఉండాలి. చావడానికన్నా స్థయిర్యం ఉండాలి!

2. కానీ, ఇన్నీ వదలి వెళ్ళింతర్వాత, చాలాసార్లు ఆ శృంగారమూ రాదు.

3. నిన్ను రమ్మనే పురుషుడు నీ డబ్బుకి ఆశిస్తున్నాడేమో ముఖ్యంగా కనిపెట్టు. అతను నిన్ను పోషించే స్థితిలో ఉండాలి.

4. ఏ నగలూ నీ వెంట తీసుకునిపోకు.

5. పూర్తిగా పురుషుడు నీకు దివ్యమైన

కాలమివ్వగలడనే విశ్వాసం ఉంటేనేగాని కదలకు.

6. బంధువులకి ఎక్కడా అందకుండా చాలా దూరం పొయ్యే ఏర్పాట్లు చేసుకో.

7. పెళ్ళి అయిన స్త్రీతో సంబంధం కలిగిన పురుషుడికి ఖయిదువేస్తారు, దానికి సిద్ధమై ఉండండి.

8. పూర్వపు పెళ్ళినించి తప్పించుకోవాలంటే మహమ్మదీయ మతం తీసుకోవడం చాలా ముఖ్యమైన మార్గం.

శృంగారం

శృంగారానికీ, ప్రేమకీ, ఇంత ప్రాముఖ్యం ఇచ్చి ముగింపు రాస్తున్నానంటే, ఏం ఆధారం లేకుండానే, ఉత్తగా రాసే మాటలు కావు ఇవి. ప్రజలు సౌఖ్యాలకై ఏ ప్రయత్నాలు చేస్తారో, వాళ్ళ జీవితాల్లో వేటిని చూసుకుని మనుషులు సంతుష్టి పడుతున్నారో, గర్వపడుతున్నారో.... వాటిని కొద్దో గొప్పో నేనూ అనుభవించి ఎరిగినవి. డబ్బు, అధికారం, పదవి, కీర్తి, గొప్పశీలం, మతం, ధ్యానం, కుటుంబం, స్ట్రగుల్ అండ్ ఎడ్వంచర్. ఏ సందేహం, సంకోచం లేకుండా చాలా సిన్సియర్‌గా చెపుతున్నాను, శృంగారానికి సరిపోయే అనుభవం ఎక్కడా దొరకదని. ప్రేమా? ప్రేమ దొరకడం చాలా కష్టం. దొరికినా అది ఒక అగ్ని. అది ఒక తపస్సు. ఈ శిఖరాన్ని అందుకో గలిగిందాకా నరాల్ని గుంజి నలిపి వ్యధపెడుతుంది! కాని దొరికిందా, ప్రేమ గొప్పవరం. అంత బాధలోనూ, గొప్ప వీణారవం వినపడుతోనే ఉంటుంది.

ఈ ప్రేమకన్న గొప్పది ఆధ్యాత్మికానుభవం అంటారు. ఆధ్యాత్మికానుభవం అంటే మతం, పూజలు, వేదాంతం ఇవేమీకావు. ఈ సన్యాసులూ, వేదాంతులూ, బైరాగులూ, ఎవరూ ఎరగని అమృతం అది. ప్రేమానుభవం కన్న గొప్పదనిపిస్తుంది అదే, దొరికితే! కాని ఎవరికి దొరుకుతుంది? ఎట్లా దొరుకుతుంది? ఇంకేం చాతగాక ఆ ప్రయత్నమేదో చేస్తున్నాము, అది దొరకబోతోందని వెర్రి ఆశలు, ఆత్మ వంచనలు, పరవంచనలూ తప్పితే! ఆ నిజమైన ఆధ్యాత్మికానుభవముంటే తనని, తన ఆత్మో, ఏదో 'తను' అనే దాన్ని ఈ విశ్వ చైతన్యంతో ఏకం చెయ్య గలగడం — విశ్వగానంతో తన కంఠాన్ని మేళవించడం — తను తనని మరిచిపోయే చివరి ఐక్యాన్ని పొందడం — లోకంలోని ఆనందాన్నంతా తనదిగా అనుభవించడం, అది అందనప్పుడు అట్లా తనని మరిచి ఐక్యమయ్యే ఆనందం ఈ ప్రేమలోనూ, కొంతవరకు శృంగారంలోనూ గాక ఎక్కడా దొరకదు.

ఇట్లా రెండోవారిలో ఐక్యం కావడం పురుషుడికన్న స్త్రీకి సులభం, అది ఆమె అదృష్టం. సులభంగా తన పురుషుడికి దైవత్వాన్ని ఆరోపించి అతనితో తన జీవితాన్ని ఐక్యం చెయ్యగలదు. దానినే పురస్కరించుకుని తనని నమ్మి ఆధారపడి ఆరాధించే స్త్రీని ఇంత చులకన చేసుకున్నాడు పురుషుడు. ఈ పనినే ఈశ్వరవరంగా చేసి గొప్ప భక్తులైనారు పురుషులు. ఈ ఐక్య ఆదర్శాన్నే పాతివ్రత్యమన్నారు పురాణాల్లో. ఈ ఐక్యాన్ని సాధించమన్నారు స్త్రీని. కాని నటించమన లేదు.

ఈ పెద్ద మాటలన్నీ మాని ఉత్త

సంభోగం సంగతి యోచించినా, దాంటో నన్నా రెండు శరీరాలు ఎక్కువ ఐక్యమయ్యే పరిస్థితిని ఆలోచించుకోలేరు.

ఆ సంభోగంమీద, రెండోవారి మీద, భక్తీ గౌరవం ఉన్న కొద్దీ మనసులూ అంత కన్న గొప్ప శక్తులూ ఐక్యమౌతాయి. అందు వల్లనే సంభోగాన్ని ఉత్త అలవాటు కార్యం కింద చేస్తున్న వాళ్ళంత దౌర్భాగ్యులు ఉండ బోరు. గొప్ప భావాలూ, కలలూ, వాంఛలూ ప్రజ్వలించి సంతృప్తి నియ్యవలసిన సమయమది. నేను ఊరికే ఏదో మాటలు రాస్తున్నాననుకోకండి.

ప్రేమలో, మోహంలో, శృంగారంలో విశ్వాసం లేకపోయినా, అవి అందుకోవడం మీ చేతకాకపోయినా సంభోగం చేతనవు తుందిగా? దాంటో, దాని గొప్పలో, అది ఇవ్వగల శాంతిలో విశ్వసించండి. సిగ్గూ, అసహ్యమూ, నీచత్వమూ మీ అంతరాంత రంగంలో కూడా ఉండకండా తీసేసు కోండి. బతకడం అందుకోసమే! ఆ శాంతినీ, ఆనందాన్నీ పొందడమేననుకోండి! ఈ ప్రపంచంలో తక్కిన సుఖాలన్నీ చెత్త దానిముందు.

అంతేకాదు, నేనూ మీ మల్లేనే ఈ మోహం, స్వేచ్ఛ ఇవన్నీ చాలా పాపాలని నన్ను నేను నిగ్రహించుకున్న రోజులు న్నాయి. ఎప్పటికీ కూడా నిగ్రహాన్నీ, మనసు చూపే నియమాన్నీ, ధర్మాన్నీ మీరడంవల్ల ఏ సౌఖ్యాన్నీ గొప్పగా పొందలేము. కాని ప్రేమకీ, శృంగారానికీ, ఆటంకమయ్యే ఈ సందేహాలూ, భయాలూ ఉత్తవి. వాస్తవం కానివి. శక్తిహీనులు ఈర్ష్యలవల్ల కల్పించి నవి. పూర్వకాలపు పరిస్థితులలో పూర్వ యుగాలలో ఏర్పరచినవి, అర్థంలేనివి. భీరులు తమ చచ్చుతనాన్ని సమర్థించుకు నేందుకు, గొప్ప చేసుకునేందుకు, కల్పించు కున్నవి.

యవ్వనంలోంచి వెలుగు మనుషు లకీ, మనసులకీ మెరుగు పెడుతున్న వాళ్ళు కవులూ, నాటకాలూ సినిమాలూ కీర్తించే ఏదో యాబ్‌స్ట్రాక్ట్ ప్రేమలో విశ్వాసముంచి వెతుకుతారు. మలుపు చివర ఎక్కడో దొరుకుతుందనుకుంటారు. తాము అనుభ వించేదే గొప్పది అనుకుంటారు. తృప్తిపడక ఇంకా వెతుకుతారు. కాని త్వరలోనే జీవితం హృదయాలమీద కొట్టే దుమ్ముని తట్టుకో లేక తాము నమ్మిన, కలలుకన్న ప్రేమ ఉత్త మాయ అని అవహేళన ప్రారంభిస్తారు. ఎవరికో ఎప్పుడో గాని ప్రేమ అనేది తట స్థించదు. అది కలిగిన నిమిషాన, అది నిజస్వరూపంతో ప్రసన్నమైనప్పుడు, ఏ కవులూ ఏ కలలూ దాని ఔన్నత్యాన్ని అందు కోనంత వెలుగులు కనపరుస్తుంది, కాలు స్తుంది. కానీ ఎంత గొప్ప ఆనందానికీ అతి మహిమలకీ, ఐశ్వర్యాలకీ, వెలుగులకీ కళ్ళు తెరుస్తుంది!

ముగింపు

ఈ విషయం అంతంలేనిది. నేను చెప్పదలచుకున్నది చెప్పాను. అనేక సంవ త్సరాలనుంచి నన్ను కలవరపెడుతూ, ప్రతి అనుభవంతోటీ ప్రతి సంవత్సరమూ మారుతూ ఉండే నా ఊహలని కొంతవరకు చేర్చి రాశాను. కాని ఇవే వాస్తవమనీ, ఇవే అనుకరింప తగినవనీ శాసించడం లేదు. ఈనాడు ఇవి నాకు తోచిన సత్యాలు.

ముందునాటికి మారిపోవచ్చు. ఇతరులకి ఇవి సత్యాలు కాకపోవచ్చు.

ఒకరికి ఉపయోగించిన పద్ధతులు తక్కిన ప్రజలందరికీ అనుకూలిస్తాయని అనుకోవడమే — లోకంలో చాలా మూర్ఖానికీ, దుఃఖానికీ, బాధకీ కారణం. చాలా మంది ఈ పుస్తకం హానికరమనీ, ఉన్మాదమనీ తగలబెడతారేమో! ఏ కొద్దిమందికో ఈ విధమయిన జ్ఞానం ఉపయోగించవచ్చు. వాళ్ళుకూడా ఇది చదివి, ఎంత వరకు ఇట్లాంటి పద్ధతులు తమకి న్యాయమో, అనుష్టీయమో, ఆలోచించుకోవా లనే నా ఊహ. అంతేగాని ఇది ఒక సంపూర్ణమయిన 'సిస్టం' అని కానీ, ఈ విధంగా లోకం మారాలని కానీ, మారుతుందని గానీ నా ఆశయం కాదు.

ఈనాటికి ఈ మార్గం, ఈ పద్ధతులు నాకు మంచివని తోస్తున్నాయి. తప్పు కావచ్చు. కానీ తప్పైనా, నా మనస్సుకి తోచాయి గనక, వీటిని అనుష్టిస్తే నూతన కాంతి నాకు ఇంకా కలుగుతుందనే నా నమ్మకం.

ఏ మనిషినో, పుస్తకాన్నో, ఆచారాన్నో గుడ్డిగా నమ్మి పాత ధర్మాలు పాత నీతి వచనాలు ఏకరువు పెడుతూ తిరిగే జడ ప్రాయులకు అభివృద్ధిసున్న. సాహసంచేసి, తమకు తోచిన తప్పు అభిప్రాయాలనైనా సాధన చేయగల వారికే అభివృద్ధి. స్వంతంగా ఆలోచించుకోవాలి. తప్పైనా సరే అనుష్టించాలి. సాహసంతో, బుద్ధికి అందినంతవరకూ యోచించాలి. మనకి తోచిందే మనకి సత్యం. ఎంత గొప్పవారైనా ఇతరులకి తోచింది మనకి సత్యంకాదు, అది మనకికూడా సహజంగా తోస్తేనే కాని.

దూకే ముందు లోతు చూడవలసిందే గాని, చూస్తూ, ఆలోచిస్తూ ఎప్పుడూ నుంచుంటే, అదే జడత్వం, అదే మృత్యువు.

నేనీ పుస్తకంలో చూపిన సంఘం లోపాలు, ఈ దేశస్తులలోనే కాదు, లోక మంతటా ఉన్నాయి. తరతరాలనించి పురుషుడు స్త్రీకి చేస్తున్నది అన్యాయమే! ఆమె ఆత్మ గౌరవాన్ని చంపాడు. స్త్రీ దాన్ని మళ్ళీ సంపాయించుకోవాలి. తన ఇష్టం వచ్చినట్టు తనకి తోచిన మార్గాన ఆమె తిరిగి తన గౌరవాన్ని పొందాలి.

అందుకు ముఖ్య సాధనం ఎదిరింపు. అన్నిటికీ, గృహానికీ, భర్తకీ పెద్దలకీ, పురాతన ధర్మాలకీ, బూజుపట్టిన నీతులకీ, తన అభివృద్ధికాటంకం కలిగించే ప్రతి సంస్థకీ, తిరగబడి, నలిగి, తమ జీవితం అర్పిస్తేనే గాని పోయిన తన ఆత్మని తను తిరిగి పొందలేదు. ఈ భయంలో, సిగ్గులో, బద్ధకంలో, బానిసత్వంలోంచి మేల్కొని, తన నిజమయిన హక్కులనీ, స్వతంత్రాన్నీ, ధిక్కరించి లాక్కోవాలి. అప్పుడే తన ఆత్మని ధన్యం చేసుకుంటుంది.

ఈ పుస్తకం చదివి ప్రజలూ, సంఘాలూ చెడిపోతాయని కొందరంటారు. ప్రజల్నీ, సంఘాల్నీ పాడుచెయ్యగలిగిన శక్తి గల వాడనని నన్ను అనడం చాలా గౌరవం. కానీ ఎవరూ పాడవరని నాకు తెలుసు. నా పుస్తకం చదివినంత మాత్రాన, నా మాటల్ని నమ్మి, వినాశనంలో పడేటంత బలహీనులు ఎక్కడా లేరని నా నమ్మకం. అంతకన్నా నాతోటి ప్రజలపైని నాకు గౌరవమూ, విశ్వాసమూ ఉంది.

చలం రచనల వివరాలు

నవలలు

1. శశిరేఖ
2. వివాహం
3. మైదానం
4. దైవమిచ్చిన భార్య
5. బ్రాహ్మణీకం
6. అరుణ
7. అమీనా
8. జీవితాదర్శం

కథలు

1. ప్రేమ పర్యవసానం
2. వాణీ - ఏస్టడీ
3. అవతారమా?
4. ఆమె త్యాగం
5. మామగారి మర్యాద
6. చిరుగు గౌను
7. అదృష్టం
8. ఆశాశకురుపు
9. భాషన్నా తెలీదు
10. మోసం చేసిందా?
11. యవనవ్వనం
12. రెడ్డి రంగమ్మ
13. మధురమీనాక్షి
14. ఆర్గ్యుమెంటు
15. లక్ష్మి ఉత్తరం
16. వితంతువు
17. నాయుడు పిల్ల
18. సుశీల
19. నేను చేసినపని
20. భార్య
21. శేషమ్మ
22. రామభక్తుడు
23. అప్పుడూ — ఇప్పుడూ
24. దోషగుణం
25. జెలసీ
26. మణి
27. నేనేం చేశాను?
28. బిడ్డ
29. ఏం తప్పు?
30. భోగం మేళం
31. అట్లపిండి
32. అభినవ సారంగధర
33. కలియుగ ధర్మం
34. నాటకం
35. పాటకచ్చేరి
36. నా మొదటి క్రాఫ్
37. రావణ దర్శనం
38. విచిత్ర నళీయం
39. సినిమా సాయం
40. ముక్కాలి పీట
41. అనుసూయ
42. చుక్కమ్మ
43. ఆత్మార్పణ
44. ఈ లోకం
45. ఉషారాణీతో ఇంటర్వ్యూ
46. ఒరేయ్, వెంకటచలం!
47. ఓ పువ్వు పూసింది
48. కర్మమిట్లా కాలింది
49. కళ్యాణి
50. జానకి
51. పతివ్రత
52. పాపఫలాలు
53. 1960
54. మనోహర ప్రజ్ఞ
55. లంచం
56. వాళ్ళునలుగురూ
57. వెన్నెల తోటలు
58. సీతయ్య
59. సుగంధి
60. శమంతకమణితో ఇంటర్వ్యూ
61. హంకో మహబత్
62. హంపీకన్యలు
63. దయ్యాలు
64. ఆత్మహత్య
65. కొత్త చిగుళ్ళు

66. ఒంటరితనం
67. ధైర్యమేనా?
68. ఎందుకు?
69. కర్మఫలం
70. కళారాధన
71. ఆ రాత్రి
72. ఎదగనే లేదు
73. అమ్మగారి అవసరం
74. ఎరుకలమ్మ
75. హరిజన సమస్య
76. మచ్చలు
77. పరీక్షలు
78. హిందూ ముసల్మాన్
79. హరిజన విద్యార్థి
80. లక్ష్మీదేవి
81. రుషులూ, యోగులూ
82. మాదిగ అమ్మాయి
83. హత్య విచారణ
84. ముక్తి మార్గం
85. రసపుత్రులు
86. స్టేషన్ పంపు
87. అవసరం లేని ఆపరేషన్
88. కోర్కె
89. ఆమె పెదవులు
90. మర్యాదస్తునికో కథ
91. లిల్లీతో స్నేహం ఎలా అయ్యిందంటే...
92. ఆరంభింపరు...
93. నేనూ, మా ఆవిడా మిగిలాం
94. వేదాంతం
95. సీత తల్లి
96. ఏం తప్పు?
97. తరుణుల చిత్తంబు...
98 పేదరాసి పెద్దమ్మ

నాటకాలు

1. విడాకులు
2. సావిత్రి
3. చిత్రాంగి
4. త్యాగం
5. మృత్యువు
6. పురూరవ
7. శశాంక
8. మంగమ్మ
9. పద్మరాణి
10. జయదేవ

నాటికలు

1. ఆడవాళ్ళ ఆకలి
2. ఈర్ష్య
3. జానకి ఆవేదన
4. తెలుగు నవల
5. సత్యం
6. శివం
7. సుందరం
8. హరిశ్చంద్ర
9. భానుమతి
10. పంకజం
11. ద్రౌపది
12. నరసింహావతారం
13. రంగదాసు
14. సత్యవంతుడు
15. వెలయాలి అబద్ధాలు
16. వీరమ్మ
17. స్వతంత్రం
18. కొండడు
19. చివరికుండ
20. జానకి సమస్య
21. ఏం జబ్బు?
22. ఇన్‌జెక్షన్లు
23. ఆత్మసంపర్కం
24. దేవీప్రసన్నం
25. హంతకుడు
26. స్వర్గనరకాలు
27. భక్త కుచేల
28. మామయ్యలు
29. యముడిముందు చలం
30. కుచేలుడు
31. శావలిని
32. సీత అగ్ని ప్రవేశం

33. మిస్ కోమలం
34. పండగ భిక్ష
35. పోలీసుదొంగ
36. ప్రహ్లాదుడు

ఇతర ముఖ్య రచనలు

1. స్త్రీ
2. బిడ్డల శిక్షణ
3. మ్యూజింగ్స్ (3 సంపుటాలు)
4. ప్రేమ లేఖలు (2 సంపుటాలు)
5. బుజ్జిగాడు
6. చలం మిత్రులు
7. చలం (ఆత్మకథ)

వ్యాసాలు

1. మాన్‌అండ్‌ఉమన్ (ఇంగ్లీషులో)
2. కవి హృదయం
3. మరవరాని మిత్రుడు
4. గురువర్యుడు
5. సినిమా ప్రియులు
6. పిన్నికి లేఖ
7. ఆదీఫిలిమూ, ఆంధ్రదేశమూ
8. పుణ్యం — పాపం
9. భయం
10. ద్వేషం — ఈర్ష్య
11. కామం
12. సెక్స్ కంట్రోలు
13. హిందూ పతివ్రత
14. అన్యకాంత లడ్డంబైన
15. ప్లేటోనిక్ లవ్
16. పత్రికలు చేసే అపచారం
17. కవిత్వం దేనికి?
18. బాధ
19. ఆనందం
20. నిగ్రహం
21. అశ్లీలాలూ, బూతులూ
22. స్త్రీలూ, నాట్యరంగం
23. ధర్మంచర
24. ఆదర్శవంతంగా చూపతగినది మానవుడి ప్రేమ
25. సినిమా జ్వరం

ఉత్తరాలు

1. చలం ఉత్తరాలు
2. చలం లేఖలు
3. మహాస్థాన్
4. శ్రీ రమణస్థాన్
5. కవిగా చలం

అనువాద కవిత్వం

1. టాగోర్ "గీతాంజలి"
2. టాగోర్ "ఉత్తరణ"
3. టాగోర్ "ఫలసేకరణ"
4. టాగోర్ "వనమాలి"
5. టాగోర్ "కాన్క"
6. ఉమర్ ఖయామ్ రుబాయీలు

"ఆధ్యాత్మిక" రచనలు

1. చలం గీతాలు
2. సుధ (కవితలు)
3. వెలుగు రవ్వలు (కథలు)
4. భగవత్ గీత (అనువాదం)
5. అక్షర మణిమాల
6. ధర్మసాధన (వ్యాసాలు)
7. భగవాన్ స్మృతులు (వ్యాసాలు
8. జీసస్ జీవితం
9. నిర్వికల్పం
10. మార్తా (నవల)

★



చలం

జననం : 18-5-1894
మరణం : 14-5-1979

"స్త్రీకి కూడా శరీరం ఉంది - దానికి వ్యాయామం ఇవ్వాలి; ఆమెకు మెదడు ఉంది - దానికి జ్ఞానం ఇవ్వాలి; ఆమెకు హృదయం ఉంది - దానికి అనుభవం ఇవ్వాలి."

"అన్నిటికన్నా విద్య కన్నా ముఖ్యం స్త్రీ స్వతంత్ర [illegible] గానీ, దేశాల్ని గానీ [illegible] ఆర్థిక అసహాయత్వం ముఖ్య సూత్రం. అందు చేతనే స్త్రీ ముఖ్యంగా బానిస అయింది."

"స్త్రీ పురుషులు నిజమైన స్నేహితులూ, దంపతులూ కావాలంటే ఇద్దరికీ సంపూర్ణమైన స్వేచ్ఛ ఉండాలి. ప్రేమ బంధమే కాని అధికార బంధం ఉండకూడదు."

"ఈ స్త్రీ పురుష సంబంధంలోంచి సుఖం రావాలంటే, వికాసం కలగాలంటే, దేశపు పరిస్థితి పూర్తిగా మారాలి. వంటా, చాకిరీ, పిల్లల్ని కనడం, పెంచడం ఇంతకన్న చాలా సులభమూ, సుఖమూ కావాలి స్త్రీకి."